గురువారం 29-6-2023

సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 285


'స్వచ్ఛమైన రక్షిత జలాలను అందిస్తేనే గోండు, చెంచు, ఆదివాసి గిరిజనులు ఆరోగ్యంగా ఉంటారు.'



మనోవాంఛల త్యాగమే బక్రీద్

త్యాగధనుల ఆచరణను స్మరిస్తూ జరుపుకొనే పర్వదినం - 11లో



నిఫ్టీ @ 19,000

64 వేల స్థాయిని అందుకున్న సెన్సెక్స్.. ముగింపులోనూ కొత్త రికార్డులు - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



చెరకు ధర క్వింటాల్‌కు రూ.315

చెరకు ఎఫ్ఆర్‌పీని క్వింటాల్‌కు రూ.10 చొప్పున పెంచుతున్నట్లు కేంద్రం ప్రకటించింది. దీంతో క్వింటాల్ ధర రూ.315కు పెరిగింది.

వివరాలు 6లో ▸



'యూసీసీని వ్యతిరేకిస్తాం'

ఉమ్మడి పౌరస్మృతిని వ్యతిరేకిస్తున్నట్టుగా ఆలిండియా ముస్లిం లా బోర్డు తెలిపింది. న్యాయ పోరాటం చేస్తామని పేర్కొంది.

వివరాలు 6లో ▸



విభిన్నం, వినూత్నం.. చంద్రయాన్-3

వచ్చే నెలలో చంద్రయాన్-3 ప్రయోగం నిర్వహించేందుకు.. ఇస్రో శాస్త్రవేత్తలు తుది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

వివరాలు 6లో ▸



'హెచ్1బీ'తో కెనడాలో ఉద్యోగం

అమెరికాలోని హెచ్1బీ వీసాదారులు ఇక కెనడాలో కూడా ఉద్యోగాలు చేసుకోవచ్చు. ఈ మేరకు కెనడా బంపర్ ఆఫర్ ఇచ్చింది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

డబ్బుంది.. కళ్ల జబ్బుందా?

- సామాజిక రంగంపై వ్యయం సమాజ హితం కోసమని రామోజీకి తెలియదా?.. ఆ సొమ్మంతా ఎక్కడికి వెళ్లిందో కాగ్ ప్రొవిజనల్ గణాంకాలు చదవలేదా?
- సామాజిక రంగాలకు రూ.90,112 కోట్లు వ్యయం చేసినట్లు కాగ్ చెప్పింది
- విద్య, వైద్యం, సంక్షేమం, పౌష్టి కాహారం, గృహ నిర్మాణాల కోసం వెచ్చించిన రాష్ట్ర ప్రభుత్వం
- సాధారణ రంగాలపై వ్యయం మరో రూ.62,558 కోట్లు
- అంటే జీతభత్యాలు, పెన్షన్లు, వడ్డీలు, చెల్లింపులు, పరిపాలన, నిర్వహణ వ్యయం
- ఆర్థిక రంగాలపై మరో రూ.55,304 కోట్లు వ్యయం
- వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాగునీరు, విద్యుత్, పరిశ్రమలు, రవాణా కోసం ఆ వ్యయం
- కాగ్ గణాంకాల్లోనే ఇదంతా చెప్పినా పచ్చి అబద్ధాలతో పైశాచిక కథనాలు ఎందుకు?
- ఐరాస సుస్థిర లక్ష్యాల సాధనకు సామాజిక రంగంపై వ్యయం పెరుగుదల సముచితమన్న కేంద్రం

10లో


పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన సభకు హాజరైన విద్యార్థులు, ప్రజలు

ఇది భవితకు పునాది

బటన్ నొక్కడం అంటే తెలియని బడుద్దాయిలకు చెప్పండి

నాలుగో ఏడాది అమ్మ ఒడి సాయం విడుదల చేస్తూ సీఎం వైఎస్ జగన్ వ్యాఖ్య

- ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలి
- విదేశాల్లో చదువులకూ అండగా నిలుస్తాం
- ఇంటికొక సత్య నాదెళ్ల రావాలి
- ఒక్క విద్యా రంగంలోనే రూ.66,722 కోట్ల ఖర్చు.. బడుల రూపురేఖలు మార్చాం
- నాణ్యమైన అత్యుత్తమ విద్యను తీసుకొచ్చాం
- రూ.6,392.94 కోట్లు నేరుగా తల్లుల ఖాతాల్లో జమ.. 42.62 లక్షల మంది తల్లులు.. 83.15 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి

2లో

"పిల్లల బంగారు భవిష్యత్ కోసం తప్పనిసరిగా మీ పిల్లలను బడికి పంపించాలని ప్రతి తల్లినీ కోరుతున్నా. మన పిల్లల బాగు కోరే ప్రభుత్వంగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాం. మన పిల్లలు ఉన్నత చదువులు చదవాలనే తపన, తాపత్రయంతో అడుగులు ముందుకు వేస్తున్నాం. ఇందులో భాగంగా తొలి దశలో పిల్లల భవిష్యత్ కోసం వారిని బడికి పంపించినందుకు ప్రోత్సాహకంగా ఈ నాలుగేళ్లలో ఏకంగా రూ.26 వేల కోట్లు తల్లుల ఖాతాల్లో వేశాం. ఇలా దేశంలోని 28 రాష్ట్రాల్లో కేవలం మన రాష్ట్రంలో మాత్రమే జరిగింది. ఇకపై కూడా కొనసాగుతుంది. బటన్ నొక్కడం అంటే తెలియని బడుద్దాయిలకు ఈ విషయం అర్థం అయ్యేలా చెప్పండి.

\- ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



నమ్మించి ముంచడమే వారి నైజం

ప్రతిపక్షాల తీరుపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మండిపాటు

- ప్రజలకు మంచి చేస్తుంటే జీర్ణించుకోలేకపోతున్నారు
- అబద్ధాలకు హద్దూ పద్దూ లేదు
- చెత్తబుట్టలో చంద్రబాబు అండ్ కో మేనిఫెస్టో.. దత్తపుత్రుడిలా బూతులు తిట్టలేం.. పూనకం వచ్చినట్లు ఊగిపోలేం
- నోటికి అదుపులేదు, మనిషికి నిలకడ లేదు
- పేదలు, ప్రజా సేవలోంచే మన పునాదులు.. ప్రతి కార్యకర్త కాలర్ ఎగరేసేలా మన నడత
- దుష్టచతుష్టయం దుర్నీతిని గమనించండి.. మీకు మంచి జరిగుంటేనే తోడుగా నిలవండి

2లో

న్యూస్‌రీల్


మరో రఫేల్ అవుతుందా?



ప్రధాని మోదీ అమెరికా పర్యటనలో కుదిరిన 31 ఎంక్యూ-9బీ ప్రిడేటర్ డ్రోన్ల ఒప్పందంపై కాంగ్రెస్ అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ ఒప్పందం పారదర్శకంగా జరగలేదని.. అత్యధిక ధరకు కొనుగోలు చేస్తున్నారని ఆరోపించింది.

వివరాలు 6లో ▸

331 వైద్య పోస్టుల భర్తీకి వాక్-ఇన్ ఇంటర్వ్యూ



రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలోని ఏపీ వైద్య విధాన పరిషత్ పరిధిలో 14 స్పెషాలిటీల్లో 331 వైద్య పోస్టుల భర్తీకి జూలై 5 నుంచి వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టులను భర్తీ చేస్తారు.

వివరాలు 3లో ▸



గ్రామాల్లో మొదలైన ఆస్తుల రిజిస్ట్రేషన్

ప్రజలకు అనుకూలంగా ప్రభుత్వం మరో కీలక నిర్ణయం


నెల్లూరు జిల్లా నార్తు రాజుపాలెం సచివాలయం వద్ద డాక్యుమెంట్ అందజేస్తున్న అధికారులు

- రీసర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో ప్రారంభమైన సేవలు.. సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్లు చేయాలని నిర్దేశించిన సీఎం
- దానికి అనుగుణంగా చర్యలు చేపట్టిన అధికారులు
- సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్ సేవలన్నీ గ్రామాల్లోనే అందుబాటులోకి..

3లో



వ్యవసాయానికి విద్యుత్తు ఉచితమే

'వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల రైతులపై విద్యుత్ బిల్లుల భారం పడదు. పూర్తిగా ఉచితం. నగదు బదిలీ ద్వారా రైతు బ్యాంకు ఖాతాలో ఆ బిల్లు మొత్తాన్ని ప్రతి నెలా ప్రభుత్వమే జమ చేస్తుంది. అది తిరిగి రైతుల ద్వారా విద్యుత్ సంస్థలకు చెల్లించడం జరుగుతుంది. రైతులు వారి జేబు నుంచి పైసా చెల్లించక్కర్లేదు' అని డిస్కంల సీఎండీలు చెప్పారు. దుష్ప్రచారాలను నమ్మి.. ఆందోళనకు గురికావద్దన్నారు.

- వివరాలు 3లో



రైతు బజార్లలో సబ్సిడీపై టమాటా

దేశవ్యాప్తంగా తారెత్తిస్తున్న టమాటా ధరల భారం నుంచి రాష్ట్ర ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. ప్రధాన నగరాలు, పట్టణాల్లోని రైతు బజార్లలో కిలో రూ.50కే అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టింది. వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో బుధవారం శ్రీకారం చుట్టగా, మిగిలిన జిల్లాల్లో గురువారం నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది.

- వివరాలు 5లో

ఆక్రమణల నుంచి దేవుడి భూములకు విముక్తి

- వారంరోజులు గడువిచ్చి స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వం
- ఆర్డినెన్స్ జారీ.. గవర్నర్ ఆమోదం
- తక్షణం అమల్లోకి.. ఇప్పటివరకు భూముల స్వాధీనంలో ఎన్నో చిక్కులు
- ట్రిబ్యునల్, కోర్టులో ఏళ్లతరబడి వివాదాలు
- ఆక్రమణదారుల అనుభవంలోనే భూములు
- వీటిన్నిటికీ చెక్ పెడుతూ ఆర్డినెన్స్
- ఆక్రమణదారులే కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి

10లో



'థర్మల్'కు బై.. 'రెన్యూవబుల్'కు జై!

దేశంలో గత ఐదేళ్లుగా తగ్గిన కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాలు

- అదే సమయంలో పెరిగిన పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్‌లు
- ఉత్పత్తి, నిర్వహణ వ్యయ భారంతో థర్మల్‌వైపు ప్రైవేటు సంస్థల వెనకడుగు
- పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సైతం సౌర, పవన విద్యుత్ వైపే మొగ్గు



సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్: నేటి ఆధునిక ప్రపంచంలో విద్యుత్ లేనిదే ఎవరికీ పూట గడిచే పరిస్థితి లేదు. తలసరి విద్యుత్ వినియోగమే రాష్ట్ర, దేశ పురోగతికి సంకేతం. అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల మధ్య తలసరి విద్యుత్ వినియోగం మధ్య వ్యత్యాసం చాలానే ఉంది. పునరుత్పాదక విద్యుత్ (రెన్యూవబుల్ ఎనర్జీ) రావడానికి ముందు థర్మల్, జల, అణు, గ్యాస్ ఇంధనమే ప్రధానమైన విద్యుత్ ఉత్పాదన కేంద్రాలు. ప్రస్తుతం పవన, సౌర విద్యుత్ కేంద్రాల నిర్మాణం వేగంగా సాగుతోంది. పర్యావరణ పరిరక్షణ, కాలుష్య నియంత్రణ కోసం రెన్యూవబుల్ ఎనర్జీనే ఎక్కువగా ప్రోత్సహిస్తున్నారు. ఒకప్పుడు థర్మల్ విద్యుత్ కేంద్రాలకే పరిమితమైన నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సైతం ప్రస్తుతం పునరుత్పాదక విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటులో వేగం పెంచింది. మరోవైపు ప్రైవేటు రంగం పెద్ద ఎత్తున రెన్యూవబుల్ ఎనర్జీ వైపు పరుగులు పెడుతోంది. థర్మల్ కేంద్రాల నిర్మాణంలో గడిచిన ఐదేళ్ల కాలంలో ప్రైవేటు రంగం గణనీయంగా పడిపోతూ వస్తోంది. 2023 సంవత్సరంలో ఇప్పటివరకు ఒక్క యూనిట్ కూడా ప్రైవేటు రంగంలో గ్రిడ్‌కు అనుసంధానం కాకపోవడం గమనార్హం. రానురాను కొత్త థర్మల్ విద్యుత్ కేంద్రాలు తలకు మించిన భారంగా మారే పరిస్థితులు కనిపిస్తున్నాయి. విద్యుత్ ప్లాంట్ నిర్మాణంలోనే కాదు.. దాని ఉత్పత్తి వ్యయం కూడా ఏటేటా పెరుగుతోంది. థర్మల్ విద్యుత్ ఉత్పాదనకు అవసరమైన బొగ్గు ధరలు పెరగడం, బొగ్గు ఉత్పాదన కేంద్రం నుంచి ప్లాంట్ వరకు రవాణా వ్యయం కూడా పెరగడం వల్ల అంతిమంగా విద్యుత్ సరఫరా, పంపిణీ సంస్థలకు వచ్చేసరికి తడిసి మోపెడు అవుతోంది. అది కాస్తా వినియోగదారులపై భారం మోపక తప్పని పరిస్థితి.

2030 నాటికి కర్బన ఉద్గారాల తగ్గింపే లక్ష్యమా..?

దేశంలో ప్రస్తుతం ఉన్న 2,36,680 మెగావాట్ల థర్మల్ విద్యుత్ కేంద్రాలతో దాదాపు 910 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు విడుదల అవుతున్నాయి. వీటిని గణనీయంగా తగ్గించే ప్రయత్నంలో కేంద్ర ప్రభుత్వం ఉన్నట్లు స్పష్టం అవుతోంది. కేంద్ర ఇంధన శాఖలోని కేంద్ర విద్యుత్ ప్రాధికార సంస్థ (సీఈఏ) 2029–30 నాటికి శిలాజ ఇంధనలతో విద్యుత్ ఉత్పత్తిని తగ్గించడం, సంప్రదాయేతర ఇంధనాలతో విద్యుత్ ఉత్పత్తిని పెంచేలా ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. తద్వారా పర్యావరణ సమతౌల్యతను కాపాడటానికి సంప్రదాయేతర ఇంధన విద్యుత్ ఉత్పాదనను ప్రోత్సహించనున్నట్లు తెలుస్తోంది.

పెరుగుతున్న మెగావాట్ ధరలూ ఓ కారణమా..?

దేశంలో థర్మల్ విద్యుత్ కేంద్రాల వ్యయం ఒక మెగావాట్‌కు గడిచిన ఏడేళ్లుగా పెరిగిన తీరు పరిశీలిస్తే... అవి రాబోయే కాలంలో లాభసాటిగా అయ్యే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. 2015లో ఒక మెగావాట్‌కు రూ. 4.88 కోట్లు, 2016లో రూ. 5.33 కోట్లు, 2019లో రూ. 6.79 కోట్లు, 2023లో రూ. 8.34 కోట్లు చేరినట్లు సీఈఏ గణాంకాలు చెబుతున్నాయి. అదే సమయంలో సౌర విద్యుత్ మెగావాట్ వ్యయం దాదాపు రూ.4 కోట్ల నుంచి రూ.5 కోట్ల మేరకు ఉంటోంది. ఒకప్పుడు సౌర ఫలకాల ధరలు అధికంగా ఉండటంతో యూనిట్ విద్యుత్ రూ. 14కు కూడా విద్యుత్ సంస్థలు కొనుగోలు చేశాయి. ఇప్పుడు అదే సోలార్ విద్యుత్ రూ. 3.50 నుంచి రూ. 4.50 మధ్య అందుబాటులోకి వచ్చింది.

2030 నాటికి...

దేశంలో థర్మల్ విద్యుత్ స్థాపిత సామర్థ్యం, సౌర, పవన విద్యుత్ స్థాపిత సామర్థ్యం ప్రకారం 2029–30 నాటికి దేశంలోని అన్ని రకాల విద్యుదుత్పాదన ప్లాంట్ల సామర్థ్యం 5,87,243 మెగావాట్లుగా ఉంటుందని కేంద్రం పేర్కొంది. వాటిలో థర్మల్ విద్యుత్ కేంద్రాల స్థాపిత సామర్థ్యం 2,66,911 మెగావాట్లకు చేరుకుంటే... సౌర, పవన విద్యుత్‌ల స్థాపిత సామర్థ్యం ఏకంగా 2,25,160 మెగావాట్లకు చేరనున్నట్లు అంచనా వేసింది. వాటితోపాటు జల, బయోమాస్, బ్యాటరీ స్టోరేజ్ ఎనర్జీ, పంప్డ్ స్టోరేజి విద్యుత్ ప్లాంట్ల సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని స్పష్టం చేసింది. తద్వారా కర్బన ఉద్గారాలను గణనీయంగా తగ్గించాలన్న నిర్ణయం కూడా ఇమిడి ఉంది. కానీ తాజాగా విడుదల చేసిన అంచనా ప్రకారం మొత్తం స్థాపిత సామర్థ్యం 5,87,243 మెగావాట్లుగా ఉండనుంది.

2023 మార్చి 31 వరకు ఉన్న విద్యుదుత్పాదన సామర్థ్యం

ప్లాంట్‌లు	మెగావాట్లలో
జల విద్యుత్	42,104
పీఎస్‌పీ	4746
చిన్న జల విద్యుత్ ప్లాంట్‌లు	4999
సౌర విద్యుత్	66,780
పవన విద్యుత్	42,633
బయోమాస్	10,802
న్యూక్లియర్	6,780
థర్మల్ పవర్+లిగ్నైట్	2,11,855
గ్యాస్	24,824
మొత్తం	4,15,469..

2029-30 నాటికి ఉత్పాదన సామర్థ్యం పెరుగుదల అంచనా

ప్లాంట్‌లు	మెగావాట్లలో
జల విద్యుత్	11,494
పీఎస్‌పీ	2780
స్మాల్ హైడ్రో	502
సౌర విద్యుత్	92,580
పవన విద్యుత్	25,000
బయోమాస్	3818
న్యూక్లియర్	8700
థర్మల్ విద్యుత్	26900
గ్యాస్	00
మొత్తం	1,71,774

ప్రైవేటు రంగంలో గడిచిన ఆరేళ్లలో వచ్చిన థర్మల్ కేంద్రాల స్థాపిత సామర్థ్యం

సంవత్సరం	మెగావాట్లలో..
2017-18	3,760
2018-19	972
2019-20	45
2020-21	0
2021-22	525
2022-23	0





సభా ప్రాంగణం కిక్కిరిసిపోవడంతో వెలుపల నిలిచిపోయిన భారీ జనసందోహం



సీఎం జగన్‌ను చూసి కేరింతలు కొడుతున్న విద్యార్థులు

ఇది భవితకు పునాది

విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యం.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ భరోసా



అమ్మ ఒడి లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్మును బటన్ నొక్కి జమ చేస్తున్న సీఎం వైఎస్ జగన్



విద్యార్థులతో సీఎం జగన్ గ్రూప్ ఫొటో. చిత్రంలో ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణి

సాక్షి ప్రతినిధి, విజయనగరం: వర్గాలకు, మతాలకు, రాజకీయాలకు అతీతంగా ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలని, ప్రతి ఇంటి నుంచి సత్య నాదెళ్ల రావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. తమది చదువుల సంకల్పమని స్పష్టం చేశారు. విదేశీ కాలేజీల్లో సీటు తెచ్చుకుంటే ఫీజు రూ.1.25 కోట్లయినా భరిస్తామని హామీ ఇచ్చారు. జగనన్న అమ్మఒడి నాలుగో సంవత్సరానికి సంబంధించి 42,61,965 మందికి లబ్ధి చేకూరుస్తూ రూ.6,392.94 కోట్ల ఆర్థిక సాయాన్ని బటన్ నొక్కి విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన బహిరంగ సభలో అశేష జన సందోహాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. తమ పిల్లలు తమకంటే గొప్పగా ఉండాలని, తాము పడిన కష్టాలు పిల్లలకు రాకూడదని తల్లిదండ్రులందరూ కోరుకుంటారన్నారు. పోటీ ప్రపంచంలో తట్టుకొని నిలబడాలని, ప్రపంచాన్నే ఏలే పరిస్థితిలోకి పిల్లలు రావాలనే గట్టి సంకల్పంతో ఈ నాలుగేళ్లుగా మీ బిడ్డ ప్రభుత్వం అడుగులు వేసిందని చెప్పారు. అందులో భాగంగానే అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నామని, నాలుగో ఏడాది కార్యక్రమాన్ని కురుపాం వేదికగా ప్రారంభిస్తున్నామన్నారు. పది రోజులపాటు ప్రతి మండలంలోనూ పండగ వాతావరణంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని, విద్యార్థులతో ప్రజా ప్రతినిధులంతా మమేకమవుతారని తెలిపారు. ఈ పథకం ద్వారా ఒకటి నుంచి 12వ తరగతి దాకా పిల్లలను చదివిస్తున్న 42 లక్షల 62 వేల మంది అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్నామని చెప్పారు. తద్వారా 83 లక్షల 15 వేల మంది విద్యార్థులకు మంచి చేస్తున్నామని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు లబ్ధి చేకూర్చేలా తల్లులకు అమ్మఒడి వర్తింపజేస్తున్నామని, ఈ ఒక్క పథకం ద్వారా నాలుగేళ్లలో ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా నేరుగా వారి ఖాతాల్లో రూ.26,067 కోట్లు జమ చేశామని స్పష్టం చేశారు. ఈ సభలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

ఐదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు

- గిరిజన ప్రాంతంలో ఒకప్పుడు వైద్యానికి దిక్కులేని పరిస్థితి. ఇప్పుడు ఐదు ఐటీడీఏల పరిధిలో ఐదు మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు కడుతున్నాం. కురుపాం నియోజకవర్గంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీని వేగంగా నిర్మిస్తున్నాం. ఇదే నియోజకవర్గంలో మరో మెడికల్ కాలేజీ రాబోతోంది.
- ఉత్తరాంధ్రకు సంబంధించిన గిరిజన ప్రాంతంలో కొత్తగా కురుపాం, పాడేరు, నర్సీపట్నంలో మెడికల్ కాలేజీలు రాబోతున్నాయి. నాలుగోది విజయనగరంలో నిర్మాణంలో ఉంది. వచ్చే నెలలో ట్రైబల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయబోతున్నాం.

కళ్లెదుటే మార్పు కనిపిస్తోంది

- గవర్నమెంట్ బడులన్నింటిలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టాం. బడులు ప్రారంభం కాగానే మెరుగైన విద్యాకానుక కిట్లను ప్రతి పిల్లాడు, ప్రతిపాప చేతిలో పెడుతున్నాం. క్లాస్ టీచర్లకే దిక్కులేని పరిస్థితి గతంలో చూశాం. ఈ నాలుగేళ్ల కాలంలో మూడో తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లు ఉండేలా అడుగులు పడ్డాయి. 3వ తర గతి నుంచే పిల్లలకు ఇంటర్నేషనల్ సర్టిఫికెట్ టోఫెల్ కరిక్యులమ్ తీసుకొచ్చింది కూడా ఈ ప్రభుత్వంలోనే. పిల్లలకు చక్కగా అర్థమయ్యేలా బైలింగ్వల్ పాఠ్య పుస్తకాలు మొట్టమొదటిసారిగా ఇస్తున్నాం. బైజూస్ కంటెంట్‌ను కూడా మన పాఠాలతో అనుసంధానం చేయడం మీ జగన్ మామ ప్రభుత్వంలోనే జరిగింది.
- 6వ తరగతి నుంచే ప్రతిక్లాస్ రూమ్‌ను డిజిటలైజ్ చేశాం. ఐఎఫ్‌పీతో డిజిటల్ బోధనను స్కూల్స్‌లోకి తీసుకొచ్చాం. రోజుకొక మెనూతో చిక్కీ, రాగిజావ కూడా గోరుముద్దగా ఇస్తున్నాం. పౌష్టికాహారం అందించేలా అంగన్‌వాడీల్లోనూ మార్పులు తెచ్చాం. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు సంపూర్ణ పోషణ అమలు చేస్తున్నాం. గిరిజన ప్రాంతాల్లో సంపూర్ణ పోషణ ప్లస్ కూడా అమలు చేస్తున్నాం.



థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

- నాడు–నేడుతో 45 వేల ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చాం. 8వ తరగతి పిల్లలకు, టీచర్లకు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా విద్యను అందించేలా ట్యాబ్స్ అందిస్తున్నదీ మీ మేనమామ ప్రభుత్వమే. ఆడపిల్లల కోసం స్వేచ్ఛ అనే పథకాన్ని అమలు చేస్తున్నాం. పెద్ద చదువుల కోసం వంద శాతం పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో జగనన్న విద్యా దీవెన ఇస్తోంది మీ మేనమామ ప్రభుత్వంలోనే. మెస్, హాస్టల్ ఖర్చుల కోసం వసతి దీవెన కార్యక్రమాన్నీ అమలు చేస్తున్నాం.

ఇంకా గొప్పగా చదవాలి

- పిల్లలు ఇంకా గొప్పగా చదవాలి. ప్రతి కుటుంబం నుంచి సత్యానాదెళ్ల రావాలి. విదేశాల్లో చదవాలన్నా తల్లిదండ్రులకు ఇబ్బందులు ఉండకూడదనే విదేశీ విద్యా దీవెన పథకం తీసుకొచ్చాం. ప్రపంచంలోనే టాప్ 50 కాలేజీల్లో 21 ఫ్యాకల్టీస్‌లో ఎక్కడ..ఏ సీటు వచ్చినా రూ.1.25 కోట్ల ఫీజు వరకు పూర్తిగా భరించడానికి సిద్ధంగా ఉన్నాం. జీవితంలో చదువు అవసరాన్ని చెప్పేందుకే పదో తరగతి పూర్తి చేసి ఉండాల్సిందే అన్న నిబంధనతో వైఎస్సార్ కల్యాణమస్తు–షాదీ తోఫా అమలు చేస్తున్నాం. ఈ నాలుగేళ్లలోనే కేవలం విద్యా రంగంలో సంస్కరణల కోసం రూ.66,722 కోట్లు ఖర్చు చేశాం.

గవర్నమెంట్ బడి వెలుగుతోంది..

- గత ప్రభుత్వం దాదాపు కోటి మంది పిల్లలకు చేసిన అన్యాయం క్షమించగలమా? విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులతో చదువుల్లో అంటరానితనాన్ని తుదముట్టించడం ఈ ప్రభుత్వంలోనే జరిగింది. ఒకప్పుడు పెత్తందార్లకు మాత్రమే అందుబాటులో ఉన్న ఆ చదువుల కన్నా గొప్ప చదువులు పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ బడులకు తీసుకొచ్చాం. ప్రైవేట్ బడులకు తీసిపోకుండా పోటీపడే పరిస్థితి మొట్టమొదటిసారిగా ఈ రాష్ట్రంలో వచ్చింది. పెత్తందారీ విధానాన్ని బద్దలుగొట్టి ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలు, పేదల పిల్లలు గొప్ప చదువులకు వెళ్లేలా చేశాం. గవర్నమెంట్ బడుల్లో ఆణిముత్యాలుంటాయని, వజ్రాలు, రత్నాలు మెండుగా పుట్టే విద్యా విధానాన్ని తీసుకొచ్చింది ఈ నాలుగేళ్లలో మీ మేనమామ ప్రభుత్వంలోనే.
- పేదల కుటుంబాల్లో వెలుగులు నింపేలా గవర్నమెంట్ బడి వెలుగుతోంది. టెన్త్ పరీక్షల్లో గవర్నమెంట్ స్కూళ్ల నుంచి టాప్ 10 ర్యాంకులు గతేడాది 25 రాగా, ఈ ఏడాది ఏకంగా 64కు పెరిగాయి. 75%కి పైగా మార్కులతో డిస్టింక్షన్ సాధించిన విద్యార్థుల సంఖ్య గత ఏడాది 63,275 ఉంటే, ఈ ఏడాది ఆ సంఖ్య 67,114కు పెరిగింది. 66.50% ఫస్ట్ క్లాస్‌లో పాసైతే ఈసారి 70.16%కి పెరిగారు. 67 మంది పిల్లలకు ఐఐటీ, ఎన్ఐటీ, నిఫ్ట్, సెంట్రల్ వర్సిటీల్లో అడ్మిషన్లు దొరికే అవకాశం ఈ సంవత్సరం రాబోతోంది.
- బాబు హయాంలోని 2018–19లో ప్ర భుత్వ స్కూళ్లలో చేరిన విద్యార్థుల సంఖ్య గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రేషియో 84.48% తో ఏపీ దేశంలోనే అట్టడుగు స్థానంలో ఉండింది. ఇప్పుడు 100.80%తో మెరుగైంది. జాతీయ సగటు 100.13% కంటే ఎక్కువగా ఉన్నాం. ఇది విద్యా రంగంలో మనం చూపించిన శ్రద్ధకు దక్కిన ఫలితం.

గిరిజనులను గుండెల్లో పెట్టుకున్నాం

- గిరిజనులను గుండెల్లో పెట్టుకున్నది మీ బిడ్డ ప్రభుత్వమే. ఐదుగురు ఉప ముఖ్యమంత్రులుంటే వారిలో మొట్టమొదటి గిరిజన డిప్యూటీ సీఎంగా ఈ రాష్ట్రంలో పని చేసిన చరిత్ర నా సోదరి, కురుపాం ఎమ్మెల్యే పుష్ప శ్రీవాణిది. ఇప్పుడు మరో గిరిజనుడు పీడిక రాజన్నదొర డిప్యూటీ సీఎంగా పని చేస్తున్నారు. ట్రైబల్ అడ్వయిజరీ కమిటీని సకాలంలో వేసిన చరిత్ర మనదే.
- నవరత్నాలను మారుమూల గిరిజన గ్రామాలకు చేర్చాలని తపన పడుతున్నాం. ఒక్క కురుపాం నియోజకవర్గంలోనే 118 టవర్లను ఒక్కొక్కటి రూ.80 లక్షల ఖర్చుతో ఏర్పాటు చేశాం. గిరిజనుల్లో ఏకంగా 1,47,242 కుటుంబాలకు మేలు చేస్తూ ఆర్వోఎఫ్ఆర్ డీకేటీ పట్టాలు ఇచ్చాం. వారికి 3,62,737 ఎకరాలను పంచి పెట్టింది మీ బిడ్డ ప్రభుత్వమే.
- కురుపాం నియోజకవర్గంలోనే 21,311 కుటుంబాలకు 38,798 ఎకరాలు పంపిణీ చేశాం. వాళ్లందరికీ వైఎస్సార్ రైతు భరోసా సొమ్మును గత నాలుగేళ్లుగా ఇస్తున్నాం. నామినేటెడ్ పదవి అయినా, కాంట్రాక్ట్ అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కచ్చితంగా 50 శాతం కేటాయించాలని చట్టం చేశాం. మన కళ్లెదుటే గ్రామ సచివాలయాల్లో 1.30 లక్షల మంది ఉద్యోగులుగా ఉన్నారు. వారిలోనా ఎస్టీలు, ఎస్సీలు, బీసీలు, మైనార్టీలు 84 శాతం మంది కనిపిస్తున్నారు.

ఏపీ వైపు దేశం చూపు

ఏ విద్యార్థి కూడా ఆర్థిక పరిస్థితుల వల్ల చదువుకు దూరం కాకూడదని సీఎం జగన్ ఎన్నికలకు ముందే చెప్పారు. అందుకోసమే అధికారంలోకి రాగానే అమ్మ ఒడి పథకం అమలు చేస్తున్నారు. విద్యా రంగంలో సంస్కరణలతో దేశమంతా ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తోంది. ఈ విషయంలో కేరళ, ఢిల్లీ గురించే గతంలో మాట్లాడేవారు. ఇప్పుడు ఏపీ గురించి అందరూ చెప్పుకుంటున్నారు. డిజిటల్ ఎడ్యుకేషన్, పిల్లలకు ట్యాబ్‌లు, నైపుణ్యం పెంపు ఇలా ఒకటేమిటి చెప్పుకుంటూ పోతే విద్య కోసం చేస్తున్న ఖర్చు సంక్షేమం కాదు అదొక పెట్టుబడి. సత్య నాదెళ్ల లాంటి వారు మన రాష్ట్రం నుంచి ఎంతో మంది తయారవ్వాలని సీఎం తపనపడుతున్నారు.

– బొత్స సత్యనారాయణ, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి

నిజమైన లెజెండ్ సీఎం జగన్



నేను ఒక మారుమూల గిరిజన ప్రాంతంలో ఎస్టీ కులానికి చెందిన సింగిల్ పేరెంట్ చైల్డ్‌ని. మొదట్లో తెలుగు మీడియంలో చదువుకున్నా. ఇప్పుడు జగన్ మామయ్య ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటున్నాను. మా విద్యార్థులకు, విద్యా వ్యవస్థకు ఉపయోగపడే పథకాలు అనేకం తీసుకువచ్చారు. జగనన్న అమ్మఒడి అద్భుత పథకం. దీనివల్ల నాలాంటి అనేక మంది పేద, మధ్య తరగతి కుటుంబాల పిల్లలు చక్కగా చదువుకునేందుకు దోహదపడుతోంది. జగనన్న విద్యా కానుక కింద అవసరమైనవన్నీ ఇస్తున్నారు. నాడు–నేడుతో స్కూళ్లు మారిపోతున్నాయి. నిజమైన లెజెండ్ అంటే సీఎం జగనే.

– ఎస్.మనస్విని, 9వ తరగతి, కేజీబీవీ, గుమ్మలక్ష్మీపురం

మేలిమి వజ్రం మీరే మామయ్యా



అమ్మఒడి పథకం నాకు చాలా ఉపయోగపడుతోంది. జగనన్న విద్యా కానుక కిట్లు చాలా బాగున్నాయి. నాడు–నేడు ద్వారా సరస్వతి నిలయంలో సమస్యలకు తావే లేకుండా చేశారు. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అంటేనే చిన్న చూపు. ఇప్పుడు ప్రభుత్వ పాఠశాలలో చదవాలన్న ఆసక్తి ప్రతి ఒక్కరిలో కలుగుతోంది. క్లాస్‌రూంలో ఐఎఫ్‌పీ కూడా ఏర్పాటు చేశారు. దాంట్లో పాఠాలు చెబు తుంటే మాకు బాగా అర్థమవుతున్నాయి. మట్టిలో ఉన్న మాణిక్యాలను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన మేలిమి వజ్రం మీరే మామయ్యా.

– సుచరిత, 10వ తరగతి, ఏపీమోడల్ స్కూల్, కురుపాం

నమ్మించి ముంచడమే వారి నైజం

- దుష్టచతుష్టయం దుర్నీతిని గమనించండి
- ప్రతిపక్షాల తీరుపై సీఎం జగన్ మండిపాటు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: 'మనం ప్రజలకు మంచి చేస్తున్నామని కొంత మందికి కడుపులో మంట. వారికి మద్దతుగా ఉండే దుష్టచతుష్టయం జీర్ణించుకోలేకపోతోంది. పదేపదే అబద్ధాలు చెబుతూ, ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారు. ఈర్ష్యతో కళ్లు కప్పుకుపోయాయి. వీరి దుర్నీతిని ప్రజలు గమనించాలి' అని సీఎం వైఎస్ జగన్ అన్నారు. అమ్మఒడి నాలుగో ఏడాది ఆర్థిక సాయం విడుదల సందర్భంగా పార్వతీపురం మన్యం జిల్లా కురుపాంలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 45 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్లు సీఎంగా ఉండీ కూడా ఏమీ చేయని ఓ నాయకుడు (చంద్రబాబు), ఆ నాయకుడి కోసం 15 ఏళ్ల కిందటే పుట్టిన ఓ దత్తపుత్రుడు (పవన్ కళ్యాణ్) మన ప్రభుత్వం చేస్తున్న మంచి చూసి జీర్ణించుకోలేకపోతున్నారన్నారు. 'ఇదీ టీడీపీ అంటే.. టీ–తినుకో, డీ–దోచుకో, పీ–పంచుకో. దోచుకున్న అవినీతి సొమ్మును పంచుకుంటూ.. బొజ్జలు పెంచుకుంటూ.. బొజ్జ రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారు. వారి పత్రికలు, వారి టీవీలతో కలిసి మంచి పనులు చేస్తున్న మనపై దుష్ప్రచారం చేస్తున్నారు' అని చెప్పారు. ఈ సభలో సీఎం ఇంకా ఏమన్నారంటే..

కొత్త డ్రామాలు మొదలు

- మూడుసార్లు సీఎం అయినా కూడా ఏ ప్రాంతానికీ ఏ మంచీ చేయని చంద్రబాబు.. ఎన్నికల ముందు మేనిఫెస్టో బుక్ తెస్తారు. అది చేస్తా, ఇది చేస్తా అంటారు. అధికారంలోకి వస్తే దానిని చెత్త బుట్టలో పడేస్తారు. ఇదీ వాళ్ల ట్రాక్ రికార్డు. ఇదే దుష్ట చతుష్టయం, ఇదే బాబు.. మరోసారి అధికారం ఇవ్వండంటూ మరోసారి మేనిఫెస్టోతో మళ్లీ మోసానికి దిగారు. డ్రామాలు మొదలు పెట్టారు.
- ఈసారి డ్రామాలను కొంచెం రక్తి కట్టించారు. ప్రతి ఇంటికీ కేజీ బంగారం, బెంజ్ కారంట.. మోసం చేసేదానికి ఒక హద్దు పద్దు లేకుండా పోయింది. జగన్ ఏం చేస్తున్నాడు.. జగన్ కంటే కాస్త ఎక్కువ చెప్పాలని చెప్పి మోసం చేయడంలో రక్తి కట్టిస్తున్నాడు. వీళ్లందరికీ తోడు ఒక దత్త పుత్రుడు ఉన్నాడు. 2014లో చంద్రబాబుకు మద్దతు పలికాడు. ఒకవైపు చంద్రబాబు, మరోవైపు దత్తపుత్రుడి సంతకాలతో మీకు లేఖలు వచ్చాయి. మాదీ బాధ్యత అని, అన్నీ పూర్తి చేస్తామని చెప్పారు. ఎన్నికలు అయిపోయాక ఎన్నికల ప్రణాళికను చెత్తబుట్టలో వేశారు.

ప్యాకేజీ స్టార్ ఊగిపోతున్నాడు

- రైతులు, అక్కచెల్లెమ్మలు, అవ్వాతాతలు, చిన్న పిల్లలను సైతం వదలకుండా చంద్రబాబు మోసం చేశాడు. పూచీగా సంతకం పెట్టిన దత్తపుత్రుడు ఐదేళ్లలో ఒక్క మాటా మాట్లాడలేదు. అలాంటి దత్తపుత్రుడు, ప్యాకేజీ స్టార్ ఈ రోజు ఓ లారీ ఎక్కాడు. దాని పేరు వారాహి అట. ఊగిపోతూ తనకు నచ్చని వారిని చెప్పుతో కొడతానంటాడు.. తాట తీస్తానంటాడు.. గుడ్డలూడదీసి తంతానంటాడు.. ఈయన నోటికి అదుపులేదు.. మనిషికి నిలకడ లేదు. పూనకం వచ్చినట్లు ఊగిపోతాడు. అలా మనం మాట్లాడలేం. వారిలా మనం రౌడీల్లా మీసాలు మెలేయలేం. బూతులు తిట్టలేం. నలుగురిని పెళ్లి చేసుకొని నాలుగేళ్లకోసారి భార్యనూ మార్చలేం. పెళ్లి అనే పవిత్ర వ్యవస్థను రోడ్డు మీదకు తీసుకురాలేం. ఇవన్నీ వారికే పేటెంట్.



మా నమ్మకం నువ్వే జగనన్న అంటూ చెట్టెక్కి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజలు

> గాంధీ గారి మూడు కోతుల కథలో 'చెడు వినొద్దు, చెడు కనొద్దు, చెడు అనొద్దు' అని నీతి చెబుతాయి. కానీ మన రాష్ట్రంలో మాత్రం 'మంచి వినొద్దు, మంచి కనొద్దు, మంచి అనొద్దు, మంచి చేయొద్దు' అనే నాలుగు కోతులున్నాయి. వీరినే దుష్ట చతుష్టయం అని మనం పిలుచుకుంటున్నాం. అవినీతి సొమ్మును పంచుకోవడం కోసం వారికి అధికారం కావాలి. ఇదీ వారి దుర్నీతి. నమ్మించి ప్రజల్ని నట్టేట ముంచడమే వారికి తెలిసిన ఏకైక నీతి.
>
> – ముఖ్యమంత్రి వైఎస్ జగన్

తేడా మీరే గమనించాలి

- బాబు వర్గానికి అధికారం అంటే కేవలం దోచుకోవడం, పంచుకోవడం, తినుకోవడం (డీపీటీ). వాళ్ల పునాదులు, మన పునాదుల మధ్య తేడా గమనించండి. అప్పుడూ ఇప్పుడూ అదే రాష్ట్రం, అదే బడ్జెట్. మారిందల్లా కేవలం ఒక్క జగన్ మాత్రమే. మరి వాళ్లెందుకు ఈ సంక్షేమ కార్యక్రమాలు చేయలేకపోయారు? మీ బిడ్డ ఎందుకు చేయగలుగుతున్నాడు? వాళ్ల సోషల్ మీడియా, పత్రికలు, టీవీలు, వాళ్లంతా కలిసికట్టుగా రోజూ అదే అబద్ధాలు, వాళ్లు చేస్తున్న దుర్నీతిని గమనించాలి. చిన్న పొరపాటు జరిగినా ఇంతింత పెద్దగా చూపిస్తున్నారు. మనది కాని తప్పును మన మీద వేస్తూ బురద జల్లుతున్నారు.
- మీ బిడ్డ ప్రభుత్వంలో ఐదుగురు డిప్యూటీ సీఎంలలో నలుగురు ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీలే. రాష్ట్రానికి హోం మంత్రి నా దళిత చెల్లెమ్మ. అలాంటి మనందరి ప్రభుత్వం మీద కావాలని పనిగట్టుకొని సమాజాన్ని చీల్చడం కోసం వాళ్లు పడుతున్న పాట్లు చూడాలి.
- ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మంత్రులు బొత్స, గుడివాడ, ఎంపీలు బెల్లాన, గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యేలు పాముల పుష్పశ్రీవాణి, కళావతి, అలజంగి జోగారావు, కంబాల జోగులు, శంబంగి చినవెంకట అప్పలనాయుడు, బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీలు తలశిల రఘురాం (సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్), పాలవలస విక్రాంత్, రఘురాజు తదితరులు పాల్గొన్నారు.

పేదల పట్ల ప్రేమ నుంచి మన పునాదులు

- మన పార్టీ పునాదులు పేదల పట్ల ప్రేమలోంచి పుట్టాయి. రైతుల మమకారంలోంచి పుట్టాయి. అవ్వాతాతలు, అక్కచెల్లెమ్మల పట్ల వారి బాధ్యతలోంచి పుట్టాయి. మాట ఇచ్చి మోసం చేయడం అనే వారి పునాదులు మన దగ్గరికి కూడా రావు. నా అక్కచెల్లెమ్మల భవిష్యత్తు కోసం, వారి కుటుంబాల భవిత కోసం రెండు లక్షల 23 వేల కోట్ల రూపాయలు నాలుగేళ్లలో నేరుగా వారికి అందించిన డీబీటీ మీద మన పునాదులు పుట్టాయి.
- పేదల కోసం తీసుకొస్తున్న విద్యా విప్లవంలో, వాళ్లకు ఇచ్చిన ఇళ్ల స్థలాల్లో, వారి కోసం కట్టిస్తున్న ఇళ్లలో.. గ్రామాల్లో ఎలాంటి లంచాలు, వివక్ష లేకుండా అక్కచెల్లెమ్మలు, రైతన్నలు, అవ్వాతాతలు, పిల్లలకు మంచి జరిగేలా అందిస్తున్న పౌర సేవల్లో నా పునాదులున్నాయి. అక్కచెల్లెమ్మల సాధికారత కోసం అమలు చేస్తున్న పథకాల్లో మన పునాదులున్నాయి. వాళ్ల మాదిరిగా పనికిమాలిన పంచ్ డైలాగుల్లో మన పునాదులు లేవు.
- మన ఓదార్పు యాత్ర నుంచి, 3,648 కిలోమీటర్లు సాగిన నా పాదయాత్రలో నుంచి, పేదల కష్టాల్లోంచి నా పునాదులు పుట్టాయి. వారి మాదిరిగా వెన్నుపోటు లోంచి నా పునాదులు పుట్టలేదు. అబద్ధాలపైన మన పునాదులు లేవు. దోచుకో, పంచుకో, తినుకో అనే సిద్ధాంతం నుంచి పుట్టలేదు. మన పునాదులు సామాజిక న్యాయంలో ఉన్నాయి తప్ప వారిలా సమాజాన్ని చీల్చడంలో లేవు.

ఇదీ మన ఫిలాసఫీ

- 2009 నుంచి ఇప్పటి వరకు పేద వాడి కోసం నిలబడగలిగిన జగన్‌ను గమనిస్తే.. ఏ కార్యకర్త అయినా అడుగో అతడే మా నాయకుడని కాలర్ ఎగరేసేలా నడత, ప్రవర్తన ఉంది. ఏ రోజూ అధర్మాన్ని, అబద్ధాలు చెప్పి గెలవాలని ప్రయత్నం చేయలేదు. అధికారం కోసం, పొత్తుల కోసం పాకులాడలేదు. ప్రతి అడుగులోనూ పేదవాడు బాగుండాలని ఆలోచన చేశా. ఇదీ మన పునాది, ఇదీ మన ఫిలాసఫీ, ఇదీ మన పార్టీ, ఇదీ మన మనసున్న ప్రభుత్వం.
- ఈ రోజు చేసిన మంచే మన బలం, ఇదే మన నినాదం. మనం యుద్ధం చేస్తున్నది రాక్షసులతో. అధర్మాన్నే ధర్మంగా వాళ్లు ఎంచుకొని యుద్ధం చేస్తున్నారు. వాళ్ల మాదిరిగా మీ బిడ్డకు ఢంకా బజాయించే ఈనాడు, ఆంధ్రజ్యోతి, టీవీ–5 లేదు. ఓ దత్తపుత్రుడు తోడుగా లేడు. ఒకే అబద్ధాన్ని వందసార్లు చెప్పిందే చెప్పి.. అదే నిజమని భ్రమ కలిగించే మీడియా మాధ్యమాలూ లేవు. మీ బిడ్డ ఇలాంటి తోడేళ్లను నమ్ముకోలేదు. మీ బిడ్డ నమ్ముకున్నది పైన దేవుడిని, మిమ్మల్నే.
- వీళ్లు చెబుతున్న అబద్ధాలు నమ్మకండి. మీ ఇంట్లో మంచి జరిగిందా లేదా అనేదే కొలమానంగా తీసుకోండి. మంచి జరిగి ఉంటే మీ బిడ్డకు మీరే సైనికులుగా నిలబడండి. జరగబోయే కురుక్షేత్ర యుద్ధంలో మీ బిడ్డకు శ్రీరామరక్షగా నిలవాలని కోరుతున్నా. ఇంకా మీకు మంచి చేసే అవకాశం దేవుడు ఇవ్వాలని కోరుతున్నా.

మన భావితరాలు ప్రపంచాన్ని ఏలే స్థాయికి ఎదగాలి

- పేద కుటుంబాల విద్యావసరాల కోసమే 'అమ్మ ఒడి'
- విద్యార్థులందరినీ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- సీఎం వైఎస్ జగన్ ట్వీట్

సాక్షి, అమరావతి: మన భావితరాలు ప్రపంచాన్ని ఏలే స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో గతంలో ఎన్నడూ లేనన్ని సంక్షేమ పథకాలను విద్యా రంగంలో ప్రవేశ పెట్టామని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. 'పేద కుటుంబాల్లో తల్లిదండ్రులు తమ బిడ్డల విద్యావసరాల కోసం ఇబ్బంది పడకుండా జగనన్న అమ్మఒడి పథకాన్ని తీసుకొచ్చాం. ఈ పథకం కింద తమ పిల్లలను చదివిస్తున్న 42.64 లక్షల మంది అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నేడు రూ.6,393 కోట్లు జమ చేస్తున్నాం. ఈ ఒక్క పథకం కిందే మన ప్రభుత్వం ఈ నాలుగేళ్లలో రూ.26,067 కోట్లు వారి ఖాతాల్లో నేరుగా జమ చేసింది. విద్యార్థులందరినీ ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో విద్యా రంగంలో మరిన్ని విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేలా చర్యలు చేపట్టాం' అని బుధవారం ఆయన ట్వీట్ చేశారు.

చంద్రబాబు కరకట్ట నివాసం కేసు.. విచారణ 30కు వాయిదా



సాక్షి, అమరావతి: టీడీపీ ప్రభుత్వ హయాంలో అమరావతిలో భూ కుంభకోణాల కేసులో చంద్రబాబు కరకట్ట నివాసాన్ని అటాచ్ చేయాలన్న సీఐడీ పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం ఈ నెల 30కు వాయిదా వేసింది. ఈ కేసుపై విజయవాడ ఏసీబీ న్యాయస్థానంలో బుధవారం వాదనలు సందర్భంగా కరకట్ట నివాసానికి సమాన విలువైన ఆస్తిని ష్యూరిటీగా చూపిస్తామని లింగమనేని రమేశ్ తరఫు న్యాయవాది న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. దానిపై సీఐడీ తరఫు న్యాయవాది తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఇక ఇదే కేసులో నారాయణ కుటుంబ సభ్యులకు చెందిన బ్యాంకు ఖాతాలను అటాచ్ చేయడంపై న్యాయస్థానం కోరిన వివరాలను సీఐడీ న్యాయవాది సమర్పించారు. అనంతరం ఈ కేసును న్యాయమూర్తి ఈ నెల 30కు వాయిదా వేశారు.

క్లుప్తంగా...

రాష్ట్ర ప్రజలకు గవర్నర్ బక్రీద్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రజలకు గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాం సంప్రదాయంలో బక్రీద్‌కు ఎంతో ప్రాధాన్యముందని పేర్కొన్నారు. అమితమైన భక్తి, త్యాగం, పేదలపై దయ, దాతృత్వం, సౌభ్రాతృత్వాలకు బక్రీద్ ప్రతీకగా నిలుస్తుందని తెలిపారని రాజ్‌భవన్ వర్గాలు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నాయి.

త్యాగ నిరతికి నిదర్శనం బక్రీద్

సీఎం జగన్ శుభాకాంక్షలు



సాక్షి, అమరావతి: ముస్లిం సోదర సోదరీమణులకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఈ పండుగ జరుపుకుంటారన్నారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని చెప్పారు. ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లిలందరూ ఈ పండుగను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకుంటారన్నారు. అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు. ఈ మేరకు బుధవారం సీఎం కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది.

ఉపాధ్యాయుల పదోన్నతులకు ఉత్తర్వులు

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు పాఠశాల విద్యాశాఖ ఉత్తర్వులిచ్చింది. ఇటీవల గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులకు సీనియారిటీ ఆధారంగా ఎంఈవో–2 పోస్టుల్లోకి పదోన్నతులు కల్పించడంతో ఏర్పడిన ఖాళీలను స్కూల్ అసిస్టెంట్లతో భర్తీ చేయనున్నారు. దీంతోపాటు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు సైతం స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించి ప్రభుత్వ, జిల్లా పరిషత్ పాఠశాలల్లో నియమించనున్నారు. దీనికి సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ బుధవారం విడుదల చేసింది. భాషా పండితులు మినహా గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ లిస్టును 30న వెల్లడించాలని ఆర్జేడీలు, డీఈవోలను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్‌కుమార్ ఆదేశించారు. హెచ్‌ఎంల ఎంపికపై జూలై 1, 2 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి 3న తుది సీనియారిటీ జాబితా వెల్లడించాలని, 4న కౌన్సెలింగ్ నిర్వహించి, కేటాయించిన ప్రాంతాల్లో ఐదోతేదీన రిపోర్టు చేయాలని ఆదేశించారు. స్కూల్ అసిస్టెంట్ల ఎంపికలో 1, 2, 3 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, 4న తుది జాబితా వెల్లడి, 5న కౌన్సెలింగ్, 6న కొత్త పోస్టుల్లో రిపోర్టింగ్‌కు అవకాశం కల్పించారు.

ఐటీ, సైబర్ సెక్యూరిటీలపై యువతకు సీటీఈ శిక్షణ

సాక్షి, అమరావతి: ఏపీలో ఐటీ, సైబర్ సెక్యూరిటీ రంగాల్లో శిక్షణ ఇచ్చేలా కన్సార్టియం ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (సీటీఈ) ముందుకువచ్చింది. రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లను ఏర్పాటు చేయడం ద్వారా ఐటీ, సైబర్ సెక్యూరిటీల్లో పరిశ్రమలకు అవసరమైన కోర్సులను రూపకల్పన చేసి శిక్షణ ఇవ్వనుంది. ఈ మేరకు ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ తో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. ఏపీఎస్ఎస్‌డీసీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎస్ఎస్‌డీసీ ఎండీ సీఈవో వినోద్ కుమార్, సీటీఈ డైరెక్టర్ అళగర్సామిలు ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు.

సిటీస్ ప్రాజెక్ట్ పనుల ప్రారంభం

తాడేపల్లి రూరల్: మంగళగిరి నియోజకవర్గానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సిటీస్ ప్రాజెక్ట్ పనులు చేపట్టేందుకు ఫేజ్–1 కింద సుమారు రూ. 8 కోట్లను విడుదల చేశారు. బుధవారం వీటికి సంబంధించిన పనులను సీఆర్‌డీఏ స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు ప్రారంభించారు.

జగనన్న కాలనీల్లో ఇంకుడు గుంతల నిర్మాణం

సాక్షి, అమరావతి: జగనన్న కాలనీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా రూ.108 కోట్లతో ఇంకుడు గుంతల నిర్మాణానికి అనుమతిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ సూర్యకుమారి బుధవారం ఆదేశాలిచ్చింది.

ప్రాధాన్యత కేసుల దర్యాప్తును వేగవంతం చేయండి

సీఐడీ అధికారులకు డీజీపీ ఆదేశం




రెండో బెటాలియన్ అధికారులతో మాట్లాడుతున్న డీజీపీ

కర్నూలు: పెండింగ్‌లోని ప్రాధాన్యత కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి సీఐడీ అధికారులను ఆదేశించారు. కర్నూలు వెంకటరమణ కాలనీలోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. సీఐడీ అధికారులతో సమావేశమై కేసుల దర్యాప్తు, పురోగతిపై చర్చించారు. సీఐడీ ఆఫీస్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలు, పోలీసుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలను తెలుసుకున్నారు.

వ్యవసాయానికి విద్యుత్తు

పూర్తిగా ఉచితం

పగటి పూట 9 గంటల నిరంతరం నాణ్యమైన సరఫరా



అన్నదాతలకు ఉచిత విద్యుత్తు హక్కుగా అందాలన్నదే సీఎం జగన్ లక్ష్యం

- అందుకే వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం
- తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందకండి
- విద్యుత్ బిల్లు ఎంతైనా ప్రభుత్వమే భరిస్తుంది
- డిస్కంల సీఎండీలు పృథ్వీతేజ్, పద్మాజనార్దనరెడ్డి, సంతోషరావు



పృథ్వీతేజ్



పద్మాజనార్దనరెడ్డి



సంతోషరావు

సాక్షి, అమరావతి: అన్నదాతలకు ఉచిత విద్యుత్‌ను హక్కుగా అందించాలని, 30 ఏళ్లయినా వ్యవసాయానికి ఎలాంటి కొరత లేకుండా నాణ్యమైన కరెంటు సరఫరా చేయాలన్నదే సీఎం వైఎస్ జగన్ లక్ష్యం. ఇందుకోసం ఖర్చుకు కూడా వెనుకాడకుండా రాష్ట్ర రైతాంగం కోసం ఏర్పాటు చేసిన పథకమే వైఎస్ఆర్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకం. ఈ పథకం కింద వ్యవసాయానికి పగటిపూట 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్తు ఉచితంగా అందుతుంది. ఇందుకోసం ప్రభుత్వం సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సెకీ)తో ఒప్పందం కుదుర్చుకుంది. వాడిన విద్యుత్‌కు రైతులు చెల్లించాల్సిన బిల్లుల మొత్తాన్ని కూడా రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. ఇంత మంచి పని చేస్తుంటే చూసి ఓర్వలేకపోతున్నారు కొందరు. రైతుల హక్కును అడ్డుకునేందుకు కుట్ర చేస్తున్నారు. అసత్య ప్రచారాలతో ప్రజలను, రైతులను అయోమయానికి గురిచేయాలని ప్రయత్నిస్తున్నారు. అలాంటి తప్పుడు ప్రచారాలని నమ్మి ఆందోళనకు గురికావద్దని ఏపీ తూర్పు, మధ్య, దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల సీఎండీలు పృథ్వీతేజ్, పద్మాజనార్దనరెడ్డి, సంతోషరావు స్పష్టం చేశారు. వారు వెల్లడించిన వివరాలిలా ఉన్నాయి..

➡ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకానికి వ్యవసాయదారులందరూ పూర్తిగా సహకరిస్తున్నారు. నగదు బదిలీ పథకంలో చేరేందుకు రైతులందరూ అంగీకరించి దరఖాస్తు కూడా చేసుకున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఏ సంక్షేమ పథకానికి వ్యవసాయ విద్యుత్ బిల్లులను ప్రామాణికంగా తీసుకోవడంలేదు. మీటర్ల వల్ల సంక్షేమ పథకాల్లో కోత విధిస్తారనే భయాందోళనలు రైతులకు అవసరం లేదు.

➡ రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, సేవలు అందుతున్నాయి. రైతులకు అత్యంత తక్కువ సమయంలో వ్యవసాయ సర్వీసులు విడుదలవుతున్నాయి. కాల్ సెంటర్లను ఆధునీకరించడంతో వినియోగదారుల సమస్యలకు సత్వరమే పరిష్కారం లభిస్తోంది. దీంతో ఫిర్యాదులు కూడా గణనీయంగా తగ్గాయి. డిస్కంలు కూడా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో బలోపేతం అవుతున్నాయి. దీంతో రైతులకు, ప్రజలకు ఇబ్బంది లేకుండా, వ్యవసాయ, గృహ, పారిశ్రామిక, వాణిజ్య విద్యుత్ కొరత లేకుండా అందిస్తున్నాయి. కాబట్టి ఈ విషయంలో ఎలాంటి అపోహలకూ తావులేదు.

☛ వ్యవసాయ బోర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు వల్ల రైతులకు ఎలాంటి విద్యుత్ బిల్లుల భారం పడదు. పూర్తిగా ఉచితం. నగదు బదిలీ ద్వారా (డీబీటీ) రైతుకు చెందిన ప్రత్యేక బ్యాంకు ఖాతాలో ఆ బిల్లు మొత్తాన్ని ప్రతినెలా ప్రభుత్వమే వేస్తుంది. అది తిరిగి రైతుల ద్వారా విద్యుత్ సంస్థలకు చెల్లించడం జరుగుతుంది. రైతులు వారి జేబు నుంచి ఒక్క పైసా కూడా చెల్లించాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఏ విధంగా ఉచిత విద్యుత్ పొందుతున్నారో, ఇక మీదట కూడా అలాగే పొందుతారు. ఖర్చు మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది.

☛ ఉచిత విద్యుత్తుకు తూట్లు పొడిచేందుకే ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు పెడుతోందనే ప్రచారం పూర్తిగా అవాస్తవం. వచ్చే 30 ఏళ్ళ పాటు వ్యవసాయానికి ఉచిత విద్యుత్తు సరఫరా జరుగుతుంది. దీని కోసమే రాష్ట్ర ప్రభుత్వం 7 వేల మెగావాట్ల సౌర విద్యుత్తు కొనుగోలుకు సెకీతో ఒప్పందం చేసుకుంది. అన్ని వ్యవసాయ సర్వీసులకు వైఎస్సార్ ఉచిత వ్యవసాయ విద్యుత్ పథకాన్ని సంపూర్ణంగా అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు కట్టుబడి ఉన్నాయి.

☛ స్మార్ట్ మీటర్ల వల్ల మొత్తం మోటారు లోడు తెలుస్తుంది. ఏ సమయంలో ఏ ప్రాంతాల్లో ఎంతెంత విద్యుత్ సరఫరా చేయాలో ఖచ్చితంగా తెలుస్తుంది. దీనివల్ల లోడుకి సరిపడా ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు, సబ్‌స్టేషన్లు వంటి మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయొచ్చు. అధిక లోడు కారణంగా మోటార్లు కాలిపోయే పరిస్థితి ఉండదు. వ్యవసాయానికి సరఫరా అయ్యే విద్యుత్ నాణ్యత (ఓల్టేజి, అంతరాయాలు) మెరుగుపడుతుంది. ట్రాన్స్‌ఫార్మర్లకి రక్షణ ఏర్పడుతుంది. మీటర్లు, వాటికి కావాల్సిన స్విచ్, ఎర్త్ వైరు వంటి నాణ్యమైన వస్తువులను విద్యుత్ కంపెనీనే అమరుస్తుంది. దీనివల్ల షార్ట్ సర్క్యూట్ వంటి ప్రమాదాలను నివారించొచ్చు.

డిమాండ్‌కు సరిపడా విద్యుత్..

రాష్ట్రంలో ఎక్కడా కోత లేదు

స్పష్టం చేసిన ఏపీ ట్రాన్స్‌కో

సాక్షి, అమరావతి: ప్రభుత్వ హామీ మేరకు రాష్ట్రంలో డిమాండ్‌కు సరిపడా విద్యుత్ సరఫరా జరుగుతోందని, ఎక్కడా విద్యుత్ కోతలు విధించడం లేదని ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ (ఏపీ ట్రాన్స్‌కో) బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేసింది. విద్యుత్ పంపిణీ సంస్థలు ఈ నెల 24న 206.62 మిలియన్ యూనిట్లు, 25న 197.19 మిలియన్ యూనిట్లు, 26న 201.97 మిలియన్ యూనిట్లు చొప్పున ఎలాంటి విద్యుత్ లోటు, లోడ్ రిలీఫ్‌లు లేకుండా అందించాయని తెలిపింది. ఈ మూడు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీజెన్‌కో) థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు సగటున రోజుకు 80 మిలియన్ యూనిట్లు అందించాయని వెల్లడించింది. 27వ తేదీ వరకు సగటు విద్యుత్ ఎగుమతి (అమ్మకాలు) రోజుకు 1.36 మిలియన్ యూనిట్లు మాత్రమేనని పేర్కొంది. అందువల్ల సరఫరా – డిమాండ్ గ్యాప్ కారణంగా లోడ్ రిలీఫ్‌లు లేవని, గ్రిడ్ డిమాండ్‌కు సరిపడా విద్యుత్‌ను డిస్కంలు సమకూర్చుకుంటున్నాయని తెలిపింది. విద్యుత్ కొరత తీర్చడానికి ఎప్పటికప్పుడు బహిరంగ మార్కెట్ (ఎనర్జీ ఎక్స్ఛేంజీలు) నుంచి కొని, రాష్ట్రంలోని వినియోగదారులకు నిరంతరాయంగా కరెంటు సరఫరా చేస్తున్నాయని వివరించింది.

ప్రాజెక్టుల ప్రగతిపై పీఎం మోదీ సమీక్ష

- సీఎస్ జవహర్‌రెడ్డితోపాటు పలు శాఖల అధికారుల హాజరు



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధికి అమలు చేస్తున్న వివిధ జాతీయ ప్రాజెక్టుల ప్రగతిపై బుధవారం ఢిల్లీ నుంచి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పలువురు కేంద్ర శాఖల కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రధానంగా వివిధ రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తున్న ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), ఢిల్లీ–వడోదర–ముంబై ఎక్స్‌ప్రెస్ వే, చోటాదపూర్–ధార్ రత్లాం–మాహౌ–ఖాండ్వా–అకోలా రైల్వే లైన్ కన్వర్షన్, ముంబై–నాగపూర్–ఝూర్సుగుడ పైపులైన్, బైలదిల్లా ఐరన్ ఓర్ డిపాజిట్ ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి (పీఎం స్వానిధి) అంశాలకు సంబంధించి ఆయా ప్రాజెక్టుల ప్రగతిని ప్రధానమంత్రి సమీక్షించారు. ఈ వీడియో సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్ జవహర్‌రెడ్డి, ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి శ్యామలరావు, రహదారులు–భవనాలశాఖ కార్యదర్శి ప్రద్యుమ్న, ఐటీశాఖ కార్యదర్శి కె.శశిధర్, పీసీసీఎఫ్ ఎ.కె.ఝూ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్కరణలు వేగవంతం చేయండి: కేంద్రం

సాక్షి, న్యూఢిల్లీ: విద్యుత్ సంస్కరణలు వేగవంతం చేయాలని రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం సూచించింది. సంస్కరణలు పూర్తి చేసిన రాష్ట్రాలకు అదనపు రుణ పరిమితి వెసులుబాటు నిమిత్తం ఆర్థిక ప్రోత్సాహకాలు అందజేస్తామని పేర్కొంది. 2023–24లో సంస్కరణలు అమలు చేసిన రాష్ట్రాలకు ప్రోత్సాహకంగా రూ.1,43,332 కోట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొంది. ఇప్పటికే ప్రయోజనాలు పొందిన రాష్ట్రాలకు కొనసాగింపు ఉంటుందని ఆర్థిక శాఖ బుధవారం ఓ ప్రకటనలో వెల్లడించింది.

ఎన్ఆర్ఐ కమ్యూనిటీ సైన్స్ కోర్సులకు ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరంలో ఎన్ఆర్ఐ కోటా, కమ్యూనిటీసైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ రామారావు బుధవారం తెలిపారు. ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. జూలై 17లోగా లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని వర్సిటీ కార్యాలయంలో పోస్ట్, లేదా నేరుగా అందజేయాలని సూచించారు.

ఏపీలో విద్యా సంస్కరణలు అద్భుతం

మేఘాలయ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సంపత్‌కుమార్



ఈశ్వరమ్మను సత్కరిస్తున్న నేతలు, అధికారులు

రామచంద్రపురం రూరల్: ఏపీలో విద్యా సంస్కరణలు బాగున్నాయని, ఇప్పటికే ఫలితాలు కళ్ల ముందు కనిపిస్తున్నాయని, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని మేఘాలయ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ పి.సంపత్‌కుమార్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం భీమక్రోసుపాలెంలోని మండల ప్రజాపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తన తల్లి ఈశ్వరమ్మతో కలసి బుధవారం ఆయన సందర్శించారు. సంపత్‌కుమార్ ఇదే పాఠశాలలో 4వ తరగతి విద్యనభ్యసించగా, తల్లి ఈశ్వరమ్మ ఇక్కడ ఉపాధ్యాయినిగా పనిచేశారు. తాను పనిచేసిన పాఠశాలలను ఒక్కసారి చూడాలన్న తల్లి కోరికతో పాటు ఏపీలో జరుగుతోన్న విద్యా సంస్కరణలను పరిశీలించడానికి వచ్చినట్లు సంపత్‌కుమార్ తెలిపారు. విద్యార్థులతో మాట్లాడిన ఆయన పట్టుదలతో శ్రమించాలని సూచించారు. మంచి చదువును అందిస్తే భవిష్యత్ తరాలు అద్భుతంగా మారతాయని ఆ దిశగా పనిచేస్తోన్న సీఎం జగన్ అభినందనీయుడన్నారు. సంపత్‌కుమార్ తల్లి ఈశ్వరమ్మను ఆర్జేడీ నాగమణి ఆధ్వర్యంలో సత్కరించారు.

8 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల పర్యవేక్షణకు కమిటీ

ఉత్తర్వులు జారీ చేసిన సీఎస్ జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: ఐక్యరాజ్యసమితి పేర్కొన్న సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను వేగంగా చేరుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఏపీఎస్‌డీజీ ప్రత్యేక పోర్టల్ ద్వారా సేకరించే సమాచారం దుర్వినియోగం కాకుండా ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ఎనిమిది మంది సభ్యులతో ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులిచ్చారు. కమిటీలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పాఠశాల విద్య ముఖ్య కార్యదర్శి, మహిళా శిశు సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, సాంఘిక సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి, మైనార్టీ, గిరిజన సంక్షేమ కార్యదర్శులు సభ్యులుగా, ఐటీశాఖ కార్యదర్శి సభ్య కన్వీనర్‌గా వ్యవహరిస్తారని వివరించారు. 10 నుంచి 19 ఏళ్ల బాలికల్లో ఎనీమియా, 15 నుంచి 49 ఏళ్ల మధ్యలో గర్భందాల్చిన మహిళల్లో ఎనీమియా, ఐదేళ్లలోపు వయసులో బరువు తక్కువగా ఉన్న వారిలో పౌష్టికాహారలోపం, ఐదేళ్లలోపు వయసుకు తగ్గట్టుగా బరువు పెరగని పిల్లల్లో పౌష్టికాహారలోపం, 1–8 తరగతుల విద్యార్థుల ప్రాథమిక విద్య నమోదు, ఇంటర్మీడియట్ విద్యార్థుల గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ నిష్పత్తి, పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు, పాఠశాలల్లో విద్యార్థినుల టాయిలెట్స్ వంటి ఎనిమిది సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించిన సమాచారం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి ఎప్పటికప్పుడు సేకరించి ఏపీఎస్‌డీజీ పోర్టల్‌లో నమోదు చేస్తారు.

జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సాక్షి, అమరావతి: జాతీయ ఉపాధ్యాయ అవార్డులు–2023 కోసం అర్హత గల ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ఎంపిక జరుగుతుందన్నారు. అర్హత గల ఉపాధ్యాయులు జూలై 15లోగా తమ దరఖాస్తులను http:/-/n ationalawardstoteacher. eduction. gov. in ద్వారా సమర్పించాలన్నారు. ఎంపికైన వారికి సెప్టెంబర్ 5వ తేదీన గురుపూజోత్సవం సందర్భంగా అవార్డులు ప్రదానం చేస్తారన్నారు.

గ్రామాల్లో మొదలైన ఆస్తుల రిజిస్ట్రేషన్



సాక్షి, అమరావతి: ఆస్తుల రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో ప్రభుత్వం మరో భారీ మార్పునకు శ్రీకారం చుట్టింది. ప్రజలకు అనుకూలంగా పరిపాలనను మండలం నుంచి గ్రామ స్థాయికి తీసుకువచ్చిన ప్రభుత్వం.. దాన్ని మరింత మెరుగుపరిచేలా రిజిస్ట్రేషన్ల సేవల్ని కూడా అందుబాటులోకి తీసుకువచ్చింది. భూముల రీసర్వే పూర్తయిన 2 వేల గ్రామాల్లో పూర్తి స్థాయిలో రిజిస్ట్రేషన్ సేవలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. ఇప్పుడు రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకే వెళ్లాల్సిన అవసరం లేదు. తమ గ్రామాల్లోని సచివాలయాలకు వెళితే అక్కడ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉండే అన్ని సేవలు పొందవచ్చు. సుపరిపాలనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భూముల రీసర్వే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే 2 వేల గ్రామాల్లో రీసర్వే అన్ని దశల్లోనూ పూర్తయి అక్కడ డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వచ్చాయి. దీంతో ఈ గ్రామాల్లో రిజిస్ట్రేషన్ సేవల్ని ప్రారంభించాలని గతంలోనే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. అందుకోసం మొదట ప్రయోగాత్మకంగా రీసర్వే పూర్తి చేసిన 51 గ్రామ సచివాలయాలను గత సంవత్సరం జనవరిలోనే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తించి అక్కడి పంచాయతీ కార్యదర్శులను జాయింట్ సబ్ రిజిస్ట్రార్లుగా నియమించింది. ఆ తర్వాత 2022 నవంబర్‌లో 1,949 సచివాలయాలు, ఈ నెల 23న మరో 195 సచివాలయాలను సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుగా గుర్తించింది. వీటిలో రీసర్వే పూర్తయిన 2 వేల గ్రామాలను 1,535 గ్రామ సచివాలయాలుగా మ్యాపింగ్ చేసి అక్కడ రిజిస్ట్రేషన్ సేవల్ని లాంఛనంగా ప్రారంభించారు.

సీఎం దిశా నిర్దేశం.. ఊపందుకున్న రిజిస్ట్రేషన్లు

గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు పూర్తి స్థాయిలో మొదలు కావాలని ఇటీవల సీఎం వైఎస్ జగన్ అధికార యంత్రాంగానికి నిర్దేశించారు. ఈ నెలాఖరు నాటికి ప్రారంభం కావాలని స్పష్టం చేశారు. దీంతో ఈ 15 రోజుల్లోనే దాదాపు అన్ని సచివాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు ఊపందుకున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అందించే సర్టిఫైడ్ కాపీ, ఈసీ సర్టిఫికెట్, మార్కెట్ వాల్యూ సర్టిఫికెట్ జారీ సహా డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌ను మొదలు పెట్టారు. ఇప్పటివరకు 4,300కిపైగా రిజిస్ట్రేషన్లను సచివాలయాల్లో చేశారు. వాటి ద్వారా ప్రభుత్వానికి రూ.7.67 కోట్ల ఆదాయం లభించింది. అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లాలోని 44 గ్రామ సచివాలయాల్లో 766 రిజిస్ట్రేషన్లు జరిగాయి. ఈ 2 వేల గ్రామాలకు సంబంధించి సచివాలయాల ద్వారా 16 లక్షల ఈసీలు, 62 లక్షల సర్టిఫైడ్ కాపీలు జారీ చేశారు. ఈ సేవల్ని మరింత విస్తృతంగా సచివాలయాల నుంచి అందించడానికి అధికార యంత్రాంగం ప్రయత్నిస్తోంది. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ సేవల గురించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరలో అధికారికంగా ప్రకటించనున్నారు.

ప్రజల ముంగిటకే రిజిస్ట్రేషన్ సేవలు

ప్రభుత్వ సేవలను ప్రజల ముంగిటకే తీసుకువెళ్లే విధానాన్ని రిజిస్ట్రేషన్ల శాఖలోనూ ప్రవేశపెట్టాం. రీసర్వే పూర్తయిన గ్రామాలకు సంబంధించిన గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేస్తున్నాం. ప్రజలు ఈ సర్వీసుల్ని వినియోగించుకోవాలి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలతో పాటు ఎవరి గ్రామాల్లో వారు ఈ సేవలను పొందవచ్చు. రిజిస్ట్రేషన్లు చేయడం కోసం ఆయా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి శిక్షణ కూడా ఇచ్చాం.

– వి రామకృష్ణ, కమిషనర్ అండ్ ఐజీ, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ.

విశాఖలో దంపతుల కిడ్నాప్ యత్నం భగ్నం

- కారులో తీసుకుపోతుండగా యలమంచిలి హైవే వద్ద బిగ్గరగా అరచిన భార్య లోవలక్ష్మి
- యలమంచిలి హైవే వద్ద భార్యను దించేసి భర్త శ్రీనివాస్‌తో పరారైన కిడ్నాపర్లు
- కిడ్నాపర్ల కారును అడ్డగించి నిందితుల్ని అదుపులోకి తీసుకున్న కత్తిపూడి పోలీసులు



కిడ్నాపర్లు కారు నుంచి తోసేయడంతో బయటపడిన లోవలక్ష్మి


సీతమ్మధార (విశాఖ ఉత్తర)/యలమంచిలి : విశాఖ నగరానికి చెందిన భార్యాభర్తలను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించిన దుండగులకు పోలీసులు చెక్ పెట్టారు. అక్కయ్యపాలెంలో దంపతులిద్దరినీ కొట్టి కారులో విజయవాడకు తరలించేందుకు ప్రయత్నించగా మార్గంమధ్యలోనే కిడ్నాపర్లను పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడకు చెందిన వి.లోవలక్ష్మి, పట్నాల శ్రీనివాసరావు దంపతులు నెల రోజుల క్రితం విశాఖ వచ్చారు. ఇక్కడ గురుద్వార ప్రాంతంలోని స్నేహితుడి ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇటీవల అక్కయ్యపాలెం ప్రాంతంలో ఉన్న శ్రీచరణ్ రియల్ ఎస్టేట్ సంస్థలో ఇద్దరూ ఎగ్జిక్యూటివ్‌లుగా చేరారు. కాగా, బుధవారం మధ్యాహ్నం దంపతులిద్దరూ కార్యాలయం నుంచి బయటకు వెళ్తున్న సమయంలో ఏడుగురు వ్యక్తులు రెండు కార్లలో వచ్చారు. ఆ దంపతులపై దాడిచేసి బలవంతంగా కారులో ఎక్కించుకొని విజయవాడకు తీసుకువెళ్లేందుకు పయనమయ్యారు.

భార్య కేకలు వేయడంతో..

ఆ కార్లు అక్కయ్యపాలెం మీదుగా జాతీయ రహదారిలో వెళుతుండగా యలమంచిలి మండలం కొక్కిరాపల్లి ప్రాంతానికి చేరుకున్న సమయంలో భార్య లోవలక్ష్మి కారులోంచి గట్టిగా కేకలు వేసింది. స్థానికులు చూడటంతో కిడ్నాపర్లు వెంటనే ఆమెను కారు నుంచి దించేసి భర్త శ్రీనివాసరావుతో వెళ్లిపోయారు. దీంతో స్థానికులు ఆమె వద్దకు వచ్చి విషయం తెలుసుకుని వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. యలమంచిలి సీఐ గఫూర్ జరిగిన విషయాన్ని తెలుసుకుని ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో పోలీస్ అధికారులు జాతీయ రహదారిలో ఉన్న అన్ని చెక్‌పోస్టులు, హైవే పెట్రోలింగ్, ఇతర స్టేషన్ల అధికారులు, సిబ్బంది అప్రమత్తమయ్యారు. అలాగే సీఐ గఫూర్ లోవలక్ష్మిని దగ్గరుండి విశాఖ బస్సు ఎక్కించి నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయాలని పంపించారు.

కత్తిపూడి వద్ద కిడ్నాపర్లను పట్టుకున్న పోలీసులు

కిడ్నాపర్ల కారును కత్తిపూడి వద్ద పోలీసులు గుర్తించి అడ్డుకున్నారు. కిడ్నాపర్లను అదుపులోకి తీసుకుని శ్రీనివాసరావును సురక్షితంగా విడిపించారు. ఆ సమాచారాన్ని విశాఖ నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. ఇంతలో లోవలక్ష్మి రాత్రి 9.30 గంటలకు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని పోలీసులను ఆశ్రయించింది. ఇదిలా ఉంటే భార్యాభర్తలిద్దరూ విజయవాడలో ఉన్న సమయంలో భర్త శ్రీనివాసరావు ఒక కేసు విషయంలో 11 నెలల పాటు జైలులో ఉన్నట్టు సమాచారం. కిడ్నాప్ గ్యాంగ్‌తో కలిసి ఈయన విజయవాడలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయగా.. వారికి రూ.60 లక్షల వరకు బాకీ పడినట్టు తెలిసింది. కిడ్నాపర్లను విశాఖకు తీసుకువచ్చేందుకు ఎస్ఐతో పాటు ఒక బృందాన్ని కత్తిపూడికి పంపించినట్టు సమాచారం.



సాక్షి, అమరావతి: రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖలోని ఏపీ వైద్యవిధాన పరిషత్ (ఏపీవీవీపీ) పరిధిలో 14 స్పెషాలిటీల్లో 331 వైద్య పోస్టుల భర్తీకి వచ్చే నెల ఐదోతేదీ నుంచి వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు ఏపీవీవీపీ కమిషనర్ డాక్టర్ వెంకటేశ్వర్ బుధవారం తెలిపారు. శాశ్వత, కాంట్రాక్ట్ పద్ధతుల్లో పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. ప్రభుత్వ వైద్యులుగా పనిచేసి రిటైరైన వారికి కాంట్రాక్ట్ పద్ధతి నియామకాల్లో అవకాశం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జూన్ ఒకటో తేదీ నాటికి 70 ఏళ్లు పైబడని రిటైర్డ్ వైద్యులు అర్హులని తెలిపారు. 5వ తేదీ జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్ స్పెషాలిటీల్లో, 7వ తేదీ గైనకాలజీ, అనస్తీషియా, ఈఎన్‌టీ, పాథాలజీ, 10వ తేదీ పీడియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, ఆప్తమాలజీ, రేడియాలజీ, సైకియాట్రి స్పెషాలిటీల్లో ఇంటర్వ్యూ నిర్వహిస్తామని వివరించారు. షెడ్యూల్ ప్రకారం అభ్యర్థులు గొల్లపూడిలోని ఏపీవీవీపీ కార్యాలయానికి ఉదయం 10 గంటలకు చేరుకుని దరఖాస్తులు సమర్పించాలని చెప్పారు. నోటిఫికేషన్ వివరాల కోసం అభ్యర్థులు hmfw.ap.gov.inలో చూడాలని సూచించారు. ఇతర వివరాలకు 06301138782 ఫోన్ నంబరులోగానీ, apvvpwalkinrecruitment@gmail.com లోగానీ సంప్రదించాలని కోరారు. కాంట్రాక్ట్ పద్ధతి నియామకాల్లో గిరిజన ఆస్పత్రుల్లో రూ.2.50 లక్షలు, గ్రామీణ ఆస్పత్రుల్లో రూ.2 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.30 లక్షలు చొప్పున వేతనాలు ఉంటాయని తెలిపారు. ప్రభుత్వాస్పత్రుల్లో ఒక్క పోస్టు కూడా ఖాళీగా ఉండకుండా చూడాలనే చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఇప్పటికే 48 వేలకుపైగా పోస్టులను భర్తీచేసిన విషయం తెలిసిందే. ఏపీవీవీపీ పరిధిలోని గిరిజన, గ్రామీణ ఆస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యులను పూర్తిస్థాయిలో అందుబాటులో ఉంచడానికి ఇప్పటికే పలుమార్లు వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించారు. వివిధ కారణాలతో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి మరోసారి ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు.

• తెలంగాణ

అవినీతి బ్యాంక్ ఉద్యోగులకు జైలుశిక్ష

సాక్షి, హైదరాబాద్: బ్యాంక్‌ను మోసగించిన కేసులో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ బ్రాంచ్ మాజీ మేనేజర్ పి.ఫణిప్రసాద్, మాజీ అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్.పాండురంగం చలపతిలకు సీబీఐ కోర్టు ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. రూ.75 వేల చొప్పున జరిమానా కూడా విధించింది. వీరిద్దరూ హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రైవేట్ కంపెనీ యజమాని వై.కోటేశ్వర్‌రావుతో చేతులు కలిపి బ్యాంక్‌కు రూ.1.15 కోట్ల నష్టం కలిగించారు. ఇళ్ల నిర్మాణం పేరుతో సదరు మొత్తాన్ని పొందిన కోటేశ్వర్‌రావు.. కొన్ని ఇళ్ల నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేశారు. మరికొన్ని ప్రారంభించలేదు. పరిశీలించ కుండానే ఫణిప్రసాద్, పాండురంగం అతనికి రుణం విడుదల చేశారు. దీనిపై 2005లో కేసు నమోదు చేసిన సీబీఐ 2007లో ముగ్గురిపై చార్జిషీట్ దాఖలు చేసింది.



మంచి భర్త ఎప్పుడూ రాత్రిపూట (అందరికంటే) ముందు పడుకోడు: ఉదయం అందరికంటే చివర మేల్కొనడు.
– హొనొరే డె బాల్జాక్

సాక్షి
గురువారం, 29 జూన్ 2023

ప్రశ్నల పీక నొక్కకండి!

ప్రశ్నిస్తే... వేధిస్తారా? అవును. సోషల్ మీడియా తెర చాటున నిలబడి దొంగ పేర్లతో బాణాలు వేసే విచ్చలవిడి వీరత్వం పెరుగుతున్న కొద్దీ అదే ఖాయమవుతోంది. గత వారం అమెరికా పర్యటనలో ఉన్న భారత ప్రధానిని వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు సాక్షిగా ఇబ్బందికరమైన ప్రశ్న వేయడమే పాకిస్తానీ అమెరికన్ జర్నలిస్ట్ సబ్రినా సిద్దిఖీ చేసిన పాపమైంది. భారత్‌లో మైనారిటీల హక్కుల సంగతి అడిగిన ఆమెపై ట్రోలింగ్ తీరు అచ్చం అలాగే ఉంది. చివరకు వైట్‌హౌస్ ప్రతినిధి ఈ ట్రోలింగ్‌లు 'అంగీకారయోగ్యం కాదు' అని ఖండించాల్సి వచ్చింది. ప్రజాస్వామ్య సూత్రాలకే విరుద్ధమని హితవు చెప్పాల్సొచ్చిందంటే తీవ్రత అర్థం చేసుకోవచ్చు. హైదరాబాద్ నుంచి అమెరికా దాకా అంతటా జర్నలిస్టులకు ఎదురవుతున్న ట్రోలింగ్‌భూతంపై పోరు అత్యవసరమని ఇది గుర్తుచేస్తోంది.

మోదీని ప్రశ్నించిన సబ్రినా సిద్దిఖీ అనుభవమున్న జర్నలిస్ట్. తల్లితండ్రులు పాకిస్తానీలైనా, ఆమె పుట్టింది అమెరికాలోనే. దీర్ఘకాలంగా అమెరికా అధ్యక్షులు, వైట్‌హౌస్ వ్యవహారాలను నివేదిస్తూ, విలేఖరిగా తనదైన ముద్ర వేశారు. 'హఫింగ్టన్ పోస్ట్', 'బ్లూమ్‌బెర్గ్', 'గార్డియన్' లాంటి ప్రసిద్ధ సంస్థల్లో తన పాళీకి పదునుపెట్టుకున్నారామె. సాధారణంగా ఎన్నడూ అప్పటికప్పుడు అడిగే ప్రశ్నలకు జవాబివ్వాల్సిన విలేఖరుల సమావేశంలో పాల్గొనని మోదీ వైట్‌హౌస్ ఒత్తిడి మేరకు బైడెన్‌తో కలసి విలేఖరుల ముందుకు రావాల్సి వచ్చింది. ఇద్దరూ చెరి రెండు ప్రశ్నలకు సమాధానాలు చెప్పిన ఆ భేటీలో 'వాల్ స్ట్రీట్ జర్నల్' ప్రతినిధిగా సబ్రినా మోదీని వేసింది ఒక ప్రశ్నే. 'ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారత్‌లో మతపరమైన మైనారిటీలపై ప్రభుత్వ దుర్విచక్షణ సాగుతోందనీ, విమర్శకుల నోరు మూయిస్తున్నారనీ మానవ హక్కుల సంస్థలంటున్నాయి. మైనారిటీల హక్కులకై మీ సర్కారేం చేయనుంది' అన్నది స్థూలంగా ప్రశ్న.

ఇరుకున పెట్టే ప్రశ్న వేసినా, భారత్‌లో అలాంటిదేమీ లేదంటూ ప్రధాని బలంగానే తన వాణి వినిపించారు. అయినా సరే, ఆయనను అలాంటి ప్రశ్న వేయడం వీరభక్తులకు నచ్చలేదు. ఫలితమే – అంతర్జాలంలో సబినాపై అమానుష దాడి. ఆమె పాకిస్తానీ అనీ, ముస్లిమ్ అనీ, డిజిటల్ యుగపు నిరసనల 'టూల్‌కిట్ గ్యాంగ్'లో భాగమనీ దుర్భాషలాడారు. ఇలాంటి ట్రోలింగ్ ప్రైవేట్ మూకల్నీ, సాంకేతిక జ్ఞానంతో కావాల్సిన సందేశాలు పంపే ఇంటర్నెట్ బాట్ల విధానాన్నీ ఇవాళ పాలక వ్యవస్థలన్నీ పెంచిపోషిస్తున్న మాట నిష్ఠురసత్యం. మోదీని ప్రశ్నించిన జర్నలిస్టును వేధిస్తున్నది పాలకపక్ష ప్రైవేట్ సైన్యమే అని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నది అందుకే. ధైర్యంగా ప్రశ్నించడంలో జర్నలిస్టుగా ఆమె తన బాధ్యత నిర్వహిస్తే, సోషల్ మీడియా వేదికగా విషం చిమ్మడం విస్తుపరుస్తోంది. వెనకెవరూ లేనిదే ఇంతగా వేధింపులకు దిగరనేది తర్కబద్ధమే. 'ఈ పని మీ ప్రైవేట్ ట్రోల్ సేనలది కాదా? వారిపై చర్యలు తీసుకుంటారా?' అని బీజేపీపై కాంగ్రెస్ విరుచుకుపడింది.

మీడియా ప్రజాస్వామికీకరణకు సోషల్‌మీడియా ఉపకరించింది ఎంత నిజమో, వేదికలు పెరిగి, చేతిలో ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ అడ్డుకట్ట లేని అంతర్జాలంలో అడ్డమైన అభిప్రాయాలనూ వదిలి, భావకాలుష్యం పెంచుతున్నదీ అంతే నిజం. దాని విపరిణామమే ఇప్పుడు ప్రపంచమంతటా చూస్తున్నది. మెజారిటీ ఆలోచనకు భిన్నాభిప్రాయం ఉన్నవారెవరినీ సోకాల్డ్ ప్రజాస్వామ్య వేదికలు ఫేస్‌బుక్, ట్విట్టర్, యూట్యూబ్‌లలో ఎక్కడా మననివ్వక పోవడం నిత్యం చూస్తున్నదే. సాధారణ సమూహాల నుంచి పాలక పక్షాల దాకా అందరికీ ఈ ట్రోలింగ్ ఓ ఆనవాయితీ. ప్రత్యర్థి పీకనొక్కే పదునైన ఆయుధం. ఈ వర్తమాన వైపరీత్యానికి బాధితులే – అమెరికాలో సబ్రినా అయినా, హైదరాబాద్‌లో చందు తులసి అయినా! ఇందులో భావప్రకటన స్వేచ్ఛ ఒక్కటే కాదు... బెదిరింపులు, దూషణలతో భయభ్రాంతుల్ని చేసి, మానసికంగా హింసించే మానవ హక్కుల ఉల్లంఘన కోణమూ ఉంది.

సాక్షాత్తూ ఓ కేంద్ర మంత్రి సబ్రినా తరహాలో తమ పాలనపై ప్రశ్నలు వేస్తున్న వారందరినీ ఇప్పటికే 'పాత్రికేయ వేశ్యలు' (ప్రెస్టిట్యూట్స్) అనడం చూశాం. అది ఏ స్థాయి అసహనమో అర్థం చేసుకున్నాం. పాలకులు సైతం ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన ప్రజాస్వామ్యంలో పాత్రికేయుల పని ప్రశ్నించడమే! ప్రజల పక్షాన నిలిచి ప్రశ్నిస్తేనే అది నేరమన్నంత అసహనం ఏ పాలకైనా మంచిది కాదు. వేసిన ప్రశ్నలో, చేసిన విమర్శలో నిజం లేదనుకుంటే, ఆ సంగతి ససాక్ష్యంగా చెప్పవచ్చు. నలుగురికీ తెలిసేలా నిరూపణలు చూపవచ్చు. అంతేకానీ, అభిప్రాయం కలిగివుండడమే నేరమన్నట్టు ప్రవర్తిస్తే అన్యాయం. కానీ, వాట్సప్ యూనివర్సిటీలు పంచుతున్న, పెంచుతున్న అజ్ఞానాంధకారం సాక్షిగా దేశంలో ఈతరహా వేధింపులు అన్ని స్థాయుల్లో పెరిగిపోవడమే విషాదం.

భగవద్గీత సైతం తెలుసుకొనేందుకు 'పరిప్రశ్న' వేయమనే చెబుతోంది. కానీ, ప్రశ్నించడమే నేరమనే ధోరణిలోకి మన దిగజారడం కలవరపెడుతోంది. ఈ ట్రోలింగ్ ముఠా తెలిసో తెలియకో... 'విమర్శకుల నోరు మూయిస్తున్నారట' అన్న సబ్రినా వాదననే నిజంచేసింది. అలాగే, లింగ వివక్షతో రాజకీయాల్లో మహిళలపై ట్రోలింగ్ మరీ ఎక్కువనీ, న్యూజిలాండ్ ప్రధాని నుంచి మన దేశపు నేతల దాకా అందరూ బాధితులేననీ రెండేళ్ళ పరిశోధనతో ఈ ఫిబ్రవరిలో విడుదలైన అధ్యయనం తేల్చడం గమనార్హం. అధికార భావజాలాన్ని వ్యతిరేకిస్తే మీపై, పిల్లలపై అత్యాచారం చేస్తామనే ఈ బరితెగింపు వేధింపుల్ని అరికట్టే కఠినమైన సైబర్ చట్టాలు కావాలి. ప్రభుత్వాలూ చిత్తశుద్ధితో చర్యలు చేపట్టాలి. ఎందుకంటే, గొంతు విప్పడానికే భయపడాల్సిన పరిస్థితిని ఎక్కడ, ఎవరు, ఎందుకు సృష్టించినా అది సమర్థనీయం కాదు. సహించాల్సింది కానే కాదు. అది ప్రజాస్వామ్యం అసలే కాదు!

తిరుగుబాటు టీ కప్పులో తుపానా?

విశ్లేషణ



గుర్జీత్ సింగ్

రష్యాలో వాగ్నర్ గ్రూపు తిరుగుబాటు ఎక్కువసేపు కొనసాగలేదు కానీ, ఉన్నతాధికార వర్గాల్లో ఒకింత అలజడినైతే సృష్టించింది. యుద్ధానికి కావాల్సిన ఆయుధాలను రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ నిరాకరించడమే ఈ తిరుగుబాటుకు కారణమని అంచనా. ఉక్రెయిన్‌లో వాగ్నర్ గ్రూపు సభ్యులు చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఇది వారి నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసి ఉండొచ్చు. నెపం రక్షణ మంత్రిత్వ శాఖపై నెట్టడం మంచి వ్యూహం. అయితే ఈ తిరుగుబాటు వల్ల ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత నిశితంగా పరిశీలించాల్సిన పరిస్థితి రష్యాకు ఏర్పడింది. వాగ్నర్ గ్రూపు లాంటి కిరాయి దళాలు రష్యా సాధించిన విజయాల్లో కొన్నింటికి కారణమైతే కావొచ్చు కానీ, అంతిమంగా ఇవి అధికార వ్యవస్థను బలహీన పరిచేవే!

వాగ్నర్ తిరుగుబాటు ఉక్రెయిన్‌పై పోరు విషయంలో రష్యా తన పరిస్థితిని పునఃసమీక్షించుకునేందుకు పురిగొల్పవచ్చు.

రష్యా రక్షణ మంత్రిత్వ శాఖపై వాగ్నర్ గ్రూపు తిరుగుబాటు ఎక్కువసేపు కొనసాగలేదు కానీ, రష్యా ఉన్నతాధికార వర్గాల్లో ఒకింత అలజడినైతే సృష్టించింది. తిరుగుబాటుకు మాత్రమే కాకుండా... అంతే వేగంగా అది సమసిపోయేందుకు కారణాలేమిటన్న దానిపై పెద్ద ఎత్తున ఊహాగానాలు సాగుతున్నాయి. కొన్ని తప్పుడు అంచనాల వల్ల జరిగిందా? లేదా పనిగట్టుకుని కుట్రపూరితంగా వెలుగులోకి వచ్చిన విప్లవమా? వాగ్నర్ కమాండర్ యెవ్గెనీ ప్రిగోజిన్, రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికీ దోస్తులేనా?

ఉక్రెయిన్‌పై యుద్ధంలో పైచేయి సాధించలేకపోవడంతో ఆఫ్రికా కార్యకలాపాల్లో నిమగ్నమైన వాగ్నర్ మూకలను రష్యా రప్పించాల్సి వచ్చింది. అందరితో మంచి సంబంధాలు కలిగి ఉండటమే కాకుండా, బాగా డబ్బున్న కిరాయి సైనికుడైన ప్రిగోజిన్ సారథ్యంలో నడుస్తున్న వాగ్నర్ గ్రూపు 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను లాక్కోవడంలో రష్యాకు బాగా ఉపయోగపడింది. ప్రపంచానికి దీని గురించి తెలిసింది కూడా అప్పుడే. ఆ వెంటనే అమెరికా వాగ్నర్ గ్రూపు, ప్రిగోజిన్‌లపై ఆంక్షలు ప్రకటించింది.

ఆ తర్వాత వాగ్నర్ గ్రూపు దాదాపు ఇరవై దేశాల్లో రష్యా ప్రయోజనాలను కాపుకాస్తూ వచ్చింది. అయితే, మొజాంబిక్‌లోని కాబో డెలగాడోలో చొరబాటుదారులను అణచడంలో విఫలమైంది. చివరకు అక్కడ రువాండా దళాలు శాంతి భద్రతలను పునఃస్థాపించాయి. లిబియా, సూడాన్, మాలి, సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్, ఇలా పలు దేశాల్లో వాగ్నర్ గ్రూపు చురుకుగా పని చేసింది. అప్పటికే అక్కడున్న ఫ్రెంచి దళాలను తరిమేయడం లేదా అంతర్గత కుమ్ములాటల్లో ఒక పక్షం వహించడం వాగ్నర్ గ్రూపు చేసిన పనులు. ప్రధాన లక్ష్యం మాత్రం రష్యా మద్దతిచ్చిన సంస్థలకు దన్నుగా నిలవడం. ఈ పనులకు ప్రతిఫలంగా వాగ్నర్ గ్రూపునకు రష్యా ఆయుధాల సరఫరా జరుగుతుంది. బంగారం ఇతర సహజ వనరుల వెలికితీతకు సంబంధించిన వాటిల్లో మినహాయింపులు లభిస్తాయి. ఈ నేపథ్యంలోనే వాగ్నర్ గ్రూపును ఉక్రెయిన్‌పై యుద్ధానికి దింపింది రష్యా. ఫలితంగా ఆఫ్రికా దేశాల్లో ఈ గ్రూపు కార్యకలాపాలు ఆగిపోయాయి. ఉక్రెయిన్ బఖ్‌ముట్ నగరంలో వాగ్నర్ గ్రూపు యుద్ధ సామర్థ్యానికి పుతిన్ ప్రశంసలు కూడా లభించాయి.

తిరుగుబాటుకు కారణాలేమిటి?

బఖ్‌ముట్ ప్రాంతంలో యుద్ధానికి కావాల్సిన ఆయుధాలను ఇచ్చేందుకు రష్యా నిరాకరించడమే ప్రిగోజిన్ తిరుగుబాటుకు కారణమని కొంతమంది విశ్లేషకుల అంచనా. బఖ్‌ముట్‌లో వాగ్నర్ గ్రూపు సభ్యులు చాలామంది ప్రాణాలు కోల్పోయారు. ఇది కాస్తా వారి నైతిక



స్థైర్యాన్ని దెబ్బతీసి ఉండవచ్చు. నెపం రష్యా రక్షణ మంత్రిత్వ శాఖపై నెట్టేందుకు ప్రయత్నించడం మంచి వ్యూహం. రష్యా రక్షణ మంత్రి సెర్గి షోయిగూ, చీఫ్ ఆఫ్ జనరల్ స్టాఫ్ జనరల్ వాలెరీ గెరాసిమోవ్‌లపై కూడా ప్రిగోజిన్ అసంతృప్తితో ఉన్నారు. రష్యా దళాల్లో వాగ్నర్ గ్రూపును ఏకం చేయడంలో వీరు కీలకపాత్ర పోషించారు. వాగ్నర్ గ్రూపు సైనికులు రక్షణ మంత్రిత్వ శాఖతో కాంట్రాక్టులు కుదుర్చుకోవాలని పట్టుపట్టింది కూడా ఈ ఇద్దరే. ఈ కాంట్రాక్టులే కుదిరితే వాగ్నర్ గ్రూపు కేవలం ఆఫ్రికా కార్యకలాపాలకు పరిమితం కావాల్సి వచ్చేది. అయితే ప్రిగోజిన్ మిలిటరీ స్థావరమైన రొస్తోవ్‌ను చేజిక్కించుకునే విషయంలో దాదాపు విజయం సాధించాడు. ఆ వెంటనే తన తిరుగుబాటును బహిరంగం చేసేశాడు. అంటే, ఉక్రెయిన్ యుద్ధం విషయంలో రష్యా పరిస్థితిలో ఏదో తేడా ఉందన్నమాట. ఇందుకు తగ్గట్టుగానే రష్యా రక్షణ మంత్రిత్వ శాఖలో సమూల ప్రక్షాళన జరగాలని కోరుతున్న వారూ కొందరు ఉండటం గమనార్హం.

రష్యా భద్రతా సంస్థ 'ఫెడరల్ సెక్యూరిటీ సర్వీస్' (ఎఫ్ఎస్‌బీ అంటారు. కేజీబీ వారసత్వం) ప్రిగోజిన్ వైపు కొంత మొగ్గు చూపుతున్నట్లు కొన్ని కథనాలు ఉన్నాయి. ఈ లెక్కన చూస్తే రక్షణ మంత్రిత్వ శాఖ ఉన్నత వర్గాల్లో మార్పులను ఎఫ్ఎస్‌బీ కూడా కాంక్షిస్తూండవచ్చు. తద్వారా అటు మంత్రిత్వ శాఖ, ఇటు ఎఫ్ఎస్‌బీ రెండూ సమన్వయంతో పనిచేసే అవకాశం ఏర్పడుతుంది.

యుద్ధం... ఇకపై ఎలా?

వాగ్నర్ గ్రూపు నాయకత్వం ప్రధానంగా సెయింట్ పీటర్స్‌బర్గ్ ప్రాంతంలో కేంద్రీకృతమై ఉంది. రష్యాను నియంత్రించేంత సత్తా అనుమానమే. కాకపోతే కొన్ని అంశాల్లో కీలకమైన ప్రభావం చూపగలదు. ఇందుకు తగ్గట్టుగానే తిరుగుబాటు సందర్భంగా వాగ్నర్ ప్రకటనలు వారి సత్తాకు మించి ఉన్నట్లు స్పష్టమైంది. పైగా ఈ తిరుగుబాటు వారి శక్తిని కాకుండా నిస్పృహను ప్రదర్శించినట్లు అయ్యింది.

ఈ దశ నుంచి ఉక్రెయిన్‌పై యుద్ధం ఎలా సాగబోతోందనడం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఇప్పటివరకూ ప్రిగోజిన్ రక్షణ మంత్రిత్వ శాఖను బహిరంగంగానే విమర్శిస్తే ఇతరులు నిశ్శబ్దంగా తమ అసంతృప్తిని వెళ్లగక్కి ఉంటారు. యుద్ధం సాఫీగా కొనసాగితే భవిష్యత్తులో ఇలా బహిరంగ కీచులాటలైతే ఉండవు.

వచ్చే ఏడాది మార్చిలో రష్యా అధ్యక్ష ఎన్నికలు జరగనున్నాయి. ఈ లోపుగానే ఉక్రెయిన్ పై పైచేయి సాధించడం పుతిన్‌కు చాలా అవసరం. ఇప్పటికే యుద్ధంలో పదహారు మంది జనరళ్లు మరణించారు లేదా పదవుల నుంచి తప్పించబడ్డారు. జనరళ్ల స్థాయిలో ఈ స్థాయి వేట్లు ఒక రికార్డనే చెప్పాలి. తాజాగా రక్షణ మంత్రి, చీఫ్ ఆఫ్ ద జనరల్ స్టాఫ్‌లపై వేటు వేస్తారా? అదే జరిగితే తిరుగుబాటుదారుల లక్ష్యం నెరవేరినట్లు అవుతుంది.

ఇప్పుడు ఉక్రెయిన్ యుద్ధాన్ని మరింత నిశితంగా పరిశీలించాల్సిన పరిస్థితి రష్యాకు ఏర్పడింది. వాగ్నర్ ఉదంతం నుంచి పాఠాలు కూడా నేర్చుకోవాలి. ఇలాంటి ప్రత్యేక దళాలు రష్యా సాధించిన విజయాల్లో కొన్నింటికి కారణమైతే కావచ్చు కానీ, అంతిమంగా ఇవి అధికార వ్యవస్థను బలహీన పరిచేవే. కాబట్టి వీటిపై మరింత కఠినమైన నియంత్రణ అవసరమవుతుంది. రానున్న కొన్ని నెలల్లో రష్యా సైనిక దళం పుతిన్ రాజకీయ ఆకాంక్షలకు తగ్గట్టుగా మెరుగైన ప్రదర్శన కనపరచగలదా అన్నది కూడా ఒక ప్రశ్న. ఉన్నతస్థాయిలో మార్పులు చేస్తే వ్యూహాలు, పద్ధతులకు మార్పులు, చేర్పులు అనివార్యమవుతాయి. ఎఫ్ఎస్‌బీ, రక్షణ మంత్రిత్వ శాఖలు సమన్వయంతో పని చేయడం ఇప్పుడు పుతిన్‌కు అవసరం. వాగ్నర్ గ్రూపు సైనికుల్లో అధికులు ఇప్పటికీ రక్షణ శాఖతో ఒప్పందాలు కుదుర్చుకునే అవకాశ ముంది. ఎంతైనా ఇవి ఠంచనుగా డబ్బులు తీసుకుంటూ పనిచేసే కిరాయి సైన్యాలే కదా? కానీ వీరు సాధారణ సైనికుల మాదిరిగా క్రమశిక్షణతో వ్యవహరించగలరా?

ఆఫ్రికా దేశాల్లో రష్యా ప్రయోజనాలు కాపాడే ప్రాజెక్టులతో అటు రక్షణ శాఖకూ, ఇటు వాగ్నర్ గ్రూపునకూ ఆర్థిక దన్ను ఇచ్చే సామర్థ్యం ప్రిగోజిన్‌కు ఉంది. అయితే రక్షణ శాఖ ఈ నిధులను దుర్వినియోగం చేస్తోందన్నది ప్రిగోజిన్ ఆరోపణ. ఇప్పుడు ప్రిగోజిన్ బహిష్కరణ ముప్పును ఎదుర్కొంటున్నారు. వాగ్నర్ గ్రూపు మానవ నష్టాన్ని చవిచూసింది. మిగిలిన వాళ్ళ సమర్థంగా పని చేయాలంటే ఏం చేయాలన్నది ఆసక్తికరంగా మారింది. ఏమైనప్పటికీ రానున్న ఎనిమిది నెలల్లో వాగ్నర్ గ్రూపు తన వారిని, రష్యా సైనికుల కార్యాచరణకు అనుగుణంగా పనిచేసేలా చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు ఉక్రెయిన్ కూడా తన ప్రతిదాడులను కొనసాగిస్తూనే ఉంది. రష్యా దీటుగానే తట్టుకుంటోంది కూడా. కానీ ప్రిగోజిన్ సృష్టించిన ప్రకంపనలు కాస్తా రష్యా వ్యవస్థలోని లోటుపాట్లను ఎత్తి చూపినట్లు అయ్యింది.

వ్యాసకర్త మాజీ రాయబారి
('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నాయకుడికి గౌరవం



పీవీ నరసింహారావుజీ జయంతి సందర్భంగా ఆయన్ని స్మరించుకుంటున్నాను. ఆయన దీర్ఘదృష్టి గల నాయకత్వం, భారత అభివృద్ధి పట్ల నిబద్ధత ఎన్నదగినవి. దేశ ప్రగతిలో ఆయన వెలకట్టలేని తోడ్పాటును మనం గౌరవించుకుందాం.

– నరేంద్ర మోదీ, ప్రధాన మంత్రి

అది సాధారణమే



భారతీయుల్లో 71 శాతం మంది మాంసం తింటారు. మాంసం తినడాన్ని భయం, పశ్చాత్తాపం లాంటి భావనలతో ముడిపెట్టడమంటే, మాంసాహారులు ఆటవికులు అని సూచిస్తున్నట్టు. భారత మూలవాసులను అణచడానికి అదే దీర్ఘకాలిక ఆయుధం అయింది.

– అద్వైద్, చరిత్రకారుడు

ఇంత సింపులా?



నిన్న ఒకరిని కలవడానికి వెళ్లాను. నా ఫోన్ డేటా సరిగ్గా పనిచేయక పోవడంతో వాళ్ల వైఫై కోసం ప్రయత్నించాను. దానికి పాస్‌వర్డ్ ఉంది. సరే ఏదో ఒకటి చూద్దామని 12345678 కొట్టాను. కనెక్ట్ అయింది.

– అరుణ్ బోత్రా, పోలీస్ అధికారి

అర్థం కావొద్దా?



హిందీ సినిమాల్లోకి నెమ్మదిగా జొరబడుతున్న పంజాబీ పాటలకు సబ్‌టైటిల్స్ వేయడం బాలీవుడ్ ఎందుకు మొదలుపెట్టదు? భారతదేశవ్యాప్తంగా అందరికీ పంజాబీ అర్థం అవుతుందని వాళ్లు ఎందుకు అనుకుంటున్నారు? – పుణేరీ మెల్‌బోర్న్‌కర్, పరిశోధకురాలు

వాడుకో!



దేవుడు లేని చైనా... హిందువులకు విగ్రహాలు, ముస్లింలకు జపమాలలు తయారుచేస్తోంది. డబ్బు సంపాదించడంలో చైనా ఎంతైనా తెలివైనది.

– ఇంతియాజ్ మహమూద్, థింకర్

సత్యమేవ జయతే!

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత దానిపై బురదజల్లాలనే ఉద్దేశంతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అవకతవకలు జరుగుతున్నాయని చంద్రబాబు అండ్ కో చేస్తున్న అసత్య ప్రచారాలు, విమర్శలకు అంతు లేదు. ఇందులో భాగంగా అత్యంత ప్రతిష్ఠాత్మకమైన టీటీడీ 'శ్రీవాణి ట్రస్టు'పై వరుస విమర్శలు గుప్పించడం అలవాటుగా మార్చుకున్నారు.

శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు (శ్రీవాణి) 2018 ఆగస్టులో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ప్రారంభమైంది. అమరావతిలో శ్రీవారి ఆలయాన్ని రూ. 150 కోట్లతో నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రయత్నించింది. దీనిలో భాగంగా టీటీడీ నిధులు వాడాలనే ప్రయత్నం చేయడం, సాంకేతిక కారణాలు అడ్డు రావడంతో శ్రీవాణి ట్రస్టు తెరమీదకు వచ్చింది. జగన్ అధికారంలోకి రాగానే టీటీడీ పవిత్రతను కాపాడేందుకు, గత ప్రభుత్వం ఇష్టానుసారంగా కూల్చివేసిన దేవాలయాలను పునర్నిర్మించేందుకు, ఆలయాల్లో ధూప దీప నైవేద్యాలకు చేయూత ఇచ్చేందుకు, వేద బ్రాహ్మణులకు, ఆలయ పూజారులకు మేలు చేసే కార్యక్రమాలను విస్తృతంగా అమలుచేస్తూ వస్తున్నారు. ట్రస్టు ద్వారా వచ్చే విరాళాలను మారుమూల ఎస్సీ, ఎస్టీ, బీసీ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణాలను చేపట్టేలా కార్యక్రమాలను రూపొందించి అమలు చేస్తున్నారు. శ్రీవాణి ట్రస్టుకు రూ. 10 వేలు పైచిలుకు విరాళంతో పాటు రూ. 500 దర్శనం టికెట్ తీసుకొనే ఒక్కొక్క భక్తునికి ప్రివిలేజ్‌లో భాగంగా 'బ్రేక్ దర్శనం' టీటీడీ కల్పిస్తుంది. రోజుకు 1000 శ్రీవాణి దర్శనాలను టీటీడీ అందుబాటులో ఉంచుతోంది. వీటిలో 500 టికెట్లు ఆన్‌లైన్‌లో, మిగిలినవి భౌతికంగానూ అందుబాటులో ఉంటాయి. ఈ ట్రస్టు ద్వారా దర్శనానికి వెళ్లాలని అనుకొనే భక్తులు ఎలా టికెట్ బుక్ చేసుకున్నా ఒకే రసీదుపై రూ. 10 వేలతో పాటు ఆ పైచిలుకు ఇచ్చిన విరాళం వివరాలు, దర్శనం కోసం చెల్లించే వివరాలు స్పష్టంగా టీటీడీ దానిలో తెలియజేస్తుంది. ఇవేమీ తమకు పట్టవన్నట్లు శ్రీవాణి ట్రస్టు రసీదులు ఇవ్వడం లేదనీ, ఆ నిధులు పక్కదారి పడుతున్నాయనీ పదేపదే ప్రతిపక్ష నాయకులు ఆరోపించడం సమంజసం కాదు.

శ్రీవాణి ట్రస్టుకు భక్తులు సేవాభావంతో ఇప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా రూ. 475.57 కోట్లు, ఆఫ్ లైన్ ద్వారా రూ. 350.82 కోట్లు ఆదాయం అందించారు. వీటిని ఉపయోగించి దేశవ్యాప్తంగా 2,445 ఆలయాలు నిర్మించింది ట్రస్టు. వేలాది ఆలయాల్లో ధూప, దీప నైవేద్యాలకూ, సనాతన ధర్మ ప్రచారానికీ శ్రీవాణి ట్రస్టు ఖర్చు చేస్తోంది. ఇదీ అసలు సత్యం. 'సత్యమేవ జయతే!'

– అడపా దుర్ర
అడ్వైజర్ – ఎస్వీబీసీ, టీటీడీ

నేలమ్మకు వెల పెరుగుతోందట..

సారాంశం
సరికొండ చలపతి

ముందుగా శంకరమంచి సత్యం గారి అమరావతి కథల్లో ఓ గొప్ప కథ ఇది... అమాయక రైతు కథ..

సిద్దయ్యకు పొలంలో ఒక మెరుస్తున్న రాయి దొరుకుతుంది. అది గమనించిన ఒక రత్నాల వ్యాపారి ముత్యాలు 'ఎంతకిస్తావ్. కొంటా' – అని సిద్దయ్యను అడిగితే, సిద్దయ్యకు దాని విలువ తెలియక రాయికి బదులుగా పొగాకు తీసుకొని సంబరపడతాడు.

సిద్దయ్య దగ్గర ముత్యాలు కొన్నది మామూలు రాయి కాదు, వజ్రం. ఈ వార్త ఆ నోటా ఈ నోటా పాకి ఆ ఊరి పెద్దమనిషి దాకా వెళ్తుంది. అంతటి విలువైనది నా దగ్గర లేకపోవడం ఏంటి అని ముత్యాలు దగ్గర పది లక్షలు పెట్టి కొనుక్కుని, అది ముత్యాలుకు ఎలా వచ్చిందో మరో పది లక్షలు ఇచ్చి తెలుసుకుంటాడు. వెంటనే ఆ పెద్దమనిషి సిద్దయ్య పొలానికి వెళ్లి ఆయన అర ఎకరం పొలంలో ఉన్న విలువైన రాళ్లు తీసుకొని, ఆ పొలం బదులుగా పదెకరాల మాన్యం, బండెడు పొగాకు సిద్దయ్యకి ఇస్తాడు.

అమాయక సిద్దయ్యకు అంతులేని ఆనందం, వీళ్లేంటి పిచ్చోళ్లలాగా రాళ్ల కోసం ఇలా ఆరాటపడుతున్నారు అని నవ్వుకుంటూ జీవితాంతం చుట్టలు కాల్చుకుంటూ, ఆ పదెకరాల పొలం పండించుకుంటూ ఉన్నదాంట్లో నలుగురికి తిండి పెడుతూ హాయిగా బతికేసి, తృప్తిగా వెళ్లిపోతాడు.

అచ్చంగా రైతు ఇలాగే ఉంటాడు. స్వచ్ఛమైన, అమాయకమైన రైతును చూపే కథ ఇది.. సిరి – శాంతి.

.....

తెలంగాణలో పొలం ధరలు బాగా పెరుగుతున్నాయి.. అని తరచూ మన సీఎం చెబుతుంటారు. మనకూ ఇంపుగానే వినిపిస్తుంది. మన ఆర్థికాభివృద్ధికి ఇది సూచనా, లేక పల్లెలకు, పొలాలకు పాకుతున్న రియల్‌ఎస్టేట్ ధోరణికి అద్దమా అన్న చర్చ పక్కన పెట్టినా.. **ఇది వ్యవసాయానికి, రైతుకు ఉపయోగపడే ధోరణేనా అన్న కోణంలో చర్చ జరగాల్సిందే.**



....

ఇది చూడండి..తెలంగాణలోనే ఓ ఊరు. ఐదారేళ్ల క్రితం ఆ ఊరు రైతు తనకు ఉన్న ఎకరా పొలాన్ని పిల్లాడి చదువు కోసం 50 వేల రూపాయలకు అమ్ముకున్నాడు. అప్పటికి అదే మంచి రేటు. అదృష్టవశాత్తు కొడుకు చదువు పూర్తయ్యింది. హైదరాబాద్‌లో కొలువులో కుదురుకున్నాడు. కాసిన్ని డబ్బులు కూడగట్టుకున్నాడు. పొలంపై ఆశ చావక ఇప్పుడు మళ్లీ తన ఊరిలోనే ఓ అర ఎకరమైనా కొందామని ప్రయత్నిస్తే.. నేల అందని ఆకాశమైంది. ఇప్పుడక్కడ ఎకరం అక్షరాలా 5 లక్షలు. ఇప్పుడా రైతు హైదరాబాద్‌లో అడ్డామీద కూలీ. **ఈయనే కాదు. ఎవరైనా నేల మీద ప్రేమ , వ్యవసాయం మీద అనురక్తి ఉన్న రైతు తన ఊరిలోనే మరో ఎకరం కొని వ్యవసాయం చేసే పరిస్థితి ఉందా..?**

పెరిగిన భూముల ధర రైతుకు మేలు చేస్తోందా.. కీడు చేస్తోందా?. – ఆలోచించాల్సిన విషయం.

....

తండ్రీ కొడుకులు ఓ పొలం గట్టున నిలబడి ఉన్నారు. కొడుకు బెంగళూరులో సాఫ్ట్‌వేర్ జాబ్ చేసి బాగానే వెనకేస్తున్నాడు. అమెరికా వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. తండ్రి సర్కారు టీచర్‌గా పనిచేసి వరంగల్‌లో ఉంటున్నాడు. ఆయన పుట్టిన ఊరులోనే కొడుకు ఐదెకరాలు కొని చుట్టూ కంచె వేస్తున్నాడు. ఆ సందర్భంలోనే ఈ సంభాషణ.

'మనం వ్యవసాయం చేయలేం. నాకు ఓపిక లేదు. నీకు టైం లేదు. కొని ఏం చేస్తావ్.' – తండ్రి అడిగాడు.

'వ్యవసాయం ఎందుకు చేయడం.. భూమి ధర ఇంకా బాగా పెరిగితే అమ్ముకుందాం. మరో చోట పెట్టుబడి పెడదాం... అంతే..' – కొడుకు సమాధానం, '..అంటే.. షేర్ మార్కెట్‌లో ఇన్వెస్ట్‌మెంట్‌లాగా అన్నమాట..', దానికి కొడుకు నవ్వి 'అవును..' అన్నాడు.

ఇప్పుడా వూరిలో, పచ్చని వరి స్థానంలో అక్కడక్కడా తెల్లని కడీలు, కంచెలు కనిపిస్తాయి

ఈ పరిస్థితి వ్యవసాయానికి ఎంతవరకు ఉపయోగం..? – ఆలోచించాల్సిన సందర్భం.

సాగు భూములు కొనే వారు వ్యవసాయమే చెయ్యాలి అనే నిబంధనలు కొన్ని యూరప్ దేశాల్లో కనిపిస్తాయి. అన్నం పెట్టే పంట పొలం అంగడి సరుకవుతున్న వేళ మనమూ కూడా పరిశీలించాల్సిన అంశమే ఇది.

....

– పిల్లల పెళ్లిళ్లు, చదువులు లాంటి రైతు ఆర్థిక అవసరాలు.. సాగునుంచి ఎక్కువ ఆదాయం రాని పరిస్థితిని ఆసరాగా తీసుకుని.. పెరుగుతున్న ధరలను ఆశగా చూపి.. సాగు భూమికి రైతును దూరం చేసే దిశగా ఈ ట్రెండ్ వెళ్లడం లేదా?

– రైతులను కూలీలుగా, వాచ్‌మన్‌లుగా, కౌలుదారులుగా మార్చడం లేదా...?

– పెరుగుతున్న భూముల ధరలు రైతుకో, సాగుకో ఉపయోగపడాలి కదా, అదే జరుగుతున్నదా?

'భూముల ధరలు పెరుగుతున్నాయి.. ఇక్కడ కొని అక్కడ మరింత కొనుక్కోవచ్చు ..' అని ఆనందపడే ప్రతి సందర్భంలో మనం వేసుకోవాల్సిన ప్రశ్నలివే.

ఇతర దేశాల్లో భూములిలా..

ఎంతో అభివృద్ధి చెందిన, భారీ తలసరి ఆదాయం కలిగిన జర్మనీ, స్పెయిన్, ఫ్రాన్స్ వంటి చోట్ల కూడా భూముల ధరలు అతి తక్కువగా ఉండటం గమనార్హం.

– కొందరి చేతుల్లోకే భూములు వెళ్లకుండా నియంత్రణలు, కచ్చితంగా వ్యవసాయం చేస్తామనే హామీ ఇస్తేనే రిజిస్ట్రేషన్లు, పన్ను మినహాయింపులు వంటివి రైతులకు భూముల ధరలు అందుబాటులో ఉండేందుకు కారణమవుతున్నాయి.

– యూరప్ ఖండంలోనే అత్యంత అభివృద్ధి చెందిన జర్మనీలో వ్యవసాయ భూమి ధర సగటున ఎకరానికి రూ.10 లక్షల నుంచి రూ.12 లక్షల మధ్యే ఉండటం గమనార్హం. చిత్రమేంటంటే.. ఆ దేశంలో స్థానికులుగానీ, విదేశీయులుగానీ పెద్దగా ఎలాంటి నియంత్రణలు లేకుండానే భూములు కొనడం, అమ్మడం చేయవచ్చు. వ్యవసాయం చేస్తే భూములపై పన్నులు కూడా చాలా తక్కువ.

– అయితే కొన్ని ప్రాంతాల్లో పర్యావరణ పరిరక్షణ నిబంధనలు అమల్లో ఉంటాయి. అక్కడ వ్యవసాయ భూములు కొనుగోలు చేసేవారు.. వాటిలో 20 ఏళ్లపాటు వ్యవసాయమే చేయాలి. రియల్ ఎస్టేట్, ఇతర అవసరాలకు వినియోగించడానికి వీల్లేదు. దీనితో భూముల ధరలు నియంత్రణలో ఉంటాయి.

– నెదర్లాండ్స్‌లో వ్యవసాయ భూమి ధర సగటున ఎకరానికి రూ.22 లక్షల వరకు ఉంటుంది. ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనడం, అమ్మడం చేయవచ్చు. సదరు భూమిలో కనీసం పదేళ్లపాటు వ్యవసాయం చేస్తామని రాతపూర్వకంగా హామీ ఇస్తే.. కొనుగోలుపై పన్ను మినహాయింపు కూడా ఉంటుంది.

– అభివృద్ధి చెందిన దేశాల్లో కీలకమైన స్పెయిన్‌లో ఎకరం వ్యవసాయ భూమి ధర కాస్త అటూ ఇటూగా రూ.6 లక్షలే. ఆ దేశ ప్రభుత్వం వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు.. కొత్తగా భూములు కొన్నవారికి ఎనిమిదేళ్లపాటు వివిధ రకాలుగా సాయం చేస్తుంది. 50 శాతం సబ్సిడీతో పంటల బీమా అమలు చేస్తోంది.

– ఫ్రాన్స్‌లో అయితే ఎకరం వ్యవసాయ భూమి ధర సగటున రెండు, మూడు లక్షల రూపాయలే. కానీ ఇక్కడ 'సేఫర్' పేరిట ఏర్పాటు చేసిన ప్రభుత్వ ఏజెన్సీ పర్యవేక్షణలోనే భూముల కొనుగోళ్లు, అమ్మకాల లావాదేవీలన్నీ జరుగుతాయి. గంపగుత్తగా కొనుగోళ్లు, కొందరి చేతుల్లోకే భూములన్నీ వెళ్లిపోకుండా.. అధికారులు చర్యలు తీసుకుంటారు. దీనితో భూములకు డిమాండ్ తక్కువ. వ్యవసాయం చేయాలనుకునేవారు తక్కువ ధరకే కొనుగోలు చేసుకోవచ్చు.

– దక్షిణాఫ్రికాలో ఎకరం ధర కొంచెం అటూఇటూగా లక్ష రూపాయలే. కొందరి చేతుల్లోనే ఎక్కువ భూములు ఉండకుండా నియంత్రణలు అమల్లో ఉన్నాయి. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లపై పన్నులు ఉండవు.

– కామెరూన్‌లో ఎకరం వ్యవసాయ భూమి రూ.25 వేలు మాత్రమే. కానీ అక్కడ భూములపై పూర్తిగా ప్రభుత్వ నియంత్రణ ఉంటుంది.

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.10.34 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** స్వాతి ప.1.12 వరకు, తదుపరి విశాఖ, **వర్జ్యం:** సా.6.48 నుండి 8.25 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.9.53 నుండి 10.44 వరకు, తదుపరి ప.3.04 నుండి 3.56 వరకు, **అమృతఘడియలు:** తె.4.30 నుండి 6.07 వరకు (తెల్లవారితే శుక్రవారం), తొలి ఏకాదశి (శయన ఏకాదశి); **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.31, **సూర్యాస్తమయం:** 6.34.

జూలై 3న తిరుమలలో చాతుర్మాస దీక్ష


తిరుమల: తిరుమలలో పెద్దజీయర్‌స్వామి నేతృత్వంలో జూలై 3న చాతుర్మాస దీక్ష సంకల్పం వైభవంగా నిర్వహించనున్నారు. హైందవ సనాతన వైదిక ధర్మంలో ఈ చాతుర్మాస దీక్షలకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. శ్రావణ, భాద్రపద, ఆశ్వయుజ, కార్తీక పవిత్ర మాసాల్లో ఆచార్య పురుషులు స్నాన, జప, హోమ, వ్రత, దానాదులను లోక కల్యాణార్థం నిర్వహించడం ఆనవాయితీ.

ఉద్యాన వర్సిటీ వీసీ పదవీకాలం పొడిగింపు



సాక్షి, అమరావతి/తాడేపల్లిగూడెం: పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లి గూడెం మండలం వెంకట్రామన్నగూడెంలోని వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా డాక్టర్ తోలేటి జానకీరామ్ పదవీ కాలం మరో మూడేళ్ల పాటు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వీసీగా ఆయన బాధ్యతలు చేపట్టి గురువారంతో మూడేళ్లు పూర్తి కానుంది. ఈ క్రమంలో మరో మూడేళ్ల పాటు ఆయన్ను వీసీగా కొనసాగిస్తూ ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఢిల్లీలోని ఐసీఏఆర్‌లో పని చేస్తూ మూడేళ్ల కిందట ఇక్కడకు వీసీగా వచ్చారు. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్‌లో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన జానకీరామ్ పాలనలో తనదైన ముద్ర వేశారు.

తురువగల్లు కొండల్లో చిరుత పులి



ఆస్పరి(కర్నూలు): కర్నూలు జిల్లా ఆస్పరి మండలంలోని తురువగల్లు కొండల్లో చిరుత పులి సంచారంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామ సమీపంలోని అడ్డుగుట్ట కొండపై చిరుత పులి ఉండటాన్ని మేకల కాపరులు, రైతులు రవి, గోవిందరెడ్డి, చిన్న నల్లన్న, రంగస్వామి, అహోబిలం తదితరులు బుధవారం చూశారు. చిరుతను సెల్‌ఫోన్లలో వీడియోలు చిత్రీకరిస్తూ కేకలు వేయడంతో అది పక్కనే ఉన్న పొదల్లోకి వెళ్లింది. కొండ కింద గొర్రెలు, మేకలు ఉండడంతో వాటి కోసం చిరుత పులి వచ్చి ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు.

సబ్సిడీపై టమాటా

రంగంలోకి దిగిన రాష్ట్ర ప్రభుత్వం

- కృత్రిమ కొరత, అధిక ధరలకు చెక్
- రైతుల నుంచి నేరుగా సేకరణ
- వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో విక్రయాలకు శ్రీకారం
- రైతుబజార్ల ద్వారా కిలో టమాటా రూ.50కే అమ్మకం
- నేటి నుంచి మిగిలిన జిల్లాల్లోని రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయాలు
- టమాటా తరహాలోనే పచ్చి మిర్చి కూడా సబ్సిడీపై అందించేందుకు ఏర్పాట్లు



సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా ఠారెత్తిస్తున్న టమాటా ధరల భారం నుంచి ప్రజలకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. పలుచోట్ల టమాటా రేట్లు చుక్కలను తాకుతుండటంతో అప్రమత్తమైన రాష్ట్ర ప్రభుత్వం మార్కెటింగ్ శాఖను రంగంలోకి దించింది. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి ప్రధాన నగరాలు, పట్టణ ప్రాంతాల్లోని రైతుబజార్లలో కిలో రూ.50కే అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టింది. వైఎస్సార్, కర్నూలు జిల్లాలలో బుధవారం శ్రీకారం చుట్టగా.. మిగిలిన జిల్లాల్లో గురువారం నుంచి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు నిత్యం 50–60 టన్నుల టమాటాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. మరోవైపు టమాటాతో పోటీపడుతూ ఆకాశానికి ఎగబాకుతున్న పచ్చి మిర్చిని కూడా సబ్సిడీపై వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

సీఎం యాప్‌లో పర్యవేక్షణ..

పలుచోట్ల విస్తారంగా కురుస్తున్న వర్షాలు టమాటా ధరలను హడలెత్తిస్తున్నాయి. వర్షాలతో పంట పూర్తిగా దెబ్బతినడంతో టమాటా ధర చుక్కలనంటుతోంది. నిన్న మొన్నటి వరకు కిలో రూ.20–30కు మించి పలకని టమాటా ధరలు ఒక్కసారిగా ఆకాశానికి ఎగబాకాయి. పలు రాష్ట్రాల్లో కిలో రూ.100 దాటగా మన రాష్ట్రంలోని బహిరంగ మార్కెట్లలో ప్రస్తుతం కిలో రూ.65 నుంచి 90 మధ్య పలుకుతోంది. పరిస్థితిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులపై భారం పడకుండా చర్యలు చేపట్టింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో రంగంలోకి దిగిన వ్యవసాయ శాఖమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి వ్యవసాయ మార్కెటింగ్ శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది, మార్కెటింగ్ శాఖ కమిషనర్ రాహుల్ పాండే, రైతుబజార్ల సీఈవో నందకిషోర్‌తో పాటు జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. సీఎం యాప్ ద్వారా ధరల హెచ్చుతగ్గులను సమీక్షిస్తూ కృత్రిమ కొరత సృష్టించే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. టమాటాతో పాటు పచ్చి మిర్చి ధరలు కూడా వంద దాటడంతో వాటిని కూడా సబ్సిడీపై అందించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. టమాటా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో అత్యధికంగా విశాఖలో కిలో రూ.90 ఉండగా మిగిలిన జిల్లాల్లో రూ.50–85 మధ్య ధరలున్నట్లు గుర్తించడంతో రైతుబజార్ల ద్వారా అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమయ్యారు. నాలుగేళ్లుగా టమాటా ధరలు పెరిగిన పలు సందర్భాల్లోనూ రాష్ట్రప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రైతు బజార్ల ద్వారా సబ్సిడీపై వినియోగదారులకు అందిస్తోంది. ధరల పెరుగుదల ఎక్కువగా ఉన్న నగరాలు, పట్టణాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. అదేవిధంగా పచ్చి మిర్చి కూడా పలు జిల్లాల్లో రూ.వంద దాటినట్టు గుర్తించారు. దీంతో మంత్రి ఆదేశాలతో పచ్చి మిర్చిని కూడా రైతుల నుంచి కొనుగోలు చేసి సబ్సిడీపై రైతుబజార్లలో అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మదనపల్లి, పలమనేరు మార్కెట్లలో సేకరణ

ధరలు ఎగబాకడంతో టమాటా రైతన్నలకు మంచి రేటు లభిస్తోంది. రాష్ట్రంలోని మదనపల్లి, పలమనేరు, పత్తికొండ, పుంగనూరు, కలికిరి మార్కెట్లకు వస్తున్న టమాటాను పొరుగు రాష్ట్రాల వ్యాపారులు ఎగరేసుకుపోతున్నారు. బుధవారం మదనపల్లి, పలమనేరు మార్కెట్లలో మార్కెటింగ్ శాఖ అధికారులు రైతుల నుంచి కిలో రూ.70 చొప్పున 10 టన్నుల టమాటాలు సేకరించారు. నేటి నుంచి మిగిలిన మార్కెట్లలోనూ సేకరించనున్నారు. రోజుకు కనీసం 50–60 టన్నులు తక్కువ కాకుండా సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. వైఎస్సార్, కర్నూలు జిల్లాల్లో రైతుబజార్ల ద్వారా కిలో రూ.50 చొప్పున టమాటా విక్రయాలకు బుధవారం శ్రీకారం చుట్టగా.. విశాఖ సహా మిగిలిన జిల్లాలకు గురువారం నుంచి విస్తరించాలని నిర్ణయించారు.

అదుపులోకి వచ్చే దాకా సబ్సిడీపై విక్రయాలు



ఏపీ మినహా మిగిలిన రాష్ట్రాల్లో కిలో రూ.100 దాటింది. ప్రధాన మార్కెట్లలో రైతుల నుంచి సేకరించి సబ్సిడీపై వినియోగదారులకు అందుబాటులోకి తెచ్చేలా చర్యలు చేపట్టాం. ధరలు పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు దీన్ని కొనసాగిస్తాం.

– నందకిషోర్, సీఈవో, ఏపీ రైతుబజార్లు

ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఏర్పాటు



ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ టమాటా అమ్మకాలకు శ్రీకారం చుడుతున్నాం. మిగిలిన చోట్ల రైతు బజార్లలో కూడా కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం.

– రాహుల్ పాండే, కమిషనర్, మార్కెటింగ్ శాఖ

టమాటా, పచ్చిమిర్చి కూడా..



మార్కెట్‌లో టమాటా, మిర్చి ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సబ్సిడీపై అందించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశాం. ధరల నియంత్రణపై స్పెషల్ సీఎస్‌తోపాటు, మార్కెటింగ్ శాఖ కమిషనర్, రైతు బజార్ల సీఈవోతో సమీక్షించాం. గురువారం నుంచి రాష్ట్రంలో ప్రధాన రైతు బజార్లలో టమాటా కిలో రూ.50కే సబ్సిడీపై అందించనున్నాం. అదేవిధంగా మిర్చిని కూడా సబ్సిడీపై అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి

విశాఖ ఐటీలో జోష్

- ఇన్ఫోసిస్ సిబ్బందితో యాజమాన్యం సమావేశం
- త్వరలో కార్యకలాపాలు ప్రారంభం



విశాఖ ఐటీ సెజ్‌లో సర్వాంగ సుందరంగా తయారైన ఇన్ఫోసిస్ కార్యాలయం

మధురవాడ (భీమిలి): విశాఖ ఐటీ హిల్స్‌పై సందడి మొదలైంది. ఇన్ఫోసిస్ కార్యకలాపాలు ప్రారంభించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తుండడంతో మరింత జోష్ నెలకొంది. ఇందులో భాగంగా ఏపీఐఐసీ ఇంక్యుబేషన్ సెంటర్‌కు అతి సమీపంలో ఉన్న ఓ కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ఇన్ఫోసిస్ యాజమాన్యం ఎంప్లాయీస్ లీడర్‌షిప్ కనెక్షన్ ప్రోగ్రాం నిర్వహించింది. దీనికి సుమారు 800 మంది వరకు సిబ్బంది, ఇతరులు హాజరయ్యారు. ఒకేసారి ఇంతమంది రావడంతో పండగ వాతావరణం నెలకొంది. ఇక్కడ కార్యకలాపాలు, విధివిధానాల గురించి యాజమాన్యం.. సిబ్బందికి వివరించింది. దీంతో సిబ్బందితో పాటు విశాఖ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో కార్యకలాపాలు ప్రారంభం అవుతాయని ఐటీ వర్గాలు తెలిపాయి.

విశాఖలో మోడరన్ ట్రామ్ ప్రాజెక్టు

- మెట్రో సిస్టమ్‌కు అనుసంధానంగా ఏర్పాటు
- నగరం నలుదిక్కులా నాలుగు కారిడార్లతో నిర్మాణం
- 60.05 కిలోమీటర్లు.. 58 స్టేషన్లు
- రూ.5,332 కోట్లతో ప్రణాళిక
- డీపీఆర్ తయారీకి మంత్రి ఆదిమూలపు సురేష్ ఆదేశం



సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో ప్రతిపాదించిన మెట్రో లైట్ (మోడరన్ ట్రామ్) ప్రాజెక్టుకు సమగ్ర ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్) తయారు చేయాలని పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అధికారులను ఆదేశించారు. మంత్రి బుధవారం మెట్రో ప్రాజెక్టుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. విశాల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టు డీపీఆర్‌ను మరింత మెరుగ్గా తయారు చేయాలని అధికారులకు సూచించారు. ఈ అధునాతన ట్రామ్ ప్రాజెక్టును మెట్రో రైలు సిస్టంకు అనుసంధానంగా నగరం నలు దిక్కులా నాలుగు కారిడార్లుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. మొత్తం 60.05 కిలోమీటర్ల పరిధిలో 58 స్టేషన్లతో రూ.5,332 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని మంత్రి వివరించారు. ప్రజా అవసరాలు, డిమాండ్ తదితర ప్రాధాన్యతలకు అనుగుణంగా ఒక్కొక్క కారిడార్‌కు తగిన ఆర్థిక నమూనా (ఫైనాన్షియల్ మోడల్)లో అభివృద్ధి చేయాలని మంత్రి సూచించారు. ఈ సమావేశంలో పురపాలక, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్‌లు వై.శ్రీలక్ష్మి, ఎస్ఎస్ రావత్, మెట్రో రైల్ కార్పొరేషన్ ఎండీ యూజేఎం రావు తదితరులు పాల్గొన్నారు.

కులవాదులకు పేదల 'ఇళ్ల'పై అక్కసు ఎందుకు?

1,004 వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: ఆర్–5 జోన్‌లో పేదల ఇళ్ల నిర్మాణాలకు కేంద్రం అనుమతిస్తే కులవాదులకు అక్కసు ఎందుకని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ప్రశ్నించారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,004వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో బుధవారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదలను భయభ్రాంతులకు గురిచేసేలా కులవాదులు, ఎల్లో మీడియా విషప్రచారాలున్నాయని, కేంద్ర ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేస్తే కోర్టులకు వెళతామని మాట్లాడటం వెనుక అక్కసు ఎంతుందో ఇట్టే తెలుస్తుందన్నారు. ప్రజా రాజధాని అమరావతి అంటూ ప్రచారం చేస్తూ నిరసనలు తెలియజేస్తున్న కులవాదుల దొంగ ఉద్యమాల్లో సామాజిక న్యాయం ప్రకారం పేదలకు ఇళ్ల స్థలాలిస్తే ఎందుకు అడ్డుకుంటున్నారో చెప్పాలన్నారు. నిన్నటి వరకు కమ్మరావతిగా ఉన్న అమరావతిలో ఇప్పుడు 52,700 మంది బహుజనులకు ఇళ్ల స్థలాలివ్వడం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రపంచానికి గొప్ప సందేశం ఇచ్చారన్నారు. బాబు చేసే కార్పొరేట్ అవినీతికి కొమ్ము కాసేందుకే.. పేదలకు రాజధానిలో చోటు కల్పించడాన్ని వ్యతిరేకిస్తూ మీడియాలో విగ్గురాజు తదితరులు పెగ్గేసి మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నాయకులు మాదిగాని గురునాథం, పెరికే వరప్రసాద్, పల్లె బాబు, ఈపూరి ఆదాం, పులి దాసు, బేతపూడి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాఖండ్ సీఎంకు చాతుర్మాస్య దీక్ష ఆహ్వానం

సాక్షి, న్యూఢిల్లీ: ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ దామిని విశాఖ శ్రీశారదాపీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతీ బుధవారం కలిశారు. జూలై 3వ తేదీన రిషికేష్‌లో ప్రారంభించనున్న చాతుర్మాస్య దీక్షపై చర్చించారు. దీక్షా కాలంలో విశాఖ శ్రీశారదాపీఠం రిషికేష్ ఆశ్రమాన్ని సందర్శించాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు. పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి 2009 నుంచి రిషికేష్ వేదికగానే చాతుర్మాస్య దీక్షను చేపడుతున్నారని వివరించారు. ఈ సందర్భంగా సీఎం పుష్కర్ సింగ్ దామి మాట్లాడుతూ చార్‌ధామ్ యాత్రీకుల సౌకర్యార్థం కమ్యూనికేషన్ వ్యవస్థను మెరుగుపరుస్తున్నామని, రహదారులను విస్తరిస్తున్నామని తెలిపారు. లోక కళ్యాణార్థం రిషికేష్ వేదికగా చాతుర్మాస్య దీక్ష చేపట్టడంపై సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వ సహకారం అందిస్తామని హామీనిచ్చారు.

అవినీతి 'కట్టలు'!



బెంగళూరులో తహసీల్దార్ ఇంట్లో దొరికిన నగదు

ఇంట్లో ఎక్కడ వెతికినా నోట్ల కట్టలే. ఇంటి ఆవరణలో ఖరీదైన బైక్‌లు, కార్లు, బెంగళూరు నగరవ్యాప్తంగా ఫ్లాట్లు, ఇళ్లు. ఇది ఓ మామూలు తహసీల్దార్ సంపాదన అంటే నమ్మాల్సిందే. బుధవారం ఉదయం నుంచి లోకాయుక్త అధికారులు కర్ణాటకవ్యాప్తంగా 15 మంది అధికారుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు, లంచాల ఆరోపణలే దీనికి కారణం. చిత్రంలో కనిపిస్తున్న నగదు బెంగళూరులోని ఓ తహసీల్దార్ ఇంట్లో పట్టుబడింది. సోదాలు ఇంకా కొనసాగుతున్నాయి.

– బనశంకరి

పొగాకు ధర పరుగో పరుగు

- రికార్డు స్థాయికి పొగాకు ధరలు
- అత్యధికంగా కిలో రూ.288
- రూ.204 దాటిన సగటు ధర
- ఇంకా పెరిగే అవకాశం ఉందంటున్న అధికారులు



సాక్షి ప్రతినిధి, గుంటూరు: పొగాకు ధర రికార్డులు సృష్టిస్తోంది. సగటు ధర సైతం ఊహించని విధంగా పరుగులు తీస్తోంది. చరిత్రలోనే ఎన్నడూ లేనంత ధర పలుకుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 24న రాష్ట్రంలోని పొగాకు వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. వర్జీనియా పొగాకు పండే గోదావరి జిల్లాల్లో అత్యధికంగా కిలో ధర రూ.288కి చేరుకోగా.. గత మూడు నాలుగు రోజుల నుంచి గరిష్టంగా రూ.280కి తగ్గకుండా వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కిలోకు రూ.249 గరిష్ట ధర పలకగా.. ప్రస్తుతం రూ.246 ధర పలుకుతోంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో 11 వేలం కేంద్రాలకుగాను నాలుగు కేంద్రాల్లో అధికారికంగా పండించిన పొగాకు కొనుగోళ్లు ముగిశాయి. దీంతో వెల్లంపల్లి, కలిగిరి, డిసిపల్లి, కనిగిరి వేలం కేంద్రాల్లో పొగాకు కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఈ ఏడాది రాష్ట్రంలో 142 మిలియన్ కిలోలు పండించాలని పొగాకు బోర్డు లక్ష్యంగా నిర్ణయించగా.. 162.48 మిలియన్ కిలోల ఉత్పత్తి వచ్చినట్టు అంచనా. అనధికారికంగా పండించిన పొగాకు కొనుగోలుకు అనుమతి కోరుతూ పొగాకు బోర్డు కేంద్రానికి లేఖ రాసింది. ఒకట్రెండు రోజుల్లో అనుమతులు వస్తాయని, మళ్లీ ఈ కేంద్రాలను ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో పండిన పొగాకు మొత్తాన్ని కొనుగోలు చేస్తామని పొగాకు బోర్డు అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇప్పటికీ వేలం కేంద్రాలకు సగటున 10 వేల నుంచి 15 వేల బేళ్లు వస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు అత్యధికంగా కిలోకు రూ.204.56 సగటు ధర పలికింది. ఇది పొగాకు బోర్డు చరిత్రలో రికార్డు. 2017–18లో రూ.134.04, 2018–19లో రూ.129.99, 2019–20లో రూ.124, 2020–21లో రూ.133.29, 2021–22లో రూ.173.48 చొప్పున సగటు ధర పలికింది.

అప్రమత్తమైన పొగాకు బోర్డు

పొగాకుకు మంచి ధర వస్తుండటంతో తోటల కౌలుతో పాటు బ్యార్నల అద్దెను విపరీతంగా పెంచుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో పొగాకు బోర్డు అప్రమత్తమైంది. వచ్చే నెలలో సమావేశం నిర్వహించి బ్రెజిల్, జింబాబ్వేతో ఉన్న పోటీని దృష్టిలో పెట్టుకుని లక్ష్యాన్ని నిర్ణయిస్తుందని, దానికి కట్టుబడి ఉండాలని వేలం కేంద్రాల అధికారులకు ఇప్పటికే సమాచారం ఇచ్చింది. అత్యధికంగా పంట వేస్తే 2014–15 నాటి పరిస్థితులు పునరావృతం అవుతాయనే ఆందోళన నెలకొంది. డిమాండ్ ఎప్పుడూ ఒకేలా ఉండదన్న విషయాన్ని గమనంలో ఉంచుకుని కౌలు రేట్లు, బ్యార్నల ధరలను పెంచకుండా చూసుకోవాలని పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు సూచించారు. ఈ సీజన్‌లో పండించిన ప్రతి కిలో పొగాకును కొనేలా చర్యలు తీసుకుంటున్నట్లు 'సాక్షి'కి తెలిపారు.

'టూరిజం' ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు

జూలై 6 వరకు దరఖాస్తులకు అవకాశం

మొగల్రాజపురం (విజయవాడ తూర్పు): భారత పర్యాటక శాఖ, ఏపీ పర్యాటక శాఖలు సంయుక్తంగా తిరుపతిలో నిర్వహిస్తోన్న స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్ కేటరింగ్ టెక్నాలజీ అండ్ అప్‌లైడ్ న్యూట్రిషియన్ కాలేజీలో 2023–24 విద్యాసంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఈ విషయాన్ని కళాశాల అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ కె.శివరామకృష్ణ చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో బుధవారం మాట్లాడారు. బీఎస్సీ (హెచ్ అండ్ హెచ్.ఏ) మూడేళ్ల డిగ్రీ కోర్సుకు ఇంటర్ ఏదైనా గ్రూప్‌లో 45% మార్కులు పొందిన వారు అర్హులని తెలిపారు. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ అండ్ పెటిసరి కోర్స్‌కు పదో తరగతి పాసైన వారు అర్హులన్నారు. సర్టిఫికెట్ కోర్స్ ఇన్ ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్ కోర్స్‌కు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన వారు అర్హులని చెప్పారు.

అరుణాచలం సర్వీస్‌లకు అనూహ్య స్పందన

సాక్షి, అమరావతి: దక్షిణ భారతదేశంలోని పంచలింగ క్షేత్రాల్లో ఒకటైన తిరువణ్ణామలై (అరుణాచలం) క్షేత్రాన్ని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం నడిపిన ప్రత్యేక సర్వీసులకు విశేష స్పందన లభించిందని ఏపీఎస్ ఆర్టీసీ ఓ ప్రకటనలో వెల్లడించింది. గతేడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకు రాష్ట్రంలోని వివిధ డిపోల నుంచి 338 బస్సులు నడపగా.. మంచి స్పందన లభించిందన్నారు. దీంతో ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూన్ వరకు 483 బస్సులు నడిపామన్నారు. అదేవిధంగా వైశాఖ పౌర్ణమి రోజైన మే 5వ తేదీన ఒక్కరోజే 196 బస్సులు నడిపామన్నారు. ఇలా గడిచిన 9 నెలల్లో 821 ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీకి రూ.3.50 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. వచ్చే సీజన్‌లో నడిపే బస్సుల కోసం ముందస్తు రిజర్వేషన్లు చేసుకోవాలని సూచించారు.

'నాటా' అవార్డు ఇన్ జర్నలిజం ఎక్సలెన్సీ–2023కు కొమ్మినేని ఎంపిక



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఉత్తర అమెరికా తెలుగు సమితి (నాటా) అవార్డు ఇన్ జర్నలిజం–2023కు ఆంధ్రప్రదేశ్ సి.రాఘవాచారి మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ఎంపికయ్యారు. ఈ నెల 30 నుంచి జులై 3వ తేదీ వరకు అమెరికాలోని డల్లాస్ నగరంలో డల్లాస్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డును కొమ్మినేని అందుకోనున్నారని మీడియా అకాడమీ కార్యాలయ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. తెలుగు ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలను ప్రోత్సహిస్తూ వివిధ రంగాల్లోని ప్రముఖులు, ఆయా రంగాల్లో చేసిన విశేష కృషికి నాటా ఉత్సవాల సందర్భంగా అవార్డులు ప్రదానం చేసి సత్కరిస్తారు. 46 సంవత్సరాల పాటు వివిధ పత్రికలు, చానళ్లలో పనిచేసిన అనుభవం, కేఎస్ఆర్ లైవ్ షో పేరుతో తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన కొమ్మినేని శ్రీనివాసరావుకు జర్నలిజం విభాగంలో ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

గోవా మద్యంతో ముగ్గురు మహిళల అరెస్ట్

కైకలూరు: గోవా కేంద్రంగా అక్రమ మద్యాన్ని రైళ్లలో రవాణా చేస్తున్న ముగ్గురు మహిళలను ఏలూరు జిల్లా కైకలూరు పట్టణ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వీరి వద్ద లభ్యమైన 24 లగేజీ బ్యాగ్‌లలో గోవాలో కొనుగోలు చేసిన రాయల్ క్లాసిక్, హనీ గ్రేడ్ రకాలకు చెందిన 2,734 క్వార్టర్, 215 రాయల్‌స్టాగ్, మేన్షన్ హౌస్ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కైకలూరు పట్టణ సీఐ ఆకుల రఘు, పట్టణ ఎస్ఐ గద్దల జ్యోతిబాస్ తెలిపిన వివరాల మేరకు.. బాపట్ల జిల్లా చీరాల మండలం, ఓడరేవు గ్రామం, వైఎస్సార్‌కాలనీకి చెందిన కట్ట కోకిల (36), కొలిపల్లి మరియమ్మ (40), గోదావరి భవానీ (25) ఈనెల 24న ఎల్‌టీటీ ట్రైన్‌లో గోవాకు వెళ్లారు. తిరిగి ముంబై–విశాఖ (ట్రైన్ నంబర్ 18520)లో ఉదయం 5.30 గంటలకు కైకలూరు స్టేషన్‌లో దిగారు. పక్కా సమాచారంతో పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. గోవా రైల్వేస్టేషన్ సమీప మద్యం దుకాణాల్లో కొనుగోలు చేసి లగేజీ బ్యాగ్‌లలో వీటిని తీసుకొస్తున్నట్లు గుర్తించారు. విజయవాడ రైల్వేస్టేషన్‌లో తనిఖీలు ఉండడంతో కైకలూరు, ఆకివీడు వంటి స్టేషన్లలో బ్యాగులు దించి రోడ్డు మార్గంలో మద్యం తరలిస్తున్నారు. పట్టుబడిన మద్యం విలువ గోవాలో రూ.1,35,600 ఉండగా, ఏపీలో ఎక్కువ రేట్లకు విక్రయించి రూ.4,54,400 సొమ్ము చేసుకునేలా పథకం రచించారు.

సారా విక్రయాల నుంచి గోవా మద్యం వరకు..

పట్టుబడిన నిందితులు కోకిల, మరియమ్మ, భవానీ గతంలో సారా వ్యాపారం చేసేవాళ్లు. వీరిపై బాపట్ల జిల్లా పోలీసు స్టేషన్లలో పలు కేసులు నమోదయ్యాయి. ఈ ఘటనతో రైల్వే పోలీసులు సైతం నిఘా ముమ్మరం చేశారు.

సీపెట్‌లో శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు



ఉద్యోగాలు సాధించిన వారితో శేఖర్, రవికుమార్, సీపెట్ ప్రతినిధులు

గన్నవరం రూరల్: భారత ప్రభుత్వ సంస్థ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్) సంస్థ సూరంపల్లిలో ఏపీ ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో పీఎం అజయ్ నిధుల ద్వారా 3 నెలలు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ పూర్తి చేసుకున్న 30 మంది ఉద్యోగాలు సాధించినట్లు సీపెట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ శేఖర్ తెలిపారు. బుధవారం సీపెట్‌లో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.రవికుమార్ చేతుల మీదుగా వీరికి సర్టిఫికెట్లు, ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. డాక్టర్ శేఖర్ మాట్లాడుతూ..చెన్నైలోని మదర్సన్ ఆటోమోటివ్ కంపెనీ, బెంగళూరు ఫైన్ టూల్స్ కంపెనీల్లో నెలకు రూ.15,000 వేతనంతో వీరు ఉద్యోగాలు పొందారని చెప్పారు. శిక్షణ, డిప్లొమో కోర్సుల ద్వారా విద్యార్థులను ప్లాస్టిక్ కంపెనీల్లో ఉద్యోగ, సంస్థల వ్యవస్థాపకులుగా తయారు చేస్తున్నామన్నారు. రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ సౌజన్యంతో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ ఇచ్చి ఉద్యోగులుగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు.

బర్డ్ ఆస్పత్రిలో ఆర్థో ప్లాస్టీ సదస్సు

తిరుపతి తుడా: బర్డ్ ఆస్పత్రిలో ఈనెల 30 నుంచి జూలై 2 వరకు 'ఆపరేటివ్ ఆర్థో ప్లాస్టీ' సదస్సును టీటీడీ నిర్వహించబోతోంది. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు 'లైవ్ సర్జరీలు' చేయనున్నారు. రోగులకు మెరుగైన వైద్యమందించేందుకు బర్డ్ ఆస్పత్రిలో నాలుగేళ్లుగా ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తున్నారు. ఇక్కడ అరుదైన, క్లిష్టమైన శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. పేద రోగులకు ఉచితంగా, ఇతరులకు తక్కువ ధరకే సర్జరీలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నూతన ఆధునిక వైద్య పద్ధతులపై డాక్టర్లకు అవగాహన కల్పించేందుకు సదస్సు ఏర్పాటు చేశారు. దేశంలోని టాప్–20 ఆర్థో వైద్య నిపుణులు చేసే సర్జరీలను లైవ్ ద్వారా చూపించనున్నారు. ఇప్పటివరకు సుమారు 200 మంది వైద్యులు తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్పాట్ రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కూడా కల్పించాలని బర్డ్ ట్రస్ట్ నిర్ణయించింది.

ఉద్యోగుల గ్రీవెన్స్ డే ఏర్పాటు హర్షణీయం

ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన

కోనేరుసెంటర్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా మూడో శుక్రవారం ఉద్యోగుల గ్రీవెన్స్ డే నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయకుమార్ తెలిపారు. ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత హెచ్‌వోడీలు అమలు చేసి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు. ఈ అవకాశాన్ని ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

5 నుంచి ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

- ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి

నూజివీడు: రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2023–24 అడ్మిషన్లలో భాగంగా జూలై 5వ తేదీ నుంచి 9 వరకు ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన నిర్వహించనున్నట్లు ఆర్జీయూకేటీ చాన్సలర్ ఆచార్య కేసీ రెడ్డి తెలిపారు. ఈ ఏడాది 38,490 దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. రీవెరిఫికేషన్ పెట్టుకున్న విద్యార్థులు తమ మార్కులు పెరిగితే వచ్చే నెల 5లోగా నోటిఫికేషన్‌లో ఇచ్చిన వెబ్‌సైట్‌లో తెలియజేస్తే వారి దరఖాస్తులో మార్కుల వివరాలను సవరిస్తామని తెలిపారు. ప్రత్యేక కేటగిరికి సంబంధించిన క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, పీహెచ్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కేటగిరి అభ్యర్థులకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన షెడ్యూల్‌ను ఈ నెల 30న యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచుతామని, అలాగే వారి కాల్ లెటర్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు.

వియత్నాం బయలుదేరిన ఐఎన్ఎస్ కిర్పాన్

- ఆ దేశానికి బహుమతిగా ఇచ్చిన మన దేశం



వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్‌కు గౌరవ వందనం చేస్తున్న నేవీ ఉద్యోగులు

సింధియా (విశాఖ పశ్చిమ): ఇన్ సర్వీస్ మిస్సైల్ కార్వెట్ ఐఎన్ఎస్ కిర్పాన్ బుధవారం విశాఖ నుంచి వియత్నాం బయలుదేరింది. వియత్నాం రక్షణశాఖ మంత్రి జనరల్ ఫాన్ వాన్ గియాంగ్ జూన్ 17 నుంచి 19వ తేదీ వరకు మనదేశంలో పర్యటించారు. ఆ సమయంలో వియత్నాంకు ఐఎన్ఎస్ కిర్పాన్‌ను బహుమతిగా ఇస్తున్నట్లు మన రక్షణశాఖ మంత్రి ప్రకటించారు. దీంతో బుధవారం ఐఎన్ఎస్ కిర్పాన్ విశాఖపట్నం నుంచి వియత్నాం బయలుదేరింది. ఈ నౌకను అక్కడ నౌకాదళానికి అప్పగిస్తారు. విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన కార్యక్రమంలో ఐఎన్ఎస్ కిర్పాన్‌కు ఈస్ట్రన్ నేవల్ కమాండ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ వైస్ అడ్మిరల్ సంజయ్ వాత్సాయన్ నేతృత్వంలో నేవీ అధికారులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. ఐఎన్ఎస్ కిర్పాన్ దేశీయంగా తయారు చేసిన మూడో ఖుక్రి క్లాస్ క్షిపణి కార్వెట్. పలు సెన్సార్లు, అనేక రకాల ఆయుధాలతో ఇప్పటివరకు భారత నౌకాదళంలో క్రియాశీల సేవలో ఉన్న ఐఎన్ఎస్ కిర్పాన్ మానవతా సహాయ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంది.

క్లుప్తంగా...

ఎస్సీ కొలీజియంలో ఇద్దరు కొత్త న్యాయమూర్తులు


జస్టిస్ గవాయ్


జస్టిస్ సూర్యకాంత్

న్యూఢిల్లీ: సుప్రీం కోర్టు కొలీజియంలో మార్పులు చోటు చేసుకున్నాయి. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఆధ్వర్యంలో అయిదుగురు న్యాయమూర్తులుండే కొలీజియంలో కొత్తగా జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ సభ్యులుగా వచ్చి చేరారు. సుప్రీం కోర్టు వేసవి కాలం సెలవుల సమయంలో కొలీజియంలో సభ్యులుగా ఉన్న జస్టిస్ కె.ఎం. జోసెఫ్, జస్టిస్ అజయ్ రస్తోగి పదవీ విరమణ చేశారు. జూన్ 16, 17 తేదీల్లో ఇరువురు న్యాయమూర్తులు వరుసగా రిటైర్ కావడంతో కొత్త సభ్యుల్ని చేర్చుకోవాల్సిన అవసరం ఏర్పడింది. కొలీజియంలో మార్పులు చేర్పులు చేసిన తర్వాత ప్రధాన న్యాయమూర్తితో పాటు జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్ ఉన్నారు.

ఉక్రెయిన్ రెస్టారెంట్‌పై రష్యా క్షిపణి దాడి

11 మంది మృతి

కీవ్: తూర్పు ఉక్రెయిన్‌లో పాపులర్ పిజ్జా రెస్టారెంట్‌పై రష్యా జరిపిన క్షిపణి దాడిలో 11 మంది మరణించారు. మంగళవారం అర్ధరాత్రి జరిగిన ఈ దాడిలో మరో 61 మందికి గాయాలయ్యాయి. ఇటీవల కాలంలో ఉక్రెయిన్‌పై రష్యా జరిపిన దాడుల్లో ఇదే పెద్దది. అయితే ఈ క్షిపణి రెస్టారెంట్ వైపు వెళ్లేలా ప్రయోగించడానికి ఉక్రెయిన్‌కు చెందిన ఒక వ్యక్తి రష్యా మిలటరీకి సాయం చేశాడన్న ఆరోపణలపై ఉక్రెయిన్ అధికారులు ఒక వ్యక్తిని అదుపులోనికి తీసుకున్నారు. రష్యాలో ప్రైవేటు సైన్యం వాగ్నర్ సంస్థ చీఫ్ ప్రిగోజిన్ తిరుగుబాటు తర్వాత రాజకీయంగా, మిలటరీ పరంగా అంతర్గత సంక్షోభం ఉన్నప్పటికీ ఆ దేశం ఉక్రెయిన్‌పై ఇంకా దాడులు కొనసాగిస్తూనే ఉంది.

పీవీకి ప్రధాని నివాళి

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు ప్రధాని నరేంద్ర మోదీ నివాళి అర్పించారు. '' పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఆయన్ను స్మరించుకుంటున్నాను. దూరదృష్టి కలిగిన ఆయన నాయకత్వం, దేశ అభివృద్ధి పట్ల ప్రదర్శించిన నిబద్ధత ప్రశంసనీయం. దేశ ప్రగతికి పీవీ అందించిన అమూల్యమైన తోడ్పాటు గౌరవించుకొంటున్నాం'' అని ప్రధాని మోదీ బుధవారం ట్వీట్ చేశారు.

విభిన్నం, వినూత్నం.. చంద్రయాన్–3

చంద్రయాన్–2 వైఫల్యం నుంచి పాఠాలు నేర్చుకున్న 'ఇస్రో'సైంటిస్టులు

- తాజా ప్రయోగంలో పలు కీలక మార్పులు
- జాబిల్లి ఉపరితలంపై ల్యాండర్ భద్రంగా దిగడానికి తగిన ఏర్పాట్లు
- ప్రయోగం సఫలమైతే భారత అంతరిక్ష పరిశోధనల్లో కీలక మలుపు



చల్లని వెన్నెలను ఇచ్చే చందమామను మనం చూసేది కేవలం ఒకవైపే. కంటికి కనిపించని అవతలి భాగంలో ఏముందో తెలుసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. కొన్ని దేశాలు కొంతవరకు విజయం సాధించాయి. అంతరిక్ష నౌకలను క్షేమంగా పంపించాయి. చంద్రుడి ఉపరితలంపై ఆయా అంతరిక్ష నౌకలు కాలుమోపాయి. ఈ జాబితాలో చేరాలని భారత్ సైతం ఉవ్విళ్లూరుతోంది. అత్యంత ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్–3 ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. వచ్చే నెలలో జరిగే ఈ ప్రయోగం కోసం భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) సైంటిస్టులు తుది ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. చంద్రుడిపైకి రోవర్‌ను పంపించి, అక్కడి వాతావరణ, భౌగోళిక పరిస్థితులను తెలుసుకోవడ మే ఈ మిషన్ లక్ష్యం. చంద్రయాన్–3 స్పేస్‌క్రాఫ్ట్‌ను జీఎస్ఎల్‌వీ–ఎంకే–3 రాకెట్ ద్వారా చందమామపైకి పంపించనున్నారు. చంద్రయాన్–3 మిషన్‌ను కచ్చితంగా సఫలం చేయాలని, చంద్రుడిపై ప్రయో గాల్లో మనదైన ముద్ర వేయాలని ఇస్రో సైంటిస్టులు అహోరాత్రులూ శ్రమిస్తున్నారు. భవిష్యత్తులో మనుషులను చంద్రుడిపైకి పంపించడానికి ఈ ప్రయోగం కీలకం అవుతుందనడంలో సందేహం లేదు.

మీకు గుర్తుందా? చంద్రయాన్–2 ప్రయోగం దేశ ప్రజలకు చేదు జ్ఞాపకాలను మిగిల్చింది. విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్, ఆర్బిటార్‌తో వెళ్లిన చంద్రయాన్–2 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి ఉపరితలంపై క్షేమంగా దిగలేకపోయింది. సాంకేతిక లోపం తలెత్తడంతో 2019 సెప్టెంబర్ 6న క్రాష్ ల్యాండ్ అయ్యింది. ప్రయోగం విఫలం కావడంతో అప్పటి ఇస్రో చైర్మన్ కె.శివన్ ప్రధాని మోదీ సమక్షంలో కన్నీరు పెట్టుకున్నారు. దేశ ప్రజలంతా సానుభూతి ప్రదర్శించారు. చంద్రయాన్–2తో పోలిస్తే చంద్రయాన్–3 ప్రయోగం చాలా విభిన్నంగా, వినూత్నంగా ఉంటుందని పరిశోధకులు చెబుతున్నారు. రెండింటి మధ్య ఎన్నో వ్యత్యాసాలు ఉన్నాయని అంటున్నారు.

జూలై 13న చంద్రయాన్-3 ప్రయోగం!

న్యూఢిల్లీ: ప్రతిష్టాత్మకమైన చంద్రయాన్–3 ప్రయోగానికి రంగం సిద్ధమైంది. జూలై 13న మధ్యాహ్నం 2.30 గంటలకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా శ్రీహరికోట లోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి ఈ ప్రయోగం ప్రారంభించనున్నట్లు సీనియర్ శాస్త్రవేత్త ఒకరు బుధవారం చెప్పా రు. అయితే, ప్రయోగ తేదీని ఇంకా ఖరారు చేయలేదని ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ అన్నారు. జూలై12 నుంచి 19వ తేదీల మధ్య ఏదో ఒక రోజు ప్రయోగం చేపట్టే అవకాశముందని వివరించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.615 కోట్లు కేటాయించింది. చంద్రయాన్–1 ప్రయోగం 2008 అక్టోబర్22న, చంద్రయాన్–2 ప్రయోగం 2019 జూలై 22న ప్రయోగం నిర్వహించారు. చంద్రయాన్–1 విజయవంతమైంది. జాబిల్లి ఉపరితలంపై నీడ జాడ లను గుర్తించింది. చంద్రుడి చుట్టూ తిరుగుతూ 312 రోజులపాటు సేవలందించింది.

అవేమిటో తెలుసుకుందాం...

- చంద్రయాన్–2లో జీఎస్ఎల్‌వీ ఎంకే–3 రాకెట్ ఉపయోగించారు. చంద్రయాన్–3 లోనూ ఇలాంటి రాకెట్‌ను వాడుతున్నారు. చంద్రయాన్–2 రాకెట్‌లో ల్యాండర్, రోవర్, ఆర్బిటార్ ఉన్నాయి. మూడో ప్రయోగంలో ల్యాండర్, రోవర్ మాత్రమే ఉంటాయి. చంద్రయాన్–2లో భాగంగా ప్రయోగించిన ఆర్బిటార్‌ను ఈ తాజా ప్రయోగంలోనూ ఉపయోగించుకుంటారు. ఈ ఆర్బిటార్ ప్రస్తుతం చంద్రుడి కక్ష్యలో క్షేమంగా ఉంది. సమాచారం ఇచ్చిపుచ్చుకోవడానికి, ఉపరితలంపై మ్యాపింగ్ కోసం ఆర్బిటార్‌ను వాడుకుంటారు.
- చంద్రయాన్–2 వైఫల్యం నుంచి సైంటిస్టులు పాఠాలు నేర్చుకున్నారు. అందుకే చంద్రయాన్–3లో కొన్ని మార్పులు చేశారు.



- ఆర్బిటార్, మిషన్ కంట్రోల్ సెంటర్‌తో సమన్వయం చేసుకుంటూ పనిచేసే ల్యాండర్ హజార్డ్ డిటెక్షన్ అండ్ అవాయిడెన్స్ కెమెరా చంద్రయాన్–2లో కేవలం ఒక్కటే ఉంది. చంద్రయాన్–3లో ఇలాంటివి రెండు కెమెరాలు అమర్చుతున్నారు. చంద్రుడిపై ల్యాండర్ భద్రంగా దిగడానికి ఇవి ఉపకరిస్తాయి.
- చంద్రయాన్–2లో 9 కీలక పరికరాలు ఉన్నాయి. ఇవి చంద్రుడి కక్ష్యలో ఇంకా చక్కగా పనిచేస్తూనే ఉన్నాయి. చంద్రయాన్–3 ప్రొపల్షన్ మాడ్యూల్‌లో కేవలం స్పెక్ట్రో–పోలారీమెట్రీ ఆఫ్ హ్యాబిటబుల్ ప్లానెట్ ఎర్త్(ఎస్‌హెచ్‌ఏపీఈ) అనే పేలోడ్ కూడా ఉంటుంది. ఇతర గ్రహాలపై మానవ నివాస యోగ్యమైన ప్రదేశాల అన్వేషణకు అవసరమైన సమాచారాన్ని ఈ పరికరం అందజేస్తుంది.
- చంద్రయాన్–3లో ల్యాండర్‌తోపాటు లేజర్ రెట్రోరిఫ్లెక్టర్ అరే(ఎల్ఆర్ఏ)ను సైతం పంపించబోతున్నారు. జాబిల్లిపై పరిస్థితులను అర్థం చేసుకోవడానికి ఇది తోడ్పడుతుంది. తాజా ప్రయోగం విజయవంతం కావడం ఖాయమని సైంటిస్టులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. అంతా అనుకున్నట్లు జరిగితే ఈ ప్రయోగం భారత అంతరిక్ష పరిశోధనల్లో ఒక కీలకమైన మైలురాయి కానుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

అమెరికా హెచ్1బీ వీసాతో కెనడాలో ఉద్యోగం



టొరంటో: అమెరికాలో హెచ్1బీ వీసా వినియోగదారులు ఇక కెనడాలో కూడా ఉద్యోగాలు చేసుకోవచ్చు. ఈ మేరకు కెనడా ప్రభుత్వం బంపర్ ఆఫర్ ప్రకటించింది. మొత్తం 10 వేల మంది ఉద్యోగాలు చేయడం కోసం ఓపెన్ వర్క్ పర్మిట్‌కు ఏర్పాట్లు చేస్తోంది. దీంతో అమెరికాలో భారతీయ టెక్కీలకు కూడా లబ్ధి చేకూరుతుంది. అమెరికాలో దిగ్గజ కంపెనీలు ఉద్యోగాల్లో కోత విధిస్తూ ఉండడంతో దానిని తనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాల్లో కెనడా ఉంది. అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయిన నిపుణులైన టెక్కీలను ఆకర్షించి సాంకేతిక రంగంలో ప్రపంచంలో అగ్రగామిగా ఎదగాలని చూస్తోంది. ''అమెరికాలో హెచ్1బీ వీసా కలిగి ఉన్న వారు 10 వేల మంది వరకు జూలై 16లోగా కెనడాకు రావడానికి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక్కడే ఉద్యోగాలు చేయొచ్చు. వారి కుటుంబ సభ్యులు చదువుకోవడం , పని చేయడానికి కూడా అనుమతులిస్తాం'' అని కెనడా వలసలు, పౌరసత్వ సేవల మంత్రి సియాన్ ఫ్రాజర్ చెప్పారు. తాము ఎన్నో లక్ష్యాలను ఏర్పాటు చేసుకున్నామని, దానికి తగ్గట్టుగానే ఇమ్మిగ్రేషన్ టెక్ టాలెంట్ స్ట్రాటజీని అనుసరిస్తున్నట్టుగా చెప్పారు. సాంకేతికంగా వైవిధ్యభరితమైన పురోగతి సాధించి టెక్ జెయింట్‌గా ఎదగాలన్నదే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమం కింద హెచ్1బీ వీసా వినియోగదారులకు మూడేళ్ల పాటు ఓపెన్ వర్క్ పర్మిట్ లభిస్తుంది. వారి జీవిత భాగస్వామి ఉద్యోగం లేదా చదువుకోవడం వంటివి చేయొచ్చు. అమెరికాలో భారత్, చైనాకు చెందిన వేలాది మంది టెక్కీలను టెక్ కంపెనీలు ప్రతీ ఏటా ఉద్యోగాల్లోకి తీసుకుంటాయి. ప్రస్తుతం అమెరికా మార్కెట్ సరిగా లేకపోవడంతో లేఆఫ్‌లు ఎక్కువగా ఉన్నాయి. గత ఏడాది నవంబర్ నుంచి దాదాపుగా 2 లక్షల మంది టెక్కీలు అమెరికాలో ఉద్యోగాలు కోల్పోయారు. ఇప్పుడు అలాంటి వారందరికీ కెనడాలో మంచి అవకాశాలు దొరికే చాన్స్ వచ్చింది.

బియ్యానికి బదులు డబ్బులు

అన్న భాగ్య పథకంపై కర్ణాటక ప్రభుత్వం కీలక నిర్ణయం

బెంగళూరు: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల్లో ఒకటైన అన్న భాగ్య పథకాన్ని అమలుకు అడ్డంకులు ఎదురవుతున్నాయి. భారీ స్థాయిలో బియ్యం సేకరించడం శక్తికి మించిన పనిగా మారింది. ఈ పథకం ప్రకారం దారిద్ర్య రేఖకి దిగువన ఉన్న కుటుంబాలకు అయిదు కేజీలు అదనంగా బియ్యం ఇవ్వాల్సి ఉంది. జూలై 1 నుంచి ఈ పథకం అమలు చేయాల్సి ఉండగా బియ్యం సేకరణలో ఇబ్బందులు తలెత్తడంతో బియ్యానికి బదులుగా డబ్బులు ఇవ్వాలని నిర్ణయించింది. బుధవారం జరిగిన కర్ణాటక రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కేజీ బియ్యానికి రూ.34 చొప్పున 5 కేజీలకయ్యే ధర మొత్తం వారి ఖాతాల్లో వేయనున్నారు. ఈ విషయాన్ని కర్ణాటక ఆహార, పౌర సరఫరా శాఖ మంత్రి కె.హెచ్. మునియప్ప విలేకరులకు వెల్లడించారు.''రాష్ట్ర అవసరాలకు సరిపడా బియ్యాన్ని ఇవ్వడానికి ఏ సంస్థ ముందుకు రాలేదు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రకారం కేజీ బియ్యం ధర రూ.34. అవసరమైన బియ్యం ప్రభుత్వం సేకరించే వరకు అర్హులైన లబ్ధిదారులందరికీ బియ్యానికి బదులుగా డబ్బులు ఇస్తాం'' అని వివరించారు. ఒక కార్డులో ఒకే వ్యక్తి ఉంటే రూ.170, ఇద్దరు ఉంటే రూ.340, ఒకవేళ అయిదుగురు సభ్యులుంటే వారి ఖాతాలో రూ.850 వేస్తామని మంత్రి వివరించారు.

జూలై మూడోవారం నుంచి పార్లమెంటు సమావేశాలు!



న్యూఢిల్లీ: పార్లమెంటు వర్షాకాల సమావేశాలు జూలై మూడో వారంలో ప్రారంభమయ్యే అవకాశాలున్నాయి. పాత పార్లమెంటు భవనంలో సమావేశాలు మొదలై మధ్యలో నూతన పార్లమెంటుకు మారుతాయని విశ్వసనీయవర్గాల సమాచారం. నూతన పార్లమెంటు భవనాన్ని ప్రధాని నరేంద్ర మోదీ మే 28న ప్రారంభించిన విషయం తెలిసిందే. నెలరోజుల పాటు జరిగే వర్షాకాల సమావేశాల్లో దాదాపు 20 సిట్టింగ్‌లు ఉంటాయని సమాచారం. స్వాతంత్ర్య దినోత్సవానికి ముందే సమావేశాలు ముగుస్తాయి. ఢిల్లీలో అధికారులపై అజమాయిషీ కేంద్రానికే ఉంటుందని కేంద్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తెచ్చిన విషయం తెలిసిందే. వర్షాకాల సమావేశాల్లో ఈ ఆర్డినెన్స్ స్థానంలో బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలున్నాయి.

చెరకు ధర క్వింటాల్‌కు రూ.315

ఎఫ్ఆర్‌పీ రూ.10 చొప్పున పెంపు ● కేంద్ర ప్రభుత్వం వెల్లడి

న్యూఢిల్లీ: చెరకు పంటకు ఫెయిర్ అండ్ రెమ్యూనరేటివ్ ప్రైస్(ఎఫ్ఆర్‌పీ)ను క్వింటాల్‌కు రూ.10 చొప్పున పెంచుతున్నట్లు కేంద్ర ప్రభుత్వం బుధవారం ప్రకటించింది. దీంతో ఈ ఏడాది అక్టోబర్ నుంచి ప్రారంభమయ్యే 2023–24 సీజన్‌లో సంవత్సరంలో క్వింటాల్ చెరకు ధర రూ.315కు పెరిగింది. చక్కెర మిల్లులు రైతులకు క్వింటాల్‌కు కనీసం రూ.315 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థిక వ్యవహారాలపై కేంద్ర కేబినెట్ సమావేశం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగింది. ఎఫ్ఆర్‌పీని పెంచుతూ ఈ భేటీలో నిర్ణయం తీసుకున్నారు. 2022–23లో క్వింటాల్ చెరుకు ఎఫ్ఆర్‌పీ రూ.305 ఉండగా, ఈసారి రూ.315 కానుందని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ తెలిపారు. వ్యవసాయం, అన్నదాతల సంక్షేమానికి నరేంద్ర మోదీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రైతన్నలకు మన ప్రధానమంత్రి ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కమిషన్ ఫర్ అగ్రికల్చర్ కాస్ట్స్ అండ్ ప్రైసెస్(సీఏసీపీ) సిఫార్సుల ఆధారంగా చెరుకు ఎఫ్ఆర్‌పీని ఖరారు చేస్తుంటారు. ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు, ఇతర భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను సైతం పరిగణనలోకి తీసుకుంటారు. 2014–15 సీజన్‌లో చెరకు ఎఫ్ఆర్‌పీ క్వింటాల్‌కు రూ.210 ఉండేది. 2013–14లో చక్కెర మిల్లులు రూ.57,104 కోట్ల విలువైన చెరకు పంటను కొనుగోలు చేశాయి. 2022–23లో రూ.1,11,366 కోట్ల విలువైన 3,353 లక్షల టన్నుల చెరకును సేకరించాయి. ఇండియాలో దాదాపు 5 కోట్ల మంది రైతులు చెరుకు సాగు చేస్తున్నారు. చక్కెర మిల్లుల్లో దాదాపు 5 లక్షల మంది ప్రత్యక్షంగా ఉపాధి పొందుతున్నారు.

నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ ఏర్పాటు!

దేశంలో సైన్స్ అండ్ టెక్నాలజీ రంగంలో పరిశోధనలకు మరింత ఊతం ఇవ్వడమే లక్ష్యంగా నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్(ఎన్ఆర్ఎఫ్) ఏర్పాటుకు సంబంధించిన బిల్లుపై కేంద్ర మంత్రివర్గం ఆమోదం ముద్రవేసింది. ప్రధాని మోదీ అధ్యక్షత బుధవారం సమావేశమైన కేంద్ర కేబినెట్ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ బుధవారం వెల్లడించారు.



కేబినెట్ నిర్ణయాలను వెల్లడిస్తున్న మంత్రులు మన్‌సుఖ్ మాండవీయ, అనురాగ్ ఠాకూర్

నేషనల్ రీసెర్చ్ ఫౌండేషన్ బిల్లు–2023ను త్వరలో పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న 'సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు చట్టం–2008' స్థానంలో ఈ బిల్లును తీసుకొస్తున్నట్లు వివరించారు. 2027–28 దాకా పరిశోధనల కోసం రూ.50,000 కోట్లు ఖర్చు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. ఇందులో రూ.14,000 కోట్లను వచ్చే ఐదేళ్లలో ప్రభుత్వమే ప్రత్యక్షంగా ఖర్చు చేస్తుందన్నారు. మిగతా రూ.36,000 కోట్లను ప్రైవేట్ రంగ సంస్థలు, అంతర్జాతీయ పరిశోధక సంస్థల నుంచి సేకరిస్తామన్నారు. ఎన్ఆర్ఎఫ్ పాలక మండలికి ప్రధానమంత్రి నేతృత్వం వహిస్తారని, ఇందులో 15 నుంచి 25 మంది నిపుణులు, పరిశోధకులు సభ్యులుగా ఉంటారని అనురాగ్ ఠాకూర్ చెప్పారు. ప్రభుత్వ ముఖ్య శాస్త్రీయ సలహాదారు నేతృత్వంలో కార్యనిర్వాహక మండలి సైతం పని చేస్తుందన్నారు.

'పీఎం-ప్రణామ్'కు ఆమోదం

ప్రత్యామ్నాయ ఎరువుల వాడకాన్ని పెంచడం, రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించడమే లక్ష్యంగా రాష్ట్రాలకు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ఉద్దేశించిన 'పీఎం–ప్రణామ్' కొత్త పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అలాగే యూరియా సబ్సిడీ పథకాన్ని మరో మూడేళ్లపాటు కొనసాగించాలని నిర్ణయించింది. ఇందుకోసం రూ.3.68 లక్షల కోట్లు ఖర్చు చేయనుంది. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడానికి రూ.1,451 కోట్ల రాయితీ ఇచ్చేందుకు ఆర్థిక వ్యవహారాలపై ఏర్పాటైన కేబినెట్ కమిటీ నిర్ణయం తీసుకుంది. అలాగే దేశంలో సల్ఫర్–కోటెడ్ యూరియా(యూరియా గోల్డ్)ను ప్రవేశపెట్టాలని నిర్ణయించింది. నేలలో సల్ఫర్ లోపాన్ని సరిచేయడానికి ఈ యూరియా తోడ్పడుతుంది. నేల సారాన్ని కాపాడుకోవడమే 'పీఎం–ప్రణామ్' లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.

అమిత్ మాలవీయాపై కర్ణాటకలో కేసు నమోదు

బెంగళూరు/న్యూఢిల్లీ: బీజేపీ ఐటీ విభాగం అధ్యక్షుడు అమిత్ మాలవీయాపై కర్ణాటక పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కర్ణాటక కాంగ్రెస్ నేత రమేశ్ బాబు ఫిర్యాదు మేరకు మాలవీయాపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం వెల్లడించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని అభ్యంతరకరంగా చిత్రీకరిస్తూ సోషల్ మీడియాలో మాలవీయా ఓ వీడియోను పోస్టు చేశారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ రమేశ్ బాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రజల మధ్య చిచ్చుపెట్టడం, విద్వేషాలు రగిలించడమే మాలవీయా ఉద్దేశమని ఆరోపించారు. ఇదిలా ఉండగా, తనపై కర్ణాటకలో కేసు నమోదు కావడంపై మాలవీయా ట్విట్టర్‌లో ప్రతిస్పందించారు. విదేశీ శక్తుల చేతుల్లో రాహుల్ గాంధీ ఓ పావు అని విమర్శించారు. మాలవీయాపై కేసు పెట్టడాన్ని కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నేత స్మృతి ఇరానీ తప్పుపట్టారు. కర్ణాటకలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు.



అమెరికాలోని నార్త్ కరోలినా రాష్ట్రంలోని చార్లొటే విమానాశ్రయంలో డెల్టా ఎయిర్‌వేస్‌కు చెందిన విమానం బుధవారం ముందు చక్రం తెరుచుకోకుండానే అత్యవసరంగా ల్యాండ్ అయింది. పైలెట్ విమానాన్ని సురక్షితంగా దించడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రయాణికులందరూ క్షేమంగా ఉన్నారని విమానాశ్రయ అధికారులు తెలిపారు.

మరో రఫేల్ అవుతుందా?

అమెరికాతో డ్రోన్ల ఒప్పందంపై కాంగ్రెస్ అనుమానాలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఇరు దేశాల మధ్య కుదిరిన 31 ఎంక్యూ–9బీ ప్రిడేటర్ డ్రోన్ల ఒప్పందంపై కాంగ్రెస్ సందేహాలు వ్యక్తం చేసింది. వేలాది కోట్ల రూపాయల ఈ ఒప్పందం పారదర్శకంగా జరగలేదని ఆరోపించింది. కేంద్రం అత్యధిక ధరకి ఈ డ్రోన్లను కొనుగోలు చేస్తోందని కాంగ్రెస్ అధికార ప్రతినిధి పవన్ ఖేరా బుధవారం విలేకరుల సమావేశంలో అనుమానం వ్యక్తం చేశారు. దేశ భద్రతకు సంబంధించిన ఈ డ్రోన్ల ఒప్పందంలో ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయని అన్నారు. ''దేశభద్రతను ప్రమాదంలో పడేయడం మోదీ ప్రభుత్వానికి సర్వసాధారణం. రఫేల్ ఒప్పందంలో కూడా ఇదే చూశాము. 126 రఫేల్ యుద్ధ విమానాలకు బదులుగా మోదీ ప్రభుత్వం 36 మాత్రమే కొనుగోలు చేసింది. సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపుని కూడా హెచ్ఏఎల్‌కు నిరాకరించడమూ మనం చూశాం. డిఫెన్స్ అక్విజిషన్ కమిటీ, త్రివిధ బలగాలు అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పికీ ఏకపక్ష నిర్ణయాలు ఎన్నో జరిగాయి. ఇప్పటికీ రఫేల్ కుంభకోణంపై ఫ్రాన్స్ పరిశీలనలో ఉంది'' అని పవన్ ఆరోపించారు. మరో రక్షణ స్కామ్‌లో మనం పడకూడదన్నారు.

ఎందుకంత ధర?

అమెరికాలో జనరల్ ఆటమిక్స్ సంస్థ రీపర్ డ్రోన్ల ఒక్కొక్కటి రూ.812 కోట్లకు విక్రయిస్తోందని, భారత్ 31 డ్రోన్లకు ఒప్పందం కుదుర్చుకుందని అంటే మొత్తంగా 25,200 కోట్లు ఖర్చు పెట్టాల్సి వస్తుందని పవన్ అన్నారు. ఇప్పుడు పెడుతున్న దాంట్లో 10–20 శాతం ఖర్చుతో డీఆర్‌డీఓకి డ్రోన్లను అభివృద్ధి చేసే సామర్థ్యం ఉందన్నారు. మరెందుకు అంత డబ్బు ఖర్చు పెట్టి ఆ డ్రోన్లు కొనుగోలు చేయాల్సి వస్తోందని ప్రశ్నించారు. 2017లో ఈ డ్రోన్లను తొలుత తయారు చేశారని, ఇప్పుడు సాంకేతికత బాగా పెరిగిందని లేటెస్ట్ టెక్నాలజీ ఆయుధాలను ఎందుకు కొనుగోలు చేయడం లేదని పవన్ నిలదీశారు.

నిరుపేదలు, మధ్యతరగతిని మర్చిపోయిన కేంద్రం: రాహుల్

న్యూఢిల్లీ: నిత్యావసరాలు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. నిరుపేదలు, మధ్యతరగతిని మోదీ సర్కార్ మర్చిపోయిందన్నారు. పెట్టుబడిదారుల సంపద పెంచడంలో మునిగిపోయిన కేంద్రం మధ్యతరగతి కుటుంబాలను విస్మరిస్తోందన్నారు. ప్రజా సమస్యల నుంచి దృష్టి మరల్చడానికి బీజేపీ వేసే ఎత్తుల్ని సాగనివ్వమని రాహుల్ బుధవారం ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. ''టమాటా కేజీ రూ.140, కాలీఫ్లవర్ కేజీ రూ.80, కంది పప్పు కేజీ రూ.148, గ్యాస్ సిలిండర్ రూ.1100 పై మాటే. ధరలు ఇలా పెంచుకుంటూ పోతూ పెట్టుబడుదారుల ఆస్తుల్ని పెంచుతోంది. ప్రజల నుంచి పన్నులు వసూలు చేస్తూ వారి ప్రయోజనాలనే విస్మరిస్తోంది'' అని ట్వీట్ చేశారు. దేశంలో నిరుద్యోగ యువత పెరిగిపోతున్నారని అన్నారు.

యూపీలో భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పులు



షహరాన్‌పూర్: ప్రముఖ దళిత నాయకుడు, భీమ్ ఆర్మీ అధినేత, ఆజాద్ సమాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు చంద్రశేఖర్ ఆజాద్(36)పై గుర్తు తెలియని వ్యక్తులు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఆయన గాయపడ్డారు. ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని డాక్టర్లు చెప్పారు. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం షహరాన్‌పూర్ జిల్లాలోని దేవ్‌బంద్ పట్టణంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆజాద్‌పై కాల్పులు జరిగాయని పోలీసులు బుధవారం చెప్పారు. కారులో ఉండగానే గుర్తుతెలియని వ్యక్తులు ఆయనపై తుపాకీతో కాల్పులు జరిపి పారిపోయారని చెప్పారు. చంద్రశేఖర్ ఆజాద్ కడుపులోకి ఓ తూటా దూసుకెళ్లిందని అన్నారు. దుండగులు ప్రయాణించిన వాహనంపై హరియాణా రిజిస్ట్రేషన్ నెంబర్ ఉందని వెల్లడించారు. వారిని గుర్తించి, అదుపులోకి తీసుకొనేందుకు ముమ్మరంగా గాలింపు చేపట్టామన్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌పై కాల్పుల ఘటన పట్ల ప్రతిపక్ష సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ఆందోళన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లో శాంతి భద్రతలు నానాటికీ క్షీణిస్తున్నాయని, ప్రజలకు రక్షణ లేకుండాపోయిందని విమర్శించారు.

రైల్వేలో ఖాళీల సంఖ్య 2.74 లక్షలు

ప్రయాణికుల భద్రతకు సంబంధించి 1.75 లక్షల పోస్టులు ఖాళీ

న్యూఢిల్లీ: రైల్వేలో 2.74 లక్షలకు పైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని సమాచార హక్కు చట్టం కింద వెల్లడైంది. ఇందులో ప్రయాణికుల భద్రతకు సంబంధించిన ఖాళీలే 1.75 లక్షల వరకు ఉన్నాయని రైల్వే శాఖ స్పష్టం చేసింది. మధ్యప్రదేశ్‌కు చెందిన సామాజిక కార్యకర్త చంద్రశేఖర్ గౌర్ సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కింద అడిగిన ప్రశ్నలకు రైల్వే శాఖ వివరంగా సమాధానమిచ్చింది. రైల్వే శాఖలో మొత్తంగా 2,74,580 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిసింది. ఇందులో భద్రత కేటగిరీకి సంబంధించిన ఖాళీలు 1,77,924గా ఉన్నాయి. జూన్ 1 తేదీ నాటికి నాన్ గెజిటెడ్ గ్రూప్ సిలో 2,74,580 పోస్టులు ఖాళీగా ఉన్నట్టు రైల్వే శాఖ చెప్పింది. ఇక రైల్వేల భద్రతకు సంబంధించి 9.82 లక్షల పోస్టులు ఖాళీగా ఉంటే 8.04 లక్షల భర్తీ చేసినట్టు వివరించింది. భద్రత కేటగిరీలో లోకో పైలెట్లు, ట్రాక్ తనిఖీలు చేసే వ్యక్తులు, పాయింట్స్‌మెన్, ఎలక్ట్రీషియన్లు, ఇంజనీర్లు, సిగ్నల్ అసిస్టెంట్లు, ఇంజనీర్లు, ట్రైన్ మేనేజర్లు, స్టేషన్ మాస్టర్లు, టికెట్ కలెక్టర్ వంటి పోస్టులు ఉన్నాయి. ఒడిశాలో బాలాసోర్ వద్ద ఘోరమైన రైలు ప్రమాదం నేపథ్యంలో ఆర్‌టీఐ కింద పోస్టుల ఖాళీలపై ఆర్‌టీఐ కింద ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

యూసీసీని వ్యతిరేకిస్తాం

లా కమిషన్‌కు సమర్పించాల్సిన నివేదికపై ముస్లిం లా బోర్డు కసరత్తు

లక్నో: ఒకే దేశం ఒకే చట్టం ఆవశ్యకతపై ప్రధానమంత్రి మంత్రి నరేంద్ర మోదీ బహిరంగంగానే వ్యాఖ్యానించడంతో ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు మంగళవారం రాత్రికి రాత్రి సమావేశమైంది. ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టుగా స్పష్టం చేసింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించిన బోర్డు సభ్యులు యూసీసీకి వ్యతిరేకంగా న్యాయపరమైన పోరాటంపై వ్యూహ రచన చేయనున్నట్టు చెప్పారు. ఈ అంశంలో ఏర్పాటు చేసిన 22వ లా కమిషన్‌కు సమర్పించాల్సిన ముసాయిదా పత్రంపై కూడా ఈ సమావేశంలో చర్చించినట్టుగా ఏఐఎంపీఎల్‌బీ సభ్యుడు ఖలీద్ రషీద్ వెల్లడించారు. న్యాయ కమిషన్ ఎదుట అభ్యంతరాలను వెల్లడించడానికి చివరి తేదీ జూలై 14 అని, అందుకే దీనిపై విస్తృతంగా చర్చించామన్నారు. రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఉండే యూసీసీని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. భారత్‌లో ఎన్నో మతాలు, సంస్కృతులకు ఉన్నాయని ఉమ్మడి పౌరచట్టాన్ని తీసుకువస్తే ముస్లింలతో పాటు హిందువులు, క్రిస్టియన్లు, జైనులు, పార్సీలు, యూదులు ఇలా అందరిపై ప్రభావం చూపిస్తుందన్నారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 29 । జూన్ । 2023

పౌర నిరసన



ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని, వేతనాలను పెంచాలని బుధవారం బెంగళూరు ఫ్రీడం పార్క్‌లో పౌర కార్మికుల ఆందోళన

న్యూస్‌రీల్

వందే భారత్‌కు స్వాగతం



తుమకూరు: దేశంలో అత్యంత వేగం, అధునాతమైన వందేభారత్ రైలు సర్వీసు తుమకూరు జిల్లాకు కూడా అందుబాటులోకి రావడం గర్వ కారణమని సిద్ధగంగ మఠాధిపతి సిద్ధలింగ స్వామీజీ తెలిపారు. ధార్వాడ–బెంగళూరు మధ్య ప్రారంభమైన వందేభారత్ రైలు సర్వీసు తుమకూరు రైల్వేస్టేషన్ మీదుగా వెళ్తుంది. అలా వెళ్తున్న రైలుకు తుమకూరులో స్వామీజీ, అధికారులు స్వాగతం పలికారు. ఈ రైలు తుమకూరు స్టేషన్‌లో 5 నిమిషాలు ఆగుతుంది. ఎంపీ జీఎస్ బసవరాజు, మాజీ మంత్రి బీసీ నాగేశ్ పాల్గొన్నారు.

మైసూరు వేగమార్గం రేస్ ట్రాకు కాదు: ఎంపీ

మైసూరు: మైసూరు–బెంగళూరు పది లేన్ల ఎక్స్‌ప్రెస్ వే ఉన్నది ప్రయాణం కోసం తప్ప బైక్, కార్ రేసుల కోసం కాదని ఎంపీ ప్రతాప్ సింహా అన్నారు. ఈ ఎక్స్‌ప్రెస్ వే ఎక్కడ అశాస్త్రీయంగా ఉందో ఏ మహానుభావుడైనా చెబితే అక్కడ సరిచేస్తామని తెలిపారు. ఎక్స్‌ప్రెస్ వే యాక్సిడెంట్లకు నిలయంగా మారిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించిన నేపథ్యంలో ఎంపీ బుధవారం మైసూరులో మాట్లాడారు. ఎక్స్‌ప్రెస్ వేను రేస్ ట్రాక్‌లా ఊహించుకుని పిచ్చి పట్టినట్లు వాహనాన్ని నడిపితే ప్రమాదాలు సంభవిస్తాయని ఎద్దేవా చేశారు. ఈ రోడ్డుపై జరిగిన 90 శాతం ప్రమాదాలు కేవలం డ్రైవర్ల నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంగా వాహనం నడపడం వల్ల జరిగినట్లు తెలిపారు. అంతేకానీ అశాస్త్రీయంగా రహదారి నిర్మించడం వల్ల కాదని అన్నారు. ఈ రహదారి ఎక్కడ అశాస్త్రీయంగా నిర్మించారో చూపించాలని సవాలు విసిరారు. టోల్ చార్జీల పెంపు తనకు తెలియదని అన్నారు.

పలువురు ఐఏఎస్‌ల బదిలీ

శివాజీనగర: రాష్ట్ర ప్రభుత్వం 8 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది, అలాగే నిరీక్షణలో ఉన్న 5 మంది ఐఏఎస్‌లకు పోస్టింగ్‌లు ఇచ్చింది. బీబీఎంపీ ప్రత్యేక కమిషనర్ ఉజ్వల్ కుమార్ ఘోష్‌ను కృష్ణా ఎగువ ప్రాజెక్ట్ భూస్వాధీన పునర్వసతి, పునర్ నిర్మాణ కమిషనర్ నియమించింది. సుష్మా గోడ్బోలెను కర్ణాటక స్టాంప్ వ్యాల్యువేషన్ అథారిటీ అధికారిగా, పి.సునీల్‌కుమార్‌ను రాష్ట్ర ప్రకృతి వైపరీత్యాల నిర్వహణ అథారిటీ కమిషనర్ స్థానానికి నియమించారు. రవికుమార్ ఎంఆర్‌కు మైసూరు చక్కెర కంపెనీ ఎండీగా పోస్టింగ్ ఇచ్చారు. జయవిభవ స్వామి రాష్ట్ర ఖనిజ మండలి ఎండీగా నియమితులయ్యారు.

జోడో యాత్ర సంగీతంపై కేసు కొట్టివేతకు నో

బనశంకరి: భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సంగీతాన్ని కాపీ కొట్టారని దాఖలైన కేసును కొట్టివేయడానికి రాష్ట్ర హైకోర్టు నిరాకరించింది. జోడో యాత్రలో కేజీఎఫ్–2 సినిమా మ్యూజిక్‌ను వినియోగించారని ఒక మ్యూజిక్ సంస్థ కేసు గతేడాది డిసెంబరులో కేసు పెట్టింది. ఆ మ్యూజిక్‌పై తమకు హక్కులున్నాయని తెలిపింది. ఈ కేసును రద్దు చేయాలని పలువురు కాంగ్రెస్ నాయకులు హైకోర్టులో అర్జీ వేశారు. ఆ కేసులో విచారణ జరపవచ్చని ఆదేశిస్తూ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.నాగప్రసన్న కాంగ్రెస్ నేతల అర్జీని తిరస్కరించారు.

షూలో నాగుపాము పిల్ల



షూలో ఉన్న పాము పిల్ల

హుబ్లీ: షూ వేసుకునేటప్పుడు ఒకటికి రెండుసార్లు అందులో ఏ జీవి లేదు కదా అని చూసుకోవడం మంచిది. షూ లో ఓ నాగుపాము పిల్ల ప్రత్యక్షమైన ఘటన ధార్వాడలోని హొస యల్లాపుర మేదార వీధిలో జరిగింది. నందిత, శివనగౌడ అనే దంపతుల ఇంటి బయట వదిలిన ఒక షూలో పిల్ల నాగపాము వెచ్చగా తలదాచుకుంది. ఉదయం కసువు ఊడ్చేటప్పుడు నందిత షూలో పాము ఉన్నట్లు గమనించారు. తక్షణమే పాము రక్షకుడు యల్లప్ప జోడళ్లికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వారి ఇంటికి చేరుకున్న యల్లప్ప ఆ పాము పిల్లను పట్టుకున్నారు. షూ వేసుకొనేటప్పుడు అందరూ జాగ్రత్తగా ఉండాలని, ఏమరుపాటుతో ఉండరాదని సూచించారు.

అక్రమార్జన బట్టబయలు



మరో అధికారి ఇంట్లో దొరికిన నోట్ల కట్టలు

- రాష్ట్రంలో లోకాయుక్త మెరుపు దాడులు
- 15 మంది అధికారుల ఇళ్లలో సోదాలు
- పెద్దమొత్తంలో నగదు, బంగారం, ఆస్తులు గుర్తింపు





ఓ అధికారి ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తున్న లోకాయుక్త సిబ్బంది

బనశంకరి: రాష్ట్రవ్యాప్తంగా లోకాయుక్త అధికారులు లంచగొండి ప్రభుత్వ ఉద్యోగులు, అధికారుల ఇళ్లపై ఆకస్మిక దాడులు నిర్వహించగా, బస్తాల కొద్దీ నగదు కట్టలు, పెద్ద మొత్తంలో బంగారు, విలువైన సొత్తు, కోట్ల రూపాయల ఆస్తులు బయటపడ్డాయి. మొత్తం 15 మంది ఇళ్లు, ఆఫీసులు, వారి బంధుమిత్రుల ఇళ్లలో దాడులు చేపట్టారు. విలాసవంతమైన కార్లు, విదేశీ వాచ్‌లు, ఖరీదైన మద్యం సీసాలు కూడా లభించాయి.

ఫిర్యాదులు రావడంతో కన్ను

కొందరు అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టినట్లు, విపరీతంగా లంచాలు గుంజుతున్నట్లు ఫిర్యాదులు అందడంతో లోకాయుక్త కన్నేసింది. బుధవారం తెల్లవారుజామున బెంగళూరు, రామనగర, బాగల్‌కోటే, విజయపుర, బెళగావి, చిక్కమగళూరు, యాదగిరి, చిక్కబళ్లాపురం, తుమకూరు జిల్లాల్లో ఒకేసారి లోకాయుక్త అధికారులు కార్యాచరణ ప్రారంభించారు. అనుకోని దాడితో లంచగొండి అధికారులు కంగుతిన్నారు.

దాడులు ఎక్కడెక్కడంటే

- బాగల్‌కోటేలో విద్యానగరలో గల వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ చేతనా పాటిల్ ఇంట్లో సోదాలు చేశారు. ఆమె ఇంట్లో రెండు అరుదైన జాతి తాబేళ్లు, 30 ఖరీదైన వ్యానిటీ బ్యాగులు, పెద్దమొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు లభించాయి. ఇంకా సోదాలు నిర్వహిస్తున్నారు. అదే జిల్లా బీళగి వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కృష్ణ శిరూర ఇళ్లు, ఆఫీసుల్లో దాడులు చేశారు.
- రాయచూరు జిల్లాలో నగర యోజనశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శరణప్ప మడివాళ కు చెందిన ఫామ్ హౌస్‌లో సోదాలు చేశారు.
- గౌరిబిదనూరు తాలూకా ఎక్సైజ్‌శాఖ సీఐ వీ.రమేశ్ ఇంట్లో సోదాలు జరుగుతున్నాయి.
- యాదగిరి జిల్లాలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఇంజనీరింగ్ విభాగం ఏఇఇ విశ్వనాథ రెడ్డి ఇల్లు, ఆఫీసులో దాడులు జరిపి ఫైళ్లను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు.
- చిక్కమగళూరు నిర్మితికేంద్ర యోజనా అధికారి గంగాధర ఇంటిలో సోదాలు జరిపారు.
- కొడగు జిల్లా మడికెరిలో తాగునీటి విభాగం క్లర్కు మహమ్మద్ బషీర్ ఇళ్లలో సోదాలు కొనసాగుతున్నాయి.
- బెళగావిలో బెస్కాం కార్యనిర్వాహక ఇంజనీర్ శేఖర బహురూపికి చెందిన మూడు ఇళ్లపై దాడి చేసి ఆస్తుల వివరాలను తనిఖీ చేపట్టారు. ఈయన బళ్లారి జిల్లా హరపనహళ్లిలో విధులు నిర్వహిస్తున్నాడు. 2019లో వరదల సమయంలో అథణిలో పనిచేస్తూ నిధులు స్వాహా చేసినందుకు సస్పెండ్ అయ్యాడు.
- విజయపుర జిల్లాలో బసవన బాగేవాడి విభాగం ఏఇఇ భీమనగౌడ బిరాదార, విజయపుర సిటీలో ఉండే ముద్దేబిహాళ గ్రామీణ తాగునీటి అసిస్టెంట్ ఇంజనీర్ జేపీ.శెట్టి ఇళ్లు, స్వగ్రామంలో ఇంట్లో తనిఖీలు జరుగుతున్నాయి.
- కోలారులో కేఆర్ఐడీఎల్ అసిస్టెంట్ ఇంజనీర్ కోదండరామయ్య నివాసంపై దాడులు చేశారు.
- 15 మంది అధికారుల వద్ద రూ. 31 కోట్ల విలువ చేసే ఆస్తులను గుర్తించినట్లు లోకాయుక్త వర్గాలు తెలిపాయి. బయట మార్కెట్ ధరల ప్రకారం ఇవి వందల కోట్ల రూపాయల విలువ చేస్తాయని అంచనా.

అధికారిణి ఇంట్లో తాబేళ్లు



స్వాధీనం చేసుకున్న తాబేళ్లు

యశవంతపుర: బాగలకోటలో వ్యవసాయశాఖ అధికారిణి చేతనా పాటిల్ ఇంట్లో సోదాల్లో రెండు నక్షత్ర తాబేళ్లు దొరికాయి. కొన్ని రకాల నమ్మకాలతో కొద్దికాలం నుంచి ఆమె వీటిని పెంచుతున్నట్లు తెలిపారు. నక్షత్ర తాబేళ్లు అంతరించిపోయే జాబితాలో ఉన్నాయి, అటవీశాఖ చట్టం ప్రకారం వీటిని ఎవరూ దగ్గర ఉంచుకోరాదు. అటవీ సిబ్బంది చేరుకుని వాటిని స్వాధీనం చేసుకున్నారు.

తుమకూరులో తనిఖీలు



పీఆర్ ఇంజనీరు పుట్టరాజు నివాస భవనం

తుమకూరు: తుమకూరు జిల్లాలో వ్యవసాయ శాఖ జేడీ కేహెచ్ రవి, శిరా పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కేబీ పుట్టరాజ్‌ల ఇళ్లు, ఆఫీసుల్లో లోకాయుక్త తనిఖీలు నిర్వహించింది. తుమకూరు ఆర్‌టీ నగర శంకరపురంలో రవి ఇంట్లో పత్రాలను, ఆస్తుల వివరాలను పరిశీలించారు. ఈయన ఏడు నెలల క్రితమే హాసన్ నుంచి తుమకూరుకు బదిలీ అయ్యారు.

శిర పీఆర్‌డీ అసిస్టెంట్ ఇంజనీర్ పుట్టరాజు తుమకూరు అశోకనగరలో విలాసవంతమైన నివాసంలో ఉంటున్నారు. ఇంట్లో ముమ్మరంగా గాలింపు జరిపారు. అలాగే యల్లాపుర కమర్షియల్ కాంప్లెక్స్, శిరా కార్యాలయం, భద్రావతిలోని పుట్టరాజుకు చెందిన ఇళ్లలో సోదాలు సాగాయి. లోకాయుక్త ఎస్పీ వలీ, డీవైఎస్పీ మంజునాథ్, హరీశ్ పాల్గొన్నారు.

ప్రేమించిందని ప్రాణం తీశాడు

కూతురును హత్య చేసిన తండ్రి

- ప్రేయసి ఇక లేదని ప్రియుని ఆత్మహత్య
- కోలారు జిల్లాలో విషాదం



హత్యకు గురైన కీర్తి (ఫైల్)



ఆత్మహత్య చేసుకున్న గంగాధర్ (ఫైల్)



యువతి తండ్రి కృష్ణమూర్తి

కేజీఎఫ్: కోలారు జిల్లా బంగారుపేట తాలూకా బోడగుర్కి గ్రామంలో పరువు హత్య జరిగింది. దళిత వర్గానికి చెందిన యువకున్ని ప్రేమించినందుకు కన్నతండ్రే కాలయముడై కూతురును హత్య చేశాడు. ప్రియురాలి మరణవార్త విన్న ప్రియుడు విరక్తి చెంది రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

అతడు కూలీ, ఆమె విద్యార్థిని..

వివరాలు.. బోడగుర్కి గ్రామానికి చెందిన గంగాధర్ (23) ఇంటర్ ఫెయిల్ అవడంతో గార పని చేసుకుంటూ జీవిస్తున్నాడు. కీర్తి (20) అనే యువతి కేజీఎఫ్ కళాశాలలో డిగ్రీ సెకెండియర్ చదువుతోంది. వీరిరువురి ఇళ్లు ఒకేచోట ఉండడంతో పరిచయం పెరిగి ప్రేమగా మారింది. పెళ్లి చేసుకోవాలని కూడా నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలిసిన తండ్రి కృష్ణమూర్తి కూతురును నిలదీసి అతన్ని మరచిపోవాలని హెచ్చరించాడు. కానీ కీర్తి ప్రేమను కాదనలేనని తెగేసి చెప్పింది. దీనిపై ఇంట్లో మంగళవారం రాత్రి గొడవ జరిగింది. తెల్లవారుజామున తండ్రి కృష్ణమూర్తి కూతురు కీర్తిని గొంతు పిసికి హతమార్చాడు. ఈ విషయం తెలుసుకున్న ప్రియుడు గంగాధర్ మైసూరు–చెన్నై ఎక్స్‌ప్రెస్ రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. యువతి తండ్రి కృష్ణమూర్తిని కామసముద్రం పోలీసులు అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు కేజీఎఫ్ ఎస్పీ ధరణీదేవి తెలిపారు. రెండు విషాద సంఘటనలతో గ్రామంలో అలజడి నెలకొంది.

దయనీయం.. ఆటో డ్రైవర్లు

- పూర్తిగా పడిపోయిన రాబడి



మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ఆటోలకు బాగా నష్టం

సాక్షి బెంగళూరు: రోజంతా పనిచేసి కొద్దోగొప్పో ఆదాయంతో బతుకీడ్చేవారు. కానీ మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం వారి నోట్లో మట్టి కొట్టింది. ప్రస్తుతం కన్నడనాట ఆటోరిక్షా డ్రైవర్ల పరిస్థితి దయనీయంగా మారింది. ఎంత కష్ట పడి ఆటో నడిపినా కనీస ఆదాయం రాక ఆవేదనకు లోనవుతున్నారు. శక్తి యోజన పథకం కారణంగా మహిళలు దాదాపుగా అందరూ ఆర్టీసీ, బీఎంటీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం సాగిస్తున్నారు. దీంతో ఆటో డ్రైవర్లకు గిరాకీ లేక గోళ్లు గిల్లుకుంటున్నారు. బెంగళూరు సహా ప్రముఖ నగరాలు, పట్టణాల్లో ఇటువంటి పరిస్థితి ఉంది.

రూ.40 సంపాదనతో ఎలా బతకాలి

బెంగళూరులో ఒక ఆటో డ్రైవర్ ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఆటో నడిపినా కేవలం 40 రూపాయలే వచ్చాయని చెప్పిన ఒక వీడియో ప్రస్తుతం అందరినీ కలచివేస్తోంది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉదయం 8 గంటల నుంచి తాను మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆటోనడిపితే తనకువచ్చింది కేవలం రూ. 40 అని ఆ ఆటో డ్రైవర్ కన్నీటి పర్యంతమయ్యాడు. ఓట్ల కోసం ఉచిత పథకాలను ప్రకటించారు, ఇవి తమ ఉపాధిని తుడిచిపెట్టాయని వాపోయాడు. తాను సంపాదించిన ఆ రూ. 40ను జేబులో నుంచి తీసి చూపించాడు. ఇక తాను చేసేదేమీ లేదని, వేరే పని ఏదైనా చూసుకోవాలని బోరుమన్నాడు.

కరువు ఛాయలు.. ఎండిన నదులు



రుతు పవనాలు ముఖం చాటేయడంతో వర్షాలు సెలవు తీసుకున్నాయి. అక్కడక్కడా జల్లుల వర్షమే తప్ప కుండపోత వానలు పడడం లేదు. దీంతో అనేక జిల్లాల్లో కరువు ఛాయలు అలముకొన్నాయి. జీవనదులు ఎండిపోతున్నాయి. ఇందుకు సాక్ష్యమే ఈ చిత్రాలు. బుధవారం బాగల్‌కోట జిల్లాలో ప్రసిద్ధ కూడల సంగమ క్షేత్రం వద్ద ఎండిపోయిన కృష్ణా, మలప్రభ నదుల సంగమ ప్రాంతం. మామూలుగా అయితే ఈపాటికి ఇక్కడ నదుల నీటిమట్టం నిండుగా ఉండేది



బియ్యానికి బదులు.. ఖాతాలోకి డబ్బులు

- సర్కారు నిర్ణయం
- అన్నభాగ్య పథకంలో మలుపు



కార్డుదారులకు నగదు సాయం



బనశంకరి: ముఖ్యమంత్రి సిద్దరామయ్య నేతృత్వంలో బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో పలు ముఖ్య నిర్ణయాలను తీసుకున్నారు. వివరాలను న్యాయశాఖ మంత్రి హెచ్‌కే.పాటిల్ విలేకరులకు వెల్లడించారు. క్యాబినెట్ సమావేశంలో 15 విషయాలపై చర్చించామని తెలిపారు. అన్నభాగ్య కింద కార్డుదారులకు నెలనెలా 5 కేజీలకు సరిపడా నగదు ఇస్తామని చెప్పారు. సరకు సేవల చట్టం సవరణకు ఆమోదం తెలిపామని, కేంద్రం పంపిన జీఎస్‌టీ బిల్లులో రెండు సవరణలకు సమ్మతించలేదని తెలిపారు. కృష్ణ, కావేరి, మహాదాయి పథకాల అమలులో ఉన్న గందరగోళం నివారణకు మంత్రి వర్గ ఉపసమితిని ఏర్పాటు చేస్తారు. వీటిపై వివిధ కోర్టుల్లో ఉన్న కేసులను ఉపసంహరించుకుంటారు.

పెట్టుబడులకు రాయితీలు

- భారీ పెట్టుబడులకు ప్రత్యేక రాయితీ ఇవ్వాలని తీర్మానం
- చందాపుర భూగర్భ డ్రైనేజీ పథకానికి రూ.106 కోట్లు నిధులు
- పలు నగరాల్లో స్మార్ట్ సిటీ పనులు పూర్తిచేయడానికి అవధి పొడిగింపు,
- రోడ్ల సురక్షతా చట్టం సవరణకు ఆమోదం

బియ్యం దొరికేవరకు డబ్బులు ఇస్తాం

ఆహారపౌరసరఫరాలశాఖామంత్రి కేహెచ్.మునియప్ప మాట్లాడుతూ అన్నభాగ్యకు బియ్యం దొరకనందున కార్డుదారులకు నెలకు రూ.170 చొప్పున నగదును వారి ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ఎఫ్‌సీఐ కేజీ రూ.34 ధరకు కోరినంత బియ్యం ఇవ్వడానికి అంగీకరించి, తరువాత మాట మార్చిందన్నారు. బియ్యం అందే వరకు 5 కిలోలకు డబ్బులు ఇస్తామన్నారు. ఇందుకు ప్రతినెలా రూ.700 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. కార్డుదారుల ఆధార్, పాన్‌కార్డు వివరాలు లింక్ అయి ఉంటే వాటి ఆధారంగా అకౌంట్‌కు నగదు జమ చేస్తామని తెలిపారు.

గత సర్కారు అక్రమాలపై విచారణ

శివాజీనగర: గత బీజేపీ ప్రభుత్వ హయాంలో వివిధ శాఖల్లో జరిగిన అక్రమాలపై దర్యాప్తు చేయాలని కేబినెట్ భేటీలో తీర్మానించారు. ఏ శాఖలో అవకతవకలు జరిగి ఉంటే ఆ శాఖ మంత్రి విచారణకు ఆదేశించవచ్చని సీఎం సిద్దరామయ్య సూచించారు. 40 శాతం కమీషన్ల వ్యవహారం, కరోనా సమయంలో వైద్య సామగ్రిల కొనుగోలులో గోల్‌మాల్, నీటి సరఫరా విభాగంలో అక్రమాలు, కరోనా సమయంలో చామరాజనగర జిల్లాస్పత్రిలో ఆక్సిజన్ అందక రోగుల మృతి, గంగా కళ్యాణ పథకంలో అక్రమాలు, గ్రామీణాభివృద్ధి శాఖలో అవ్యవహారాలు, ఎస్ఐ ఉద్యోగాల బాగోతం, బిట్ కాయిన్ స్కాం, వైద్య విద్యా కాలేజీల నిర్మాణ పనుల్లో అవినీతి తదితరాలపై విచారణ జరపాలని భేటీలో తీర్మానించారు.

షూ, సాక్సులు సకాలంలో అందేనా?

- విద్యార్థులకు పంపిణీకి పాఠశాల స్థాయిలోనే కొనుగోలుకు ఆదేశం



కోలారు: 2023–24వ విద్యా సంవత్సరంలో విద్యా వికాస పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచితంగా ఒక జత షూ, సాక్సుల పంపిణీకి రాష్ట్ర ప్రభుత్వం రూ.125 కోట్లను కేటాయించి మొదటి విడతలో రూ.99.70 కోట్లను విడుదల చేసింది. ఆయా విద్యా శాఖాధికారు(బీఈఓ)లు నిధులను తమ పరిధిలోని పాఠశాలల విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా డ్రా చేసుకుని ఆయా పాఠశాలల ఎస్డీఎంసీల ఖాతాలకు జమ చేయాల్సి ఉంటుంది. ఆయా పాఠశాలల హెచ్ఎంలు నియమానుసారంగా షూ, సాక్సులను ఖరీదు చేసి విద్యార్థులకు పంపిణీ చేయడానికి బాధ్యతలను చేపట్టాలని సూచించారు. ఆయా జిల్లాల డీడీపీఐలు సరైన సూచనలు ఇచ్చి నిధులను సకాలంలో వినియోగించేలా చూడాలని విద్యాశాఖ కమిషనర్ డాక్టర్ ఆర్.విశాల్ ఆదేశించారు.

విద్యా జిల్లాల వారీగా కేటాయింపులు

జిల్లాలోని విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులను కేటాయించారు. బెళగావి జిల్లాకు - రూ. 4.78 కోట్లు, బళ్లారి–3.08 కోట్లు, బాగలకోటె–4.58 కోట్లు, కలబురిగి–5.56 కోట్లు, విజయపుర–4.78 కోట్లు చొప్పున కేటాయించారు. విద్యార్థులు తక్కువగాఉన్నందున ఉత్తర కన్నడ–1.10 కోట్లు, ఉడుపి–1.18 కోట్లు, చిక్కమగళూరు–1.39 కోట్లు, కోలారు–1.90 కోట్లు కేటాయించారు. రాయచూరు జిల్లాకు రికార్డుస్థాయిలో 5.70 కోట్లు దక్కాయి.

కొనుగోలుకు మార్గదర్శకాలివే

విద్యార్థుల పాదరక్షల సైజును నమోదు చేసుకుని నాణ్యమైన ఒక షూ, సాక్సులను ఖరీదు చేసే బాధ్యతలను పాఠశాల ఎస్డీఎంసీలకు అప్పగించారు. షూ, సాక్సుల ఖరీదుకు విద్యా శాఖ డీడీపీఐలకు మార్గదర్శకాలను అందించింది. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థుల షూ జతకు రూ.265, 6 నుంచి 8వ తరగతి విద్యార్థుల షూ జతకు రూ.295, 9 నుంచి 10 తరగతి విద్యార్థుల షూ జతకు రూ.325లను ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను జూలై 30 లోగా పూర్తి చేయాలని సూచించారు.

భిన్నాభిప్రాయాలు

అయితే టెండర్లు, కొనుగోళ్ల ప్రక్రియను సకాలంలో పూర్తిచేసేరా?అనే అనుమానాలున్నాయి. అనేక పాఠశాలల కమిటీలకు, విద్యాధికారులకు మధ్య విభేదాలున్నాయి. చాలా జిల్లాల్లో ఇంత పెద్దమొత్తంలో షూలను సరఫరా చేసే సంస్థలు లేవు. ప్రభుత్వమే షూ, సాక్సులను భారీఎత్తున కొనుగోలు చేసి జిల్లాలకు సరఫరా చేసి ఉంటే బాగుండేదనే అభిప్రాయాలున్నాయి.

క్లుప్తంగా

హట్టిలో పురాతన శిలాశాసనం లభ్యం



పురాతన కాలం నాటి శిలా శాసనం

రాయచూరు రూరల్: జిల్లాలోని లింగసూగూరు తాలూకా హట్టి సమీపంలోని కోట ప్రాంతంలో వెంకట రమణ ఆలయం వద్ద కన్నడ భాషలో 37 వరుసల్లో చెక్కిన పురాతన కాలపు శిలాశాసనం లభించింది. ఇది క్రీ.శ.1116లో కళ్యాణ చాళుక్యుల ఆరో చక్రవర్తి విక్రమాదిత్య కాలం నాటిదని చరిత్రకారులు తెలిపారు.

అన్నభాగ్య బియ్యం స్వాధీనం

- 104 క్వింటాళ్ల పట్టివేత



బియ్యం బస్తాలను చూపుతున్న అధికారులు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో పేదలకు పంపిణీ చేసే అన్నభాగ్య పథకం బియ్యం కలబుర్గి విభాగంలో దారి మళ్లుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ పథకం కింద ఉచితంగా 10 కే.జీ.ల బియ్యం అందించడానికి పెనుగులాడుతోంది. అయితే బుధవారం లారీలో తెలంగాణకు అక్రమంగా తరలిస్తున్న 104 క్వింటాళ్ల బియ్యాన్ని రెవిన్యూ, ఆహార పౌర సరఫరాల శాఖ, కలబుర్గి జిల్లా అఫ్జల్‌పూర్ పోలీస్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు.

అలరించిన బాలల మేళా



హోటల్ నిర్వహిస్తున్న విద్యార్థులు

విజయపుర: పట్టణంలోని ప్రభుత్వ పీయూ కాలేజీ ఆవరణలో బుధవారం విద్యార్థులకు వ్యాపార మెళకువలను బోధించేందుకు గణితం మెట్రిక్ మేళాను నిర్వహించారు. పురసభ అధ్యక్షురాలు విమల ముఖ్య అతిథిగా హాజరై మేళాను ప్రారంభించారు. విద్యార్థులు వివిధ రకాల వంటకాలతో హోటళ్లు, కూరగాయల దుకాణాలను, షాపులను ఏర్పాటు చేశారు. తామే స్వయంగా వాటిని తీసుకొచ్చి వ్యాపారం చేశారు. లాభనష్టాల గురించి లెక్కాచారాలను వేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తల్లిదండ్రులు సహాయం చేశారు.

వర్షం కోసం గాడిదలకు పెళ్లి



గాడిదలకు పెళ్లి చేయించిన గ్రామస్తులు

హొసపేటె: వర్షం కోసం విజయనగర జిల్లా హరపనహళ్లిలో గ్రామస్తులు, రైతులు గాడిదలకు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి పెళ్లి జరిపించారు. ఉదయం తమ కాలనీలో ఉన్న అమ్మవారికి వర్షాలు జోరుగా కురవాలని మొక్కులు తీర్చుకొన్న అనంతరం విశేషంగా అలంకరించిన గాడిదల జంటకు శాస్త్రోక్తంగా పెళ్లి చేయించారు. ఈ ఏడాది ఇంకా ముందస్తు వర్షాలు కురవక పోవడంతో గాడిదలకు పెళ్లి జరిపిస్తే వర్షాలు కురుస్తాయన్న నమ్మకంతో రైతులు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు.

ఒకటికి రెండింతలు పేరుతో మోసం

- పోలీసుల అదుపులో ముగ్గురు సభ్యుల ముఠా

రాయచూరు రూరల్: షేర్ మార్కెట్‌లో డబ్బు పెట్టుబడి పెడితే మూడు నెలల్లో ఒకటికి రెండింతల సొమ్ము ఇస్తామనే ఆశ చూపి లక్షలాది రూపాయల మేర వంచనకు పాల్పడుతున్న ఉదంతం కలబుర్గి జిల్లాలో వెలుగు చూసింది. తాలూకాలోని గొడగాంవ్ మహేష్, మంగళ అనే భార్యాభర్తలు ముఠాను ఏర్పరచుకుని మోసానికి పాల్పడుతున్నారు. కలబుర్గి తాలూకా శ్రీనివాస సరడిగి ప్రభుత్వ పాఠశాలలో ఎఫ్‌డీఏగా మంగళ విధులు నిర్వహిస్తోంది. ఈక్రమంలో సోమవారం సాయంత్రం కలబుర్గికి చెందిన సావిత్రి తాను ఇచ్చిన రూ.21 లక్షలను తిరిగి ఇవ్వాలని మంగళతో పాఠశాల వద్ద వాదనకు దిగింది. దీంతో మంగళ బృందం సభ్యులు రాజ్‌కుమార్, దయానంద్‌లు సావిత్రిని కిడ్నాప్ చేయడానికి పథకం వేసి సావిత్రిని తుపాకీతో బెదిరించారు. ఈ విషయంపై సావిత్రి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అఫ్జల్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అనంతరం వెంటనే రంగప్రవేశం చేసి మోసాలకు పాల్పడుతున్న షేర్ మార్కెట్ మోసాల ముఠాలోని ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేశారు.

నేటి నుంచి పాండురంగస్వామి ఉత్సవాలు ప్రారంభం



పాండురంగ స్వామి, రుక్మిణీల మూలవిరాట్

రాయదుర్గంటౌన్: పట్టణంలోని శ్రీపాండురంగ స్వామి ఆలయంలో ఈనెల 29, 30 తేదీల్లో ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి పూజలతోపాటు రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గురువారం తొలి ఏకాదశి పూజలు, శుక్రవారం స్వామి రథోత్సవం జరుగుతాయని, స్వకుళసాలి సమాజ బాంధవులు, భక్తులు హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

లారీ బోల్తా-డ్రైవర్‌కి గాయాలు



కూడేరు: మండల పరిధిలోని శివరాంపేట వద్ద అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై బుధవారం వడ్ల బస్తాల లోడ్‌తో వెళుతున్న లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ లారీ బళ్లారి నుంచి తమిళనాడుకు వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఘటనలో డ్రైవర్ గాయపడ్డాడు. 108లో అనంతపురంలోని ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

గృహ ప్రవేశంలో హిజ్రాల గొడవ

యశవంతపుర: ఇంటి గృహ ప్రవేశానికి అడగకుండానే వచ్చి అడిగినంత డబ్బులు ఇవ్వలేదనే కోపంతో హిజ్రాలు అసభ్యంగా ప్రవర్తించి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ ఘటన బెంగళూరులో జరిగింది. వయాలికావల్ సమీపంలో ఒక కుటుంబ బుధవారం గృహ ప్రవేశం చేసుకున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు ముగ్గురు హిజ్రాలు ఒక్కసారిగా ఇంటిలోకి చొరబడ్డారు. వారికి ఇంటి యజమానులు భోజనం తినాలని ఆహ్వానించారు. మాకు అన్నం వద్దు, డబ్బులు ఇవ్వాలని హిజ్రాలు కిరికిరి పెట్టారు. ఐదు వందల రూపాయలు ఇవ్వబోగా, ఒక్కొక్కరికి రూ. ఐదు వేలు ఇవ్వాలని గొడవకు దిగారు. అందరినీ నోటికొచ్చినట్లు తిట్టి అసభ్యంగా ప్రవరించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందింది. కాగా హిజ్రాలపై బాధిత కుటుంబం పోలీసులకు ఫిర్యాదు చేసింది.



రగడ చేస్తున్న హిజ్రాలు (వృత్తంలో)

సమస్యలపై హోంగార్డుల మొర

గంగావతి రూరల్: హోంగార్డ్స్ కమాండెంట్ మీర్‌సాబ్ ఆధ్వర్యంలో హోంగార్డ్స్ సిబ్బంది బుధవారం ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డిని కలిసి తమ సమస్యలను వివరించారు. హోంగార్డులకు జీతాల పెంపుతో పాటు పలు సమస్యలపై చర్చించారు. స్పందించిన ఎమ్మెల్యే మీ సమస్యలు పరిష్కరించేందుకు అన్ని విధాలుగా తన సహకారం ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను హోంగార్డులు సన్మానించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు మనోహర్ గౌడ, పంపాపతి సింగనాళ, వీరేశ్ బలకుంది, యమనూరు చౌడ్కి, నగర అధ్యక్షులు రమేశ్ నాయక పాల్గొన్నారు.

స్టేడియంను అభివృద్ధి చేస్తాం

నగరంలోని కనకగిరి రోడ్డులోని చెన్నబసవేశ్వర స్టేడియాన్ని బుధవారం ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి పరిశీలించారు. అక్కడ మౌలిక వసతులను పరిశీలించిన అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ తాలూకా స్టేడియం సరైన నిర్వహణ లేకుండా పూర్తిగా శిథిలావస్థకు చేరుకుందన్నారు. అనంతరం ఇండోర్ స్టేడియం, స్విమ్మింగ్ పూల్‌ను పరిశీలించిన ఆయన బోరు బావి పాడైపోయి నిర్వహణ లేకపోవడంతో స్విమ్మింగ్ పూల్ నిరుపయోగంగా ఉందని తన దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై క్రీడా శాఖా మంత్రితో మాట్లాడి స్టేడియం సమగ్ర అభివృద్ధికి పనులు చేపడతామన్నారు. అనంతరం ఆయన ఇండోర్ స్టేడియంలో కొంతసేపు బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈసందర్భంగా నగరసభ సభ్యులు చౌడ్కి రమేశ్, ధీర కన్నడ రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు అర్జున్ నాయక, వీర కన్నడిగ రక్షణ వేదిక రాష్ట్ర అధ్యక్షులు విరుపాక్ష గౌడ నాయక, పార్టీ నగర శాఖ అధ్యక్షులు హొసమల్లి రమేశ్ నాయక, బీఈఓ కార్యాలయ అధికారి రంగస్వామి నాయక, పార్టీ నాయకులు వీరేశ్ బలకుంది, కృష్ణసా దలబంజన్, లింగనగౌడ హేరూరు, చంద్రశేఖర్, బాషా, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు తమ సమస్యలు వివరిస్తున్న హోంగార్డులు

సమాజ సేవలో రోటరీ ముందంజ

విజయపుర: సమాజంలో క్షీణిస్తున్న మానవీయ విలువలను పునఃస్థాపించించేందుకు రోటరీ సంస్థ కృషి చేస్తోందని విజయపుర రోటరీ క్లబ్ అధ్యక్షుడు హెచ్ఎస్ రుద్రేశ్ మూర్తి తెలిపారు. పట్టణంలో విజయపుర రోటరీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కృతజ్ఞత సమావేశంలో రుద్రేశ్ మాట్లాడుతూ విద్య, మహిళ, శిశుసంక్షేమం, ఆర్థిక సాధికారత, ఆరోగ్యం వంటి పలురంగాల్లో రోటరీ సేవలు అమోఘమని తెలిపారు. అనంతరం కొమ్మసంద్ర ప్రభుత్వ పాఠశాల గ్రంథాలయానికి ఉచిత పుస్తకాలు, బోధన సామగ్రిని రుద్రేశ్ అందించారు.

విలేకరుల పాత్ర కీలకం

బళ్లారిటౌన్: సమాజం అభివృద్ధిలో విలేకరుల పాత్ర కీలకమని ఏడీసీ మంజునాథ్ పేర్కొన్నారు. బుధవారం పత్రికా భవనంలో విలేకరులకు ఏర్పాటు చేసిన సదస్సును ప్రారంభించి ఆయన మాట్లాడారు. నేడు ప్రింట్, ఎలక్ట్రానిక్‌తో పాటు డిజిటల్ మీడియా కూడా సమాజంలో విస్తరించిందన్నారు. ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించేందుకు మీడియా దోహదపడుతుందన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివానంద తగడూరు మాట్లాడుతూ విలేకరులు అధికారులు, ప్రజాప్రతినిధులతో ఓర్పుతో వ్యవహరించాలన్నారు. ఎల్లప్పుడూ పక్షపాత రహితంగా అందరి అభిప్రాయాలతో వార్తలు రాస్తే విలేకరులకు సమాజంలో గౌరవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అల్మామీడియా స్కూల్ సంస్థాపక డైరెక్టర్ గౌరీష్ అక్కి, డీహెచ్ఓ డాక్టర్ జనార్ధన్, సీనియర్ పాత్రికేయుడు మూర్తి, జిల్లాధ్యక్షులు యాల్పి వలీబాష, రాష్ట్ర సమితి సభ్యుడు వీరభద్రగౌడ తదితరులు పాల్గొన్నారు.

బస్సెక్కుతుండగా మొబైల్ చోరీ

- ఫోన్ పే ద్వారా రూ.36 వేలు బదిలీ

కంప్లి: పట్టణంలోని కెనరాబ్యాంక్ సమీపంలో నివాసం ఉంటున్న జిందాల్ ఉద్యోగి అక్షయ్‌కుమార్ సోమవారం డ్యూటీకి వెళుతూ కుడితిని బస్టాండ్‌లో తోరణగల్ వెళ్లే బస్సు ఎక్కుతుండగా రూ.30 వేల విలువ చేసే మొబైల్‌ను దుండగులు చోరీ చేశారు. అంతేగాకుండా అతని ఫోన్ నుంచి ఫోన్ పే ద్వారా రూ.36 వేలను బదిలీ చేసుకున్నారు. మంగళవారం ఈ విషయంపై కుడితిని పోలీసులను సంప్రదించి సైబర్ క్రైం విభాగానికి ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం



సన్మానం అందుకుంటున్న ఎమ్మెల్యే నంజేగౌడ

మాలూరు: శివారు పట్టణాలు, గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే కెవై నంజేగౌడ జీపీ సభ్యులకు సలహా ఇచ్చారు. బుధవారం సోమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో తాగునీటి యూనిట్‌ను ప్రారంభించిన అనంతరం సన్మానం అందుకుని ఆయన మాట్లాడారు. సభ్యులు, అధికారులు సమన్వయంతో పంచాయతీలను అభివృద్ధి పథంలో నడపాలన్నారు. జీపీ అధ్యక్షురాలు మునిరత్నమ్మ, ఉపాధ్యక్షుడు ఉషా, జెడ్పీ మాజీ సభ్యుడు హనుమంతప్ప తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి

- తలలో బుల్లెట్ గాయాలు



రవి(ఫైల్)

యశవంతపుర: తలలో బుల్లెట్లు దూసుకెళ్లిన స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన దక్షిణ కన్నడ జిల్లా సుళ్య తాలూకా ఉబరడ్కలో జరిగింది. అరంతోడుకు చెందిన రవి(32) మంగళవారం ఉబరడ్క గ్రామం బెత్రంపాడి సమీపంలోని తోటలో పని చేయటానికి వెళ్లాడు. బుధవారం వెళ్లి చూడగా విగతజీవిగా కనిపించాడు తలలో బుల్లెట్ గాయాలున్నాయి. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఎవరైనా తుపాకీతో కాల్చి చంపారా? అతనే ఆత్మహత్య చేసుకున్నాడా? అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

జెడ్పీ, టీపీ రిజర్వేషన్ల పునర్విభజనకు గడువు

- ఎన్నికలు వాయిదా పడే అవకాశం

బనశంకరి: జిల్లా, తాలూకా పంచాయతీ రిజర్వేషన్, పునర్విభజనకు హైకోర్టు సమయం ఇవ్వడంతో ఎన్నికలు మళ్లీ వాయిదా పడే అవకాశం ఉంది. జిల్లా, తాలూకా పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన పిటీషన్‌పై బుధవారం హైకోర్టులో విచారణ జరిగింది. జిల్లా, తాలూకా పంచాయతీల రిజర్వేషన్ పునర్విభజనకు సమయం కావాలని ఏజీ శశికిరణ్‌శెట్టి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వ మనవి మేరకు హైకోర్టు విభాగపీఠం 10 వారాలపాటు సమయం ఇస్తూ విచారణ 12 వారాలకు వాయిదావేసింది.

తుంగభద్ర వెలవెల..మత్స్యకారుల విలవిల



కంప్లి కోట రోడ్డు వంతెన వద్ద నదిలో లేని నీరు



నదిలోని మడుగులో అరకొరగా ఉన్న నీరు



నదిలో నీటి ప్రవాహం లేక ఒడ్డునే ఉన్న తెప్పలు

కంప్లి: నైరుతి రుతుపవనాల రాక ఆలస్యంతో ఈ ఏడాది తుంగభద్ర జలాశయంలో నీటి నిల్వ క్షీణించింది. ఫలితంగా నదిలో నీటి ప్రవాహం కరువైంది. కంప్లి కోట ప్రాంతంలో వందలాది మత్స్యకారుల కుటుంబాలు కేవలం నదిలో చేపల వేట ద్వారా జీవిస్తుండేవారు. తెల్లవారక మునుపే తెప్పల్లో వలలు వేసుకొని చేపల వేటకు వెళ్లి 7 గంటల కల్లా వేట ముగించి కంప్లికోట వద్ద వలలోని చేపలను రోడ్డుపైకి చేర్చి అమ్ముకునేవారు. రుచికరమైన నది చేపల కోసం ప్రజలు వేచి ఉండి వారి వద్ద నుంచి కొనుగోలు చేసేవారు. అయితే ప్రస్తుతం నదిలో నీరు లేకపోవడంతో తెప్పలు ఒడ్డున వేసి మత్స్యకారులు పొట్టకూటి కోసం వలస బాట పడుతున్నారు. ఈనేపథ్యంలో వారికి ప్రత్యామ్నాయ మార్గం చూపించి ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉంది.

కల్యాణ కర్ణాటకలో జలక్షామం



బాగలకోటె జిల్లాలో కృష్ణా నదిలో ప్రవాహం కరువైన దృశ్యం



గ్రామాల్లో తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద గుమికూడిన ప్రజలు

- ఖాళీ అయిన జలాశయాలు
- ముఖం చాటేసిన వరుణుడు

రాయచూరు రూరల్: ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినా వరుణుడి కరుణ లేక రైతులు వర్షం రాక కోసం ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. కల్యాణ కర్ణాటకలోని ఆల్మట్టి, తుంగభద్ర తదితర డ్యాంల్లో తగినంత నీరు లేక జలక్షామంతో రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది ఈ జలాశయాల్లో నీటి నిల్వ తక్కువగా ఉంది. దీంతో బాగలకోటె, గదగ్, కొప్పళ, రాయచూరు, యాదగిరి జిల్లాల్లో సాగు, తాగునీటి పథకాలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి.

మందకొడిగా విత్తన ప్రక్రియ

జిల్లాలో ఖరీఫ్‌లో తొలకరి వానలు కురవక పోవడంతో 5.4 లక్షల హెక్టార్లలో రైతులు విత్తనం వేయాల్సి ఉండగా ఐదు వేల హెక్టార్లలో మాత్రమే ఇప్పటి వరకు విత్తనం చేశారు. గత ఏడాది ఇదే సమయానికి 12 శాతం మేర రైతులు భూముల్లోలో విత్తనాలు వేసుకున్నారు. జూన్ నెలాఖరులోగా వానలు పడితే పత్తి, కంది, సూర్యకాంతి, సజ్జ, వేరుశనగ పంటలు వేసుకోవచ్చని వ్యవసాయ శాఖ జేడీ దేవిక వెల్లడించారు. జిల్లాలో జూన్‌లో 66 మి.మీ. వర్షం పడాల్సి ఉండగా కేవలం 30 మి.మీ.ల వర్షం పడింది.

జిల్లాలో విత్తనాలకు కొరత లేదు

37 రైతు కేంద్రాల్లో 2360.94 క్వింటాళ్ల విత్తనాలు నిల్వ ఉండగా 815.04 క్వింటాళ్ల విత్తనాలను విక్రయించారు. రైతు కేంద్రాలకు వచ్చి విత్తనాలను ఆడిగేవారు కరువయ్యారు. జిల్లాలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి నెలకొంది. జిల్లాలోని లింగసూగూరు తాలూకా యరగుంట, సింధనూరు తాలూకా మల్లనగుడ్డలకు ట్యాంకర్లతో నీటిని సరఫరా చేస్తున్నారు. నగరంలోని 35 వార్డులకు కూడా ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కోలారు వార్తలు...

గుడిసెల తొలగింపుపై ధర్నా

కోలారు: బంగారుపేట తాలూకా హుణసనహళ్లిలో పేదలు నిర్మించుకున్న గుడిసెల తొలగింపును ఖండిస్తూ బుధవారం దళిత రైత సేన కార్యకర్తలు అంబేడ్కర్ ఫలకాన్ని ప్రతిష్ఠించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సేన అధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ హులిబెలె జీపీ అధ్యక్షురాలి భర్త, అతని కొందరు అనుచరులు అధికారులపై ఒత్తిడి తెచ్చి తాత్కాలికంగా వేసుకున్న గుడిసెలను జేసీబీతో ధ్వంసం చేయడానికి ప్రయత్నించడం ఖండనీయమన్నారు. హుణసనహళ్లిలోని 25 దళిత కుటుంబాలు గతంలో ఇళ్ల స్థలాల కోసం ధర్నా చేయగా స్పందించి నాడు తాలూకా యంత్రాంగం ఇళ్ల స్థలాలను ఇస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వలేదన్నారు. ఇకనైనా అధికారులు, పాలకులు స్పందించి వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సేన తాలూకా అధ్యక్షుడు హీరెకరపనహళ్లి మునిరాజు, గౌరవ అధ్యక్షుడు హుళదేనహళ్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం

రైతు కుటుంబానికి రక్షణ కల్పించండి

శ్రీనివాసపురం: యల్దూరులో రైతు నారాయణ స్వామి కుటుంబానికి పోలీస్ రక్షణ కల్పించాలని, కుటుంబ సభ్యులపై భూ విషయానికి సంబంధించి దౌర్జన్యం చేస్తున్న వ్యక్తులపై చట్ట రీత్యా చర్యలు తీసుకోవాలని దళిత నాయకురాలు రామాంజమ్మ డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ అతిథిగృహంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. యల్దూరు సర్వే నెంబర్–42లో 3 ఎకరాల భూమి దరఖాస్తు ద్వారా మంజూరైంది. తండ్రి మరణానంతరం నారాయణస్వామి పేరు మీద పట్టా మార్పిడి అయింది. ఆయనే అనుభవదారుగా ఉన్నారు. సదరు భూమి అష్రఫ్ అనే వ్యక్తికి మంజూరై వ్యవహారం కోర్టులో నడుస్తోంది. తమపై జరుగుతున్న దౌర్జన్యాలపై నారాయణస్వామి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయబోగా పోలీసులు కేసు నమోదుకు నిరాకరించారు. దీనిపై జిల్లా ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినా ఇంతవరకు సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా కేసు నమోదు చేసుకుని దౌర్జన్యం చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆమె ఒత్తిడి చేశారు. దళిత నాయకుడు ఈరప్ప, ఎన్ తిమ్మయ్య, జీఎన్ మునియప్ప, నారాయణస్వామి, కళావతమ్మ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామాంజమ్మ

ఓబవ్వ ప్లాక్ దళం ఏర్పాటు

కోలారు: తాలూకాలోని జంగమగుర్జేనహళ్లి ప్రభుత్వ పాఠశాలలో బుధవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ ఓబవ్వ ప్లాక్ దళాన్ని జిల్లా స్కౌట్స్ అండ్ గైడ్స్ కమిషనర్ కెఆర్ సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా సహకార్యదర్శి స్కౌట్ బాబు, జాయింట్ సెక్రటరి ఉమాదేవి, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ విఠల్‌రావ్, ప్లాక్ లీడర్ శోభిత తదితరులు ఉన్నారు.

నకిలీ క్లినిక్‌పై అధికారుల దాడి



క్లినిక్‌కు తాళం వేసి సీజ్ చేసిన అధికారులు

శ్రీనివాసపురం: తాలూకాలోని యల్దూరు గ్రామంలో నకిలీ వైద్యుడు మధుసూదన్ ఎలాంటి సర్టిఫికెట్లు లేకపోయినా ప్రభుత్వం నుంచి అనుమతి లేకుండా ఆస్పత్రి నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న ఆరోగ్య శాఖ అధికారులు స్థానిక పోలీసుల సహకారంతో బుధవారం క్లినిక్‌పై దాడి జరిపారు. అతని వద్ద ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో క్లినిక్‌ను సీజ్ చేశారు. అంతేగాకుండా నకిలీ వైద్యుడు మధుసూదన్‌కు నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా దాడిలో శ్రీనివాసపురం పోలీస్ ఇన్‌స్పెక్టర్ జీసీ నారాయణస్వామి, తాలూకా ఆరోగ్య శాఖ అధికారి విశ్వనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా బక్రీద్ ఆచరించండి

కోలారు: త్యాగబలిదానాలకు ప్రతీక అయిన బక్రీద్ పండుగను శాంతి సౌహార్దతల మధ్యన ఆచరించాలని, ఎలాంటి అవాంఛనీయర ఘటనలు చోటు చేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అక్రంపాషా తెలిపారు. బుధవారం నగరంలోని ఎస్పీ కార్యాలయంలో బక్రీద్ పండుగ సందర్భంగా నిర్వహించిన శాంతి సౌహార్థతా సమావేశానికి అధ్యక్షత వహించి ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ చట్టాలను గౌరవించాలన్నారు. చట్టాలకు జాతి, ధర్మ బేధాలు లేవన్నారు. పండుగ జోష్‌లో వీలింగ్ తదితరాలు చేస్తే చర్యలు తప్పవని తెలిపారు. చిన్న విషయాలను పెద్దవి చేయకుండా చూడాలన్నారు. పండుగ సందర్భంగా హిందూ సోదరులను తమ ఇళ్లకు భోజనానికి ఆహ్వానించడం ద్వారా సామరస్యతను పాటించాలన్నారు. పండుగ రోజున స్వచ్ఛతకు ప్రాధాన్యత నివ్వాలన్నారు. జిల్లా వ్యాప్తంగా పోలీసులు గట్టి బందోబస్తును కల్పించాలని సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అక్రం పాషా, ఇతర అధికారులు

క్లుప్తంగా

దివ్యాంగులపై శ్రద్ధ చూపాలి



ప్రసంగిస్తున్న రామణ్ణ తదితరులు

గౌరిబిదనూరు: మానసిక దివ్యాంగుల పట్ల తల్లి దండ్రులు, సమాజం ప్రత్యేక శ్రద్ధ వహించాలని సమాజ సేవకుడు పోతేనహళ్లి రామణ్ణ సూచించారు. మాజీ మంత్రి సుధాకర్ జన్మదినం సందర్భంగా పట్టణంలోని అరుణోదయ దివ్యాంగుల ప్రత్యేక పాఠశాలలో బుధవారం ఆయన కేక్ కట్ చేసి పిల్లలకు పంచి పెట్టి ప్రసంగించారు. ఇక్కడి పిల్లల్లో కౌశల్యతకు కొదవలేదని, వీరు చేసిన అలంకారిక సామగ్రి వీరి బుద్ధి కుశలతకు నిదర్శనమన్నారు.

కళలతో ఉత్తమ వ్యక్తిత్వం

గౌరిబిదనూరు: కళలు మానవునికి ఉత్తమ వ్యక్తిత్వం సంస్కారాన్ని నేర్పుతాయని ప్రజ్ఞా ట్రస్ట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.నాగరాజు అన్నారు. పట్టణంలోని ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో తాలూకాలోని వైచకూరహళ్లి అమాస సాంస్కృతిక సంస్థ, కర్ణాటక వీధినాటక అకాడమీ ఆధ్వర్యంలో కళాకారుడు సీజీ కృష్ణస్వామి సంస్మరణార్థం మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నాటక రంగానికి సీజీ కృష్ణస్వామి అందించిన సేవలు అనన్యమన్నారు. అనంతరం మునిరెడ్డి జానపద పాటలు ఆలపించారు.

గృహలక్ష్మి పథకం నిబంధనలు త్వరలో వెల్లడి

బనశంకరి: గృహలక్ష్మి పథకానికి జూలై 15 నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని మంత్రి హెచ్‌కే. పాటిల్ తెలిపారు. పథకం నిబంధనలను రేపటిలోగా ప్రకటిస్తామని తెలిపారు. కాగా గృహలక్ష్మి పథకం కింద ఇంటి యజమానికి రూ.2 వేలు అందించే ప్రత్యేక యాప్ కు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ యాప్ గురించి మంత్రి లక్ష్మీహెబ్బాళ్కర్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు వివరించారు.

మంత్రి క్షమాపణ చెప్పాల్సిందే



ధర్నా చేస్తున్న అర్చకులు, బ్రాహ్మణులు

తుమకూరు: బ్రాహ్మణ సమాజానికి రాష్ట్ర సహకార మంత్రి కేఎన్ రాజణ్ణ క్షమాపణ చెప్పాలని ఆ సమాజ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు నగరంలోని కలెక్టరేట్ ఎదుట రాష్ట్ర ధార్మిక దేవాలయ అర్చకులు, బ్రాహ్మణుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ బ్రాహ్మణులు రూపాయి విలువైన పువ్వులు, అగరబత్తీలు తేలేరని, ఎవరో తెచ్చిన సామగ్రితో పూజ చేస్తారని దావణగెరె సభలో మంత్రి హేళన చేశారన్నారు. తక్షణం బ్రాహ్మణ సమాజానికి మంత్రి క్షమాపణ చెప్పాలన్నారు. అనంతరం జిల్లాధికారి శివానంద బి.కరాళెకు వినతి పత్రాన్ని అందించారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు



పట్టుబడిన నిందితులు

కృష్ణరాజపురం:బెంగళూరులోని బెళ్లందూరులో ఈనెల 25న జరిగిన నేపాల్ యువకుడు డేవిడ్ హత్యోదంతాన్ని బెళ్లందూరు పోలీసులు చేధించారు. సూరజ్ సాప్, సురేంద్ర, బినోద్ అనే నిందితులను అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు... మొబైల్ తీసుకుని డబ్బు ఇవ్వకుండా వేధిస్తున్నాడనే కారణంతో డేవిడ్‌ను నిందితులు చంపేశారు. మాట్లాడాలని డేవిడ్‌ను నిందితులు పిలిపించారు. తర్వాత మద్యం సేవించి డబ్బు విషయాన్ని ప్రస్తావించారు. ఈ సమయంలో డేవిడ్... నిందితుల్లో ఒకరి తల్లిని అసభ్య పదజాలంతో దూషించాడు. కోపంతో ఊగిపోయిన నిందితుడు కత్తితో డేవిడ్‌ను పొడిచి చంపేశాడు. నిందితులు కూడా నేపాల్‌కు చెందిన వారే కావడం గమనార్హం.

మాంసం కోసం గేదెలపై కాల్పులు

యశవంతపుర: తుపాకీతో గేదెలను హతమార్చి మాంసాన్ని విక్రయించేందుకు యత్నించిన ఘటన హాసన జిల్లా సకలేశపుర తాలూకా క్యామనహళ్లిలో జరిగింది. దయానిధి అనే వ్యక్తికి చెందిన గేదెను ఇద్దరు నిందితులు తుపాకీతో కాల్చారు. మాంసాన్ని కత్తరిస్తుండగా స్థానికులు చేరుకున్నారు. దీంతో నిందితులు పరారైయ్యారు. సకలేశపుర పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గాలింపు చేపట్టి నిందితులను అరెస్ట్ చేసి తుపాకీ స్వాధీనం చేసుకున్నారు.

బాలికపై కుక్క దాడి

కృష్ణరాజపురం:రోడ్డుపై వెళుతున్న బాలికపై జర్మన్ షెపర్డ్ దాడి చేసింది. కేఆర్ పురం కృష్ణా థియేటర్ వద్ద బుధవారం ఉదయం ఓ బాలిక తల్లితో కలసి కాలినడకన వెళుతుండగా ఒక ఇంటి గేటు నుంచి దూకి రోడ్డుపైకి వచ్చిన కుక్క దాడి చేసింది. తక్షణమే స్థానికులు స్పందించి కుక్కను తరిమేసి బాలికను రక్షించారు. అనంతరం ఆస్పత్రికి తరలించారు.

ఈ తహసీల్దార్‌కు కళ్లుచెదిరే ఆస్తులు

- భారీగా నగదు, బంగారం, పదుల సంఖ్యలో ఇళ్లు
- కేఆర్ పురం అధికారి అజిత్ రై గుట్టురట్టు



లోకాయుక్త అధికారులు నగదు సర్దుతున్న దృశ్యం. కుర్చీలో కూర్చుని ఉన్న అజిత్ రై

బనశంకరి: లోకాయుక్త వలలో పడిన బెంగళూరు మహాదేవపురలోని కృష్ణరాజపురం తహసీల్దార్ అజిత్ రై నివాసంలో కళ్లుచెదిరే మొత్తంలో నగదు, బంగారు ఆభరణాలు చూసి లోకాయుక్త అధికారులే కంగుతిన్నారు. తహసీల్దార్ ఇంత డబ్బు, బంగారం , ఆస్తులను సంపాదించగలరా? అని ఆశ్చర్యపోయారంటే అతిశయోక్తి కాదు.

తండ్రి చనిపోతే క్లర్కుగా చేరి

అజిత్‌రై దక్షిణ కన్నడ జిల్లా పుత్తూరు తాలూకా సొరకెకు చెందిన వ్యక్తి. ఇతడి తండ్రి ఆనంద్ రై పుత్తూరులో సర్వేయర్‌గా పనిచేస్తూ మరణించడంతో అజిత్ రైకి కారుణ్య నియామకం కింద క్లర్కుగా ఉద్యోగం లభించింది. అజిత్‌రై అంచెలంచెలుగా తహసీల్దార్ స్థాయికి చేరుకోగా ప్రస్తుతం ఇతడి సంపాదన కోటానుకోట్లకు చేరింది. అజిత్ రై కృష్ణరాజపురం తహసీల్దార్‌గా భారీగా అక్రమాలకు పాల్పడడంతో ఉన్నతాధికారులు కొద్దిరోజుల క్రితం బదిలీ చేశారు. కానీ కొత్త స్థానంలోకి ఇంకా అతడు చేరలేదు. బుధవారం లోకాయుక్త అధికారులు అతని ఇల్లు, ఆఫీసులో సోదాలు నిర్వహించగా, ఇంట్లో కట్టల కొద్దీ నగదు, అనేక ఆస్తిపత్రాలు బయటపడ్డాయి. దేశ విదేశీ లగ్జరీ మద్యం బాటిళ్లు లభించాయి.

అనేక ఇళ్లు, ఫ్లాట్లు

కృష్ణరాజపురంలో వైభవోపేతమైన పెద్ద నివాస భవనం, బెంగళూరులో పలుచోట్ల అజిత్ రై కు చెందిన స్థలాల్లో దాడులు చేశారు. చంద్రాలేఔట్ స్కైలైన్ అపార్టుమెంట్ ఫ్లాట్, సహకారనగరలో ఫ్లాట్, దేవనహళ్లిలో నివాసం, కెంపేగౌడ విమానాశ్రయంరోడ్డు ఐటీసీ పార్కు వద్ద నివాసం, దొడ్డబళ్లాపురలో ఇక ఇంటిలో సోదాలు జరిగాయి. అజిత్ రై బినామి గా ఉన్న బసవేశ్వరనగర గౌరవ్‌శెట్టి నివాసంలో గాలింపు చేశారు. చంద్రాలేఔట్ స్కైలైన్ లేఔట్‌లోని అపార్టుమెంట్‌లో పెద్ద మొత్తంలో నగదు, డాక్యుమెంట్లు లభించాయి. పార్కింగ్‌లో ఉన్న విలాసవంతమైన థార్, ఫార్చ్యూనర్ కార్లు, బైకులను సీజ్ చేశారు. పుత్తూరులోని స్వంత ఇంట్లో కూడా నోట్ల కట్టలు లభించినట్లు లోకాయుక్త అధికారులు తెలిపారు. డీవైఎస్పీ ప్రమోద్ ఆధ్వర్యంలో సోదాలు కొనసాగుతున్నాయి.

బైక్‌ల దొంగ అరెస్టు

మైసూరు: కొడగు, హాసన్, మండ్య జిల్లాల్లో బైక్‌లను దొంగతనం చేస్తున్న హాసన్ జిల్లా అరకలగూడు దడ్డదళ్లి గ్రామ నివాసి మంజు అలియాస్ మంజునాథ్ (25)ను కొడగు జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి 7బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. కొడగు జిల్లా శనివారసంతె, సోమవారపేట పోలీసు స్టేషన్ల పరిధిలో ద్విచక్రవాహనాలను దొంగతనానికి గురవుతున్నాయనే ఫిర్యాదు మేరకు పోలీసులు ప్రత్యేక బృందంగా ఏర్పాటై దర్యాప్తు జరిపి నిందితుడిని పట్టుకున్నారు.

క్లర్కు ఇంట్లో భారీగా నగదు

మైసూరు: కుశాలనగరలోని ఉద్యోగి ఇంటిపై లోకాయుక్తా సోదాలు జరిపి భారీగా నగదు కనుగొంది. కొడగు జిల్లా పంచాయతీలో క్లర్క్‌గా పని చేస్తున్న అబ్దుల్ బషీర్ ఇంటిపై లోకాయుక్తా దాడి చేసింది. సుమారు రూ. 14 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. తనిఖీలు ఇంకా కొనసాగుతున్నాయి. కుశాలనగర గోందిబసవనహళ్లి నివాసి అయిన బషీర్ ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నారనే ఆరోపణలపై లోకాయుక్తా డీవైఎస్పీ పి.పవన్ కుమార్ నేతృత్వంలోని అధికారుల బృందం ఈ సోదాల్లో పాల్గొంది.

లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేస్తా

యశవంతపుర: విధానసభ ఎన్నికల్లో హొన్నాళి నుంచి బీజేపీ తరఫున పోటీ చేసి ఓడిపోయిన ఎంపీ రేణుకాచార్య రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు గతంలో ప్రకటించారు. అయితే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో దావణగెరె నుంచి పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ఆయన పార్టీ హైకమాండ్‌కు సందేశం పంపారు. అభిమానులు, కార్యకర్తల ఒత్తిడితో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ప్రకటించారు.

కంటైనర్ బోల్తా.. డ్రైవర్, క్లీనర్ మృతి

బనశంకరి: కంటైనర్ బోల్తాపడి డ్రైవరు, క్లీనర్ మృతి చెందారు. వివవరాలు..ఐస్‌క్రీమ్‌తో బొమ్మనంద్ర నుంచి హొసకోటెకు వెళుతున్న కంటైనర్ బెంగళూరు శివారులోని అత్తిబెలె సర్కిల్ వద్దకు రాగానే అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవరు, క్లీనరు అక్కడికక్కడే మృతిచెందారు. మృతులిద్దరూ తమిళనాడుకు చెందినవారుగా తెలిసింది. ప్రమాదంలో కంటైనర్‌లోని ఐస్‌క్రీమ్స్‌రోడ్డుపై చెల్లాచెదరుగా పడిపోయింది. అత్తిబెలె పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను శవపరీక్షల నిమిత్తం అక్స్‌పర్ట్స్ ఆసుపత్రికి తరలించారు.

కోర్టులో లొంగిపోవాలి

యశవంతపుర: బీజేపీ కార్యకర్త ప్రవీణ్ హత్య కేసులో నిందితులు జూన్ 30లోపు ఎన్ఐఎ కోర్టులో లొంగిపోవాలని ఎన్ఐఎ హెచ్చరించింది. లేని పక్షంలో వారి ఇళ్లను జప్తు చేస్తామని ఎన్ఐఎ అధికారులు వార్నింగ్ ఇచ్చారు. 2022 జులై 26న అంగడిలో ఉన్న ప్రవీణ్ హత్యకు గురైన విషయం తెలిసిందే.

కనువిందుగా కళామేళా



స్టాల్‌లో దుస్తులు కొంటున్న నగరవాసులు



కళాకృతులను వీక్షిస్తున్న సందర్శకురాలు

బనశంకరి: న్యూ కళా దర్శన్ హ్యాండ్‌లూమ్ అండ్ హ్యాండీక్రాఫ్ట్ మేళా నగరంలో సర్జాపుర రోడ్డు పీఎస్ఆర్ ఫ్లోరా అపార్టుమెంట్ సమీపంలోని ఓపెన్‌మైదానంలో ఏర్పాటైంది. కలంకారీ శారీస్, కాశ్మీరీ తివాచీలు, పింగాణి వస్తువులు, బాంబే జ్యువెలరీ ఐటమ్స్, లోహపు కళాకృతులు విక్రయిస్తున్నారు.

పలు రాష్ట్రాలకు చెందిన చీరలు, వస్త్రాల స్టాళ్లు వెలిశాయి. జూలై 25 వరకు ఈ మేళా జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

బస్సును ఢీకొన్న గూడ్స్ వాహనం

- బస్సు డ్రైవర్ మృతి

దొడ్డబళ్లాపురం: బెంగళూరు–మైసూరు ఎక్స్‌ప్రెస్‌వేపై మరో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించి ఒకరు మృతి చెందారు. మైసూరు నుంచి బెంగళూరు వెళ్తున్న ఆర్టీసీ బస్సు రామనగర పరిధిలోని జయపుర గేట్ వద్దకు రాగానే గూడ్స్ వాహనం ఢీకొంది. ప్రమాద తీవ్రతకు ఆర్టీసీ బస్సు గాల్లోకి పల్టీలు కొట్టి అవతల రోడ్డులో పడింది. ఘటనలో బస్సు డ్రైవర్ మృతి చెందగా ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. రామనగర ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బీజేపీ నేతపై ఎఫ్ఐఆర్

శివాజీనగర: కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసినట్లు ఆరోపణలపై నమోదైన కేసుకు సంబంధించి బీజేపీ జాతీయ ఐటీ సెల్ అధ్యక్షుడు అమిత్ మాళవియాపై ఎఫ్ఐఆర్ నమోదైంది. కాంగ్రెస్ నాయకుడు రమేశ్ బాబు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా హైగ్రౌండ్స్ పోలీస్ స్టేషన్‌లో అమిత్‌మాళవియాపై కేసు నమోదు చేశారు. కాంగ్రెస్ పార్టీ దేశ ద్రోహి కార్యకలాపాల్లో నిమగ్నమైనట్లు ఆ పోస్టు సారాంశం.

చిరుతను ఎదుర్కొన్న రైతన్న

మైసూరు: చిరుత దాడి చేయగా ధైర్యంగా ఎదుర్కొన్న రైతు ఉదంతం కొళ్లేగాల తాలూకా మోడళ్లి సమీపంలోని కంచగళ్లి గ్రామ పొలంలో జరిగింది. గ్రామానికి చెందిన నంజప్ప అనే రైతు జొన్న పంటకు కాపలగా ఉండేందుకు వెళ్లాడు. అక్కడే గుడిసెలో ఉన్న అతనిపై చిరుత దాడి చేసింది. రైతు ఎంతో సాహసంతో పక్కనే ఉన్న కర్రతో చిరుతపై ప్రతి దాడికి యత్నించగా అది ఉడాయించింది. స్వల్పగాయాలైన ఆయన హోలీక్రాస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. సోమవారం రాత్రి కగ్గలిగుండి గ్రామంలో బాలికపై చిరుత దాడి జరిగిన ఘటన మరవకముందే ఈ ఘటన జరగడం గ్రామస్తుల్లో భయాందోళనలను కలిగిస్తోంది.



జేసీబీతో కాంపౌండ్‌ను కూలగొడుతున్న దృశ్యం

ఆక్రమణల తొలగింపు

శివమొగ్గ: శివమొగ్గ మహానగర పాలికె ఆక్రమణల తొలగింపును ప్రారంభించింది. రాజకాలువ, పోలీసు శాఖకు చెందిన కోట్ల రూపాయల విలువైన స్థలాన్ని కాపాడింది. భారతీ కాలనీ లేఔట్‌లో సుమారు రూ. 2 కోట్ల విలువైన ఒకటిన్నర ఎకరాల స్థలాన్ని పాలికె స్వాధీనం చేసుకుంది. పటిష్ట పోలీసు బందోబస్తు మధ్య సుమారు 50 మంది పాలికె అధికారులు, సిబ్బంది బృందం అక్రమ కట్టడాలను జేసీబీలతో నేలమట్టం చేయించి స్థలాన్ని స్వాధీనం చేసుకుంది.

కాంగ్రెస్ ప్రభుత్వంలో బదిలీల దందా

- పర్సంటేజీలు కూడా మొదలయ్యాయి
- మాజీ సీఎం కుమారస్వామి ఆరోపణ

దొడ్డబళ్లాపురం: కొత్తగా ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీల దందాకు పాల్పడుతోందని మాజీ సీఎం కుమారస్వామి ఆరోపించారు. బుధవారం ఆయన చెన్నపట్టణలోని మైలనాయకనహొసహళ్లి గ్రామంలో మీడియాతో మాట్లాడారు. ఒకే పోస్టుకు స్వయానా ముఖ్యమంత్రి నాలుగైదు సార్లు నియామక ఆదేశాలు ఇచ్చారని ఆరోపించారు. ఇది దేనికి సంకేతమన్నారు. అవినీతిని నిర్మూలిస్తామని గొప్పలకు పోవడమే తప్ప కాంగ్రెస్‌సర్కార్‌లో లంచం లేనిదే ఏ పనీ చేయరన్నారు. కాంగ్రెస్‌లో కూడా పర్సంటేజ్ దందా మొదలైందని, రేట్లు ఫిక్స్ చేయడానికి అన్ని పనులూ నిలిపివేశారన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఒకే నాణేనికి రెండు ముఖాల లాంటివన్నారు. రాష్ట్రంలో పెరిగిన ధరలకు కారణం కేంద్రం కాదని ఈ పాపం రాష్ట్ర ప్రభుత్వానిదే అన్నారు.

హెచ్‌డీకే ఆరోపణల్లో నిజం లేదు: మంత్రి రామలింగారెడ్డి

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బదిలీల దందా చేస్తోందన్న మాజీ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి చేసిన ఆరోపణల్లో నిజంలేదని రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఆయన విధానసౌధలో మీడియాతో మాట్లాడారు. తమ ప్రభుత్వంలో నిజాయితీ గల అధికారులకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. రవాణా శాఖలో ఉద్యోగుల వేతనాలకు నిధుల కొరత ఏర్పడిందన్న వార్త అవాస్తవమన్నారు. ఎంతమంది మహిళా ప్రయాణీకులు ప్రయాణించారో తమ వద్ద సమాచారం ఉందని, ప్రభుత్వానికి ఆ సమాచారం ఇస్తామని నిధుల కొరత అనే మాట నిజం కాదన్నారు.

గ్యారంటీ పేరుతో కాంగ్రెస్ సర్కార్ వంచన: బీజేపీ

యశవంతపుర: గ్యారంటీ పథకాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని బీజేపీ రాజ్యసభ సభ్యుడు, ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి జీవీఎల్ నరసింహరావ్ ఆరోపించారు. ఆయన బుధవారం దావణగెరె పట్టణంలో పార్టీ ఆఫీసులో విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్ చేసిన మోసం, దోహ్రంను ప్రజలు త్వరలోనే అర్థం చేసుకుంటారన్నారు. రాష్ట్రంలో నిత్యావసరాల ధరలు పెరుగుతున్నా కాంగ్రెస్ సర్కార్ నియంత్రించలేదన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం 9 ఏళ్ల పూర్తి చేస్తుకున్న సందర్భంగా బీజేపీ సర్కార్ అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరిస్తున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా రూ.10 లక్షల మందితో ప్రధాని మోదీ మాట్లాడారని ఆయన తెలిపారు.

నిలువ నీడలేదు..దయామరణానికి అనుమతించండి

- రాష్ట్రపతికి లేఖ రాసిన వరద బాధితురాలు

యశవంతపుర: వరదలకు సర్వం కోల్పోయాను. నిలువనీడలేదు. జీవనం కష్టంగా మారింది. దయా మరణానికి అనుమతి ఇవ్వండి అంటూ ఒక బాధితురాలు రాష్ట్రపతికి లేఖ రాసింది. వివరాలు.. కొడగు జిల్లాలో 2019లో కావేరినదికి వరదలు వచ్చాయి. పెద్ద సంఖ్యలో ఇళ్లు నీటిలో కొట్టుకుపోయాయి. చాలా మంది కట్టుబట్టలతో మిగిలిపోయారు. నెల్యాహుదికేరికి చెందిన శాంత అనే మహిళకు చెందిన ఇల్లు కూడా వరదల్లో కొట్టుకుపోయింది. ఇళ్లు కోల్పోయి నిరాశ్రయులకు కొత్త గృహాలు కట్టిస్తామని అప్పటి ప్రభుత్వం హామీ ఇచ్చింది. అయితే ఇంతవరకు ఇళ్లను కట్టించిన పాపాన పోలేదు. అటు ఇల్లు లేక, ఇటు జీవనం కష్టమై శాంత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఈక్రమంలో దయా మరణానికి అనుమతి ఇవ్వాలని రాష్ట్రపతికి లేఖ రాసింది.

యువకుడి ఆచూకీ లభ్యం



కుటుంబసభ్యులతో కమలేశ్‌రామ్

యశవంతపుర: పొట్టకూటి కోసం మంగళూరు వచ్చి అదృశ్యమైన యువకుడి ఆచూకీ మూడు నెలల తర్వాత లభ్యమైంది. ఝార్కండ్‌కు చెందిన కమలేశ్‌రామ్(30) మంగళూరుకు వచ్చి ఒక హోటల్‌లో పనులకు వెళ్లేవాడు. కొంతకాలంగా మానసిక అస్వస్థతకు గురై వీధుల్లో తిరిగేవాడు. ఈ ఏడాది మార్చి నుంచి కనిపించకుండా పోయాడు. కాగా కమలేశ్‌రామ్ కాళ్ల నొప్పులతో ఒక ఆస్పత్రిలో చేరాడు. వైట్‌డౌస్ సంస్థ అతని వివరాలను తెలుసుకొని ఝార్కండ్‌లోని అతని భార్యకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చింది. కుటుంబసభ్యులు మంగళవారం మంగళూరుకు వచ్చి కమలేశ్ రామ్‌ను తీసుకెళ్లారు.

బక్రీద్‌ను శాంతియుతంగా జరుపుకోవాలి

మైసూరు: బక్రీద్ పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ రాజేంద్ర, ఎస్పీ సీమా లాట్కర్ సూచించారు. నగర జిల్లా పోలీసు కార్యాలయంలో మైసూరు జిల్లా ఉభయ వర్గాల ముఖ్య నేతలతో బుధవారం శాంతి సభ నిర్వహించారు. హిందూ ముస్లింలు సోదరభావంతో మెలగాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

108 సిబ్బంది సమ్మె హెచ్చరిక

శివాజీనగర: నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో 108 అంబులెన్స్ సిబ్బంది ప్రభుత్వానికి డెడ్ లైన్ ఇచ్చారు. జులై 7 లోగా జీతం చెల్లించనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే 8న సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. 2022 నవంబర్‌లో కూడా సేవలను స్తంభించి ధర్నా చేపట్టిన విషయం తెలిసిందే. ప్రస్తుతం వేతనాలు సరిగా చెల్లించకపోవడంతో మళ్లీ ఆందోళనకు సమాయత్తమవుతున్నారు.

హోసూరు వార్తలు..

తలపై రాయిపడి మృత్యువాత

కెలమంగలం: ఇంటి మరమ్మతు పనులు చేస్తుండగా ఆకస్మాత్తుగా తలపై రాయి పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తళి వద్ద చోటు చేసుకొంది. వివరాల మేరకు తళి సమీపంలోని బిన్నమంగలం గ్రామానికి చెందిన కూలికార్మికుడు మాదేష్ (45) మంగళవారం చెల్లి కూతురు వరలక్ష్మి (27)కి సొంతమైన ఇంటికి మరమ్మతులు చేయిస్తున్నాడు. ఇంతలో పై నుంచి రాయి అతని తలపై పడి తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ మృతి చెందాడు. తళి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా కెంపేగౌడ జయంతి



కార్యక్రమంలో పాల్గొన్న వక్కలిగ నేతలు

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరులో బెంగళూరు నగర నిర్మాణకర్త కెంపేగౌడ 514వ జయంతిని వక్కలిగర సంఘం నేతలు ఘనంగా జరిపారు. బుధవారం హోసూరు యూనియన్ వైస్ చైర్మన్ కే. నారాయణస్వామి అధ్యక్షతన కెంపేగౌడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. 120 మంది అనాథపిల్లలకు సంక్షేమ ఫలాలను అందజేశారు. బాగలూరు పంచాయతీ అధ్యక్షుడు వి.డి.జయరామ్, గోపాల్, సరస్వతి పాల్గొన్నారు.

జోరుగా వారసంత

క్రిష్ణగిరి: గురువారం బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లా కేంద్రం క్రిష్ణగిరి సమీపంలోని కుందారపల్లి వారసంతలో మేకలు, గొర్రెల విక్రయాలు జోరుగా సాగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి రైతులు పోషిస్తున్న మొకలు, గొర్రెలను తీసుకెళ్లి విక్రయిస్తుంటారు. బక్రీద్ కావడంతో మేకలు, పొట్టేళ్ల అమ్మకాలు విపరీతంగా జరిగాయి. ధరలు పెరిగినప్పటికీ పోటీ పడి జీవాలను కొనుగోలు చేశారు.


నూతన ఆఫీసులు ప్రారంభం

హోసూరు: జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కలెక్టర్ కార్యాలయ ఆవరణలో రూ. 8 కోట్ల ఖర్చుతో నిర్మించిన సంయుక్త గ్రామీణాభివృద్ధి శాఖ కార్యాలయ భవనాన్ని, క్రిష్ణగిరి కొత్త బస్టాండులో మరమ్మత్తులు పూర్తియన వాణిజ్య కేంద్రాన్ని బుధవారం చెన్నై నుంచి ముఖ్యమంత్రి స్టాలిన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ శరయు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం వాణిజ్య కేంద్రంలో మహిళా సంఘ సభ్యులు తయారు చేసిన చేతివృత్తి వస్తు ప్రదర్శనను ప్రారంభించి తిలకించారు. ఎమ్మెల్యేలు వై. ప్రకాష్, మదియళగన్, అదనపు కలెక్టర్ వందనా గార్గ్, అధికారులు జాకీర్ హుస్సేన్, మణిమేఘలై నాగరాజ్ పాల్గొన్నారు.

రమణీయం కుంభాభిషేకోత్సవం



కుంభాభిషేకోత్సవంలో పాల్గొన్న భక్తులు



రాజగోపురంపై హెలికాప్టర్ ద్వారా పుష్పవర్షం

హోసూరు: హోసూరు పట్టణంలోని తేరుపేట కొండపై వెలసిన చారిత్రక ప్రసిద్ధ మరకతాంబ సమేత శ్రీ చంద్రచూడేశ్వరస్వామి ఆలయ రాజగోపుర మహాకుంభాభిషేకోత్సవం ఘనంగా జరిగింది. మంగళవారం రాత్రి బాణ వేడుకల ఘనంగా జరిగింది. బుధవారం ఉదయం 9 గంటల నుంచి పండితుల వేదమంత్రాలు, భాజా భజంత్రీల మోగుతుండగా మహా కుంభాభిషేకోత్సవం జరిగింది. గంగా, యమున, సరస్వతి, తుంగభద్ర, కావేరి తదితర తొమ్మిది నదుల నుంచి తీసుకొచ్చిన పుణ్య జలాన్ని భక్తులపై చల్లారు. హెలికాప్టర్ ద్వారా రాజగోపురంపై పుష్పవర్షం కురిపించారు. జిల్లాతో పాటు తమిళనాడు, ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కుంభాభిషేకోత్సవంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం, అన్నదానాలు నిర్వహించారు. హోసూరు డీఎస్పీ నేతృత్వంలో గట్టి పోలీసుల భద్రత చేపట్టారు.

చెరువును బాగుచేయాలని ధర్నా



పూడిపోయిన చెరువు వద్ద నిరసనకారులు

కెలమంగలం: డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని సారండపల్లి వెంకటక్రిష్ణయ్య చెరువు ఆక్రమణలకు గురైందని, ఆక్రమణలు తొలగించి చెరువును శుద్ధీకరించాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. సారండపల్లి సమీపంలోని వెంకటక్రిష్ణయ్య చెరువు సుమారు 85 ఎకరాల విస్తీర్ణంలో ఉండేదని, 35 ఎకరాల చెరువు కబ్జాల పాలైందని తెలిపారు. ఈ చెరువు ద్వారా సారండపల్లి బాస్పల్లి, బిబిపాళ్యం, నేర్లట్టి, కాలేనట్టి తదితర గ్రామాలకు చెందిన 500 కుటుంబాలు జీవనోపాధి గడిస్తుండేవారని, ఒకవైపు ఆక్రమణలు, మరోవైపు పూడిపోయి పొలాలకు నీరు రావడం లేదన్నారు. రెవెన్యూ అధికార్ల నుంచి జిల్లా కలెక్టర్ వరకు వినతిపత్రాలు అందజేసినా ఫలితం లేకపోయిందని, తక్షణం కబ్జాలను తొలగించి, పూడిక తొలగించి నీళ్లివ్వాలని డిమాండ్ చేశారు. రైతు రక్షణ సంఘ జిల్లా కార్యదర్శి గణేష్‌రెడ్డి పాల్గొన్నారు.

జోయాలుక్కాస్‌లో వివాహ కలెక్షన్



సాక్షి బెంగళూరు: అన్ని రకాల ఆభరణాలతో, విభిన్న డిజైన్లతో కస్టమర్లను ఆకట్టుకుంటున్న ప్రఖ్యాత జ్యువెల్లరీ జోయాలుక్కాస్ సరికొత్త కలెక్షన్లతో మరోసారి ముందుకు వచ్చింది. రామాయణ మహాకావ్యంలో ప్రేమ, భక్తి, శాశ్వత బంధానికి అత్యద్భుత గౌరవ ప్రతీక అయిన సీతా కల్యాణం ఆభరణాలను అందుబాటులో ఉంచింది. సంస్థ సీఎండీ జోయాలుక్కాస్ మాట్లాడుతూ ప్రస్తుతం చారిత్రక, వారసత్వ సంపద అయిన సీతా కల్యాణం వివాహ కలెక్షన్‌ను వినియోగదారులకు అందిస్తూ తమ వంతుగా ఆ మహాకావ్యం రామాయణానికి గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని బైకిస్టు మృతి

హోసూరు: ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొన్న ప్రమాదంలో వ్యాపారి మృతి చెందిన ఘటన సిఫ్‌కాట్ వద్ద జరిగింది. వివరాల మేరకు పట్టణంలోని వెంకటేష్‌నగర్‌కు చెందిన వ్యాపారి వినోద్‌రాజ్ (34) బైక్‌పై మంగళవారం సాయంత్రం హోసూరు– బెంగళూరు జాతీయ రహదారి ఆర్టీవో చెక్‌పోస్ట్ వద్ద వెళుతుండగా లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన వినోద్‌రాజ్ ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. సిఫ్‌కాట్ పోలీసులు శవాన్ని హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు.



జగనన్న కాలనీలు

నగరాలను తలపిస్తున్నాయ్

జగనన్న కాలనీలు నగరాలను తలపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాగా.. మరికొన్ని చోట్ల శరవేగంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. కృష్ణా జిల్లా పెనమలూరు శివారు ప్రాంతం, విజయవాడ సమీపంలోని నున్న గ్రామం శివారు ప్రాంతాల్లోని జగనన్న కాలనీల్లో ఇళ్లు అందంగా రూపుదిద్దుకుంటున్నాయి.

- సాక్షి, విజయవాడ



క్లుప్తంగా...

ఓటర్ల నమోదుపై కోర్టులో కేసు వేస్తాం

దొంగ ఓట్లు చేర్చారని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కి టీడీపీ ఫిర్యాదు

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ఓటర్ల నమోదుపై త్వరలో హైకోర్టులో కేసు వేయనున్నట్లు టీడీపీ నేతలు అచ్చెన్నాయుడు, వర్ల రామయ్య, బొండా ఉమా, దేవినేని ఉమ చెప్పారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో వారు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ముఖేష్ కుమార్ మీనాను కలిసి ఓటర్ల నమోదుపై వినతిపత్రం అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. దొంగ ఓట్ల నమోదుతో సీఎం జగన్ ప్రపంచంలోనే 8వ వింత నమోదు చేశారన్నారు. 2019 నుంచి జరిగిన ప్రతి ఎన్నికల్లో ప్రభుత్వం వ్యవస్థల్ని అడ్డుపెట్టుకొని గెలిచింది తప్ప, ప్రజాబలంతో కాదని అన్నారు. 2,100 ఇంటి నంబర్లతో 1.85 లక్షల దొంగ ఓట్లు చేర్పించారని తెలిపారు. 14 నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ ఇష్టానుసారం దొంగ ఓట్లు చేర్పించారన్నారు. ఒక్కో ఇంటిలో 50 నుంచి 500 వరకు దొంగ ఓట్లు ఉన్నాయన్నారు. వీటిపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌ని కోరామన్నారు.

మార్చికి ఇళ్ల నిర్మాణం పూర్తి

గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దొరబాబు



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం కింద రెండు దశలుగా నిర్మిస్తున్న 18.63 లక్షల ఇళ్ల నిర్మాణాలు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఏపీ గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో 32వ బోర్డ్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనట్టుగా పేదలకు పక్కా గృహాల కల్పనకు సీఎం జగన్ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. 31 లక్షల మందికిపైగా పేద అక్కాచెల్లెమ్మల సొంతింటి కలను సాకారం చేయడానికి కృషి చేస్తోందని చెప్పారు. 9,332 వైఎస్సార్, జగనన్న కాలనీల్లో విద్యుత్ పనులు ప్రారంభం అవ్వగా 3,485 చోట్ల పనులు పూర్తయ్యాయన్నారు. సంస్థ ఎండీ లక్ష్మీశ పాల్గొన్నారు.

దళిత ద్వేషి బాబే: కైలే

సాక్షి, అమరావతి: దళిత ద్వేషి చంద్రబాబు అని.. దళితులుగా పుట్టాలని ఎవరు కోరుకుంటారు? అని హేళన చేసిన దుర్మార్గుడని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ దుయ్యబట్టారు. అలాంటి వ్యక్తిని వెనకేసుకు వస్తూ.. నేడు రామోజీరావు 'ఈనాడు' ద్వారా వైఎస్ జగన్ ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని మండిపడ్డారు. ఈ మేరకు అనిల్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 'రామోజీ తన ఈనాడు పత్రికలో ఎస్సీ, ఎస్టీలపై హత్యలు, దాడులు జరుగుతున్నట్లు విషం కక్కుతూ తప్పుడు కథనాలు రాస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కడైనా దళితులపై దాడులు, దౌర్జన్యాలు జరిగితే వైఎస్ జగన్ ప్రభుత్వం వెంటనే కఠిన చర్యలు తీసుకుంటున్న విషయం అందరికీ తెలుసు. దళితులు ఆత్మగౌరవంతో సంతోషంగా జీవించడానికి సీఎం జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈసారి 175 స్థానాలను వైఎస్సార్‌సీపీనే కైవసంచేసుకుంటుంది' అని చెప్పారు.

ఎర్ర డైరీలో పేర్లు రాస్తున్నా: లోకేశ్

కోట(తిరుపతి జిల్లా) : ఎన్టీఆర్ దేవుడు.. చంద్రబాబు రాముడు.. నేను చాలా మూర్ఖుడిని.. అంటూ తిరుపతి జిల్లా గూడూరు నియోజకవర్గం కోటలో నిర్వహించిన బహిరంగ సభలో టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ చెప్పారు. యువగళం పాదయాత్ర బుధవారం కోటలో సాగింది. కోట గాంధీబొమ్మ సెంటర్ వద్ద నిర్వహించిన బహిరంగ సభలో లోకేశ్ మాట్లాడుతూ తన దగ్గర ఉన్న ఎర్ర డైరీలో చాలామంది పేర్లు రాస్తున్నానని, టీడీపీ ప్రభుత్వం వస్తే వారందరినీ జైలుకు పంపుతామన్నారు. సీఎం జగన్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలంతా అవినీతిపరులుగా మారిపోయారని ఆరోపించారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అనేక కేసులున్నట్టు చెప్పారు. గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు కలెక్షన్ ప్రసాద్‌గా మారి గూడూరు మున్సిపల్ కమిషనర్‌తో కలిసి అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అయితే లోకేశ్ పదే పదే ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను చూసి చదువుతుండటం సభకు వచ్చిన కొద్ది మంది జనానికి బోరు కొట్టించింది. గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌ను పదేపదే పొగుడుతూ లోకేశ్ ప్రసంగం సాగడంతో మిగతా టీడీపీ నాయకులు ఒకింత అసహనానికి లోనయ్యారు. టీడీపీ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పనబాక లక్ష్మి, పనబాక కృష్ణయ్య, పాశం సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

భీమవరంలో 'డబ్బింగ్' బ్రేక్!

- వారాహికి పవన్ విరామంపై సోషల్ మీడియాలో సెటైర్లు
- జ్వరం వచ్చిందంటూ అబద్ధాలు చెప్పిన పొలిటికల్ బ్రోకర్ అంటూ ట్వీట్లు
- పవన్ డబ్బింగ్ చెబుతున్న ఫొటోలను ట్విట్టర్‌లో విడుదల చేసిన సముద్రఖని

సాక్షి, అమరావతి, సాక్షి, భీమవరం: జ్వరం వచ్చిందంటూ వారాహి యాత్రకు విరామం ఇచ్చిన జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ భీమవరంలో తన తాజా సినిమాకు డబ్బింగ్ చెబుతున్నట్లు సోషల్ మీడియాలో విమర్శలు హోరెత్తుతున్నాయి. రాజకీయ యాత్రకు దుమ్మా కొట్టి మరీ పవన్ తన సినిమా డబ్బింగ్ పనుల్లో నిమగ్నమయ్యారని పేర్కొంటున్నారు. 'సినిమాకు డబ్బింగ్ చెప్పాల్సి రావడంతో జ్వరం వచ్చిందంటూ అభిమానులకు, వారాహికి అబద్ధం చెప్పిన మన పొలిటికల్ బ్రోకర్..!' అంటూ బుధవారం వందల మంది ట్విట్టర్ వేదికగా ట్వీట్‌లు చేశారు.



భీమవరంలో సినిమా డబ్బింగ్ పనిలో ఉన్న పవన్‌కళ్యాణ్, దర్శకుడు సముద్రఖని

ట్విట్టర్‌లో ఫొటోలు..

ఇదిలా ఉండగా యాత్ర మధ్యలో విరామ సమయంలో పవన్‌కళ్యాణ్ 'బ్రో..ది అవతార్' సినిమాకు డబ్బింగ్ చెబుతున్న ఫొటోలను చిత్ర దర్శకుడు సముద్రఖని బుధవారం ఉదయం తన ట్విట్టర్ ఖాతాలో పోస్టు చేయడం గమనార్హం. దీనిపై పలువురు ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ జ్వరం పేరుతో యాత్రను నిలిపివేసి సినిమా పనుల్లో పాల్గొనడం ఏమిటంటూ వరుసగా ట్వీట్‌లు చేశారు.

మూడు రోజులుగా భీమవరంలోనే..

పవన్‌కళ్యాణ్ సోమవారం రాత్రి నరసాపురం బహిరంగ సభలో పాల్గొన్న అనంతరం అదే రోజు రాత్రి భీమవరం చేరుకున్నారు. అప్పటి నుంచి అక్కడే గడుపుతున్నారు. ఈ నెల 30వతేదీన భీమవరంలో పవన్ బహిరంగ సభ ఉంటుందని జనసేన ప్రకటించింది. పవన్ జ్వరంతో బాధ పడుతున్నందున మూడు రోజుల పాటు యాత్రకు విరామం ఇచ్చినట్లు పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

పింఛన్ల కోసం ఎమ్మెల్యే సంతకం కావాలా?

- రాష్ట్రంలో ఇది దౌర్భాగ్య పరిస్థితి
- జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్

సాక్షి, భీమవరం: పింఛన్ల కోసం ఎమ్మెల్యే సంతకాలు అవసరమైన దౌర్భాగ్య స్థితి రాష్ట్రంలో ఉందని జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అన్నారు. బుధవారం పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఊగిపోతూ మాట్లాడుతున్నానని జగన్ అంటున్నారని, రేపటి నుంచి జగన్ స్టైల్లోనే మాట్లాడుతానంటూ హావభావాలు ప్రదర్శించారు. తాను చెప్పు చూపించి మాట్లాడటం వెనుక బలమైన కారణం ఉందన్నారు. కేసుల గురించి ఎవరూ భయపడవద్దని చెప్పారు. వరాహికి వారాహికి తేడా తెలియని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జనసేన పయోజన సంచార పాఠశాల ద్వారా అక్షరాలు, ఒత్తులు, దీర్ఘాలు



నేర్పిస్తానని చెప్పారు. నియంత, తెలుగు ఉచ్ఛారణ సరిగా రాని ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలించడం మన దౌర్భాగ్యమని వ్యాఖ్యానించారు. తనకు వ్యక్తిగతంగా ఎమ్మెల్యేలు, ముఖ్యమంత్రిపై ఎటువంటి ద్వేషం లేదన్నారు. భీమవరంలోని కస్తుర్బా గాంధీ ప్రభుత్వ కళాశాల పేరును మార్చడం దారుణమన్నారు. భీమవరం నియోజకవర్గంలో రానున్న ఎన్నికల్లో జనసేన జెండా తప్పక ఎగరాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఈనెల 30న భీమవరంలో నిర్వహించే వారాహి విజయ యాత్రలో మాట్లాడతానని, అప్పటిలోగా వైఎస్సార్‌సీపీ అనేక పాడు పనులు చేస్తుందని అన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు నాదెండ్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బుంది..కళ్ల జబ్బుందా?

సామాజిక రంగంపై వ్యయం సమాజ హితం కోసమని రామోజీకి తెలియదా?

సాక్షి, అమరావతి: ప్రభుత్వాలు సామాజిక దృక్పథంతో బాధ్యతగా వ్యవహరించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుంది! విద్య, వైద్యం, బడుగు–బలహీన వర్గాల సంక్షేమం కోసం వెచ్చించే వ్యయం ఈ కోవలోకే వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రంగానికి పెద్దపీట వేస్తుంటే ఈనాడు రామోజీకి రుచించడం లేదు! కాగ్ ప్రొవిజనల్ గణాంకాల్లోనే ఈ వివరాలన్నీ ఉన్నా ఆ డబ్బంతా ఏమైందోనంటూ యథాప్రకారం మరో తప్పుడు కథనాన్ని భుజానికెత్తుకున్నారు!! అనుబంధ సంస్థల్లోకి మళ్లించేందుకు ప్రభుత్వమేమీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ సంస్థ కాదు కదా! కాగ్ ప్రొవిజనల్ గణాంకాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఏ రంగానికి ఎంత వ్యయం చేసిందో స్పష్టంగా పేర్కొంది. రైతులు, అక్క చెల్లెమ్మలు, విద్యార్థులు, పెద్దలు, వితంతువులు, పౌష్టికాహార లోపం కలిగిన చిన్నారులు, బాలింతలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ఉద్యోగుల ఖాతాల్లోకి రూ.రెండు లక్షల కోట్లకుపైగా ప్రభుత్వం జమ చేసినట్లు తెలుస్తున్నా కబోదుల్లా నటించే వారిని ఏమనుకోవాలి? కాగ్ ప్రొవిజనల్ గణాంకాల ప్రకారం ముగిసిన ఆర్థిక సంవత్సరంలో మూలధన వ్యయం రూ.7,581.58 కోట్లు కాగా రామోజీ మాత్రం రూ.6,916 కోట్లు అంటూ సొంత లెక్కలు చెప్పారు మరి!

సామాజిక వ్యయంలో సరితూగగలవా?

ఏ ప్రభుత్వానికైనా కొన్ని ప్రాధాన్యతలుంటాయి. వాటి మేరకు వ్యయం చేస్తాయి. మూలధన వ్యయానికి కూడా ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తాయి. అయితే ప్రభుత్వాలు తప్పనిసరిగా నెరవేర్చాల్సిన సామాజిక బాధ్యతలూ ఉంటాయి. వాటికి ఎక్కువ నిధులు అవసరమైనప్పుడు మూలధన వ్యయం తగ్గుతుందని, ఇందులో కొంపలు కొల్లేరయిపోయే ప్రమాదం ఏమీ లేదని ఆర్థిక శాఖ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. 17 కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటు, ఆస్పత్రుల అభివృద్ధి, స్కూళ్లు బాగు చేయడం, వ్యవసాయం, పారిశ్రామిక రంగాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు వెచ్చిస్తున్న డబ్బు పెట్టుబడి వ్యయం కాదా? రాష్ట్ర ప్రభుత్వం సామాజిక రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుండటంతో గత నాలుగేళ్లుగా ఆ వ్యయం పెరుగుతోంది. మిగతా రాష్ట్రాలేవీ సామాజిక రంగంపై మన రాష్ట్రం చేస్తున్నంత వ్యయం చేయడం లేదని ఆర్థిక శాఖ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. అలాంటప్పుడు మూలధన వ్యయంలో వెనుకబడ్డామంటూ ఈశాన్య రాష్ట్రాలతో మనకు పోలిక ఎందుకు?

- ▲ 2022–23కి సంబంధించి కాగ్ ప్రొవిజనల్ గణాంకాలను మాత్రమే వెల్లడించింది. సాధారణ, సామాజిక, ఆర్థిక రంగాల వారీగా ప్రభుత్వ వ్యయం ఉంటుంది. జీతాలు, వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు, సబ్సిడీ కోసం చేసిన ఖర్చులుంటాయి. సమాచారాన్ని దాచి పెట్టాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏమాత్రం లేదు.
- ▲ మూలధన వ్యయం తక్కువగా ఉందని, రాష్ట్రం పరిస్థితి అధ్వానంగా ఉందన్న రామోజీ రాతల్లో నిజం లేదు. ప్రభుత్వాలు తమ ప్రాథమిక బాధ్యతలో భాగంగా కొన్నింటికి ప్రాధాన్యం ఇవ్వడం వల్ల వాటిని రెవెన్యూ వ్యయం కింద పరిగణిస్తారు. ఆరోగ్యం, విద్యలో అసమానతలు రూపుమాపడం, గ్రామీణ – పట్టణ అసమానతలను తగ్గించడం తదితర లక్ష్యాల సాధనకు సహజంగానే అధిక చేయాల్సి ఉంటుంది. ఇవన్నీ రెవెన్యూ వ్యయంగా వర్గీకరించడం వల్ల మూలధన వ్యయం తగ్గినట్లు కనిపిస్తుంది. నిజానికి మానవ వనరులు అభివృద్ధి, సామాజిక ఆస్తుల కల్పనకు ఈ వ్యయం ఎంతో అవసరం.
- ▲ గత సర్కారు 2014–19 మధ్య కాలంలో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలతో పాటు పేదల అభ్యున్నతిని విస్మరించింది. వాటిని మెరుగుపరిచేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక విద్యలో స్థూల నమోదు (జీఈఆర్) జాతీయ సగటు 99 కాగా మన రాష్ట్రంలో దేశంలోనే అతి తక్కువగా 84.48 ఉంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సంస్కరణల కోసం నాలుగేళ్లలో దాదాపు రూ.67 వేల కోట్లను వెచ్చించి చదువులను గాడిన పెట్టింది. నాడు–నేడుతో సర్కారు స్కూళ్లను కార్పొరేట్‌కు ఏమాత్రం తీసిపోకుండా తీర్చిదిద్దింది. నిజానికి ఇప్పుడు ప్రైవేట్ స్కూళ్లే ప్రభుత్వ విద్యాసంస్థలతో పోటీ పడాల్సిన పరిస్థితికి వచ్చాయి. అమ్మ ఒడి నుంచి విద్యాదీవెన, వసతి దీవెన, విద్యా కానుక, విదేశీ విద్యా దీవెన.. ఇలా ఎన్నో పథకాలను తీసుకొచ్చి పిల్లలు చదువుకునేలా ప్రభుత్వం అండగా నిలిచింది. ఇంగ్లీషు మీడియం, సీబీఎస్ఈ విధానంతోపాటు నాణ్యమైన విద్య అందించేలా బైజూస్ కంటెంట్‌ను సమకూర్చింది. డిజిటల్ తరగతి గదులను ఆరు, ఆపై తరగతుల నుంచి అందుబాటులోకి తెచ్చింది. ఇలాంటి చర్యల వల్ల ప్రాథమిక విద్యలో జీఈఆర్ 2021–22లో జాతీయ స్థాయిని మించి ఏపీలో 100.7కు పెరిగింది. ఇది రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు దోహదం చేస్తుంది. ఇది రెవెన్యూ వ్యయం కిందకు వస్తుంది. మరి ఈ వ్యయాన్ని వృథా అని రామోజీ గగ్గోలు పెడుతుంటే ఏం చెప్పాలి?
- ▲ మూలధన వ్యయం చూసినా గతంలో కంటే ఇప్పుడే మెరుగ్గా ఉంది. టీడీపీ హయాంలో సగటున ఏడాదికి రూ.15,277.80 కోట్లు మూలధన వ్యయం కాగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సగటున ఏడాదికి రూ.16,095.90 కోట్లు మూలధన వ్యయం కింద వెచ్చించింది. రూ.15,000 కోట్లతో ఒకేసారి నాలుగు కొత్త పోర్టుల నిర్మాణాన్ని చేపడుతోంది. ఇది మూలధన వ్యయం కిందకే వస్తుంది. 'ఎస్పీవీ' ద్వారా చేపడుతున్నందున దీన్ని మూలధన వ్యయంగా గుర్తించకున్నా ఇది కచ్చితంగా ఆస్తుల కల్పన వ్యయమే.
- ▲ రాష్ట్రంలో 20 – 59 ఏళ్ల వయసున్న వారు ఉపాధి కోసం వలస వెళ్తున్నట్లు ఈనాడు అవాస్తవాలు ప్రచురించింది. రాష్ట్రంలో ఆ వయసు వారు 2014తో పోల్చితే పెరిగారే కానీ తగ్గలేదు. 0 – 14 ఏళ్ల లోపు జనాభా ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశమంతా తగ్గుతోంది. జనాలు తక్కువ ఉన్నప్పుడు యువత ఎలా వస్తారు? వలసలు ఎలా పెరిగాయో రామోజీకే తెలియాలి.
- ▲ ఐరాస నిర్దేశించిన సుస్థిర లక్ష్యాల సాధనకు సామాజిక రంగంపై వ్యయం పెరుగుదల సముచితమేనని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వే కూడా చెబుతోంది. సామాజిక రంగంపై వ్యయం పెంచాలని రాష్ట్రాలకు సూచిస్తోంది. సామాజిక రంగంపై వెచ్చించే వ్యయం వ్యక్తులు, సమాజ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొంది.
- ▲ పాఠశాలలు, ఆస్పత్రులు నిర్మించాలంటూ రిటైర్డ్ అధికారి పీవీ రమేష్ సూచించినట్లు ఈనాడు తన కథనంలో పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వం చేస్తోంది కూడా అదే కదా?

సామాజిక రంగాలు అంటే?

విద్య, వైద్యం, కుటుంబ సంక్షేమం, గృహ నిర్మాణం, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, గృహ నిర్మాణం, పట్టణాభివృద్ధి, ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమం, కార్మిక సంక్షేమం, పౌష్టికాహారం, విపత్తుల సహాయం తదితరాలు ఇందులోకి వస్తాయి.

సాధారణ రంగాలు..

జీతభత్యాలు, పెన్షన్లు, వడ్డీలు, అప్పులు, చెల్లింపులు, పరిపాలన, నిర్వహణకు వ్యయం తదితరాలు.

ఆర్థిక రంగాలు..

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఇరిగేషన్, విద్యుత్, పరిశ్రమలు, రవాణా వ్యయం, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం, పర్యావరణ రంగాలు.

కాగ్ ప్రొవిజనల్ గణాంకాల ప్రకారం గత ఆర్థిక ఏడాదిలో రంగాల వారీగా వ్యయం

రంగం	వ్యయం రూ.కోట్లు
సామాజిక	90,112.38
సాధారణ	62,558.47
ఆర్థిక	55,304.15

20-59 ఏళ్ల వయసు జనాభా (ప్రతి 1000 జనాభాకు)

సంవత్సరం	ఏపీలో
2020	632
2019	628
2017	618
2014	605

పాఠశాల విద్యపై వ్యయం రూ.కోట్లలో

ఆర్థిక సంవత్సరం	వ్యయం (అమ్మఒడి లేదు)	జీతం వ్యయం	జీతం మినహాయించి వ్యయం	జీఎస్‌డీపీలో విద్య వ్యయం	సగటు
2015-16	14,347.25	10,198.25	4,149.00	0.69%	0.51%
2016-17	14,995.37	1,923.06	3,072.31	0.45%	
2017-18	16,939.61	12,710.72	4,228.90	0.54%	
2018-19	17,196.70	13,928.90	3,267.79	0.37%	
	(అమ్మఒడితో)				
2019-20	24,313.21	14,164.80	10,148.41	1.10%	
2020-21	21,921.23	14,618.20	7,303.03	0.76%	
2021-22	29,853.66	15,571.66	14,282.00	1.26%	1.07%
2022-23	31,971.52	16,709.75	15,261.77	1.16%	

అప్పులపై తప్పుడు రాతలు..

గత ఆర్థిక సంవత్సరంలో రూ.51,453.22 కోట్లు అప్పులు చేసినట్లు కాగ్ ప్రొవిజనల్ గణాంకాల్లో పేర్కొంది. ఈనాడు రామోజీ మాత్రం బడ్జెట్, బడ్జెట్ బయట రూ.90 వేల కోట్లు అప్పు చేసినట్లు పచ్చి అవాస్తవాలను ప్రచురించారు. అప్పులు ఎంత చేశారో కాగ్ నిర్ధారిస్తుంది కానీ రామోజీ ఊహాగానాలు కాదు!

ఆక్రమణల నుంచి దేవుడి భూములకు విముక్తి

- వారంరోజులు గడువిచ్చి స్వాధీనం చేసుకోనున్న ప్రభుత్వం
- ఆర్డినెన్స్ జారీ.. గవర్నర్ ఆమోదం.. తక్షణం అమల్లోకి
- ఇప్పటివరకు భూముల స్వాధీనంలో ఎన్నో చిక్కులు

సాక్షి, అమరావతి : దేవుడి భూముల ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం బుధవారం పకడ్బందీ ఆర్డినెన్స్‌ను తీసుకొచ్చింది. ఆక్రమణలపై కోర్టు ప్రక్రియ ద్వారా కాలయాపన లేకుండా ఆక్రమణదారునికి కేవలం ఒక నోటీసు ఇచ్చి వారం తర్వాత ఆ భూమిని స్వాధీనం చేసుకునే అధికారాన్ని దేవదాయ శాఖ అధికారులకు కల్పించింది. ఈ మేరకు 1987, 2007 దేవదాయ శాఖ చట్టాల్లోని 83, 84, 85, 86, 93, 94 సెక్షన్లలో పలు మార్పులు చేస్తూ, కొన్నింటిని తొలగిస్తూ ప్రభుత్వం కొత్త ఆర్డినెన్స్‌ను రూపొందించింది. గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆమోదంతో న్యాయ శాఖ ఈ ఆర్డినెన్స్‌ను విడుదల చేసింది. తక్షణమే ఆర్డినెన్స్ అమలులోకి వస్తుందని అందులో పేర్కొన్నారు.

ఇప్పటివరకు జరుగుతున్నదిదీ..

ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం దేవుడి భూములను ఎవరైనా ఆక్రమిస్తే దేవదాయ శాఖ అధికారులు ముందు ఎండోమెంట్ ట్రిబ్యునల్‌లో పిటీషన్ వేయాల్సి వచ్చేది. ట్రిబ్యునల్‌లో ఆక్రమణదారులు లాయర్ల ద్వారా వారి వాదనలు వినిపించుకోవచ్చు. ట్రిబ్యునల్ ఆ భూములు దేవదాయ శాఖవని తేల్చే వరకు వాటిని అనుభవించే వెసులుబాట ఆక్రమణదారులకే ఉంటుంది. ఒకవేళ ట్రిబ్యునల్ దేవదాయ శాఖకు అనుకూలంగా తీర్పు ఇస్తే, దానిపై కింద నుంచి పై కోర్టుల వరకు వెళ్లి, కాలయాపన చేసే వెసులుబాటు ఆక్రమణదారులకే ఉంది. దీంతో భూముల వివాదం ఏళ్ల తరబడి ఎండోమెంట్ ట్రిబున్యల్, కోర్టులలో కొనసాగుతోంది. అత్యధిక కేసుల్లో పదేళ్లకు పైనే సాగుతోందని, అంత కాలం ఆ భూములు ఆక్రమణదారులే అనుభవిస్తున్నారని అధికారులు వెల్లడించారు. ఫలితంగా వేలాది ఎకరాల దేవుడి భూములు ఆక్రమణదారుల చేతిలోనే ఉన్నాయి.

ఇప్పుడు జరగబోయేది ఇదీ..

తాజా ఆర్డినెన్స్ ప్రకారం.. ఆక్రమణదారు నుంచి భూముల స్వాధీనం చేసుకోవడానికి దేవదాయ శాఖ అధికారులు ఆ భూమి దేవుడిదని పేర్కొంటూ ఒక నోటీసు ఇస్తారు. ఆక్రమణదారు జవాబు చెప్పుకోవడానికి ఓ వారం వ్యవధి ఇస్తారు. వారం దాటిన వెంటనే పోలీసు, రెవిన్యూ అధికారుల సహాయంతో ఆ భూములను స్వాధీనం చేసుకోవచ్చు. ఈమేరకు తాజా ఆర్డినెన్స్ ద్వారా దేవదాయ శాఖ అధికారులకు అన్ని అధికారాలు దఖలు పడతాయి. న్యాయపరమైన చిక్కులు, ఆలస్యం లేకుండా దేవుడి భూములు దేవదాయ శాఖ చేతుల్లోకి వస్తాయి. ఈ స్వాధీన ప్రక్రియపై అభ్యంతరాలు ఉంటే ఆక్రమణదారుడే కోర్టులకు వెళ్లి, అవి తమ భూములని నిరూపించుకోవాల్సి ఉంటుందని దేవదాయశాఖ అధికారులు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ విధానం

సాక్షి, అమరావతి : ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ విధానం అందుబాటులోకొచ్చింది. అధిక పెన్షన్ కోసం ఆర్టీసీ ఉద్యోగులు దరఖాస్తు చేసుకోవచ్చని ఈపీఎఫ్‌వో అధికారులు సమాచారమిచ్చారు. పాత పెన్షన్ విధానం ప్రకారం ఆర్టీసీలో రిటైర్డ్ ఉద్యోగులకు నెలకు రూ.5 వేల వరకే పెన్షన్ వచ్చేది. కాగా ప్రస్తుత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయడంతో వారి పెన్షన్ ఐదారు రెట్లు పెరగనుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశాక ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభించింది. 'ఈపీటీవో'కు చెల్లించాల్సిన బకాయిలను ఆర్టీసీ చెల్లించడంతో పాటు ఉద్యోగుల ఖాతాలను సక్రమంగా నిర్వహిస్తోంది. దాంతో ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ విధానాన్ని ఈపీటీవో సత్వరం అందుబాటులోకి తేగలిగింది. ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉన్న జి.సత్యనారాయణకు నెలకు రూ.25 వేలు పెన్షన్‌గా నిర్ధారించడం విశేషం. ఈ మేరకు ఈపీఎఫ్‌వో జారీ చేసిన పత్రాన్ని ఆయనకు బుధవారం అందజేశారు. త్వరలోనే ఆర్టీసీ ఉద్యోగులందరికీ అధిక పెన్షన్ విధానంలో పెన్షన్ పత్రాలు అందజేసేందుకు ఆర్టీసీ కార్యాచరణను వేగవంతం చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ విధానం అందుబాటులోకి రావడంపై ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు హర్షం వ్యక్తం చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ విధానాన్ని అమలు చేయడంపట్ల ఎంప్లాయీస్ యూనియన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ విధానంతో రిటైరయ్యే నాటికి 60 నెలల ముందు ఉన్న బేసిక్, డీఏలను లెక్కించి పెన్షన్ చెల్లించనుండటం ఉద్యోగులకు ప్రయోజనకరంగా ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం రూ.4వేలు పెన్షన్ వస్తున్న ఉద్యోగికి ఈ కొత్త విధానంతో రూ.25వేలు పెన్షన్ వస్తుందని తెలిపింది. ఆర్టీసీ ఉద్యోగులు రిటైరయ్యాక ఆనందంగా జీవించేందుకు చర్యలు తీసుకున్న ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానికి ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.దామోదరరావు, జీవి నరసయ్య బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు.



ఆర్టీసీ ఉద్యోగికి అధిక పెన్షన్ ధ్రువ పత్రాన్ని అందిస్తున్న ఆర్టీసీ ఎండీ సీహెచ్ ద్వారకా తిరుమలరావు

జూలై నుంచి రాయితీపై గోధుమ పిండి సరఫరా

పాలకొల్లు అర్బన్: రాష్ట్రంలోని పట్టణవాసులందరికీ వచ్చే జూలై నుంచి కిలో రూ.16కే గోధుమ పిండిని చౌక డిపోల ద్వారా సరఫరా చేస్తున్నట్లు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులో బుధవారం పలు అభివృద్ధి పనులకు ఆయన ప్రారంభోత్సవం చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. దాళ్వా పంట సొమ్ములను ధాన్యం విక్రయించిన వారం రోజులకే రాష్ట్రవ్యాప్తంగా రూ.20 వేల కోట్లను రైతుల ఖాతాలకు జమ చేశామన్నారు. అలాగే వచ్చే సార్వా పంట సొమ్ములు మూడు రోజులకే రైతుల ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చంద్రబాబు దత్త పుత్రుడు పవన్‌కళ్యాణ్ ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలుస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అంతా అనుకూలమైన ఓటర్లే ఉన్నారని చెప్పారు. తెలుగుదేశం హయాంలో పేదలకు భూములు పంచినట్లు బహిరంగ చర్చకు చంద్రబాబు, ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు సిద్ధమా అని సవాల్ విసిరారు. జగనన్న కాలనీలకు మట్టి తరలిస్తుంటే నిమ్మల అడ్డుపడడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్ పాల్గొన్నారు.

(నేడు ఈదుల్ అజ్ హా / బక్రీద్ పర్వదినం)

మనోవాంఛల త్యాగమే బక్రీద్



ఒకప్పుడు ఎలాంటి జనసంచారం లేని నిర్జీవ ఎడారి ప్రాంతమది. కాని ఈనాడు విశ్వప్రభువు అనుగ్రహంతో నిత్యనూతనంగా కళకళలాడుతూ యావత్ ప్రపంచ ముస్లిం సమాజానికి ప్రధాన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఆ పుణ్యక్షేత్రమైన మక్కాలో జరిగే హజ్ ఆరాధనకు, ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజం జరుపుకునే ఈదుల్ అజ్ హా పండుగకు అవినాభావ సంబంధం ఉంది.

ఈదుల్ అజ్ హా ఒక మహత్తర పర్వదినం. వ్యావహారికంలో దీన్ని బక్రీద్ పండుగ అంటారు. బక్రీద్ పేరు వినగానే మొదట మనకు హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం, ఇస్మాయీల్ అలైహిస్సలాంల పేర్లు గుర్తుకొస్తాయి. ఆ మహనీయుల విశ్వాస పటిమ, త్యాగ నిరతి కళ్ళముందు కదలాడతాయి. అలనాటి ఆ మధుర ఘట్టాలు ఒక్కొక్కటిగా మనో యవనికపై ఆవిష్కృతమవుతాయి. వారి ఒక్కో అడుగు జాడ విశ్వాసాన్ని ద్విగుణీకృతం చేస్తుంది. ఈ విధంగా ఆ త్యాగ ధనుల ఒక్కో ఆచరణనూ స్మరించుకుంటూ జరుపుకునే పర్వదినమే ఈదుల్ అజ్ హా... అదే బక్రీద్. ఆరోజే అరేబియా దేశంలోని మక్కా నగరంలో 'హజ్' ఆరాధన జరుగుతుంది. లక్షలాది మంది యాత్రికులతో ఆ పవిత్ర నగరం కళకళలాడుతూ ఉంటుంది. 'లబ్బైక్' నినాదాలు సర్వత్రా మిన్నంటుతూ ఉంటాయి. అల్లాహ్ ఆదేశాలను, ప్రవక్త వారి ప్రవచనాలను పాటించడంలో భక్తులు నిమగ్నమై ఉంటారు. నేల ఈనినట్లు కనిపించే ఆ జనవాహినిలో 'తవాఫ్ 'చేసేవారు కొందరైతే, 'సఫా మర్వా' కొండల మధ్య 'సయీ' చేసేవారు మరికొందరు. అదొక అపురూపమైన సుందర దృశ్యం. రమణీయమైన అద్భుత సన్నివేశం. అల్లాహ్ స్తోత్రంతో పరవశించి తన్మయత్వం చెందే ఆధ్యాత్మిక కేంద్ర బింబం.

జిల్ హజ్ పదవ తేదీన జరుపుకొనే బక్రీద్ ఒక అపూర్వమైన పండుగ. హజ్రత్ ఇబ్రాహీమ్, హజ్రత్ ఇస్మాయిల్ అలైహిస్సలాంల త్యాగాలను స్మరించుకునే త్యాగోత్సవం. ప్రపంచ విశ్వాసుల పర్వదినం. ఇదేదో షరా మామూలుగా జరిగే ఆచారం కాదు. ఇదొక మహత్తర సందేశం కలిగిన శుభదినం. క్రియా రూపంలో దైవ ధర్మాన్ని ప్రపంచానికి పరిచయం చేసే అద్భుత ప్రక్రియ. మనిషి తనను తాను తగ్గించుకొని, వినమ్ర పూర్వకంగా అల్లాహ్ ఔన్నత్యాన్ని, ఆయన ఘనతను కీర్తించే గొప్పరోజు. మౌలిక విశ్వాసం పరంగా ఒక్కటిగానే ఉన్న మనం పాక్షిక పొరపొచ్చాలనూ విస్మరించి తోటి సోదరుల్ని గుండెలకు హత్తుకోవాల్సిన రోజు. ఈ పర్వదినం మనకిచ్చే మరో సందేశం ఏమిటంటే, సమాజాన్ని కలుపుకుపోకుండా, నలుగురితో మమేకం కాకుండా, సాటి ప్రజల పట్ల ప్రేమ, త్యాగం, సహనం, పరోపకారం లాంటి సుగుణాలను అలవరచుకోకుండా ఏ సంతోషమయినా, ఎంతటి ఆనందమైనా పరిపూర్ణం కాజాలదు. ఏ సంతోష కార్యమైనా నలుగురితో పంచుకోవాలని, కేవలం మన గురించి మాత్రమే కాకుండా సంఘం గురించి, సమాజం గురించి ఆలోచించాలని చెబుతుందీ పండుగ. ప్రతి ఒక్కరూ తమ స్థాయి, స్తోమతకు తగినట్లు ఈద్ జరుపుకుంటారు. ఆర్థిక స్థోమత ఉన్నవారు జిల్ హజ్జ్ నెలలో 'హజ్ 'యాత్రకు వెళతారు. అంతటి స్థోమత లేనివారు ఇళ్ళవద్దనే ఖుర్బానీలు ఇస్తారు. ఆ స్థోమత కూడా లేకపోతే రెండు రకాతుల నమాజ్ ఆచరించినా దయామయుడైన దైవం హజ్, ఖుర్బానీలు ఆచరించిన వారితో సమానంగా పుణ్యఫలం ప్రసాదిస్తాడు. ఆయన తన దాసుల చిత్తశుద్ధిని, సంకల్పాన్ని మాత్రమే చూస్తాడు. ఆయనకు ధనరాశులు, రక్త మాంసాల అవసరం ఎంతమాత్రం లేదు. కనుక సర్వకాల సర్వావస్థల్లో చిత్తశుద్ధితో కూడిన సత్కర్మలు ఆచరించాలి. పేదసాదల అవసరాలను దృష్టిలో పెట్టుకోవాలి. పండుగల్లాంటి ప్రత్యేక సందర్భాల్లో వారిని ప్రత్యేకంగా గుర్తుంచుకోవాలి. ఆనందంలో వారినీ భాగస్వాములను చేయాలి. అప్పుడే నిజమైన పండుగ. తన అవసరాలను త్యజించి దైవ ప్రసన్నత కోసం ఇతరుల అవసరాలకు ప్రాధాన్యం ఇవ్వమని చెప్పేదే ఈ త్యాగాల పండుగ. మంచికోసం మానవ సంక్షేమం కోసం, ధర్మంకోసం, ధర్మసంస్థాపన కోసం ఎంతో కొంత త్యాగం చెయ్యాలన్న సందేశం ఇందులో ఉంది. ఈరోజున ముస్లిం సమాజం జరుపుకుంటున్న త్యాగోత్సవానికి ఇదే అసలు ప్రేరణ. అందుకని, పండుగ సందర్భంగా చేసే ప్రతి ఆచరణలో త్యాగ ధనులైన హజ్రత్ ఇబ్రాహీం, ఇస్మాయీల్ గార్ల స్ఫూర్తి తొణికిసలాడాలి. దైవప్రసన్నత కోసం, ఇహపర సాఫల్యం కోసం వారు ఎలాంటి పరీక్షలు ఎదుర్కొన్నారో, ఎంతటి సహన స్థయిర్యాలు కనబరిచారో మనం కూడా అలాంటి ప్రయత్నం చెయ్యాలి. సదాచారం, త్యాగం, పరోపకారం లాంటి సుగుణాలను అలవరచుకోవాలి. మనోవాంఛల త్యాగం అన్నిటికన్నా ముఖ్యమైనది. ఈ సందర్భంగా మనం ఖుర్బానీలు ఇస్తాం, నమాజులు చేస్తాం. ఇతరత్రా ఇంకా ఏవో పుణ్యకార్యాలు ఆచరిస్తాం. కాని మనోవాంఛల త్యాగం అన్నిటికన్నా ముఖ్యమన్న విషయాన్ని విస్మరించకూడదు. ఇది నిస్సందేహంగా కష్టంతో కూడుకున్నకార్యమే. కాని, హజ్రత్ ఇబ్రాహీం, ఇస్మాయీల్ గార్ల త్యాగాలను స్మరించుకుంటే ఏమాత్రం కష్టం కాదు. మనం కూడా పరీక్షలు, కష్టాలు, త్యాగాల కఠినమయిన దశలను దాటవలసి ఉంది. ఈ మార్గంలో చేసే ఏ కృషి అయినా, ఏ త్యాగమయినా వృథా పోదు. చరిత్రే దీనికి ప్రత్యక్ష సాక్ష్యం. దైవం మనందరిలో త్యాగభావం, పరోపకార గుణాలను పెంపొందించాలని ప్రార్థిద్దాం.





– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

త్యాగానికి ప్రతీక

ఈ పండుగకు, హజ్, ఖుర్బానీలకు మూలకారణం హజ్రత్ ఇబ్రాహీం అలైహిస్సలాం. ఈయన గొప్పదైవ ప్రవక్త. దేవునికి ప్రియ మిత్రుడు. తన పూర్తిజీవితం ద్వారా దైవప్రసన్నతకు మించిన కార్యం మరొకటి లేదని నిరూపించిన త్యాగధనుడు. కలలో కనిపించింది కూడా కరుణామయుని ఆజ్ఞగానే భావించి ఆచరించేవారు. ఒకరోజు ఇబ్రాహీం ప్రవక్త తన ముద్దుల కొడుకు ఇస్మాయీల్ గొంతుకోస్తున్నట్లు కలగన్నారు. దీన్ని ఆయన దైవాజ్ఞగా భావించి, తనయునితో సంప్రదించారు. తండ్రికి దగ్గ ఆ తనయుడు వెనకా ముందు ఆలోచించకుండా త్యాగానికి సిద్ధమయ్యారు. ఆ క్రమంలో వారు ఎదుర్కొన్న పరీక్షలు, అందులో వారు సఫలమైన తీరు, వారి ఒక్కో ఆచరణ ప్రళయకాలం వరకు సజీవంగా ఉండేలా ఏర్పాటు చేశాడు దైవం. అందుకే విశ్వవ్యాప్త విశ్వాసులు ఆ మహనీయుల ఒక్కో ఆచరణనూ స్మరించుకుంటూ, దేవుని ఘనతను, గొప్పతనాన్ని కీర్తిస్తూ, సముచిత రీతిలో ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి పండుగ రోజు ఈద్‌గాహ్‌కు చేరుకుని వేనోళ్ళా దైవాన్ని స్తుతిస్తారు.

ఇలా రిపోర్ట్ చేయండి...!

సైబర్ టాక్

డబ్బు పోగొట్టుకోవడం, బెదిరింపులు ఎదుర్కోవడం, వీడియో–ఆడియో సంభాషణల ద్వారా ఇబ్బందులకు లోను అవడం.. ఇవన్నీ ఇటీవల ఆన్‌లైన్, సోషల్ మీడియా వేదికగా అధికంగా జరుగుతున్న నేరాలు. ఈ–మోసాలకు గురైతే ఏం చేయాలి? ఇంటర్నెట్‌లో భద్రంగా ఎలా ఉండాలి..? వివరంగా తెలుసుకుని ఆచరిస్తే సమస్యల నుంచి సులువుగా బయటపడవచ్చు.

మన దేశంలో సైబర్ నేరాలను అధికారులకు రిపోర్ట్ చేయాలంటే కొన్ని ముఖ్యమైన దశలు ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనవి..



ప్రతీకాత్మక చిత్రం

- సైబర్ క్రైమ్‌కు సంబంధించి వీలైనంత ఎక్కువ సాక్ష్యాలను సేకరించాలి. ఇందులో స్క్రీన్ షాట్‌లు, ఇ–మెయిల్స్, చాట్‌లాగ్‌లు, బ్యాంక్ లావాదేవీల రికార్డులు, వీడియో అండ్ ఆడియో సంభాషణలు లేదా మీ ఫిర్యాదుకు మద్దతునిచ్చే ఏవైనా ఇతర సంబంధిత సమాచారం అంతా మీ దగ్గర ఉండాలి.

1. సంఘటన ఆధారంగా..

ఇంటర్నెట్, సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ మొదలైనవాటిలో మీరు అవతలి వ్యక్తులతో కమ్యూనికేట్ చేసిన విధానం. తేదీ, సమయం, ఏ ప్లాట్ ఫారమ్ (ఇంటర్నెట్, సోషల్ మీడియా... మొదలైనవి) అనే అంశాల్ని చూసుకోవాలి. అలాగే సాక్ష్యాలను అప్‌లోడ్ చేయాలి (నగదు చెల్లింపులు /బ్యాంక్ స్క్రీన్‌షాట్‌లు ఆర్థిక మోసాలకు సంబంధించిన స్టేట్ మెంట్‌లు. వేధింపులకు లేదా ఇతర వాటికి సంబంధించిన స్క్రీన్ షాట్‌లు, ఫొటో, ఆడియో, వీడియో మొదలైనవి ఏమైనా ఉంటే జత చేయాలి).

2. అనుమానితుడి వివరాలు ఏవైనా ఉంటే..

అనుమానితుడి పేరు, గుర్తింపు (మొబైల్, ఇ–మెయిల్, సోషల్ మీడియా యుఆర్‌ఎల్ మొదలైనవి), ప్లేస్ (ఆఫీస్... మొదలైనవి).

3. కంప్లైంట్స్ వివరాలు

బాధితుడి పూర్తి పేరుతో పాటు తండ్రి/జీవిత భాగస్వామి/ సంరక్షకుడు మొదలైనవి నోట్ చేయాలి. ఇ–మెయిల్ ఐడీ /ఫోన్ నెంబర్, చిరునామా, ఐడీ గుర్తింపు (ఆధార్.. మొదలైనవి)తో మీ దగ్గరలోని స్థానిక పోలీస్‌స్టేషన్ లేదా సంబంధిత పోలీస్ కమిషనరేట్‌లోని సైబర్ క్రైమ్ విభాగాన్ని సంప్రదించాలి. నేరం గురించి, సంఘటన జరిగిన తేదీ, సమయం, మీరు సేకరించిన సాక్ష్యాలతో సహా అన్ని వివరాలతో కూడిన రాతపూర్వక ఫిర్యాదుతో వారికి అందించాలి. మీ ఫిర్యాదుకు ఏవైనా సంబంధిత పత్రాలు లేదా సాక్ష్యాధారాల కాపీలను జత చేయాలి. మీ పట్ల జరిగిన నేరం వరుస పద్ధతిలో సాక్ష్యాలను జాబితా చేయడం మంచిది. మీ కంప్లైంట్ /ఎఫ్ఐఆర్/ పిటిషన్ ఫాలోఅప్ గురించి విచారించాలి. మీ కేసుకు కేటాయించిన దర్యాప్తు అధికారిని క్రమం తప్పకుండా వివరాలను కనుక్కుంటూ ఉండాలి. అధికారి పేరు, సంప్రదింపు వివరాలు, మీకు అందించిన ఏవైనా రిఫరెన్స్ నంబర్ల రికార్డును మెయిన్‌టెయిన్ చేయాలి. ఇ–మెయిల్, సందేశాలు లేదా ఏదైనా ఇతర డిజిటల్ కంటెంట్‌తో సహా సైబర్ నేరానికి సంబంధించిన అన్ని సంబంధిత సాక్ష్యాలను భద్రపరిచారని నిర్ధారించుకోవాలి. విచారణ ప్రయోజనాల కోసం సాక్ష్యాలను తారుమారు చేయద్దు.

సైబర్‌క్రైమ్ రిపోర్టింగ్ సంబంధిత పోర్టల్స్:

దేశంలో వివిధ రకాల సైబర్ నేరాలను నివేదించడానికి ఉన్న పోర్టల్స్..

- పరువు నష్టం, సైబర్ బెదిరింపు, సైబర్ స్టాకింగ్, అశ్లీల కంటెంట్, అశ్లీలత, లైంగిక వేధింపులు, ఫిషింగ్ మోసాలు.. వంటి సైబర్ మోసాలను నివేదించడానికి మీరు https://www.cybercrime.gov.in/ పోర్టల్‌ని ఉపయోగించవచ్చు.
- పెట్టుబడి మోసాలు, క్రిప్టో కరెన్సీ స్కామ్‌లు, ఇ–కామర్స్ మోసాలు, వర్క్ ఫ్రమ్ హోమ్‌స్కామ్‌లు, ఫిషింగ్ మోసాలతో సహా ఆర్థిక సైబర్ మోసాలకు గురైనట్లైతే.. 1930కి కాల్ చేయవచ్చు. సిటిజన్ ఫైనాన్షియల్ రిపోర్టింగ్ స్కామర్ల నిధులను స్తంభింపజేయడానికి ఈ వ్యవస్థ సహాయం చేస్తుంది.
- సైబర్ సెక్యూరిటీ, సైబర్ టెర్రరిజానికి సంబంధించిన సంఘటలను రిపోర్ట్ చేయడానికి ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (CERT-In) వెబ్‌సైట్ ద్వారా https://cert-in.org.in లో రిపోర్ట్ చేయవచ్చు.
- పోగొట్టుకున్న ఫోన్ల గురించి https://ceir.sancharsaathi.gov.in/Home/index.jsp లో రిపోర్ట్ చేయచ్చు. మీ ఫోన్‌లను బ్లాక్ చేయడానికి, ట్రాక్ చేయడానికి ఈ పోర్టల్ మీకు అనుమతిస్తుంది. సరైన సూచనల కోసం పోలీస్‌స్టేషన్‌ను కూడా సంప్రదించవచ్చు.
- ఎవరైనా మీ అనుమతి లేకుండా మొబైల్ ఫోన్ సేవల కోసం మీ ఆధారాలను ఉపయోగిస్తున్నారని అనుమానం వస్తే.. దానిని https://tafcop.sancharsaathi.gov.in/telecomUser/ లో రిపోర్ట్ చేయవచ్చు.
- వన్ నేషన్ వన్ అంబుడ్స్‌మన్ స్కీమ్ అనేది మీరు యుపీఐని ఉపయోగించి అనుకోకుండా ఇతరులకు డబ్బును బదిలీ చేస్తే, ఫిర్యాదు చేయడానికి అనుమతించే పథకం. సంబంధిత యుపీఐ సర్వీస్‌ప్రొవైడ్ (పేటీఎమ్, గూగుల్ పే, ఫోన్ పే మొదలైనవాటిపై ఫిర్యాదు), టోల్ ఫ్రీ నంబర్ 14448కి కాల్ చేయాలి. https://cms.rbi.org.in పోర్టల్‌లో రిపోర్ట్ చేయాలి. ప్రత్యామ్నాయంగా CRPC@rbi.org.in కు మెయిల్ చేయవచ్చు.
- యుపీఐ లావాదేవీకి సంబంధించి https://www.npci.org.in/what-we-do/upi/dispute-redressal-mechanism లో రిపోర్ట్ చేయచ్చు.

సైబర్ సెక్యూరిటీ చిట్కాలు:

- పెద్ద అక్షరాలు, చిన్న అక్షరాలు, ప్రత్యేక అక్షరాలు, సంఖ్యా కలయికతో బలమైన పాస్‌వర్డ్‌లను సృష్టించాలి.
- మీ ఆన్‌లైన్, సోషల్ మీడియా, ఇ–మెయిల్ ఖాతాల కోసం .. టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ (2ఎఫ్ఎ)ని ప్రారంభించాలి.
- ఎసెమ్మెస్ ద్వారా మీ మొబైల్ పరికరానికి పంపిన ప్రత్యేక కోడ్‌ని లేదా ప్రత్యేక ప్రమాణీకరణ అప్లికేషన్‌ను ఉపయోగించవచ్చు.
- సురక్షిత డేటా ట్రాన్స్‌మిషన్ కోసం WPA2 లేదా WPA3 ఎన్‌క్రిప్షన్‌తో మీ వైఫై రూటర్‌ని సెట్ చేయాలి. చట్టబద్ధమైనదని మీకు కచ్చితంగా తెలిస్తే తప్ప పబ్లిక్ వై ఫైని ఎప్పటికీ ఉపయోగించవద్దు.
- మీ సోషల్ మీడియా ఖాతాల్లోని సీక్రెట్ సెట్టింగ్‌లను చెక్ చేస్తూ ఉండాలి. మీ వ్యక్తిగత వివరాలను నమ్మకమైన వారితో మాత్రమే పంచుకోవాలి.
- సాఫ్ట్‌వేర్ యాప్‌లు, ఫైల్స్‌ను రిప్యుటేషన్ ఉన్నవాటి నుండి మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్లే స్టోర్ లేదా యాప్ స్టోర్ నుండి మాత్రమే అప్లికేషన్‌లను ఇన్‌స్టాల్ చేయాలి.
- మీ ముఖ్యమైన డేటా, ఫైల్స్ డేటా, క్లౌడ్ స్టోరేజీ మొత్తాన్ని క్రమం తప్పకుండా బ్యాకప్ చేసుకోవడం మంచిది.
- డిజిటల్ భద్రత పద్ధతుల గురించి ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిది.

లోతైన పరిష్కారానికి..

సోషల్ మీడియా మోసాలకు సంబంధించి సరైన, సంతృప్తికరమైన పరిష్కారం దొరకలేదు అనుకుంటే https://gac.gov.in/లో రిపోర్ట్ చేయవచ్చు. ఈ GAC కమిటీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్ బాధితుల కంప్లైంట్స్‌ను అప్పీళ్లతో పరిష్కరిస్తుంది.



ఇన్‌పుట్స్:
అనీల్ రాచమల్ల
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

పొరుగింటి పుల్లకూర రుచి అంటారు. ముంబైకి చెందిన హేమ తన బిడ్డలు దియా, ఓజస్వీ శర్మలతో కలిసి 'చిల్జో' ఫుడ్‌బ్రాండ్ ద్వారా మన పొరుగుదేశాలతో పాటు ఇటలీ, ఆఫ్రికా, అమెరికా, చైనా... మొదలైన దేశాల వంటకాలను రుచి చూపిస్తూ 'వావ్' అనిపిస్తోంది...

● కొత్త దారి

విదేశీ భోజనంబు.. వింతైన వంటకంబు...



చైనా వంటకాలు చైనాకు వెళ్లే తిననక్కర్లేదు. ఇటలీ వంటకాలకు అక్కడికే వెళ్లనక్కర్లేదు. ముంబైలోని 'చిల్జో'లోకి అడుగుపెడితే చాలు ఎన్నో దేశాలకు సంబంధించిన నోరూరించే వంటకాలు స్వాగతం పలుకుతాయి.

గత సంవత్సరం హేమ తన కూతుళ్లు దియా, ఓజస్వీలతో కలిసి ఈ ఫుడ్‌రెస్టారెంట్‌ను ప్రారంభించింది. ప్రారంభించిన కొద్దిరోజుల్లోనే సూపర్ హిట్ టాక్ సొంతం చేసుకుంది. ముంబైవాసులు మాత్రమే కాదు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడకు రావడం మొదలైంది.

'ఇతర దేశాల ఆహార సంస్కృతిని అందిపుచ్చుకొని ఆస్వాదించడం మనకేమీ కొత్త కాదు. అయితే అక్కడి రుచిని ఇక్కడికి తీసుకు వచ్చినప్పుడే విజయవంతం అవుతాం' అంటుంది దియా.

చదువు పూర్తయిన తరువాత అమెరికాలోని ఒక మార్కెటింగ్ కంపెనీలో పనిచేసింది దియా. ఉద్యోగ కాలంలో ఎన్నో ప్రాంతాలు తిరిగింది. ఆ సమయంలో రకరకాల రుచులతో పరిచయం అయింది. వంటల రుచికి మాత్రమే పరిమితమై పోకుండా ఎందరో చెఫ్‌లు, ఫుడ్ ఇండస్ట్రీలోని ప్రొఫెషనల్స్‌తో మాట్లాడింది.

కోవిడ్ కల్లోల కాలంలో స్వదేశానికి తిరిగివచ్చిన దియా ఇంటి నుంచి పనిచేయడం ప్రారంభించింది. లాక్‌డౌన్ సమయంలో బయటికి వెళ్లి తినే పరిస్థితి లేదు. దాల్, రోటీ తినడం తప్ప మరోదారి లేదు. మరోవైపు రకరకాల వంటకాల రుచులు గుర్తుకొచ్చి నోరూరించేవి. ఆ సమయంలో వివిధ దేశాలకు చెందిన వంటకాల గురించి తెలుసుకునే పనిలో పడింది దియా.

'ఎన్నో సంవత్సరాలు హాస్టల్ ఫుడ్ తిన్న నాకు కొత్త రుచి కావాలనిపించేది. నేను పాస్తాకు వీరాభిమానిని. దీంతో ఇంట్లో వంటల ప్రయోగాలు మొదలు పెట్టాం. చాలాసార్లు విఫలం అయిన తరువాతగానీ సక్సెస్ కాలేకపోయేవాళ్లం. మేము ప్రొఫెషనల్స్ కాకపోయినా యూట్యూబ్ వీడియోలు చూసుకుంటూ నేర్చుకున్నాం. ఇప్పుడు 'చాలా బావుంది... అని మాకు అనిపించే వరకు వెనక్కి తగ్గలేదు' అంటోంది బీటెక్ చదివిన ఓజస్వీ.



● హేమ, దియా, ఓజస్వి

అయినా సరే...

'ఏమవుతుందో ఏమో!' అనే సంశయం ఎక్కువైతే ఉన్నచోటే ఉండిపోతాం. కంఫర్ట్ జోన్‌కు అలవాటు పడిపోతాం. దీంతో విజయానికి దూరం అవుతాం. 'పెద్ద రిస్క్ ఏమిటంటే ఎలాంటి రిస్క్ తీసుకోకపోవడమే' అనే ప్రసిద్ధ మాటను దృష్టిలో పెట్టుకొని రంగంలోకి దిగాను. ఫుడ్ ఇండస్ట్రీలో ఎలాంటి అనుభవం లేకపోయినా మా మీద మేము నమ్మకం కోల్పోలేదు. ఆశావాదంతో ముందుకు వెళ్లాం. అద్భుత ఫలితాన్ని సాధించాం.

- హేమ, ఫౌండర్, చిల్జో

ప్రయోగాల్లో భాగంగా తాము తయారుచేసిన రెండు వందల సాస్‌లను బంధువులు, స్నేహితులకు పంపిణీ చేశారు. వారి నుంచి మంచి స్పందన లభించింది. ఆ సమయంలోనే ఈ తల్లీకూతుళ్ల మదిలో 'చిల్జో' ఐడియా వచ్చింది.

ఒక సంవత్సరం రీసెర్చ్, డెవలప్‌మెంట్ తరువాత ప్రాజెక్ట్ పట్టాలకెక్కింది. తమ పొదుపు మొత్తాల నుంచి 40 లక్షల రూపాయలు తీశారు. 30 మందికి ఉపాధి కల్పించారు.

'ఇంట్లో వంటలతో ఎన్ని ప్రయోగాలైనా చేయవచ్చు. డబ్బులతో చేయవద్దు. ఫుడ్ ఇండస్ట్రీలో మీకు ఎలాంటి అనుభవం లేదు. రిస్క్ తీసుకుంటున్నారు' అన్నవారే ఎక్కువ మంది ఉన్నారు.

'యూనిట్ మొదలైన తరువాత నేను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేశాను. ఎన్నో సంవత్సరాలు చేసిన ఉద్యోగానికి దూరం కావడం బాధగా అనిపించినా, సొంత వ్యాపారం మొదలుపెట్టాం అనేది ఉత్సాహాన్ని ఇచ్చింది. ఉత్సాహం అయితే ఉంది కానీ ఫుడ్ ఇండస్ట్రీకి సంబంధించి ఎలాంటి నేపథ్యం లేని మాకు మార్జిన్స్, రిటైల్, ఎలాంటి డిస్ట్రిబ్యూటర్‌లను సంప్రదించాలి అనే విషయాలు తెలియదు. జీటీ–జనరల్ ట్రేడ్, ఎంటీ–మార్కెట్ ట్రేడ్‌లాంటి పదాలు తెలియవు. సక్సెస్ అవుతామా, లేదా అనేది తెలియదు. అయినా ఉత్సాహంతో ముందుకు వెళ్లాం. మంచి ఫలితాన్ని సాధించాం' అంటుంది దియా.



అల్పైన్ వారియర్స్‌కు ఐదో విజయం

గ్లోబల్ చెస్ లీగ్‌లో ప్రపంచ నంబర్‌వన్ కార్ల్‌సన్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఎస్‌జీ అల్పైన్ వారియర్స్ జట్టు ఐదో విజయం సాధించింది. భారత దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ సభ్యుడిగా ఉన్న గ్యాంజస్ గ్రాండ్‌మాస్టర్స్ జట్టుతో దుబాయ్‌లో బుధవారం జరిగిన ఏడో రౌండ్‌లో అల్పైన్ వారియర్స్ 10–8తో గెలిచింది. ఆనంద్‌తో జరిగిన గేమ్‌లో కార్ల్‌సన్ 72 ఎత్తుల్లో నెగ్గాడు. వారియర్స్‌కే చెందిన ప్రజ్ఞానంద 42 ఎత్తుల్లో ఇసిపెంకోను ఓడించగా... అర్జున్, ఎలిజబెత్ పాట్జ్ తమ గేమ్‌లను 'డ్రా' చేసుకున్నారు. గుకేశ్, ఇరీనా ఓడారు.



కేటీ లెడెకీ ఆరోసారి...

అమెరికా మహిళా స్టార్ స్విమ్మర్ కేటీ లెడెకీ వరుసగా ఆరోసారి ప్రపంచ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగనుంది. గతంలో మైకేల్ ఫెల్ప్స్, రియాన్ లోచ్టె, నటాలీ కులిన్, ఎలిజబెత్ జీసెల్, నాథన్ అడ్రియన్ మాత్రమే ఈ ఘనత సాధించారు. అమెరికా జాతీయ పోటీల్లో లెడెకీ 800 మీటర్ల ఫ్రీస్టయిల్ ఈవెంట్‌లో విజేతగా నిలిచింది. లెడెకీ ఇప్పటివరకు ఒలింపిక్స్‌లో 7 స్వర్ణాలు, ప్రపంచ చాంపియన్‌షిప్‌లో 19 స్వర్ణాలు గెలిచింది.

లార్డ్స్‌లో నిరసన గళం

నిరసనకారుణ్ని ఎత్తుకొని బౌండరీ వద్ద దించిన బెయిర్‌స్టో



విఖ్యాత లార్డ్స్ మైదానంలో బుధవారం అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఆందోళనకారులు రెండో టెస్టు మొదలవగానే హల్‌చల్ చేశారు. ఊహించని విధంగా కొందరు ఆందోళనకారులు మైదానం లోపలికి దూసుకొచ్చారు. అరెంజ్ (కాషాయ రంగు) పొడిని పిచ్‌పై చల్లేందుకు ప్రయత్నించారు. పర్యావరణ కార్యకర్తలు 'జస్ట్ స్టాప్ ఆయిల్' (చమురు ఉత్పాదక లైసెన్సులపై నిరసన)లో భాగంగా లార్డ్స్‌లో తమ నిరసన గళంతో ప్రపంచం కంటపడ్డారు. మ్యాచ్ మొదలై తొలి ఓవర్ ముగిసిందో లేదో ముగ్గురు పర్యావరణ కార్యకర్తలు గ్రౌండ్‌లోకి పరుగెత్తుకుంటూ వచ్చారు. చేతిలోని కవర్లోంచి అరెంజ్ పొడిని మైదానంలో చల్లారు. ఒక నిరసనకారుడిని కీపర్ బెయిర్‌స్టో అమాంతం తన రెండు చేతులతో మేకపిల్లను ఎత్తుకున్నంత సులభంగా పైకెత్తుకొన్నాడు. 50 మీటర్ల దూరంలో ఉన్న బౌండరీ లైను దాకా నడుచుకుంటూ వెళ్లి పద్ధతిగా అతన్ని దిగబెట్టాడు. అక్కడే కాచుకున్న సెక్యూరిటీ సిబ్బంది అతన్ని అదుపులోకి తీసుకుంది. ఈ ఉదంతంపై లండన్ పోలీసులు ముగ్గురిని అరెస్టు చేశారు.

ఏమిటీ 'జస్ట్ స్టాప్ ఆయిల్'?

పర్యావరణానికి హాని కలిగించే చమురు ఉత్పాదన కోసం కొత్త లైసెన్సులను నిలిపివేయాలని కొందరు నిరసనకారులు 'జస్ట్ స్టాప్ ఆయిల్' పేరిట ఆందోళనకు శ్రీకారం చుట్టారు. ఈ ఏడాది బ్రిటన్‌లో పలు క్రీడల ఈవెంట్లను ఈ పర్యావరణ కార్యకర్తలు ఆటంకపరుస్తూ తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. ఇంగ్లండ్, ఐర్లాండ్ క్రికెట్ మ్యాచ్, ప్రీమియర్ లీగ్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లకు, ప్రీమియర్‌షిప్ రగ్బీ ఫైనల్‌కు, ప్రపంచ స్నూకర్ చాంపియన్‌షిప్‌లలోనూ తమ నిరసన గళం వినిపించారు.


ఆసీస్‌దే తొలిరోజు

- రాణించిన స్మిత్, హెడ్, వార్నర్
- తొలి ఇన్నింగ్స్‌లో 339/5
- యాషెస్ రెండో టెస్టు

లండన్: బ్యాటర్లు క్రీజులో పాతుకుపోవడంతో రెండో టెస్టు ఆస్ట్రేలియా ఆధిపత్యంతో మొదలైంది. యాషెస్ సిరీస్‌లో భాగంగా 'క్రికెట్ మక్కా' లార్డ్స్ మైదానంలో జరుగుతున్న ఈ టెస్టులో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 5 వికెట్లకు 339 పరుగులు చేసింది. స్టీవ్ స్మిత్ (85 బ్యాటింగ్; 10 ఫోర్లు) అజేయ అర్ధసెంచరీతో నిలువగా, ట్రావిస్ హెడ్ (77; 14 ఫోర్లు), వార్నర్ (66; 8 ఫోర్లు, 1 సిక్స్) వన్డేలా ఆడి వేగంగా ఫిఫ్టీలు చేశారు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ టంగ్, రూట్ చెరో 2 వికెట్లు తీశారు. టాస్ నెగ్గిన ఇంగ్లండ్ ఫీల్డింగ్‌కే మొగ్గు చూపింది. దీనికి తగ్గట్లే బౌలర్లు కూడా ఓపెనర్లను పెవిలియన్‌కు పంపేవారు! కానీ పేలవమైన ఫీల్డింగ్ విలువైన వికెట్ అందిపుచ్చుకోలేకపోయింది. 13వ ఓవర్ ఆఖరి బంతి వార్నర్ బ్యాట్ అంచును తాకుతూ నాలుగో స్లిప్‌లో ఉన్న పోప్ వైపు వెళ్లింది. కానీ సునాయాసమైన ఈ క్యాచ్‌ను అతను నేలపాలు చేశాడు. అప్పటికి వార్నర్ స్కోరు 20 పరుగులే. కాసేపటికి ఉస్మాన్ ఖ్వాజా (17; 2 ఫోర్లు)ను టంగ్ బౌల్డ్ చేయగా, లైఫ్‌తో వార్నర్ ఎంచక్కా అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. వన్డే ఫార్మాట్‌లా ఆడుతున్న అతన్ని కూడా టంగ్ బౌల్డ్ చేయగా, లబుషేన్–స్మిత్ జోడీ ఆతిథ్య బౌలర్లకు మింగుడుపడని భాగస్వామ్యాన్ని నమోదు చేసింది. ఇద్దరు మూడో వికెట్‌కు 102 పరుగులు జత చేశారు. అనంతరం లబుషేన్ ఆటకు రాబిన్సన్ ముగింపు పలికాడు. అయితే హెడ్ వచ్చాక స్మిత్ తన నిలకడైన బ్యాటింగ్‌ను కొనసాగించడంతో ఆతిథ్య బౌలర్లకు మళ్లీ కష్టాలు తప్పలేదు. ఇద్దరు ఆఖరి సెషన్‌లో అదరగొట్టారు. ఈ జోడీ ఇంగ్లండ్ పాలిట కొరకరానికొయ్యలా మారింది. నాలుగో వికెట్‌కు 118 పరుగులు జోడించాక రూట్ ఒకే ఓవర్లో హెడ్‌తో పాటు, గ్రీన్ (0)ను అవుట్ చేయడంతో ఇంగ్లండ్ శిబిరం ఊపిరి పీల్చుకుంది. స్మిత్‌తో పాటు క్యారీ (11 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు.



1 ఈ మ్యాచ్‌తో ఆస్ట్రేలియా స్పిన్నర్ నాథన్ లయన్ తన కెరీర్‌లో 100 టెస్టులు పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలో వరుసగా 100 టెస్టులు ఆడిన తొలి బౌలర్‌గా లయన్ ఘనత సాధించాడు. గతంలో అలిస్టర్ కుక్ (159 టెస్టులు), బోర్డర్ (153), మార్క్ వా (107), సునీల్ గావస్కర్ (106), మెకల్లమ్ (101) వరుసగా 100కుపైగా టెస్టులు ఆడినా వారందరూ బ్యాటర్లు కావడం గమనార్హం.



ధ్రువ్ షోరే సెంచరీ

బెంగళూరు: భారత క్రికెట్ దేశవాళీ సీజన్ 2023–2024 దులీప్ ట్రోఫీ మ్యాచ్‌లతో బుధవారం మొదలైంది. చిన్నస్వామి స్టేడియంలో నార్త్ ఈస్ట్ జోన్‌తో ప్రారంభమైన క్వార్టర్ ఫైనల్లో తొలి రోజు ఆట ముగిసే సమయానికి నార్త్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరు దిశగా సాగుతోంది. 90 ఓవర్లు ఆడిన నార్త్ జోన్ 6 వికెట్లు కోల్పోయి 306 పరుగులు చేసింది. ఓపెనర్ ధ్రువ్ షోరే (211 బంతుల్లో 136; 22 ఫోర్లు) సెంచరీ సాధించాడు. నిశాంత్ సింధు (113 బంతుల్లో 76 బ్యాటింగ్; 9 ఫోర్లు, 2 సిక్స్‌లు), పుల్కిత్ నారంగ్ (23 బ్యాటింగ్; 3 ఫోర్లు) క్రీజులో ఉన్నారు.

సెంట్రల్ జోన్ 182 ఆలౌట్

ఆలూర్‌లో ఈస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్లో సెంట్రల్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 71.4 ఓవర్లలో 182 పరుగులకు ఆలౌటైంది. ఐపీఎల్ స్టార్ రింకూ సింగ్ (38; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఈస్ట్ జోన్ బౌలర్ మణిశంకర్ మురాసింగ్ 42 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఈస్ట్ జోన్ ఆట ముగిసే సమయానికి 2 వికెట్లు కోల్పోయి 32 పరుగులు సాధించింది.


హైదరాబాద్‌లో జాతీయ సీనియర్ స్విమ్మింగ్ పోటీలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్విమ్మింగ్ సంఘం ఆధ్వర్యంలో జూలై 2 నుంచి 5 వరకు హైదరాబాద్ వేదికగా జాతీయ సీనియర్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరగనున్నాయి. గచ్చిబౌలి స్టేడియం స్విమ్మింగ్ కాంప్లెక్స్‌లో జరిగే ఈ పోటీల్లో దేశం నలుమూలల నుంచి 500 మందికిపైగా స్విమ్మర్లు బరిలోకి దిగనున్నారు. తెలంగాణ తరఫున 22 మంది స్విమ్మర్లు పోటీపడనుండగా... పురుషుల బృందానికి సూర్యాన్ష్, మహిళల బృందానికి వ్రితి అగర్వాల్ నాయకత్వం వహిస్తారు. జాన్ సిద్దిఖీ, ఆయూశ్ యాదవ్ కోచ్‌లుగా వ్యవహరిస్తారు. ఒలింపియన్ స్విమ్మర్లు శ్రీహరి నటరాజ్, సజన్ ప్రకాశ్, మానా పటేల్ ప్రధాన ఆకర్షణగా నిలువనున్నారు.

భారత కబడ్డీ జట్టు హ్యాట్రిక్



బుసాన్ (దక్షిణ కొరియా): ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా మూడో విజయం నమోదు చేసింది. జపాన్ జట్టుతో బుధవారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 62–18 పాయింట్లతో తేడాతో ఘనవిజయం సాధించింది. కెప్టెన్ పవన్ సెహ్రావత్, అర్జున్ దేశ్వాల్, అస్లామ్ ఇనామ్‌దార్ రాణించడంతో భారత్ ఆరంభంలో 15–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. విరామ సమయానికి భారత్ 32–6తో ముందంజ వేసింది. రెండో అర్ధభాగంలోనూ భారత క్రీడాకారులు పూర్తి ఆధిపత్యం చలాయించారు. నేడు జరిగే నాలుగో లీగ్ మ్యాచ్‌లో ఇరాన్‌తో భారత్ ఆడుతుంది.



టాప్ సీడ్‌గా అల్‌కరాజ్

వింబుల్డన్ టోర్నీ సీడింగ్స్ విడుదల

లండన్: ప్రతిష్టాత్మక వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ కార్లోస్ అల్‌కరాజ్‌కు టాప్ సీడింగ్ లభించింది. దాంతో 2003 తర్వాత ఫెడరర్ (స్విట్జర్లాండ్), నాదల్ (స్పెయిన్), జొకోవిచ్ (సెర్బియా), ఆండీ ముర్రే (బ్రిటన్) కాకుండా మరో ప్లేయర్‌కు టాప్ సీడ్ దక్కడం ఇదే తొలిసారి కావడం విశేషం. 2003లో లీటన్ హెవిట్ (ఆస్ట్రేలియా)కు టాప్ సీడ్ లభించింది. మరుసటి ఏడాది నుంచి 2022 వరకు ఫెడరర్, నాదల్, జొకోవిచ్, ముర్రేలలో ఒకరు టాప్ సీడ్‌గా వింబుల్డన్ టోర్నీలో బరిలోకి దిగారు. డిఫెండింగ్ చాంపియన్ జొకోవిచ్‌కు ఈసారి రెండో సీడ్ దక్కింది. మహిళల సింగిల్స్‌లో ప్రపంచ నంబర్‌వన్, ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ స్వియాటెక్ (పోలాండ్)కు టాప్ సీడ్ కేటాయించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సబలెంకా (బెలారస్) రెండో సీడ్‌గా, డిఫెండింగ్ చాంపియన్ రిబాకినా (కజకిస్తాన్) మూడో సీడ్‌గా పోటీపడతారు. వింబుల్డన్ టోర్నీ జూలై 3 నుంచి లండన్‌లో జరుగుతుంది.



పోరాడి ఓడిన శ్రీజ

జాగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ టేబుల్ టెన్నిస్ (డబ్ల్యూటీటీ) కంటెండర్ జాగ్రెబ్ ఓపెన్ టోర్నీలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ అమ్మాయి ఆకుల శ్రీజ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందలేకపోయింది. జాతీయ మహిళల సింగిల్స్ చాంపియన్ అయిన శ్రీజ బుధవారం జరిగిన మహిళల సింగిల్స్ క్వాలిఫయింగ్ మూడో రౌండ్ మ్యాచ్‌లో 11–7, 9–11, 11–4, 4–11, 5–11తో లీ యున్‌హై (దక్షిణ కొరియా) చేతిలో ఓడిపోయింది. అంతకుముందు తొలి రౌండ్‌లో శ్రీజ 11–5, 7–11, 14–12, 11–8తో చెంగ్ పుస్‌యువాన్ (చైనీస్ తైపీ)పై, రెండో రౌండ్‌లో 11–6, 9–11, 11–9, 11–5తో రీత్ టెనిసన్ (భారత్)పై విజయం సాధించింది. భారత్‌కే చెందిన సుతీర్థ ముఖర్జీ మెయిన్ 'డ్రా'కు అర్హత పొందింది. క్వాలిఫయింగ్ చివరి రౌండ్ మ్యాచ్‌లో సుతీర్థ 1–11, 10–12, 12–10, 11–6, 11–9తో జు చెంగ్‌జు (హాంకాంగ్)పై గెలిచింది. పురుషుల సింగిల్స్ క్వాలిఫయింగ్ విభాగంలో భారత క్రీడాకారులు సత్యన్ జ్ఞానశేఖరన్, హర్మీత్ దేశాయ్, మనుష్ షా, మానవ్ ఠక్కర్, సానిల్ షెట్టి మెయిన్ 'డ్రా'కు చేరుకోలేకపోయారు.

సినిమా



● చిరంజీవి

పదహారేళ్ల తర్వాత...

పదహారేళ్ల తర్వాత చిరంజీవి, త్రిష కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారని తెలిసింది. చిరంజీవి హీరోగా, సిద్ధు జొన్నలగడ్డ కీలక పాత్రలో కల్యాణ్ కృష్ణ దర్శకత్వంలో ఓ సినిమా రూపొందనున్నట్లు వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయట. ఈ సినిమాలో చిరంజీవి సరసన త్రిష, సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా శ్రీలీల నటించనున్నారని తెలిసింది. అలాగే చిరంజీవి కుమార్తె సుష్మితా కొణిదెల ఈ సినిమాను నిర్మించనున్నారని, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించనున్నారని సమాచారం. ఈ విషయాలపై త్వరలోనే ఓ అధికారిక ప్రకటన వచ్చే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఇక 2006లో వచ్చిన 'స్టాలిన్' చిత్రం తర్వాత చిరంజీవి, త్రిష మరోసారి స్క్రీన్ షేర్ చేసుకోలేదు.



● త్రిష



● వెంకటేశ్

త్వరలో ఫైనల్ మిషన్

మిషన్‌ను పూర్తి చేయడానికి వెంకటేశ్ రెడీ అవుతున్నారు. వెంకటేశ్ హీరోగా 'హిట్' ఫేమ్ శైలేష్ కొలను దర్శకత్వంలో వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్న యాక్షన్ ఫిల్మ్ 'సైంధవ్'. ఈ చిత్రంలో శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెర్మియా హీరోయిన్లుగా నటిస్తున్నారు, బాలీవుడ్ నటుడు నవాజుద్దీన్ సిద్ధిఖీ విలన్‌గా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన తాజా కీలక షెడ్యూల్ చిత్రీకరణ హైదరాబాద్‌లో ముగిసింది. ప్రధానంగా వెంకటేశ్, రుహానీ శర్మ, శ్రద్ధా శ్రీనాథ్ పాల్గొనగా ఈ సన్నివేశాలను చిత్రీకరించారు. త్వరలోనే ఈ సినిమా ఫైనల్ మిషన్ (ఫైనల్ షెడ్యూల్ చిత్రీకరణ) ఆరంభం కానుందని చిత్ర యూనిట్ పేర్కొంది. వెంకటేశ్ కెరీర్‌లో 75వ చిత్రంగా రూపొందుతున్న ఈ చిత్రం డిసెంబరు 22న విడుదల కానుంది. ఈ చిత్రానికి సంగీతం: సంతోష్ నారాయణ్, సహ నిర్మాత: కిషోర్ తాళ్లూరు.

యాక్షన్ అర్జున్



● వరుణ్ తేజ్

సెక్యూరిటీ ఆఫీసర్‌గా వరుణ్ తేజ్ నటించిన యాక్షన్ చిత్రం 'గాండీవధారి అర్జున'. వరుణ్ తేజ్ హీరోగా ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపొందిన చిత్రం ఇది. సాక్షీ వైద్య హీరోయిన్‌గా నటించారు. బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 25న విడుదల కానుంది. తాజాగా ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని వరుణ్ తేజ్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ చిత్రంలో అర్జున్ పాత్రలో వరుణ్ తేజ్ కనిపించనున్నట్లు తెలుస్తోంది. ''ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సెక్యూరిటీ ఆఫీసర్‌గా ఫుల్ యాక్షన్ మోడ్‌లో కనిపిస్తారు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల నుంచి ప్రజలను అతను ఏ విధంగా కాపాడాడు? అందుకు అతని వ్యూహాలేంటి? అనేది ఈ సినిమాలో ఆసక్తికరం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్.

అందుకే ఈ సినిమా నిర్మించా!

- సుధాకర్ కోమాకుల



''నారాయణ అండ్ కో' కథని డైరెక్టర్ చిన్నా చెప్పినప్పుడు గమ్మత్తుగా అనిపించింది. ఫ్యామిలీ అండ్ క్రైమ్ కామెడీగా రూపొందిన ఈ చిత్రం కుటుంబమంతా కలిసి హాయిగా నవ్వుకునేలా ఉంటుంది'' అని సుధాకర్ కోమాకుల అన్నారు. చిన్నా పాపిశెట్టి దర్శకత్వం వహించిన చిత్రం 'నారాయణ అండ్ కో'. పాపిశెట్టి బ్రదర్స్‌తో కలిసి సుధాకర్ కోమాకుల నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలకానుంది. ఈ సందర్భంగా సుధాకర్ కోమాకుల మాట్లాడుతూ– ''నాకు నిర్మాణంపై ఎప్పటి నుంచో ఆసక్తి ఉంది. మొదటి నుంచి వీడియోస్, కవర్ సాంగ్స్ చేస్తూనే ఉన్నాను. సినిమా నిర్మాణంలోకి రావాలనుకున్నప్పుడు 'నారాయణ అండ్ కో' సరైన సినిమా అనిపించింది. నాకు వినోదం అంటే చాలా ఇష్టం. ఈ మూవీలో పూర్తి స్థాయి వినోదం పంచే పాత్ర చేసే అవకాశం దక్కింది. ఇక పదేళ్లకు పైగా ఉన్న నా సినీ ప్రయాణంలో రావాల్సినంత ఫేమ్ రాలేదు. 'లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్' సినిమా తర్వాత మరో సోలో చిత్రం పడుంటే నా కెరీర్ తర్వాతి స్థాయికి వెళ్లేది. డైరెక్టర్ అనిల్ రావిపూడి నాకు మంచి స్నేహితుడు. తన సినిమాలో ఓసారి మంచి పాత్ర చేసే అవకాశం వచ్చింది.. కానీ చేయలేకపోయాను. నాకు సరైన పాత్ర ఇవ్వాలని అనిల్‌కి కూడా ఉంది. 'క్రాక్' సినిమా తర్వాత క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా అవకాశాలు వచ్చాయి. కానీ, నేనే ఆసక్తి చూపలేదు.. లీడ్ రోల్స్‌పైనే దృష్టి పెట్టాను. ప్రస్తుతం 'జీడీ' (గుండెల్లో దమ్ము) సినిమాతో పాటు 1980 నేపథ్యంలో ఒక ప్రేమ కథా చిత్రం చేస్తున్నాను'' అన్నారు.



దర్శకత్వం కంటే నటన చాలా ఈజీ

- దశరథ్

''లవ్ యు రామ్' చిత్రంలో తొలిసారి తప్పని పరిస్థితిలో నేను నటించాల్సి వచ్చింది. నటించే ముందు మొదట ట్రయిల్ షూట్ చేశాం.. అందరికీ నచ్చింది. ఇప్పటివరకూ ప్రీమియర్స్ చూసిన అందరూ బాగా చేశానని అభినందించారు. ఇకపై నటన కొనసాగించాలనుకోవడం లేదు. నటుడిగా సక్సెస్ అయితే మాత్రం దర్శకత్వం కంటే నటనే చాలా ఈజీ (నవ్వుతూ)'' అని కె. దశరథ్ అన్నారు. రోహిత్ బెహల్, అపర్ణ జనార్దనన్ లీడ్ రోల్స్‌లో డీవై చౌదరి దర్శకత్వం వహించిన చిత్రం 'లవ్ యు రామ్'. డైరెక్టర్ కె. దశరథ్ కథ అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా కె. దశరథ్ మాట్లాడుతూ– ''డీవై చౌదరి, నేను మూడు వెబ్ సిరీస్‌లు చేశాం. ఆ తర్వాత ఒక చిన్న లవ్ స్టోరీ చేద్దామని 'లవ్ యు రామ్' కథ రాశాను. చాలామంది జీవితాల్లో జరిగే కథ ఇది. పెళ్లి నుంచి శోభనం మధ్యలో జరిగే ప్రేమకథ. యూత్‌ఫుల్ లవ్ స్టోరీగా రూపొందిన మా సినిమా అందర్నీ అలరిస్తుంది. రోహిత్, అపర్ణ అంకితభావంతో పని చేశారు. వేద చాలా మంచి సంగీతం ఇచ్చాడు. ఇండస్ట్రీలో ముందు యండమూరి, పరుచూరి బ్రదర్స్, తేజ గార్ల వద్ద రైటర్‌గా పని చేశాను. కానీ నేను డైరెక్ట్ చేసిన సినిమాల్లో వారి స్టయిల్ ఉండదు. నేను నాలా తీయడానికి ఇష్టపడతాను. కానీ, నేను రచయితగా పని చేసినప్పుడు మాత్రం కస్టమర్ ఈజ్ ది కింగ్. వాళ్లకి ఏం కావాలో అది ఇవ్వాలి. అలా 'ఉస్తాద్'కి మాస్ కమర్షియల్ కథ అందించాను. ప్రస్తుతం ఒక కొత్త ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. అలాగే ఒక వెబ్ సిరీస్ చేస్తున్నాను. దానికి డైరెక్టర్ హరీష్ శంకర్ షో రన్నర్‌గా ఉంటారు'' అన్నారు.

వస్తున్నాం!



● తరుణ్ భాస్కర్

'పెళ్ళిచూపులు', 'ఈ నగరానికి ఏమైంది?' చిత్రాల తర్వాత దర్శక–నటుడు తరుణ్ భాస్కర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'కీడా కోలా'. ఈ చిత్రంలో బ్రహ్మానందం, రఘు రామ్, రవీంద్ర విజయ్, చైతన్య రావు మాదాడిలతో పాటు తరుణ్ భాస్కర్ కూడా ఓ లీడ్ రోల్ చేశారు. కె. వివేక్ సుధాంషు, సాయికృష్ణ గద్వాల్, శ్రీనివాస్ కౌశిక్, శ్రీ పాద్ నందిరాజ్, ఉపేంద్ర వర్మ నిర్మించారు. వినోదాత్మక పాత్రలో బ్రహ్మానందం, లోకల్ డాన్‌గా తరుణ్ భాస్కర్ కనిపిస్తారు. సినిమా షూటింగ్ పూర్తయింది. బుధవారం టీజర్ రిలీజ్ చేశారు. ఏంట్రా అది (బ్రహ్మానందం), గ్రేప్స్.. ఏమో (మరో పాత్రధారి).. గ్రేప్.. గ్రేప్స్... ఎలా బతికావురా ఇన్నాళ్లు నువ్వు...(బ్రహ్మానందం), నువ్వు బతుకుతా లేవా..అట్లనే... (మరో పాత్రధారి) అనే డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. అలాగే టీజర్ చివర్లో 'శ్వాస మీద ధ్యాస.. వస్తున్నాం' అని కూడా కనిపించింది.

ఫన్ పార్టీ



● వీజే సన్నీ

వీజే సన్నీ, హ్రితికా శ్రీనివాస్ జంటగా సంజయ్ శేరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'సౌండ్ పార్టీ'. దర్శకుడు వి. జయశంకర్ సమర్పణలో రవి పోలిశెట్టి నిర్మించిన ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ఈ సినిమా టైటిల్ లోగో విడుదల పాత్రికేయుల చేతుల మీదగా జరిగింది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో వీజే సన్నీ మాట్లాడుతూ– ''సౌండ్ పార్టీ' చిత్రం థియేటర్స్‌లో గట్టిగా సౌండ్ చేస్తుంది'' అన్నారు. ''ఫుల్ ఫన్ రైడ్ చిత్రం'' అన్నారు సంజయ్ శేరి. ''పాతిక రోజుల్లోనే ఈ సినిమా షూటింగ్‌ను పూర్తి చేశాం. ఇది మా యూనిట్‌కు, వృత్తి నైపుణ్యానికి నిదర్శనం. ఆగస్టులో సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు రవి పోలిశెట్టి.

మాయా సెల్‌ఫోన్


''మాయా పేటిక' సినిమాలో నా మనసుకు దగ్గరైన పాత్ర నాది.. అందుకే ఎంతో ఇష్టపడి చేశాను. సెల్‌ఫోన్ నేపథ్యంలో రూపొందిన ఈ మూవీ అందరికీ నచ్చుతుంది'' అని హీరో విరాజ్ అశ్విన్ అన్నారు. రమేష్ రాపర్తి దర్శకత్వంలో విరాజ్ అశ్విన్, పాయల్ రాజ్‌పుత్, సిమ్రత్ కౌర్, రజత్ రాఘవ్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మాయా పేటిక'. మాగుంట శరత్ చంద్రా రెడ్డి, తారక్‌నాథ్ బొమ్మిరెడ్డి నిర్మించిన ఈ సినిమా రేపు (శుక్రవారం) విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో రమేష్ రాపర్తి మాట్లాడుతూ– ''మాయా పేటిక' ద్వారా సెల్‌ఫోన్ కథ చెబుతున్నాం. ప్రేమ, భావోద్వేగాలు, వినోదం.. ఇలా అన్ని అంశాలున్న చిత్రమిది'' అన్నారు. ''రెగ్యులర్ కథలకు భిన్నంగా మా సినిమా ఉంటుంది'' అన్నారు మాగుంట శరత్ చంద్రా రెడ్డి. ''నా కెరీర్‌లో 'మాయా పేటిక' ముఖ్యమైనది'' అన్నారు పాయల్ రాజ్‌పుత్. ''అద్భుతమైన డ్రామా, వినోదం, సంగీతం ఉన్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు సిమ్రత్ కౌర్. ఈ కార్యక్రమంలో నటీనటులు శ్యామల, రజత్ రాఘవ్ మాట్లాడారు.



● రమేష్, పాయల్, సిమ్రత్ కౌర్, విరాజ్ అశ్విన్

కొత్త ప్రయోగంతో...

- వారణాసి సూర్య



''జీరో బడ్జెట్‌తో 'గండ' సినిమాని తీసి, వినూత్న ప్రయోగానికి తెరతీశాం. ఈ చిత్రం ద్వారా ఎంతో మంది ప్రతిభావంతులైన నటీనటులు, సాంకేతిక నిపుణులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేస్తున్నాను. ఈ సినిమాని అందరూ ఆదరించాలి'' అని వారణాసి సూర్య అన్నారు. ఈజీ మూవీస్ బేనర్‌పై వారణాసి సూర్య స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'గండ' మూవీ రేపు(శుక్రవారం) రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా వారణాసి సూర్య మాట్లాడుతూ– ''మా ఈజీ మూవీస్ సంస్థ త్వరలో ఓ పెద్ద సంస్థతో కలిసి కొత్త ప్రాజెక్ట్స్ చేయనుంది. అలాగే విజయ్ జెడని దర్శకుడిగా పరిచయం చేస్తూ మరో జీరో బడ్జెట్ సినిమా చేయబోతున్నాం. ఇండస్ట్రీలో కేవలం పింఛన్‌పై ఆధారపడిన చిన్న నిర్మాతలకు మా సంస్థ ద్వారా సాయం చేయాలని నిర్ణయించుకున్నాం'' అన్నారు.

స్టాక్ మార్కెట్లు				
దేశీ సూచీలు				
సెన్సెక్స్ ▲	499	63,915		
నిఫ్టీ ▲	155	18,972		
విదేశీ సూచీలు (తొలి సెంబ రాత్రి 11.00 గంటలకు)				
నాస్‌డాక్	13,566	▲	11	
డోజోన్స్	33,792	▼	134	
ఎఫ్‌టీఎస్ఈ 100	7,500	▲	39	
డాక్స్	15,949	▲	102	
షాంఘై	3,189	▲	0	
నికాయ్	33,195	▲	656	

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్


మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

బులియన్ (రూ.లలో) ముంబై			
బంగారం (99.9 స్వచ్ఛత)	58,151	▼	284
బంగారం (99.5 స్వచ్ఛత)	57,918	▼	290
వెండి (కిలో)	68,972	▼	551

64,000 బుల్ 19,000 కొత్త రికార్డుల్..!

ఇంట్రాడే, ముగింపులోనూ కొత్త గరిష్టాలు • ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు







సెన్సెక్స్ మైలురాళ్లు (60,000 - 64,000)	
సెన్సెక్స్ స్థాయి	అందుకున్న తేదీ
60,000	సెప్టెంబర్ 24, 2021
61,000	అక్టోబర్ 14, 2021
62,000	అక్టోబర్ 19, 2021
63,000	నవంబర్ 30, 2022
64,000	జూలై 28, 2023

నిఫ్టీ మైలురాళ్లు (15,000 - 19,000)	
నిఫ్టీ స్థాయి	అందుకున్న తేదీ
15,000	మే 21, 2021
16,000	ఆగస్టు 3, 2021
17,000	ఆగస్టు 31, 2021
18,000	అక్టోబర్ 11, 2021
19,000	జూన్ 28, 2023

ముంబై: భారత ఈక్విటీ మార్కెట్లో బుధవారం రికార్డుల మోత మోగింది. విదేశీ ఇన్వెస్టర్ల వరుస కొనుగోళ్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో సూచీలు మరోరోజూ దూసుకెళ్లాయి. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగిరావడం మరింత ప్రోత్సాహాన్నిచ్చింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఇన్ఫోసిస్ షేర్లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ఒక్క మీడియా మినహా అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులను లిఖించాయి. సెన్సెక్స్ 64,000 స్థాయిని తాకింది. నిఫ్టీ ఎన్నాళ్లుగానో ఊరిస్తున్న 19,000 మైలురాయిని ఎట్టకేలకు అందుకుంది. సెన్సెక్స్ ఉదయం 286 పాయింట్లు లాభంతో 63,702 వద్ద మొదలైంది. ఇంట్రాడేలో 634 పాయింట్లు పెరిగి 64,050 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసిన సెన్సెక్స్ చివరికి 499 పాయింట్ల లాభంతో 63,915 వద్ద ముగిసింది. సెన్సెక్స్ సూచీకిది వరుసగా రెండోరోజూ లాభాల ముగింపు. ఈ సూచీలోని మొత్తం 30 షేర్లలో ఐదు షేర్లు మాత్రమే నష్టపోయాయి. నిఫ్టీ 91 పాయింట్లు పెరిగి 18,908 వద్ద ట్రేడింగ్‌ను ప్రారంభించింది. ట్రేడింగ్‌లో 194 పాయింట్లు ఎగసి 19,011 వద్ద కొత్త ఆల్‌టైం హైని అందుకుంది. మార్కెట్ ముగిసే సరికి 155 పాయింట్ల లాభంతో 18,972 వద్ద స్థిరపడింది. మెటల్, ఫార్మా షేర్లను కొనేందుకు ఇన్వెస్టర్లు ఆసక్తి చూపారు. సూచీల ఆల్‌టైం హై నమోదు తర్వాత చిన్న కంపెనీల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఫలితంగా బీఎస్ఈ స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.08% పెరిగి ఫ్లాటుగా ముగిసింది. మిడ్ క్యాప్ సూచీ 0.73 శాతం లాభపడింది. ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాలతో కదలాడుతున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.12,350 కోట్ల షేర్లను కొన్నారు. దేశీ ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపుతూ... రూ.1,021 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు.

బక్రీద్ సందర్భంగా నేడు ఎక్స్ఛేంజీలకు సెలవు

బక్రీద్ సందర్భంగా నేడు (గురువారం) స్టాక్ మార్కెట్‌కు సెలవు. అయితే ఫారెక్స్, డెట్, కమోడిటీ మార్కెట్లు మాత్రం సాయంత్రం సెషన్‌లో పనిచేస్తాయి. ట్రేడింగ్ తిరిగి యథావిధిగా శుక్రవారం ప్రారంభం అవుతుంది.

రెండు రోజుల్లో రూ.3.43 లక్షల కోట్లు

సెన్సెక్స్ రెండురోజుల వరుస ర్యాలీతో బీఎస్ఈలో 3.43 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 294.11 లక్షల కోట్లకు చేరింది. ఈ జూన్ 21 తేదిన బీఎస్ఈ లిస్టెడ్ మార్కెట్ క్యాప్ రూ. 294.36 లక్షల కోట్లు నమోదై జీవితకాల రికా ర్డు స్థాయిని తాకిన సంగతి తెలిసిందే. ''దాదాపు ఏడు నెలల స్థిరీకరణ తర్వాత తర్వాత నిఫ్టీ 19వేల స్థాయిని అందుకోగలిగింది. ఆర్థిక వృద్ధి ఆశలు, వడ్డీరేట్ల సైకిల్ ముగింపు అంచనాలు, గత కొన్ని రోజులుగా విదేశీ ఇన్వెస్టర్లు వరుస విక్రయ అంశాలు సూచీల రికార్డు ర్యాలీకి అండగా నిలిచాయి. మిగిలిన రంగాలతో పోలిస్తే ఫార్మా, మెటల్ షేర్లకు ఎక్కువగా డిమాండ్ లభించింది'' అని యస్ సెక్యూరిటీస్ గ్రూప్ ప్రెసిడెంట్ అమర్ అంబానీ తెలిపారు.


మార్కెట్లో మరిన్ని సంగతులు

- అమెరికాకు చెందిన ఈక్విటీ సంస్థ జీక్యూజీ పార్ట్‌నర్స్, ఇతర ఇన్వెస్టర్లు ఒక బిలియన్ డాలర్ విలువైన వాటాను కొనుగోలు చేయడంతో అదానీ గ్రూప్ షేర్లు రాణించాయి. ప్రధాన కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ 5.34% లాభపడింది. అదానీ ట్రాన్స్‌మిషన్ 6%, అదానీ పోర్ట్స్ 5%, అదానీ టోటల్ గ్యాస్, అదానీ విల్మార్ 2%, ఏసీసీ 1%, అదానీ పవర్ అరశాతం, అంబుజా సిమెంట్స్ 0.10 శాతం చొప్పున లాభపడ్డాయి. అయితే అదానీ గ్రీన్ ఎనర్జీ, ఎన్‌డీటీవీలు 0.16%, 0.32 శాతం చొప్పున నష్టపోయాయి.
- ఆర్థిక, బ్యాంకింగ్ షేర్లకు డిమాండ్ నెలకొనడంతో ఎన్ఎస్ఈలో ఈ రంగ షేర్లకు ప్రాతినిధ్యం వహించే బ్యాంక్ నిఫ్టీ ఇండెక్స్ ట్రేడింగ్‌లో 44,508 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. చివరికి 206 పాయింట్ల లాభంతో 44,328 వద్ద స్థిరపడింది.

అదానీలో జీక్యూజీ భారీ పెట్టుబడులు

రూ. 8,200 కోట్ల షేర్ల కొనుగోలు

న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ దిగ్గజం అదానీ గ్రూప్ కంపెనీలలో జీక్యూజీ పార్ట్‌నర్స్ తదితర పెట్టుబడి సంస్థలు తాజాగా బిలియన్ డాలర్లు(సుమారు రూ. 8,200 కోట్లు) ఇన్వెస్ట్ చేశాయి. గ్రూప్‌లోని డైవర్సిఫైడ్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్‌లో 1.6 శాతం వాటాకు సమానమైన 1.8 కోట్ల షేర్లు కొనుగోలు చేశాయి. ఈ బాటలో అదానీ గ్రీన్ ఎనర్జీలోనూ 2.2 శాతం వాటాకు సమానమైన 3.52 కోట్ల షేర్లను సొంతం చేసుకున్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. స్టాక్ ఎక్స్ఛేంజీల సమాచారంమేరకు రెండు కంపెనీలలో బ్లాక్‌ట్రేడ్స్ నమోదయ్యాయి. యూఎస్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ ఆరోపణల తదుపరి చైర్మన్ గౌతమ్ అదానీ.. గ్రూప్‌పట్ల ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పెంపొందించేందుకు ముందస్తు రుణ చెల్లింపులు, నిధుల సమీకరణ తదితర చర్యలు చేపడుతున్న సంగతి తెలిసిందే. మరోవైపు ఇదే సమయంలో జీక్యూజీ పార్ట్‌నర్స్.. అదానీ గ్రూప్ కంపెనీలలో పెట్టుబడులకు ఆసక్తి చూపుతూ వస్తోంది. ఈ ఏడాది మార్చిలో అదానీ గ్రూప్‌లోని నాలుగు కంపెనీలలో ప్రమోటర్లు 1.87 బిలియన్ డాలర్ల(రూ. 15,446 కోట్లు) విలువైన వాటాలను జీక్యూజీ పార్ట్‌నర్స్‌కు విక్రయించారు. తదుపరి మే నెలలో మరో 40-50 కోట్ల డాలర్ల విలువైన షేర్లను జీక్యూజీ కొనుగోలు చేసింది.



బ్లాక్‌డీల్స్ ఇలా..

అదానీ ఎంటర్‌ప్రైజెస్ కౌంటర్లో మంగళవారం ధర రూ. 2,281తో పోలిస్తే షేరుకి రూ. 2,300 ధరలో బుధవారం బీఎస్ఈలో లావాదేవీ నమోదైంది. అయితే అదానీ గ్రీన్‌లో ముందురోజు ధర రూ. 960తో పోలిస్తే రూ. 925-920 ధరలో బ్లాక్‌డీల్స్ జరిగాయి. తద్వారా రెండు కంపెనీలలోనూ విడిగా 50 కోట్ల డాలర్ల విలువైన ప్రమోటర్ల వాటాలు విదేశీ సంస్థలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు 5.3 శాతం జంప్‌చేసి రూ. 2,404 వద్ద నిలవగా.. అదానీ గ్రీన్ స్వల్ప నష్టంతో రూ. 958 వద్ద ముగిసింది. తొలుత 7 శాతం పతనంకావడం గమనార్హం! మేలో నిర్వహించిన బోర్డు సమావేశాలలో అదానీ ఎంటర్‌ప్రైజెస్, అదానీ ట్రాన్స్‌మిషన్ 2.5 బిలియన్ డాలర్ల(సుమారు రూ. 21,000 కోట్లు) సమీకరణకు ఆమోదించాయి. సంస్థాగత ఇన్వెస్టర్లకు షేర్లు విక్రయించాలని ప్రతిపాదించాయి.

ఇక 3 రోజుల్లోనే లిస్టింగ్

ఐపీవో, ఎఫ్‌పీఐలపై సెబీ తాజా నిర్ణయాలు

ముంబై: క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పబ్లిక్ ఇష్యూ చేపట్టిన కంపెనీ లిస్టింగ్‌కు ప్రస్తుతమున్న 6 రోజుల గడువును 3 రోజులకు కుదించింది. బుధవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకుంది. వీటిలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల(ఎఫ్‌పీఐలు)కు అదనపు సమాచార వెల్లడిని తప్పనిసరి చేసే నిబంధనలు సైతం ఉన్నాయి. ఇన్విట్స్, రీట్స్ కలిగినవారికి బోర్డులో నామినేషన్ హక్కును ప్రవేశ పెట్టింది.



మొత్తం ఏడు ప్రధాన ప్రతిపాదనలను బోర్డు ఆమోదించినట్లు సెబీ చైర్‌పర్సన్ మాధవి పురి బచ్ తెలియజేశారు. దీంతో పబ్లిక్ ఇష్యూ ముగిసిన రోజు నుంచి షేర్ల లిస్టింగ్ గడువు 6 రోజుల నుంచి 3 రోజులకు తగ్గనుంది. సెప్టెంబర్ 1 నుంచి తాజా నిర్ణయం స్వచ్ఛంద పద్ధతిలో అమలుకానుంది. 2023 డిసెంబర్ 1 నుంచి తప్పనిసరికానుంది. ఇక ఎఫ్‌పీఐలకు ఓనర్‌షిప్, ఎకనమిక్ ఇంటరెస్ట్ తదితర అదనపు అంశాల సమాచార వెల్లడి తప్పనిసరికానుంది. ఈ బాటలో ఇన్వెస్టర్ల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ స్కోర్స్‌ను పటిష్ట పరచడం, ఆన్‌లైన్ వివాద పరిష్కార మెకానిజంతో అనుసంధానించడం వంటివి చేపట్టేందుకు నిర్ణయించింది.

ఎనిమిదేళ్లలో శాఖలు 3 రెట్లు

1,500కు చేరిన బంధన్ బ్యాంక్ బ్రాంచీలు

కోల్‌కతా: ప్రైవేట్ రంగ బంధన్ బ్యాంక్ గత ఎనిమిదేళ్లలో తమ శాఖల సంఖ్యను మూడు రెట్లు పెంచుకుంది. ప్రస్తుతం బ్రాంచీల సంఖ్య 1,500కు, బ్యాంకింగ్ అవుట్‌లెట్స్ సంఖ్య 6,000కు చేరినట్లు బ్యాంకు ఎండీ చంద్రశేఖర్ ఘోష్ తెలిపారు. 2015 ఆగస్టులో కోల్‌కతా కేంద్రంగా 501 శాఖలతో బ్యాంకును ప్రారంభించామని ఇప్పుడు 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు విస్తరించామని ఆయన వివరించారు.



ఫిజికల్, డిజిటల్ మాధ్యమాల ద్వారా కస్టమర్ల అవసరాలకు అనుగుణమైన బ్యాంకింగ్ సేవలను అందించేందుకు కృషి చేస్తున్నామని ఘోష్ చెప్పారు. సూక్ష్మ రుణాల సంస్థగా ప్రారంభమైన బంధన్ బ్యాంక్ ప్రస్తుతం గృహ, వ్యక్తిగత, ఆటో రుణాలు మొదలైన రిటైల్ సాధనాలపైనా మరింతగా దృష్టి పెడుతోంది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

ఆంధ్రప్రదేశ్ పోలీసు ఉద్యోగాలకు సంబంధించిన స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు. ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డులో 12 పోస్టులు

విజయవాడలోని ఏపీ ఎస్ఎస్‌సీ బోర్డు, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ కార్యాలయం.. ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన జూనియర్ అసిస్టెంట్/డేటా ప్రాసెసింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12
» **పోస్టుల వివరాలు:** జూనియర్ అసిస్టెంట్-11, డేటా ప్రాసెసింగ్ అసిస్టెంట్-01.
» **అర్హత:** ఏదైనా బ్యాచిలర్ డిగ్రీ, టైపింగ్ స్కిల్స్‌తో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. ఎంఎస్ ఆఫీస్/పీజీడీసీఏ/డీసీఏ/ఇంజినీరింగ్ సర్టిఫికేట్/కంప్యూటర్ సబ్జెక్టుతో ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.01.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి/ఇంటర్మీడియట్/డిగ్రీ మార్కులు, కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్ మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 07.07.2023
» **ధ్రువపత్రాల పరిశీలనకు ఎంపికైన అభ్యర్థుల జాబితా వెల్లడి తేది:** 11.07.2023.
» **సర్టిఫికేట్ల వెరిఫికేషన్ తేది:** 13.07.2023, 14.07.2023.
» **కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్:** 16.07.2023, 17.07.2023.
» **తుది ఎంపిక జాబితా వెల్లడి:** 19.07.2023.
» **వెబ్‌సైట్:** https://dgeap.aptonline.in

మనూ, హైదరాబాద్‌లో 46 పోస్టులు

హైదరాబాద్‌లోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్శిటీ(మనూ)..మనూ క్యాంపస్‌ల లో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 46
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్,అసోసియేట్ ప్రొఫెసర్,హెచ్‌వోడీ తదితరాలు.
» **విభాగాలు:** కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఈఈఈ, మెకానికల్, ఈసీఈ, సివిల్ ఇంజనీరింగ్, సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, డిస్టెన్స్ ఎడ్యుకేషన్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ /బీఎస్/ఎండీ/ఎమ్మెస్సీ/పీజీ డిగ్రీ/ఎంఈడీ/ఎంఏ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. నెట్/సెట్/స్లెట్ అర్హత సాధించాలి.
» **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి రూ.2,18,200 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**08.07.2023
» **వెబ్‌సైట్:** www.manuu.edu.in

తుది సమరంలో.. సక్సెస్ ఇలా

గ్రూప్-4.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని 25 శాఖల్లో మొత్తం 8,039 పోస్ట్‌ల భర్తీకి నిర్వహిస్తున్న పరీక్ష! జూలై 1 జరిగే ఈ పరీక్షకు.. దాదాపు పది లక్షల మంది పోటీ పడుతున్నట్లు అంచనా! ప్రొఫెషనల్ కోర్సుల ఉత్తీర్ణులు మొదలు.. సంప్రదాయ డిగ్రీ పట్టభద్రుల వరకు గ్రూప్ 4కు హాజరవుతున్నారు. ఇంతలా పోటీ నెలకొన్న ఈ పరీక్ష కోసం నెలల తరబడి సన్నద్ధత పొందిన అభ్యర్థులు.. పరీక్ష రోజు అనుసరించే వ్యూహమే విజయంలో కీలకంగా నిలుస్తుంది. ఈ నేపథ్యంలో.. గ్రూప్-4 అభ్యర్థుల కోసం ఎగ్జామ్ డే సక్సెస్ టిప్స్..



టీఎస్‌పీఎస్సీ గ్రూప్-4

» జూలై 1న గ్రూప్-4 పరీక్ష
» దాదాపు పది లక్షల మంది పోటీ
» పరీక్ష రోజు సరైన వ్యూహంతోనే విజయం
» ఒత్తిడి లేకుండా పరీక్ష రాయాలంటున్న నిపుణులు

గ్రూప్-4 పరీక్ష రెండు పేపర్లుగా.. 300 మార్కులకు ఉంటుంది. పేపర్ 1 జనరల్ నాలెడ్జ్ 150 మార్కులకు, పేపర్ 2 సెక్రటేరియల్ ఎబిలిటీస్ 150 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండున్నర గంటలు. పరీక్షలో మెరిట్ ఆధారంగా.. జోనల్, డిస్ట్రిక్ట్, కేటగిరీ వారీ మెరిట్ జాబితా రూపొందించి నియామకాలు ఖరారు చేస్తారు.

ఒకే రోజున పరీక్ష

గ్రూప్-4 పరీక్ష రెండు పేపర్లుగా.. ఒకే రోజున ఉదయం, మధ్యాహ్నం సెషన్లలో జరగనుంది. పేపర్ 1 ఉదయం 10 గంటల నుంచి 12:30 గంటల వరకు; పేపర్ 2 మధ్యాహ్నం 2:30 నుంచి 5 గంటల వరకు ఉంటుంది.

ప్రశ్నపత్రం పరిశీలన

గ్రూప్-4 అభ్యర్థులు పరీక్ష కేంద్రంలో ప్రశ్న పత్రం తీసుకున్నాక దాన్ని పరిశీలించేందుకు కనీసం పది నిమిషాల సమయం కేటాయించడం మేలు. ప్రతి ప్రశ్నకు సమాధానం గుర్తించాలనే తొందరపాటు సరి కాదు. తొలుత పూర్తిగా ప్రశ్న పత్రాన్ని చదివేందుకు కొంత సమయం కేటాయించాలి. ఫలితంగా ప్రశ్న పత్రం క్లిష్టత స్థాయిపై ప్రాథమిక అవగాహన ఏర్పడుతుంది. ముందుగా తమకు సులభంగా భావించిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. అనంతరం ఓ మోస్తరు క్లిష్టత ప్రశ్నలకు సమాధానాలు గుర్తించాలి. చివరగా అత్యంత క్లిష్టమైన ప్రశ్నలపై దృష్టి పెట్టాలి. అలాకాకుండా ముందే కష్టమైన ప్రశ్నలకు సమాధానాలిచ్చేందుకు ఉపక్రమిస్తే.. మానసికంగా ఒత్తిడికి గురయ్యే ఆస్కారముంది. పర్యవసానంగా తమకు తెలిసిన ప్రశ్నలకు కూడా సమాధానం ఇవ్వలేని పరిస్థితి ఏర్పడుతుందని గుర్తించాలి.

ఎలిమినేషన్.. అప్రమత్తంగా

ఆబ్జెక్టివ్ పరీక్షల్లో అభ్యర్థులు అనుసరించే వ్యూహం..ఎలిమినేషన్ టెక్నిక్. అంటే.. నాలుగు ఆప్షన్లలో ప్రశ్నకు సరితూగని వాటిని ఒక్కొక్కటిగా తొలగించి.. చివరగా మిగిలిన ఆప్షన్‌ను సమాధానంగా గుర్తించడం. ఈ టెక్నిక్‌ను పరీక్ష చివరి దశలోనే అమలు చేయాలి. తమకు సమాధానాలు తెలిసిన అన్ని ప్రశ్నలను పూర్తి చేసుకున్నాకే ఎలిమినేషన్‌పై దృష్టి పెట్టాలి. అలాగే గెస్సింగ్ విధానాన్ని కూడా పరీక్ష చివరి దశలోనే అనుసరించాలి.

ఓఎంఆర్ షీట్.. జాగ్రత్తగా

ఓఎంఆర్ షీట్‌లో వివరాలు పొందుపరచడంలో అభ్యర్థులు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. అదేవిధంగా సమాధానాలు బబ్లింగ్ చేసేటప్పుడు ప్రశ్న సంఖ్య.. ఆప్షన్‌ను క్షుణ్నంగా గుర్తించాలి. కొంతమంది ఓఎంఆర్ షీట్‌ను పూర్తి చేయడంలో పొరపాట్లు చేసి.. సమాధానాలన్నీ సరిగా రాసి మంచి మార్కులు పొందినా కూడా విజయం చేజార్చుకుంటున్నారు. ఇలాంటి పరిస్థితి ఎదురు కాకుండా అభ్యర్థులు ఓఎంఆర్ షీట్‌ను జాగ్రత్తగా పూరించాలి.

కమిషన్ నిబంధనలు పాటిస్తూ

తాజాగా గ్రూప్-4 పరీక్షకు సంబంధించి టీఎస్‌పీఎస్సీ పలు నిబంధనలు జారీ చేసింది. అభ్యర్థులు వాటిని కూలంకషంగా పరిశీలించాలి. అందుకు అనుగుణంగా సిద్ధమై పరీక్ష హాల్‌కు చేరుకోవాలి. పేపర్-1కు ఉదయం 8 గంటల నుంచి పేపర్-2కు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తామని కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి. కాబట్టి అభ్యర్థులు వీలైనంత ముందుగా పరీక్ష హాల్‌కు చేరుకొని నిబంధనలన్నింటినీ పూర్తి చేయాలి.

హాల్ టికెట్ డౌన్‌లోడ్

ప్రస్తుతం గ్రూప్-4 హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం అందుబాటులో ఉంది. అభ్యర్థులు వీలైనంత ముందుగా హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. తమకు కేటాయించిన పరీక్ష కేంద్రం వివరాలను తెలుసుకోవాలి. వీలైతే పరీక్ష రోజుకు ముందుగా ఒకసారి పరీక్ష కేంద్రాన్ని వ్యక్తిగతంగా పరిశీలించడం మేలు. దీనివల్ల పరీక్ష రోజు సరైన సమయానికి చేరుకునే వీలుంటుంది.

ప్రస్తుత సమయంలో.. ఇలా

అభ్యర్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సమయంలో.. ముఖ్యాంశాలను, సబ్ హెడ్డింగ్స్‌ను ఒకసారి చూసుకోవాలి. ముఖ్యమైన గణాంకాలు, తేదీలు గుర్తుకు తెచ్చుకునే ప్రయత్నం చేయాలి. సొంత నోట్స్ రాసుకుని ఉంటే దాని ఆధారంగా పునశ్చరణ పూర్తి చేసుకోవాలి. ముఖ్యంగా షార్ట్ నోట్స్, కీ పాయింట్స్, సినాప్సిస్‌లపై ఎక్కువగా దృష్టి సారించాలి. సినాప్సిస్‌ను చదివితే ఆ అంశానికి సంబంధించిన పూర్తి సమాచారం మదిలో మెదిలే విధంగా ఉండాలి.

పరీక్షకు ముందు రోజు

పరీక్షకు ఒకరోజు ముందు అభ్యర్థులు సబ్జెక్ట్ ప్రిపరేషన్ కంటే.. పరీక్షకు హాజరయ్యేందుకు అవసరమైన వాటిని సిద్ధం చేసుకోవాలి. హాల్ టికెట్, పెన్నులు, అవసరమైన గుర్తింపు పత్రాలు అన్నింటినీ దగ్గర పెట్టుకోవాలి.

ఆరోగ్యం జాగ్రత్త

పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు రేయింబవళ్లు శ్రమిస్తేనే మంచి మార్కులు వస్తాయని భావిస్తుంటారు. పరీక్ష ముందు రోజు కూడా ఇలా అర్ధరాత్రి వరకూ చదువుతూ ఉంటారు. ఇది మరుసటి రోజు పరీక్ష హాల్లో ప్రదర్శన తీరుపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కాబట్టి మనసుకు విశ్రాంతి లభించేలా సేద తీరాలి. ఎలాంటి ఒత్తిడి లేకుండా ప్రశాంతంగా పరీక్షకు హాజరవ్వాలి.

గ్యాప్‌లో చర్చలు వద్దు

గ్రూప్ 4 మొదటి పేపర్ తర్వాత రెండో పేపర్ ప్రారంభానికి రెండు గంటల వ్యవధి ఉంటుంది. ఈ సమయంలో అభ్యర్థులు.. సహచరులతో మొదటి పేపర్‌లో గుర్తించిన సమాధానాల గురించి చర్చించడం వంటివి చేయడం సరికాదు. దీనివల్ల అనవసరపు ఒత్తిడి ఏర్పడి రెండో పేపర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది.

ఎగ్జామ్ డే టిప్స్

- వీలైనంత ముందుగా హాల్ టికెట్ డౌన్‌లోడ్ చేసుకోవాలి.
- పరీక్ష రోజు నిర్దేశిత సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలి.
- సమాధానాలు ఇచ్చే ముందు ప్రశ్న పత్రం పరిశీలనకు సమయం కేటాయించాలి.
- సులభమైన ప్రశ్నలతో ప్రారంభించి.. ఓ మోస్తరు క్లిష్టత, ఆ తర్వాత బాగా క్లిష్టంగా ఉన్న ప్రశ్నలపై దృష్టి పెట్టాలి.
- తమకు వచ్చిన అన్ని సమాధానాలు గుర్తించామని భావించాకే గెస్సింగ్, ఎలిమినేషన్ విధానాన్ని అనుసరించాలి.

ముఖ్య సమాచారం

- **పరీక్ష తేదీ:** జూలై 1(పేపర్-1 ఉదయం 10.00 - 12.30; పేపర్-2.. మధ్యాహ్నం 2.30-5.00) వరకు.
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం:** పేపర్-1 ప్రారంభానికి 45 నిమిషాల ముందు వరకు
- **వెబ్‌సైట్:** tspsc.gov.in

మినీరత్న కంపెనీలో.. జూనియర్ ఇంజనీర్

ఉత్తరాఖండ్ రాష్ట్రం, డెహ్రాడూన్‌లోని మినీరత్న సంస్థ.. తెహ్రీ హైడ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్ (టీహెచ్‌డీసీఎల్).. మొత్తం 181 జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్ ఉత్తీర్ణులు దరఖాస్తుకు అర్హులు. టీహెచ్‌డీసీఎల్‌లో జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాల పూర్తి వివరాలు..

» 181 పోస్టుల భర్తీకి టీహెచ్‌డీసీఎల్ నోటిఫికేషన్
» డిప్లొమా, బీఎస్సీ, బీఈ/బీటెక్‌తో దరఖాస్తుకు అర్హత

జాబ్స్ ఇన్ఫో

- **మొత్తం పోస్టుల సంఖ్య:** 181
- **పోస్టుల వివరాలు:** జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ(సివిల్)-72, జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ(ఎలక్ట్రికల్)-72, జూనియర్ ఇంజనీర్ ట్రెయినీ (మెకానికల్) విభాగాల్లో 37 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు



- ఈ పోస్టులకు దరఖాస్తు చేయాలనుకునే అభ్యర్థులు సంబంధిత విభాగంలో మూడేళ్ల ఫుల్‌టైం రెగ్యులర్ డిప్లొమా/లేటరల్ ఎంట్రీ డిప్లొమా/బీఎస్సీ/బీఈ/బీటెక్ 65 శాతం మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి. ఎస్సీ/ఎస్టీ, దివ్యాంగులు, ఎక్స్-సర్వీస్‌మెన్/ డిపార్ట్‌మెంటల్ అభ్యర్థులు డిప్లొమా ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది.
- **వయసు:** 07.06.2023 నాటికి 27 ఏళ్లు మించకుండా ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక విధానం

- ఆన్‌లైన్(సీబీటీ-కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) విధానంలో నిర్వహించే రాత పరీక్ష ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్ష ఆబ్జెక్టివ్ పద్ధతిలో 200 ప్రశ్నలు– 200 మార్కులకు ఉంటుంది. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో మూడు విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి. పార్ట్-1లో సివిల్/ఎలక్ట్రికల్/మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించిన 140 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలుంటాయి. పార్ట్-2లో జనరల్ అవేర్‌నెస్‌కు సంబంధించి-30 ప్రశ్నలు, పార్ట్-3లో రీజనింగ్ నుంచి 30 ప్రశ్నలను అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు లభిస్తుంది. అలాగే ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును తగ్గిస్తారు. హిందీ, ఇంగ్లిష్ మాధ్యమాల్లో పరీక్ష రాసుకోవచ్చు.
- రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ పరీక్షలను నిర్వహించి తుది ఎంపిక చేస్తారు.

శిక్షణ-వేతనాలు

ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాది పాటు శిక్షణ ఉంటుంది. శిక్షణ సమయంలోనే మూలవేతనం, డీఏ తదితర ప్రోత్సాహకాలూ లభిస్తాయి. లీవ్, వైద్య సదుపాయం, ప్రావిడెంట్ ఫండ్, పెన్షన్, గ్రాట్యుటీ మొదలైనవి ఉంటాయి. ఉద్యోగం రెగ్యులర్ అయిన తర్వాత కంపెనీ క్వార్టర్స్/హెచ్ఆర్ఏ వంటివి పొందొచ్చు. పే స్కేల్.. రూ.29,200 – రూ.1,19,000.

ముఖ్యసమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 30.06.2023
- **వెబ్‌సైట్:** https://www.thdc.co.in

బాల్య వివాహం.. హక్కుల ఉల్లంఘనే..

గత ఐదేళ్లలో 400 వివాహాలు

- అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు
- ఈ నెల 14న జీవో 31 విడుదల
- ప్రతి నెలా గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో సమీక్షకు ఆదేశాలు
- సమీకృత అభివృద్ధి లక్ష్యాల్లో చేర్చడంతో రాష్ట్ర స్థాయిలో పరిశీలన



బాల్యవివాహాల కేసుల్లో కౌన్సెలింగ్ ఇస్తున్న డీసీపీఓ

సాక్షి, పశ్చిమగోదావరి డెస్క్: ఇంట్లో ఆడపిల్ల ఉంటే.. పెళ్లి చేసి అత్తారింటికి పంపించే వరకు బరువు, భారంగానే భావిస్తున్నారు పలువురు తల్లిదండ్రులు. ఒక పక్క ఆడపిల్లలు అనేక వివక్షలు, అడ్డంకులను ఎదుర్కొంటూ సమాజంలో తమకంటూ ఒక గుర్తింపును తెచ్చుకునేందుకు, ఆర్థికంగా తమ కాళ్లపై తాము నిలబడేందుకు ప్రయత్నిస్తున్నారు. తమదైన జీవితాన్ని తామే ఎంచుకునేలా ఎదుగుతున్నారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యావకాశాలను అందుకుంటూ.. పోటీ ప్రపంచంలో దీటుగా నిలుస్తున్నారు. మరోపక్క బాల్య వివాహాలతో వారిని వెనక్కి లాగే పరిస్థితులు నేటికీ మన సమాజంలో కొనసాగుతూనే ఉన్నాయి. ఉన్నత స్థాయి విద్యావంతులు ఉన్న కుటుంబాల్లో సైతం ఇంకా ఇలాంటి పరిస్థితులే ఉండటం శోచనీయం. ఆడపిల్లకు వివాహ వయస్సు 18 ఏళ్లుగా రాజ్యాంగంలో పేర్కొన్న విషయం తెలిసిందే. రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలు చేయడం.. బాలికల హక్కుల ఉల్లంఘన కిందకు కూడా వస్తుందని రాజ్యాంగ నిపుణులు చెబుతున్నారు.

బాల్య వివాహాలకు కారణాలివీ...

గడచిన ఐదేళ్లలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 400 వరకు బాల్య వివాహాలు జరిగాయి. ఎక్కువ శాతం బాల్య వివాహాలకు ప్రధాన కారణం తల్లిదండ్రులు చదువుకోకపోవడంగా ఉంది. వారికి పెళ్లి వయసుపై సరైన అవగాహన లేకపోవడం మరో ప్రధాన కారణం. ఆడపిల్లకు త్వరగా పెళ్లి చేసి బాధ్యత నెరవేర్చుకోవడమే ప్రాధాన్యతగా తల్లిదండ్రులు భావిస్తుండటం, బంధువుల్లో మంచి సంబంధాలు దూరమవుతాయనే భయంతో త్వరపడటం మిగిలిన కారణాలుగా ఉన్నాయి. దీంతో పాటు మైనర్ బాలికలపై పలుచోట్ల జరుగుతున్న దురాగతాలు చూసి ఆందోళనకు గురై త్వరగా పెళ్లి చేయాలని భావించడం మరో కారణంగా ఉంది.

ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు..

రాష్ట్రంలో బాల్య వివాహాలను నిరోధించడానికి ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలకు సిద్ధమైంది. దీనిలో భాగంగా ఈ నెల 14న జీవో నంబర్ 31ని విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం జిల్లా స్థాయిలో సీఎంపీఓ (చైల్డ్ మ్యారేజ్ ప్రొబేషన్ ఆఫీసర్)గా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. గ్రామ, మండల, డివిజన్, జిల్లా స్థాయిలో ప్రతినెలా బాల్య వివాహాలపై సమీక్ష నిర్వహించి వివిధ శాఖల అధికారులకు వారు తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దిశానిర్దేశం చేస్తోంది.

చట్టాలు.. కమిటీలు ఇలా..

బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా బాల్య వివాహాల నిరోధక చట్టం-2006, పిల్లల సంరక్షణ చట్టం 2015 ప్రకారం కేసులు నమోదు చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. గ్రామ స్థాయిలో సర్పంచ్, అంగన్‌వాడీ టీచర్, వీఆర్వో, మహిళా పోలీస్‌తో బాల్య వివాహాలను అడ్డుకునేందుకు కమిటీని ఏర్పాటు చేశారు. మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీఓ బాల్య వివాహాలపై పర్యవేక్షణ చేస్తారు. ప్రతి నెలా మొదటి సోమవారం గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో బాల్య వివాహాలపై సమావేశాలు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, ఆర్డీఓలు జిల్లా స్థాయి కమిటీగా బాల్య వివాహాలపై సమీక్షిస్తున్నారు.

వివిధ కోర్సుల్లో శిక్షణ, ఉన్నత విద్యకు అవకాశాలు...

బాల్య వివాహాలపై సమాచారం తెలియగానే అధికారులు వాటికి అడ్డుకట్ట వేస్తున్నారు. తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నారు. బాలికల విద్యార్హతలను బట్టి వారికి ఒకేషనల్ కోర్సులు, స్కిల్ డెవలప్‌మెంట్ కోర్సుల్లో శిక్షణ ఇచ్చేందుకు, ఉన్నత విద్య అభ్యసించేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ప్రధానంగా బాలికలను రీహ్యాబిలిటేషన్ సెంటర్లలో ఉంచి వారిని ప్రయోజకులను చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి మధ్యవర్తుల సమక్షంలో వారికి అప్పగిస్తున్నారు.

కష్టకాలంలో ఆదుకున్న 'దిశ' యాప్...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన దిశ పోలీస్‌స్టేషన్, దిశ యాప్ కారణంగా చదువుకున్న, అవగాహన ఉన్న బాలికలు బాల్య వివాహాన్ని అడ్డుకునేందుకు 'దిశ'ను ఆశ్రయిస్తుండటం గమనార్హం. ఈ నెల ఎనిమిదో తేదీన ఏలూరు మండలం వెంకటాపురానికి చెందిన ఓ బాలిక ఇదేవిధంగా పెద్దలు పెళ్లి నిశ్చయించగా, తాను చదువుకుంటానని, తనకు పెళ్లి ఇష్టం లేదంటూ దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేసిన ఉదంతమే దీనికి తాజా ఉదాహరణ. ఆమె కాల్‌తో వెంటనే స్పందించిన దిశ స్టేషన్ పోలీసులు పది నిమిషాల వ్యవధిలో బాలిక ఇంటికి చేరుకున్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పెళ్లి రద్దు చేశారు. దిశ ఎస్‌ఓఎస్‌కు కాల్ చేయడం ద్వారానే తనకు న్యాయం జరిగిందని ఈ సందర్భంగా సదరు బాలిక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేయడం గమనార్హం.

కౌన్సెలింగ్ ఇస్తున్నాం



బాల్య వివాహాలు చేయకుండా తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్నాం. బాలికలు చదువుకుంటామంటే విజయవాడలోని సీడబ్ల్యూసీ కమిటీ ద్వారా హోమ్‌కు పంపించి కాలేజీలో చేర్పించడం, పని నేర్చుకుంటామంటే చేతి పనులు నేర్పించడం చేస్తున్నాం.

– గుర్రం రాగమయి, ఇన్‌చార్జి పర్యవేక్షణాధికారి, నూజివీడు

సమష్టి కృషి



జిల్లా వ్యాప్తంగా బాల్య వివాహాలను అరికట్టేందుకు సమష్టిగా కృషి చేస్తున్నాం. ఏలూరు జిల్లాలో సీఎంపీఓగా జిల్లా కలెక్టర్ వ్యవహరిస్తున్నారు. ప్రతి నెలా వీటిపై గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు సమీక్షలు నిర్వహించడం ద్వారా అవసరమైన చర్యలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నారు. బాల్య వివాహాల కేసుల్లో తల్లిదండ్రులు తమ పిల్లల వయసును ఆధార్ కార్డులో మార్చివేస్తున్న విషయాన్ని గుర్తించాం. స్కూల్ రికార్డుల ఆధారంగానే వయస్సు నిర్ధారణ చేస్తున్నాం.

– డాక్టర్ సూర్యచక్రవేణి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్


ఉమ్మడి జిల్లాలో 4 పునరావాస కేంద్రాలు

బాల్య వివాహాలను అడ్డుకుని ఆయా బాలికలను సంరక్షించడానికి స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం కల్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో నాలుగు బాల సదన్‌లు ఉన్నాయి. ఏలూరు జిల్లాలో దెందులూరు, నూజివీడు, పశ్చిమగోదావరి జిల్లాలో తణుకు, ఆకివీడు ఉన్నాయి. బాలికలు చదువుకోవడానికి తణుకులో కళాశాల ఎట్ హోం సౌకర్యం ఉంది. వారి ఆసక్తిని బట్టి చదువు, వృత్తి, నైపుణ్య విభాగాల్లో శిక్షణ ఇచ్చి వారిని ప్రయోజకులను చేస్తున్నారు. కొన్ని కొన్ని సందర్భాల్లో బాలికల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి పిల్లలను వారికే అప్పగిస్తున్నారు.



ఈనాడు 'మట్టి బుర్ర' రాతలు

- భీమిలి ప్రాంతమంతా ఎర్ర మట్టే
- నేరెళ్లవలసలో 262.92 ఎకరాల్లోనే ఎర్ర మట్టి దిబ్బలు
- జీఎస్ఐ నిర్ధారించినదీ ఇదే
- వాటికి దూరంగా కొత్తవలసలో భూముల అభివృద్ధి
- ఇవి ల్యాండ్ పూలింగ్‌లో రైతుల నుంచి సేకరించిన భూములు
- ఎర్ర మట్టి దిబ్బలకు, ఈ భూములకు సంబంధమే లేదు
- కొత్త వలస ఫొటోలు పెట్టి, ఎర్రమట్టి దిబ్బలంటూ అసత్యాలు
- ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఈనాడు తప్పుడు రాతలు



దొండపర్తి (విశాఖ దక్షిణ): ఎర్రగా కనిపించిన భూమంతా ఎర్ర మట్టి దిబ్బలేనా?.. అంటే కాదనే అంటారు ఎవరైనా. కానీ, పచ్చ కళ్ల ఈనాడుకి అన్నీ ఎర్ర మట్టి దిబ్బల్లానే కనిపిస్తున్నాయి. అందుకే ఎర్రమట్టి దిబ్బల ధ్వంసం అంటూ విషపు కథనాలని ప్రజల పైకి వదిలారు రామోజీ. జాతీయ భౌగోళిక వారసత్వ సంపదగా, చారిత్రక, పర్యాటక ప్రాంతంగా ఉన్న ఎర్రమట్టి దిబ్బలు ప్రాంతంలో భౌగోళిక పరిస్థితులకు ఎటువంటి విఘాతం కలగకుండా పర్యాటకుల సౌకర్యార్థం మౌలిక సదుపాయాల కల్పనకు చేస్తున్న ప్రణాళికలు ఈనాడుకు కనిపించ లేదు. ఎర్రమట్టి దిబ్బలకు చాలా దూరంలో రైతుల నుంచి ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించిన భూములను విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ) అభివృద్ధి చేస్తుంటే.. ఎర్ర మట్టి దిబ్బలను ధ్వంసం చేస్తున్నారంటూ ఓ అసత్య కథనం అల్లింది. భారత భూగర్భ పరిశోధనా సంస్థ (జీఎస్ఐ) భీమిలి మండలంలో ఉన్న ఎర్ర మట్టి దిబ్బల హద్దులను స్పష్టంగా నిర్దేశించింది. దానికి వందల మీటర్లు దూరంలో రైతుల నుంచి సేకరించిన భూముల్లో వీఎంఆర్‌డీఏ అభివృద్ధి పనులు చేపట్టింది.భీమిలి పరిసర ప్రాంతాల్లో భూమంతా ఎర్ర మట్టే. అభివృద్ధి చేస్తున్న ప్రాంతం కూడా ఎర్రగా ఉండటంతో ఆ ప్రాంతాలను ఎర్రమట్టి దిబ్బలుగానే పేర్కొంటూ ఈనాడు కథనం ఇవ్వడం ఆ ప్రాంతవాసులను, రైతులను విస్మయానికి గురి చేసింది. ఈ పనుల వల్ల ఎర్రమట్టి దిబ్బలకు ఎటువంటి ప్రమాదం ఉండదని ఇప్పటికే అధికారులు స్పష్టం చేశారు.

262.92 ఎకరాల్లోనే ఎర్రమట్టి దిబ్బలు

భీమునిపట్నం మండలం నేరెళ్లవలస గ్రామంలో చారిత్రక వారసత్వ సంపదగా ఎర్రమట్టి దిబ్బలను గుర్తించారు. జీఎస్ఐ నిపుణులు 2014వ సంవత్సరంలో వీటిపై సర్వే చేశారు. సర్వే నంబర్ 49/1లో 262.92 ఎకరాల్లో ఈ ఎర్రమట్టి దిబ్బలు విస్తరించి ఉన్నట్లు గుర్తించారు. అదే ఏడాది జూలై 19న ఆ ప్రాంతాన్ని వారసత్వ సంపదగా నిర్ధారించారు.

కొత్తవలస ఫొటోలతో అసత్య కథనాలు

భీమిలి మండలం కొత్తవలస గ్రామంలో సర్వే నంబర్ 75, 86, 87లో గయాలు భూములు ఉన్నాయి. ఈ భూములకు, ఎర్రమట్టి దిబ్బలకు ఎటువంటి సంబంధం లేదు. వాటికి చాలా దూరంలో ఉంటాయి. అదీ కూడా బఫర్ జోన్‌కు 45 మీటర్ల దూరంలో ఉంటాయి. వీటిని దశాబ్దాల క్రితం ల్యాండ్‌లెస్ పూర్ కేటగిరీ కింద 18 మందికి కేటాయించారు. వారు చాలా ఏళ్లుగా ఈ భూములను సాగు చేసుకుంటున్నారు. ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు రెవెన్యూ అధికారులు ల్యాండ్ పూలింగ్ ద్వారా ఆ 18 మంది నుంచి భూములను సేకరించారు. 2020లో వీఎంఆర్‌డీఏకు అప్పగించారు. వీఎంఆర్‌డీఏ ఈ భూములను అభివృద్ధి చేసేందుకు చదును చేస్తోంది. ఇదే అదనుగా ఎర్రమట్టి దిబ్బలను ధ్వంసం చేస్తున్నారంటూ ఈనాడు అసత్య కథనాలు ప్రచురిస్తోంది. కొత్తవలసలో భూముల అభివృద్ధి పనుల ఫొటోలను నేరెళ్లవలసలో ఉన్న ఎర్రమట్టి దిబ్బల్లో జరుగుతున్నట్టుగా చిత్రీకరిస్తూ తప్పుడు కథనాలను ప్రచురిస్తోంది.

ఎర్రమట్టి దిబ్బలకు సంబంధం లేదు

వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తున్న భూములకు, ఎర్ర మట్టి దిబ్బలకు ఎటువంటి సంబంధం లేదు. జీఎస్ఐ గుర్తించిన 262.92 ఎకరాల్లోని ఎర్రమట్టి దిబ్బల పరిరక్షణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. దానికి దూరంలో కొత్తవలసలో భూములను వీఎంఆర్‌డీఏ అభివృద్ధి చేస్తోంది. ఈ భూములు రైతుల నుంచి సేకరించినవి. అక్కడ నేల కూడా ఎర్రగా ఉన్నంత మాత్రాన అవి ఎర్రమట్టి దిబ్బలు కావు. దీనిపై వస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.

– డాక్టర్ ఎ.మల్లికార్జున, జిల్లా కలెక్టర్

'త్రీడీ ప్రింటింగ్'తో ఉజ్వల భవిష్యత్

సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ నాగరాణి

సాక్షి, అమరావతి: త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ రంగంలోని ఉపాధి అవకాశాలను పాలిటెక్నిక్ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ చదలవాడ నాగరాణి కోరారు. సాంకేతిక విద్యా శాఖ, సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్ (సీఈఎంఎస్- విశాఖపట్నం) సహకారంతో బుధవారం రాష్ట్రంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్‌ల అధ్యాపకులు, విద్యార్థుల కోసం త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీస్‌పై వెబినార్‌ను నిర్వహించారు. ప్రింటలిటిక్స్-బెంగుళూర్ సహా వ్యవస్థాపకుడు డాక్టర్ అభిషేక్ శాస్త్రి మాట్లాడుతూ..విభిన్న రంగాల్లో త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సీఈఎంఎస్ సీఈవో సేతు మాధవన్, సీవోవో గోపికృష్ణ మాట్లాడుతూ..తయారీ, మౌలిక సదుపాయాలు, మారీటైమ్ రంగాల్లో నైపుణ్యాభివృద్ధి పరంగా సీఈఎంఎస్ పాత్ర కీలకంగా ఉందన్నారు.

ఆక్వా జోరు.. వరి సాగు లేదు.. లాభం లేదు

ప్చ్.. లాభం లేదు

వరికి దూరమవుతున్న రైతులు

- లాభసాటి కావడంతో ఉద్యాన పంటల వైపు మొగ్గు
- చేలు మెరక చేసి కొబ్బరి, ఇతర పంటల సాగు
- ముంపు భయంతో తీర ప్రాంతంలో ఆక్వాకు సై



కాట్రేనికోన మండలం వేట్లపాలెంలో ఒకప్పుడు వరి సాగు జరిగే ప్రాంతాల్లో ఆక్వా చెరువులు

సాక్షి, అమలాపురం: గోదావరి డెల్టా అంటేనే ఆంధ్రులకు అన్నపూర్ణ. ధాన్యాగారంగా పేరు. అటువంటి డెల్టాలో వరి సాగు విస్తీర్ణం క్రమేపీ తగ్గుతోంది. వరి గిట్టుబాటు కాకపోవడం.. ఉద్యాన పంటలు, ఆక్వా సాగు కాసులు కురిపిస్తుండటంతో వీటిపై వరి రైతులు దృష్టి సారిస్తున్నారు. గోదావరి తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల్లో ఇంచుమించు ఇదే పరిస్థితి ఉండగా, జిల్లాలో వరిని వదిలి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లిపోతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది.

గోదావరి డెల్టా ఆయకట్టు 10.13 లక్షల ఎకరాలు. ఇందులో 8.96 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతుంది. డెల్టాలోని మెరక ప్రాంతాల్లో చేలను మట్టితో మెరక చేసి కొబ్బరి, అరటి వంటి ఉద్యాన పంటలు సాగు చేయడం, తీరంలోని చేలను చేపల చెరువులుగా మార్చడం 1995 వరకూ ఉంది. ఆ తరువాత నుంచి వరి చేలను ప్రత్యామ్నాయ పంటల వైపు మార్పు చేసే వేగం పెరిగింది. గత దశాబ్ద కాలంగా ఇది మరింత జోరందుకుంది. ఇప్పుడు మూడు డెల్టాల్లోనూ సుమారు 6.90 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు జరుగుతోందని అంచనా. అంటే సుమారు 2.06 లక్షల ఎకరాల్లో (23 శాతం) వరికి ప్రత్యామ్నాయ సాగు వచ్చి చేరింది. జిల్లాలోని తూర్పు, మధ్య డెల్టాల్లో 3.03 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఒకటిన్నర దశాబ్దాల కిందట 2.10 లక్షల ఎకరాల్లో వరి సాగు జరిగేది. ప్రస్తుతం గత రబీలో 1.53 లక్షల ఎకరాల్లో మాత్రమే వరి సాగవడం గమనార్హం.

ఉద్యాన సాగుతో 'కాసుల' పంట

భారీ వర్షాలు, వరదల వల్ల కొంత కాలం నుంచి డెల్టాలో వరి సాగు ఇబ్బందికరంగా మారింది. పంట పండినా పెద్దగా లాభసాటి కావడం లేదు. దీంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి పెడుతున్నారు. ఇటీవల ఉద్యాన పంటల సాగు లాభసాటిగా మారింది. కొబ్బరి, పోక, కోకో వంటి దీర్ఘకాలిక పంటలతో పాటు అరటి, పసుపు, కంద, పూల సాగు కాసుల పంట పండిస్తోంది. ఈ సాగులో నష్టాలు, కష్టాలు ఉన్నా లాభాలు మాత్రం గణనీయంగా వస్తున్నాయి. దీంతో రైతులు చేలను మెరక చేసి మరీ వీటి సాగు ఆరంభించారు. కోనసీమలో కొత్తపేట, రావులపాలెం, అంబాజీపేట, పి.గన్నవరం, కపిలేశ్వరపురం మండలాల్లో ఈ మార్పు అధికంగా కనిపిస్తోంది. పైగా ఉద్యాన పంటలకు ప్రభుత్వం నుంచి పలు రాయితీలు ఇస్తుండటం, మార్కెటింగ్ సౌకర్యాలు పెరగడంతో రైతులు వరికి ప్రత్యామ్నాయంగా వీటి చేపట్టారు.

అందుకే ఆక్వా సాగు

ఉప్పలగుప్తం మండలం ఎస్.కొత్తపల్లిలో 2,054 ఎకరాల ఆయకట్టు ఉంది. పదేళ్ల క్రితం సుమారు 500 ఎకరాల్లో ఆక్వా సాగు జరిగేది. మిగిలిన 1,554 ఎకరాలూ వరి ఆయకట్టు. ఇప్పుడు 60 ఎకరాల్లో మాత్రమే వరి ఆయకట్టు మిగిలింది. ముంపునకు తోడు, వరి సాగు గిట్టుబాటు కాకపోవడం.. ఆక్వా చెరువులు తవ్వితే పంట సాగు చేయకున్నా ఎకరాకు రూ.40 వేల నుంచి రూ.60 వేల వరకూ లీజుల రూపంలో వస్తుండటంతో రైతులు ఆక్వా సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

వరి కాదని మొక్కజొన్న సాగు

కొత్తపేట మండలంలో ఏటా రబీలో సుమారు వెయ్యి ఎకరాల్లో రైతులు మొక్కజొన్న సాగు చేస్తున్నారు. బిళ్లకుర్రు, వాడపల్లి, అవిడి ప్రాంతాల్లో సాధారణంగా రబీలో అధిక వరి దిగుబడి వస్తోంది. ఎకరాకు 45 బస్తాల (75 కేజీలు) నుంచి 50 బస్తాల వరకూ దిగుబడి లభిస్తోంది. ఖరీఫ్‌తో పోలిస్తే రబీ వరిలోనే లాభం వస్తుంది. అయినప్పటికీ ఇక్కడి రైతులు వరిని వదిలేసి మొక్కజొన్న సాగుకు మళ్లడం గమనార్హం. వానపల్లిలో 520 ఎకరాల సాగుభూమి ఉండగా, రబీలో 200 ఎకరాల్లో మొక్కజొన్న వేస్తున్నారు.



కొత్తపేట మండలం బిళ్లకుర్రులో రబీలో మొక్కజొన్న సాగు (ఫైల్)

వరితో లాభాలు రావడం లేదు



మా గ్రామాల్లో మెరక ప్రాంతం ఎక్కువ. దీనివల్ల రబీలో మొక్కజొన్న సాగు చేస్తున్నాం. చాలా మంది రైతులు మెరక ప్రాంతాల్లో మొక్కజొన్న, అరటి సాగు చేస్తున్నారు. తక్కువ మంది మాత్రమే రబీలో వరి సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం వరకూ వరిలో రెండు పంటల్లోనూ లాభాలు చూసేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు.

– బి.దొరబాబు, వాడపాలెం, కొత్తపేట మండలం

ఆక్వా తప్ప ప్రత్యామ్నాయం లేదు



మా మండలం తీర ప్రాంతంలో వర్షాలు, తుపాన్లకు పంట నీట మునిగి నష్టపోతున్నాం. పైగా వరి సాగు గిట్టుబాటు కావడం లేదు. దీంతో మా చేలను చెరువులుగా మార్చాం. దీనిలో నష్టాలున్నా లాభాలు కూడా వస్తున్నాయి. వరి మాత్రం ఎప్పుడూ నష్టమే.

– నామన రామకృష్ణ, ఉప్పలగుప్తం

తీరంలో ఆక్వా

ఆక్వా సాగు వల్ల కాలుష్యం పెరుగుతున్నా తీరంలోని ముంపు ప్రాంతాల్లో వరికి ఇదే ప్రత్యామ్నాయంగా మారింది. ఇటీవల ఏటా వేసవిలో వరి చేలు ఆక్వా చెరువులుగా మారిపోతున్నాయి. జిల్లాలోని ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం వంటి తీర ప్రాంత మండలాలతో పాటు తీరానికి దూరంగా ఉన్న మండలాల్లో సైతం చేలను చెరువులుగా మార్చేస్తున్నారు.



ఉప్పలగుప్తం మండలం కూనవరంలో వరికి బదులు మామిడి, కొబ్బరి సాగు

ఆశ ఉంటే..శ్వాస వెంటే..

చీకటిమయం చేసే అనుకోని సంఘటనలు జీవిత చరమాంకానికి చేరువ చేస్తాయి. బీ పాజిటివ్ అనుకుంటూ బతకాలన్నా తెలియని భయాందోళనల్ని రేకెత్తిస్తాయి. యావత్ జీవన గమనాన్నే మార్చేసే అనుకోని మలుపులు జీవితాన్ని నిర్వీర్యం చేస్తాయి. అటువంటి చేదు వాస్తవాలకు ఎదురొడ్డి నిలిచేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ఊతమిస్తోంది. ఇంకెన్నాళ్లులే అన్న నిర్వేదానికి ఉన్నన్నాళ్లు అన్న బదులిస్తోంది. డియర్ పాజిటివ్... బి పాజిటివ్... అంటూ భరోసా ఇస్తోంది. చీకటిమయం చేసే అనుకోని సంఘటనలు జీవిత చరమాంకానికి చేరువ చేస్తాయి. బీ పాజిటివ్ అనుకుంటూ బతకాలన్నా తెలియని భయాందోళనల్ని రేకెత్తిస్తాయి. యావత్ జీవన గమనాన్నే మార్చేసే అనుకోని మలుపులు జీవితాన్ని నిర్వీర్యం చేస్తాయి. అటువంటి చేదు వాస్తవాలకు ఎదురొడ్డి నిలిచేందుకు ఓ స్వచ్ఛంద సంస్థ ఊతమిస్తోంది. ఇంకెన్నాళ్లులే అన్న నిర్వేదానికి ఉన్నన్నాళ్లు అన్న బదులిస్తోంది. డియర్ పాజిటివ్... బి పాజిటివ్... అంటూ భరోసా ఇస్తోంది.



- ఒక వ్యక్తి పాజిటివ్ ఆలోచనతో ఏర్పడిన సంస్థ
- హెచ్ఐవీ పాజిటివ్ బాధితుల బాగుకు అవిరళ కృషి
- నాణ్యమైన జీవితాన్ని అందించడమే లక్ష్యం
- కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాజిటివ్ పీపుల్ సంస్థ సేవలు
- ఉమ్మడి జిల్లాలో 13 వేల మంది బాధిత సభ్యులు

డెస్క్-రాజమహేంద్రవరం

సరిగ్గా 27 ఏళ్ల క్రితం, 1996లో విజయవాడ సమీపంలోని పామర్రులో కాకినాడ సామర్లకోటకు చెందిన 27 ఏళ్ల ఓ యువకుడు ఓ ప్రైవేటు సంస్థలో ఉద్యోగం చేస్తూ తన భావి జీవితంపై కొండంత ఆశతో వత్తి జీవితాన్ని ప్రారంభించాడు. ఊహించని రీతిలో ఓ రోజు హెచ్ఐవీ మహమ్మారి బారిన పడినట్లు వైద్య నివేదికల్లో వెల్లడైంది. కాలికింద భూమి కదిలినట్లయింది. పనిచేస్తున్న సంస్థ కూడా ఆ విషయాన్ని తెలుసుకొని ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ చేయాలని ఒత్తిడి చేసింది. ఉద్యోగం మానిపించేసింది. స్వగ్రామం సామర్లకోటకు చేరాడు. మనోవేదన నుంచి బయటపడి తన లాంటి బాధితుల జీవన గమనాల్ని పరిశీలించాలనుకున్నాడు. ఈ క్రమంలో తన లాంటి బాధితుల బాగోగులు చూసుకునేందుకు ఓ జాతీయ స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చిందని తెలుసుకున్నాడు. సామర్లకోటకు వచ్చిన ఆ సంస్థ పెద్దలతో మమేకమయ్యాడు. వారు కూడా హెచ్ఐవీ బాధితులేనని తెలుసకుని ఆశ్చర్యపోయాడు. హెచ్ఐవీ బారిన పడినా, చక్కటి హోదాలో, ఆరోగ్యకరమైన జీవన విధానంలో బతకొచ్చన్న భరోసా కలిగింది. ఆ సంస్థ చెన్నైలో నిర్వహించిన ఓ సమావేశం అతడి జీవిత గమనాన్ని మార్చేసింది. ఆ స్ఫూర్తితో, సామర్లకోట వచ్చిన ఢిల్లీ పెద్దల సహకారంతో తన లాంటి బాధితుల జీవన నాణ్యతను మెరుగుపరిచేందుకు పాటు పడాలని నిర్ణయించుకున్నాడు.

ఒక్కరితో ప్రారంభమై..

జాతీయ నెట్‌వర్కుకు అనుబంధంగా తన 34వ ఏట 2003లో నాటి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో సేవలందించేందుకు స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశాడు. ఈ సంస్థ ద్వారా హెచ్ఐవీ రోగులకు నాణ్యమైన జీవితాన్ని అందించి జీవన ప్రమాణంతో పాటు జీవిత కాలాన్ని కూడా మెరుగుపరిచే బాధ్యతను అందిపుచ్చుకున్నాడు. వేలాది బాధితులే సభ్యులుగా చేరిన ఆ సంస్థ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొంది, ఎయిడ్స్ నియంత్రణ మండలి విభాగానికి అనుబంధంగా సేవలను అందిస్తోంది. నాటి పాతికేళ్ల ఆ యువకుడి పేరే మేడిశెట్టి రామ్మోహన్ రావు, ఆయన స్థాపించిన ఆ సంస్థ పేరే ×కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాజిటివ్ పీపుల్×. ప్రస్తుతం రామ్మోహన్ వయసు 54 సంవత్సరాలు, హెచ్ఐవీతోనే 29 ఏళ్లుగా నాణ్యమైన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. ఏడుగురితో కలిసి సంస్థకు కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి, ఇరవై ఏళ్లుగా నిరాటంకంగా హెచ్ఐవీ బాధితులకు సేవలందిస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 13 వేల మంది బాధితులు సంస్థలో సభ్యులుగా ఉన్నారు.

ఎక్కువ కాలం బతికేలా...

కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాజిటివ్ పీపుల్ ప్రధాన లక్ష్యం బాధితుల జీవన నాణ్యతను మెరుగుపరచడం. ఇందుకు సంస్థ శాస్త్రీయ విధానాలను అనుసరించి సఫలీకతమైంది. ఇమ్యూనో డెఫీషియన్సీ వైరస్ వైరల్ లోడ్ తగ్గేలా మందులు నిత్యం బాధితులతో వాడించడం, జాతీయ, అంతర్జాతీయ ప్రమాణాలతో జరుగుతున్న హెచ్ఐవీ నియంత్రణ పరిశోధనలు, ఉత్పత్తుల ప్రయోజనాలను బాధితులకు అందించడం ద్వారా మెరుగైన జీవనాన్ని వద్ధి చేయడం సంస్థ లక్ష్యాల్లో ఒకటి.

ఇవీ సేవలు

- బాధితులను కంటికి రెప్పలా కాచి కాపాడుకుంటున్న రామ్మోహన్ బందం వారి బాగోగులను అనునిత్యం పర్యవేక్షిస్తుంది.
- రెండు దశాబ్దాల్లో వందకుపైగా హెచ్ఐవీ జంటలను వివాహ బంధంతో ఏకం చేసింది.
- బాధితుల విద్యను ప్రోత్సహిస్తూ బోధనా తరగతులు నిర్వహిస్తోంది. చదువుకున్న వారికి, నిరక్షరాస్యులకు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తోంది.
- సీడీ 4 సహా వైరల్ లోడ్ పరీక్షలు ఎప్పటికప్పుడు చేయించేలా చర్యలు తీసుకుంటుంది. నిత్యం వైద్య సేవలు అందేలా కీలకంగా వ్యవహరిస్తుంది.
- కాకినాడ పీఆర్ కళాశాల రోడ్‌లో ఉన్న సంస్థ కార్యాలయంలో 25 మంది బాధితులకు ఉద్యోగాలు కల్పించారు. ప్రభుత్వ, ప్రభుత్వ అనుబంధ ప్రైవేటు సంస్థల్లో సంస్థ సిఫార్సు ద్వారా 150 మంది ఉద్యోగాలు పొందారు.

బాధితులంతా కలిసి బాధితుల కోసం ..



హెచ్ఐవీ మధుమేహం వంటి ఓ దీర్ఘకాలిక వ్యాధి. అదే తరహాలో జీవితాంతం మందులు వాడుకొని సుదీర్ఘ కాలం బతకవచ్చనే భరోసా ఇవ్వడమే మా ఉద్దేశం.బాధితులంతా కలిసి బాధితుల కోసం శ్రమిస్తున్న ఆదర్శ సంస్థ. జాతీయ నెట్‌వర్క్ నిర్వహణ సహకారం అందిస్తోంది. ప్రభుత్వ అనుబంధంగా సేవలందిస్తున్నాం. హెచ్ఐవీ అంటే మరణం అనే మాట మరిచిపోవాలి.

– మేడిశెట్టి రామ్మోహన్ రావు, కోస్టల్ నెట్‌వర్క్ ఫర్ పాజిటివ్ పీపుల్

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943